
కథలు

# భట్టి విక్రమార్కుని కథలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్ధికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org
Mobile App: Free Gurukul
email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul
Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# భట్టివిక్రమార్కునికథలు.

గ్రంథకర్త:

మామిడి అప్పారావుగారు.

P No112
S1898
8 SEP 19
MADRAS

ప్రకాశకులు:

ఈశ్వర బుక్ డిపో,

రాజమండ్రి.

# విషయసూచిక.

——:o:——


| | | | | పుటసంఖ్య. |
|---|---|---|---|---|
| 1. | విక్రమార్కుని జననము. | | | 1 |
| 2. | భర్తృహరి విరక్తినొంది రాజ్యంబు విక్రమాదిత్యున కొసంగుట. | | | 4 |
| 3. | భట్టి విక్రమాదిత్యులు కాళికాదేవివలన వరములఁ బొందుట. | | | 6 |
| 4. | విక్రమాదిత్యునకు ఇంద్రుడు ద్వాత్రింశతి సాలభంజికలుగల సింహాసన మిచ్చుట. | | | 7 |
| 5. | విక్రమాదిత్యుఁడు బ్రహ్మాస్త్రమును బడయుట. | | | 9 |
| 6. | విక్రమార్కుఁడు భేతాళుని వశము గావించుకొనుట. | | | 10 |
| 7. | విక్రమార్కునకు భేతాళుఁడు చెప్పినకథలు | | ఒకటవకథ. | 13 |
| 8. | ,, | ,, | రెండవకథ. | 19 |
| 9. | ,, | ,, | మూఁడవకథ. | 21 |
| 10. | ,, | ,, | నాల్గవకథ. | 22 |
| 11. | ,, | ,, | అయిదవకథ | 27 |
| 12. | ,, | ,, | ఆఱవకథ | 29 |
| 13. | ,, | ,, | ఏడవకథ | 33 |
| 14. | ,, | ,, | ఎనిమిదవకథ | 36 |
| 15. | ,, | ,, | తొమ్మిదవకథ | 37 |
| 16. | ,, | ,, | పదియవకథ | 41 |
| 17. | ,, | ,, | పదునొకండవకథ | 43 |
| 18. | ,, | ,, | పండ్రెండవకథ | 46 |
| 19. | ,, | ,, | పదమూఁడవకథ | 48 |
| 20. | ,, | ,, | పదునాల్గవకథ | 49 |
| 21. | ,, | ,, | పదునైదవకథ | 51 |
| 22. | ,, | ,, | పదునాఱవకథ | 52 |
| 23. | ,, | ,, | పదునేడవకథ | 54 |

| | | | | |
|---|---|---|---|---|
| 24. | ,, | ,, | పదునెనిమిదవకథ | 57 |
| 25. | ,, | ,, | పందొమ్మిదవకథ | 60 |
| 26. | ,, | ,, | ఇరువదవకథ | 62 |
| 27. | ,, | ,, | ఇరువదియొకటవకథ | 63 |
| 28. | ,, | ,, | ఇరువదిరెండవకథ | 65 |
| 29. | ,, | ,, | ఇరువదిమూడవకథ | 67 |
| 30. | ,, | ,, | ఇరువదినాల్గవకథ | 69 |
| 31. | విక్రమార్క నిర్యాణము (శాలివాహన చరిత్రము) | | | 72 |
| 32. | విక్రమార్కునిగద్దె భూస్థాపిత మొనరించుట | | | 74 |
| 33. | భోజరాజోపాఖ్యానము (విక్రమార్కునిగద్దె భోజునకులభించుట) | | | 75 |
| 34. | ఒకటవప్రతిమ చెప్పినకథ. | | | 76 |
| 35. | రెండవ | ,, | | 77 |
| 36. | మూడవ | ,, | | 79 |
| 37. | నాలుగవ | ,, | | 80 |
| 38. | అయిదవ | ,, | | 83 |
| 39. | ఆఱవ | ,, | | 85 |
| 40. | ఏడవ | ,, | | 88 |
| 41. | ఎనిమిదవ | ,, | | 91 |
| 42. | తొమ్మిదవ | ,, | | 94 |
| 43. | పదియవ | ,, | | 97 |
| 44. | పదునొకండవ | ,, | | 99 |
| 45. | పండ్రెండవ | ,, | | 102 |
| 46. | పదమూడవ ప్రతిమ చెప్పినకథ | | | 105 |
| 47. | పదునాల్గవ | ,, | | 107 |
| 48. | రాజశేఖరుని చరిత్రము. | | | 109 |

| | | |
|---|---|---|
| 49. | పదునైదవ ప్రతిమచెప్పినకథ. | 111 |
| 50. | పదునాఱవ ,, | 114 |
| 51. | పదునేడవ ,, | 116 |
| 52. | పదునెనిమిదవ ,, | 120 |
| 53. | పందొమ్మిదవ ,, | 123 |
| 54. | ఇరువదవ ,, | 126 |
| 55. | ఇరువది యొకటవ ,, | 129 |
| 56. | ఇరువదిరెండవ ,, | 133 |
| 57. | ఇరువదిమూడవ ,, | 135 |
| 58. | ఇరువదినాల్గవ ,, | 138 |
| 59. | ఇరువదియైదవ ,, | 139 |
| 60. | మతిమంతుని చరిత్రము. | 141 |
| 61. | ఇరువదియాఱవ ప్రతిమ చెప్పినకథ | 165 |
| 62. | ఇరువదియేడవ ,, | 148 |
| 63. | ఇరువది యెనిమిదవ ,, | 150 |
| 64. | ఇరువది తొమ్మిదవ ,, | 152 |
| 65. | ముప్పదియవ ,, | 166 |
| 66. | ముప్పదియొకటవ ,, | 179 |
| 67. | ముప్పదిరెండవ ,, | 162 |


## అంకితము.

విక్రమాదిత్య నరపత్య వక్రవిక్ర
మప్రశస్తగాథల రచింప ననుఁ బ్రోత్స
హించి యెంతయుఁ బ్రియము గావించినట్టి
రెడ్డి రామచంద్రాఖ్య సుహృన్మణికిఁ బ్రి
యమ్మెసఁగ నీకృతిని నంకిత మ్మొనర్తు.

శ్రీరస్తు.

# భట్టీవిక్రమార్కుని కథలు

## విక్రమార్కుని జననము

నంద్యాపురమను పట్టణమున చంద్రవర్మయను విప్రపుంగవుడుండెను. అతడు సకలశాస్త్రపారంగతుడయ్యు నింకను విద్యలను నేర్వదలచి గుర్వన్వేషణార్థమై దేశాంతరములకు బయనమయ్యెను. అడవుల దేశముల ద్రిమ్మరుచు ఒకనాటి సాయంసమయమునకు నొక యగ్రహారముజేరుకొని అందుగల యేటిగట్టుననున్న రావిచెట్టుక్రింద విశ్రమించి తనకు తగినగురువులభించనందున విచారించుచుండెను.

అంతనాచెట్టుపైనున్న యొకబ్రహ్మరాక్షసుండుక్రిందకుడిగ్గి చంద్రవర్మను సమీపించి, "ఓయీ! నీవెవ్వడవు? నీయూరెయ్యది? నీవెందులకై యిచ్చటకు వచ్చితివి? దాచక నీవృత్తాంతమంతయు సవిస్తరముగా చెప్పుము" అనియడిగిన చంద్రవర్మ యారాక్షసునిగాంచి, "అయ్యా! నేను బ్రాహ్మణకులంబునకు చెందినవాడను. నన్ను చంద్రవర్మయని పిలుతురు. మానివాసస్థలము నంద్యాపురము. నేను విద్యాపేక్షచే గురువన్వేషించుటకై దేశాటనకు బయలుదేరితినని ప్రత్యుత్తరమొసంగెను. అంతనారాక్షసుడు "ఓయీ! నీకు సర్వవిద్యలలవడుమార్గ ముపదేశించెదర"మ్మని సమీపమునగలయరణ్యమునకు ఆతనిదోడ్కొనిపోయెను.

ఆబ్రహ్మరాక్షసుడు చంద్రవర్మకు ఆహారనిద్రలు బాధింపకుండ నొకమంత్రముపదేశించి ఆఱుమాసములవఱకు విద్యగరపి పిమ్మట నొకనాడు, "ఓయీ! నీవు సకలవిద్యల నారితేరితివి. నావలన నీకు కాదగుకార్యము సమాప్తమైనది. ఇకనీవుబోవచ్చును. ముమ్ముందు నీకు శుభదినంబులురాగలవు" అనిచెప్పిన చంద్రవర్మ యమందానందంబు

నొంది గురువునకు బ్రహ్మానుమాచరించెను. అంత నారక్కసుఁడు రాక్షసత్వమునువిడచి యొక బ్రాహ్మణుడుగామారెను. చంద్రవర్మ యయ్యది గాంచి విస్మయమునుజెంది "ఆర్యా! మీరెట్టినూతనరూపమునుబొందితిరి? మీవృత్తాంతమంతయు సవిస్తరముగాదెల్పవేఁడెద" ననెను.

"చంద్రవర్మా! నావృత్తాంతమంతయు దెల్పెదను ఆలింపుము. తొల్లి నన్నొకభూసురోత్తముఁడు విద్యనేర్పుమనికోరెను. నేనాతని కోర్కెను నిరాకరించితిని. అంత నాభూసురోత్తముడు నాపై గినిసి, నన్ను "బ్రహ్మరాక్షసుడవు క" మ్మని శపించెను అంత నేనాతని పదంబులపై బడి కరుణింపుడని వేడుకొంటిని. అంత నాతఁడు కరుణార్ద్రహృదయుడై, "నీయొద్దకు చంద్రవర్మయను విప్రపుంగవుడు విద్య నేర్వదలచి వచ్చును. అతనికి నీవు విద్యగరపినచో నీకు శాపవిమోచనంబగు" నని చెప్పెను. నేటికి నీమూలమున నాకు శాపవిముక్తి కలిగినది. ఇదియే నావృత్తాంతము. నీవికబోవచ్చును." అని చెప్పి యాతడు వెడలిపోయెను.

చంద్రవర్మ అచ్చటినుండి కన్యాపురియను గ్రామమునకు వచ్చి అందలి వేశ్యవాడలో నొక్కయరుగుపై విశ్రమించి నిదురజెందెను. ఆగృహమునగల సుందరవతియను వేశ్యబాలిక యాతనినిగాంచి మనంబున మోహించి వివాహమాడ నిశ్చయించుకొనెను. సూర్యోదయమైనను ఆతడు మేల్కొనకుండుటచే వైద్యులను రప్పించిచూపించెను. వైద్యులు చంద్రవర్మనాడిని పరిశోధించి, యాపెతో నిట్లనిరి. ఈతడు పెక్కుదినములనుండి నిద్రాహారముల నెఱుగడు. ప్రస్తుతమీతనిని మేల్కొల్పరాదు. దినమునకు మూడుపూటలు అన్నమును నేతిని కలిపి బాగుగాపిసికి యొడలికి మర్దనచేసినచో కొన్నిదినముల కాతడు మేల్కొనగలడు. వైద్యులు చెప్పినరీతిగా నావేశ్యబాలిక పెక్కుదినములవరకు ఆతనికి వలయు సేవలొనరించెను. పిమ్మట యొకనాడు చంద్రవర్మ

మేల్కొని వెడలిపోవ నుద్యుక్తుడయ్యెను. అపుడా వేశ్యబాలిక యాతని నాపి, "బ్రాహ్మణోత్తమా! మీసహచర్యమునే గోరి, మీకునర్హోపచారములుజేసి కంటికి రెప్పవలె మిమ్ము గాచియుంటిని నన్ను పరిత్యజించుట మీకున్యాయముగాదు. నన్ననుగ్రహింపవేడెదను." అని పల్కిన చంద్రవర్మ, "ఓబాలా! నేను బ్రాహ్మణుడను. నీవు శూద్రాంగనవు కావున మనవివాహము న్యాయసమ్మతముగాదు" అని నిరాకరించెను. ఆబాలిక చంద్రవర్మను పెక్కురీతుల వేడుకొనెను. కానియాతడంగీకరించలేదు. ఈసంగతి ఆయూరునేలురాజగుశుద్ధవర్మకు దెలియగా రాజభటులను పంపి వారలను తనసముఖమునకు రప్పించెను. చంద్రవర్మయు వేశ్యబాలికయు తమ తమ వృత్తాంతమును యాభూపాలునకు విన్నవించిరి. శుద్ధవర్మతన కుమార్తెను చంద్రవర్మకిచ్చివివాహ మొనరింతమని వచించి, యిట్లనెను. "బ్రాహ్మణోత్తమా! నాపల్కులాలింపుము. బ్రాహ్మణుడు స్వజాతికన్యను గాక యితరకులమునందలి కన్యను వివాహమాడవలయునన్న, బ్రహ్మ,క్షత్రియ, వైశ్య, శూద్రజాతుల కన్యలను క్రమముగా పరిణయమాడవలయును. ఇయ్యది శాస్త్ర సమ్మతము. వలచినస్త్రీని పరిత్యజించతగదు. కావున శాస్త్రరీత్యా మాపురోహితుని కుమార్తెయగు కల్యాణిని, నాకుమార్తె చిత్రరేఖను, మా భాండాగారాధీశ్వరుడైన సోమశేఖరశెట్టి కుమార్తె కోమలాంగిని యావేశ్యబాలికను పరిణయమాడు"మని నుడివెను. చంద్రవర్మయు వల్లెయని రాజుపల్కుల కంగీకరించి యానాలుగుజాతుల కన్యలను క్రమముదప్పక వివాహమాడెను.

అంత కొంతకాలమునకు చంద్రవర్మ నల్వుర పత్నులవలనను క్రమ క్రమముగా, వల్లవర్మ—విక్రమాదిత్యుడు—భట్టి—భర్తృహరియను నల్వుర పుత్రులగాంచెను.

పిమ్మట శుద్ధవర్మ తనకు పుత్రులు లేమింజేసి యల్లుడగు చంద్ర

వర్మకు రాజ్యమొసంగి తపంబాచరించుకొనుటకై కాననముల కేగెను.

*

కొంతకాలమునకు చంద్రవర్మ కంత్యకాలము సమీపించినందున తన పుత్రుల నలువురను జేరబిలిచి, పల్లవర్మ, భట్టి విక్రమాదిత్యులను జూచి, "బిడ్డలారా! నాకంత్యకాలము సమీపించెను. నేజెప్పుమాటలను మీరుశ్రద్ధతో ఆలించి పిమ్మటయుక్తాయుక్తములను విచారించుకొనుడు. నేనుమీతల్లులను పరిణయంబాడుటకు కారణము భర్తృహరి తల్లియే. కావున నాకడయే పెద్దభార్య. ఆమెకుమారుడు భర్తృహరియే రాజ్యమున కర్హుడు. కావున నీభర్తృహరికి బట్టంబుగట్టెదను. మీరు మువ్వురు యువరాజ పట్టంబుననుండి అతనిని సేవింపుచుండుడు." అని పల్కిన అందరును వల్లెయని యనుమతించిరి. ఒకశుభముహూర్తమున చంద్రవర్మ భర్తృహరికి బట్టంబుగట్టి పిమ్మట కాలగతిం జెందెను.

## భర్తృహరి విరక్తినొంది రాజ్యంబు

### విక్రమాదిత్యున కొసంగుట.

భర్తృహరిరాజ్యం బేలుచుండనొక్క నాడొక సిద్ధుడు భర్తృహరిని జూడవచ్చెను. అంత భర్తృహరి యాతని నెదుర్కొని యాసనమున నుపవిష్టుంజేసి విధ్యుక్తప్రకారంబున బూజలంగావించెను. యోగీంద్రుడు భర్తృహరి భక్తివిశేషంబులకు మదిమెచ్చి తనయొద్ద గుప్తముగానున్న యొకఫలంబుదీసి "భూపాలా! యీఫలంబు నాతపోబలంబుచే లభించెను.

దీనిం దిన్నవారికి జరామరణ భయంబులుండవు. నీవు భూపాలుండవు గాన బ్రతికియుండిన బ్రజలకు హితంబొనరింతు వని తలచి నీకీయఁదెచ్చితిని. కావున స్వీకరింపుమ"ని రాజున కా ఫలంబొసంగి ఆశీర్వదించి వెడలిపోయెను.

భూపాలుఁ డా ఫలంబును స్వీకరించి అంతిపురమునకు జని అంతఃపురాంగనలలో తనబహిఃప్రాణమైన మోహనాంగిని బిలిచి ఫలప్రభావంబు తెలుకపఱచి ఫలంబునొసంగెను. మోహనాంగియు ఆఫలంబును దినక తనవలపుకాఁడైన గొల్లనికి దిననొసంగెను .ఆగొల్లడును తనప్రాణసమమైన యొకగొల్లపడుచునకొసంగెను. ఆపడుచు గృహంబునకుపోయి తిన దలచి తనపేడతట్టపై ఫలమునుంచి వీధింబడి నేగుచుండెను

ఆసమయముననే భర్తృహరి యుప్పరిగపైనెక్కి చల్లగాలికై తిరుగాడుచు గంపయందలి ఫలంబునుగాంచి అయ్యాదిసిద్ధుఁడు తనకొసంగినఫలంబని గుర్తించి సేవకులనుబంపి యాగొల్లపడుచును రప్పించి, "ఓసీ నీకీఫలం బెట్లు లభించెనో తెల్పుము. నిక్కము నచియింపనిచో దండించెదను "అని యడుగగా యాగొల్లది గడగడవడకుచూ ,తనప్రియుడైన గొల్ల డొసంగినట్లు దెల్పెను. వెంటనే గొల్లవానినిగూడ బిలిపించి వానివలన యథార్థమెఱింగి, స్త్రీలను విశ్వసించరాదని మనంబున నిశ్చయించుకొని ప్రపంచక సౌఖ్యములను రోసి విరక్తినొంది, విక్రమాదిత్యునకు రాజ్యంబొసంగి భట్టిని మంత్రిగా నియమించి తాను తపం బాచరించుకొనుటకేగెను.

వల్లవర్షియు సకలశాస్త్ర విశారదుం డగుటంజేసి ప్రపంచక సౌఖ్యములను ద్యజించి సన్యసించెను.

# భట్టి విక్రమాదిత్యులు కాళికాదేవి వలన వరములు బొందుట

భట్టి విక్రమాదిత్యులు కాళికామంత్రమును కడుంగడు నిష్ఠతో నుపాసించిరి. కొన్నిదినంబుల కా దేవి కనుగ్రహము కలిగి వారలకు సాక్షాత్కరించి, భట్టికి రెండువేల సంవత్సరంబు లాయువున్నొసంగి, విక్రమాదిత్యునకు భూచక్రము నవక్రపరాక్రమముతో వేయేండ్లు పరిపాలించునట్లుగా వరంబొసంగి, పదమూడు మాసముల కుమ్మరి బాలికకు జనించిన సూనునివలన మృతికలుగు నట్లుగను తదితర శత్రుజనంబులచే మరణంబు లేకుండు నట్లుగా వరంబొసంగెను.

పిమ్మట ధీశాలియు సకల విద్యావిశారదుండు నగు భట్టి తన వలెనే విక్రమార్కుడు రెండువేల సంవత్సరములు జీవించునట్లు చేయుట కొకయుక్తి బన్ని ఱేని కిట్లెరింగించెను. "అగ్రజా! నీకు కాళికాదేవి సహస్రవర్షములు ధరాచక్రము బరిపాలించునట్లు గదా వరంబొసంగెను? యీవేయివత్సరముల పరిపాలన కాలమున, నీవు ఆరుమాసములు రాజ్యపాలనము ఆరుమాసములు భూసంచారమును చేసినచో నీజీవితమును రెండువేల వత్సరముల వరకును బొగిడించుకొనవచ్చును." అని పల్కిన ఱేడు సంతసించి యాతడు చెప్పినరీతిని నాఱునెలలు భూసంచారమును నాఱు నెలలు రాజ్యపాలనమును చేయుచుండెను.

# విక్రమాదిత్యునకు ఇంద్రుడు

## ద్వాత్రింశతి సాలభంజికలుగల సింహాసన మిచ్చుట.

దేవలోకంబున నొక్కనాడు రంభోర్వశులకు దమలో నెవ్వరు నాట్యమునందు మించిన వారలో యని పంతముగలిగి వారిరువురు యింద్రునియొద్దకు జని వారల తగవు నెఱింగించి యిరువురిని పరీక్షించి తగవును పరిష్కరింపుడని కోరిరి అంత నింద్రుడు వారలకు నా దేవసభయందు నాట్యము సలుప, నానతిచ్చెను. వారిరువురు సమముగా నాట్యము సలుప నింద్రుడు తనసభయందు నాసీనులై యున్న వారం గని, "సభికులారా! రంభోర్వశుల నాట్యంబు గంటిరిగదా! వీరిరువురిలో నెవ్వరధికులో మీరే నిర్ణయింపుడు" అనిపలికెను. ఆసభికులు నిర్ణయించు శక్తిలేమి జేసి మిన్నకుండిరి. అంత సురగురుండు దేవేంద్రునితో నిట్టు లనియెను. "దేవేంద్రా! వీరిర్వురిలో నధికులెవరో నిర్ణయించుట కష్టతరము. అటుల నిర్ణయించు వారెవ్వరును యిచ్చటలేరు. భూలోకంబున నుజ్జయినీ పురంబు నవక్రపరాక్రమున బరిపాలించుచున్న విక్రమార్క భూపాలుడు అరువదినాల్గు కళలయందును పదునాలుగు శాస్త్రములయందును పాండిత్యము కలవాడు. అతడే వీ రిరువురిలో నధికులెవరో నిశ్చయింప దగిన వాడు. కావున ఆతనిని బిలిపింపుడు." అన విని దేవేంద్రుడు మాతలిం జూచి, "ఓయీ! నీవు భూలోకంబున కేగి యా ఉజ్జయినీ పాలకుడగు విక్రమార్కుని యిచ్చటకు దోడ్కొనిరమ్ము." అని పుత్తెంచెను.

మాతలియు జాగుసేయక రథంబు శృంగారించుకొని ఉజ్జయినీ కేగి తనరాక విక్రమాదిత్యునకు దెలిపి యాతని సన్నిధి కరిగి, దేవేంద్రుల

కుశలం బెరిగించి, "దేవేంద్రుడు మిమ్ములను జూడ దోడ్కొని రమ్మని నన్ను పుత్తెంచె"నని సవినయముగా విన్నవించెను.

విక్రమార్కుడు రాజ్యకార్యములు నిర్వహించుటకు భట్టిని నియమించి, తాను తేరుపై దేవలోకంబున కేగెను. దేవేంద్రుడు విక్రమార్కుని సముచిత రీతుల గౌరవించి యాసనంబుపై నుపవిష్టుంజేసి యిట్లులనియెను, "ఓ భూపాలా! నాట్యంబున రంభోర్వశులలో నెవ్వరధికులో నిర్ణయించ వలసివచ్చె. దానికి నీవు తగిన వాడ వని నిన్ను రావించితిని." అనిపల్కిన విక్రమార్కుడు, "వారలను నాట్యమొనరింప రమ్మని పిలుపించుడు" అనిన దేవేంద్రుడు రంభోర్వశులను నాట్యమొనరింప రప్పించెను.

రంభోర్వశు లిరువురును నొకరి తరువాత నొకరుగా నరుదెంచి నాట్యమొనరించి తమ ప్రావీణ్యము జూపిరి. నాట్యానంతరము విక్రమాదిత్యు డిట్లులనియెను. "నాట్యంబున వీరిరువురూ సమానులే యైనను, శాస్త్రసమ్మతముగా నాట్యమాడుటయందు ఊర్వశి కొంచె మధికురాలు" అనిచెప్పిన, దేవేంద్రుడు విక్రమార్కుని బుద్ధివిశేషమున కశేషముగా నలరి నవరత్నఖచితమును ముప్పదిరెండు ప్రతిమలు గలిగిన స్వర్ణసింహాసనమును విక్రమార్కునికొసంగి బహూకరించెను.

విక్రమార్కు డుజ్జయినీ పురవరంబున కరుదెంచి యొక శుభముహూర్తమున నాగద్దియను బూజించి జయజయ ధ్వానంబులు మిన్నుముట్ట నాసింహాసన మధిష్టించెను.

# విక్రమాదిత్యుడు బ్రహ్మాస్త్రమును బడయుట.

విక్రమాదిత్యుడు భూసంచారము సేయు నాఱుమాసములలో నొక్కనాడొక యడవింబడి నేగుచుండెను. అందొకవృక్షముక్రింద నిరువురు పురుషులు తగవులాడుచుండిరి. విక్రమార్కుడు వారలంగని దరికేగి యిట్లనియెను. "ఓయీ! మీరెవరు? మీకలహకారణంబేమి?" అనినయిరువురును 'అయ్యా! మావివాద కారణంబేమనిన—యీవృక్షముక్రింద గలవస్తువులను భాగించుకొననేరక కలహపడుచుంటిమి. యీవస్తువుల మహిమయేమన-ఇవి పాదుకలు—ఇవిధరించి యెచ్చటికిబోవ దలచిన నచ్చటికిబోవచ్చును. ఇదిసువర్ణపాత్ర-యీపాత్రనుండి మనము కోరిన ఆహారపదార్థములు లభించును. ఈసంచి విదలించిన మాత్రమున సువర్ణనాణెములు నేలరాలును. మీరుపెద్దమనుష్యులవలెనున్నారు. మాతగవును న్యాయపద్ధతిని పరిష్కరింప వేడెదము" అనిప్రార్థించిరి. విక్రమార్కుడు యీవస్తువులు తనకక్కరకు వచ్చునని యెట్లైనను చేజిక్కించుకొన వలెననితలచి, "ఓయీ! యీవస్తువులను భాగించుటకష్టము. యీవస్తువులన్నియు నొక్కనికే చెందినచో బాగుగానుండును. మీలోనధికులైనవారు యీవస్తువుల ననుభవించవలెను. కావున మీరిరువురును సమకాలమున బయలువెడలి ఆదూరమున నున్న మఱ్ఱివృక్షము క్రిందగల నొకపత్రమును గొనిరండు. మీలోనెవ్వడు ముందరుదెంచునో వాడే యీవస్తువుల ననుభవింప నర్హుడు" అనిపల్కిన నందులకు వారుసమ్మతించి వృక్షమును జేరుటకుపర్విడిరి. వారు చనిన పిదప విక్రమార్కుడాపాదుకలను ధరించి గగనమార్గమున నేగుచు కొందఱు ఖేచరులంగాంచి "మీరెచ్చటకు పోవుచుంటి"రని ప్రశ్నింప, వారు స్వర్గమున జరుగబోవు సభకేగుచుంటిమని దెల్పిరి. విక్రమా

ర్కుడు కూడ తత్సభ కేగి దేవేంద్రుని దర్శింపదలచి. దివ్యపాదుకల సహాయమున స్వర్గమున కేగెను.

విక్రమార్కుడు సభను ప్రవేశించినంతనే, యాసభయందుగల చతురాననుడు విక్రమార్కునిగాంచి, ,,ఓయీ! నీవెవ్వడవు? ఇచ్చటికిట్లేకతంబున వచ్చితివి? తెలుపు”మనిన విక్రమార్కుడు నమస్కరించి, ,,దేవా! నేనుఉజ్జయినిపాలకుండను. నన్ను విక్రమార్కుడందురు. మీదర్శనార్థమై యేతెంచితిని.”అనిపల్కిన చతురాననుడు,,ఓయీ! నిన్ను నీనామంబు నెఱిగియుంటిని. నీవతిసాహస మంతుడవు. మనుష్యమాత్రుడవయ్యును మనుజులకు జేరరాని స్వర్గంబున కరుదెంచితివి. కావున యీయస్త్రమును గొనుము. యియ్యది బ్రహ్మాస్త్రము. నీకుజయింప దుర్ఘటనమైన శత్రువులపై దప్ప సామాన్యులపై యీయస్త్రము ప్రయోగింపకుము” అని చెప్పి బ్రహ్మాస్త్రము నొసంగి ప్రయోగోప సంహారముల నొనరించువిధానము నెఱింగించెను.

## విక్రమార్కుడు భేతాళుని వశము గావించుకొనుట.

ఒకనాడు విక్రమార్కుడు కొలువుకూటమునం దాసీనుండై యుండగా జ్ఞానశీలుండను మునీశ్వరుండేతెంచెను. అతడు దుర్గనుగూర్చి పెక్కువత్సరములు ఘోరతపమాచరించగా దేవి సాక్షాత్కరించి, ,,ఓయీ! నీకేమికావలయునో కోరుకొను”మన అతడు ,,ఓజగదంబా!

యీవటవృక్షముపైనున్న భేతాళుని నావశముగావించి పిమ్మట విక్రమార్క భూపాలుని స్థానమున నేనేయీమహీతలమును బాలించునట్లు వరమునుగ్రహించుము" అనివేడినదేవి, "ఓయీ!నాపీఠముయొద్దనొక గొప్ప యాగముచేసి యాగానంతరమున నాసంప్రీత్యార్థమై నూరుగురు నృపాలురను బలియొసంగినచో నీకోరికసిద్ధించును." అనిచెప్పి దేవియంతర్థానమొందెను. జ్ఞానశీలుడు తనమనోరథము సఫలీకృతమొనరించుకొన నిశ్చయించుకొని కార్యాచరణమునకు గడంగి, యాగమాచరించి, అనంతరమున తొంబది తొమ్మండుగురు. నృపాలురను దేవికిబలియొసంగెను ఇకనొకభూపాలునితో క్రతువు పరిసమాప్తి గాందెను. జ్ఞానశీలుడు విక్రమార్కునే కాళికాదేవికి తుదియుపహారముగా నర్పింపదలచి విక్రమార్కుని యాస్థానమునకేతెంచెను.

జ్ఞానశీలుడు తన హృదయమునందలి కల్మషమును మరుగు పరచుకొని విక్రమార్కుని చెంతకేగి యాశీర్వదించి యొకఫలమాతని పాదములచెంతనిడి వెడలిపోయెను. సాధారణముగా విక్రమార్కుని సందర్శించు వారెల్లరు నేదోయొక ఫలమును కానుకగా తెచ్చి సమర్పించు చుందురు. అందుచేత మునిదెచ్చిన ఫలవిషయము రేడు అంతగాపాటింపలేదు. జ్ఞానశీలుడీరీతిగా ప్రతిదినము నేతెంచి కానుకఫలము సమర్పించి పోవుచుండెను. విక్రమార్కుడొకనాడు మునిదెచ్చిన ఫలమును సమీపముననున్న వానరమునకు బడవైచెను. ఆవానరము భక్షింపదలచి యాఫలమును యిచ్చెను. అందు యపూర్వకాంతి వెదజల్లువజ్రముండెను. రేడదిగాంచి విస్మయముజెంది యామునియిదివరలో నొసంగిన ఫలములను దెప్పించిచూడగా వాటియందునను వజ్రములుండెను.

ఆమరునాడుముని యథాప్రకారముగా ఫలమును గొనివచ్చెను. భూపాలుడా ఫలమును గూడపరీక్షింప నందుగూడ వజ్రములుండుట

గని, "మునీశ్వరా! తమరిట్టి వ్రతములను నిత్య మేల నాకొసంగు చుండిరి? నావలన మీకు కాదగిన కార్యము కలదేని సంశయింపక నెఱుంగ జేయ వేడుచున్నాను"

జ్ఞానశీలుడు నృపాలునిపల్కు లాలించి అమందానందంబు నొంది మందస్మితముఖుడై, "మహీపాలా! నేనుజ్ఞానశీలుడనువాడను. ఈనగరమునకు వెలుపల నున్న వనమున గల కాళికాలయమున నేనొక యాగమాచరించుచున్నాను. వచ్చు చవితి నాటిరాత్రి యాగము యొక్క కర్మకాండ జరుగ గలదు. ఆనాటిరాత్రి నీవొక్కడవే అచ్చటి కరుదెంచినచో ననేకవిషయముల నెఱుంగ గలవు. ఇందులకేమందువు?" అనిపల్కిన విక్రమార్కుడు మునిహృదయమును గూర్చి లేశమైనను శంకింపక నట్లేయని యందుల కనుమతించెను. ముని హర్షోత్ఫుల్లవదనుడై నిజాశ్రమము జేరబోయెను.

విక్రమార్కుడా మునిని నిర్దేశించి చెప్పిన దివసంబున చంద్రాయుధధారియై యొంటరిగా వనమునకేగి మునిని గలిసికొనెను. జ్ఞానశీలుడు రాజేంద్రునితో యాదరపూర్వకముగా సంభాషించి పెక్కురీతులబొగడి యనంతరమున, "రాజా! శ్మశాన సమీపమున గల వటవృక్షశాఖపై భేతాళుడనువాడు శవాకృతితో తలక్రిందుగానున్నాడు. ముందుగా నీవాతనిని బంధించి తీసుకొని రావలయును." అని నియోగించి పంపెను.

——:0:——

# విక్రమార్కునకు భేతాళుఁడుచెప్పిన కథలు

[ఒకటవ కథ]

విక్రమార్కుఁడు వటవృక్షమునకడకేగి యొకశాఖపై శవాకృతితో తలక్రిందుగా వ్రేలాడుచుండిన భేతాళునిగాంచి, యాభూరుహము నారోహించి భేతాళుని మూపుపై నిడుకొని వచ్చుచుండెను. భేతాళుఁడు విక్రమార్కునితో "ఓ రాజా! ముని నీకెట్టికష్టముగుపనిగల్పించెను? నీశ్రమ నివారణార్థమై యొకచక్కనికథజెప్పెదనాలింపుము" అని యీక్రిందికథజెప్పెను.

తొల్లి దేవవరంబను పురంబును ప్రతాపసింహుఁడనురాజు పరిపాలించుచుండెను. అతనికి వజ్రముకుటుం డను పుత్రుఁడు గలఁడు. వజ్రముకుటుండు మతిమంతు డను మంత్రిసూనునితో గూర్మికలిగి యొండొరులఁబాసి యుండలేకపోయెడివారు. ఒకనాడు మృగయావినోదార్థమై యరణ్యంబునకరిగి పెక్కు ఘాతుకమృగములను వధించి శ్రమనివారణార్థమై అందుగల యొకతటాకంబునుజేరి సమీపమునగల వృక్షచ్ఛాయను విశ్రమించిరి.

ఇంతలో నొక్క నారీరత్నము తననెచ్చెలులతో స్నానార్థమై యచ్చటికరుదెంచెను. వజ్రముకుటుఁడాకాంతామణింగాంచి మోహించెను. ఆ కన్యాలలామయు వజ్రముకుటునిఁగాంచి మోహించి, కొంతతడవు జలకేళి సలిపి తటాకమునందుగల పద్మమునొకటి చేఁబూని తీరమున కరుదెంచి, వజ్రముకుటుండు చూచునట్లుగా నాపద్మమును తనకన్నులనద్దుకొని పంటిచేఁగరచెను. పిమ్మట యాపద్మమును సవిలాసముగా దన పదములపై విడచెను. తదుపరి యాపద్మమును గ్రమ్మర గ్రహించి తనకుచస్థలిపై జేర్చుకొని మరికొన్ని శృంగారచేష్టలంగావించి చెలులతోఁగలసి నిజపురంబునకు బోయెను. పిమ్మట వజ్రముకుటుండు మతిమంతునితోఁగలసి దేవవరంబుఁజేరుకొనియెను.

వజ్రముకుటుండు పురంబు ప్రవేశించినది మొదలుగా దాను తటాకమునొద్దగాంచిన కన్యపై మోహంబునిలిపి విరహాభరంబున గృశించుచు నొకనాడు మతిమంతునిఁబిలిచి యాలలన గావించిన సైగలనుదెలిపెను. అంతమతిమంతుడు "మిత్రమా! ఆమెకూడా నీయందు బద్ధానురాగయైయున్నది. ఆమెకావించిన సైగలకు అర్థముతెలిపెద నాలింపుము. ఆమెపద్మమును గన్నుల కద్దుకొనుటచే ఆమెనివసించు పురంబు నేత్రపురంబు పంటఁగఱచుటచే నామెపేరు పద్మావతి. పద్మమును పాదములపై విడుచుటచే తనతండ్రిపేరుఉత్తానపాదుడు, కుచములపై నిడుకొనుటచే నీయందు బద్ధానురాగ. కావున మనము నేత్రపురంబునకు బోయి యామెను గలిసికొంద"మన్న రాజకుమారుడు సంతసించి యామరునాడే నేత్రపురంబు పయనమై యేగిరి.

వజ్రముకుటుండును మతిమంతుఁడును నేత్రపురంబు జేరుకొని పద్మావతి వృత్తాంతమరసి పద్మావతి దాసియగు యొకవృద్ధాంగనను గలిసికొని యామెచేత కొన్ని బంగరు నాణెములిడి యామెను దమ వశము గావించుకొని "అవ్వా! మాపద్మావతిపై మా రాకొమరుని మనంబు లగ్నమై యుండెను. ఆమెకూడ నీతని యందు బద్ధానురాగయై రమ్మనిచెప్పియుండెను. కావున నీ వామెకడకేగి యరణ్యమునందుగల కాసార తీరంబున నీవు గాంచిన రాకుమారుఁ డరుదెంచినాడని చెప్పి ఆమె యొసంగు సమాధానము మరల మాకు నివేదించుము" అని చెప్పి యామెను పద్మావతికడకు పంపిరి. ఆవృద్ధాంగన పద్మావతికడ కేగి వారు చెప్పినచొప్పున చెప్పగా, పద్మావతి కోపము నభినయించి తనరెండుచేతులకు జందనంబు నద్ది యావృద్ధాంగన గండపాలికలపై గొట్టెను. అంత నామె మతిమంతుని కడకరుదెంచి, "అయ్యా మీరుచెప్పిన చొప్పున నామెతో చెప్పగా జందనమును దన చేతులకు బూసికొని నాగండపాలికలపై చరచెన"నెను. అదివిని

రాకుమారుడు నిరాశ జెంది నిట్టూర్పులు విడచుచుండెను. అంత మతిమంతు డాతనితో నిట్లనియెను. "మిత్రమా! ఇందు నిరాశ జెంద నక్కరలేదు. పద్మావతి సామాన్య వనితకాదు. ఆమె కడు చమత్కారిణి. ఆమె వృద్ధాంగన గండ పాలికలపై జందనమద్దుటకు గారణమే మనిన, వెన్నెలపోవుటకు నింక పది దివసంబు లున్నది కావున నీతో గలియ వీలుకాదనియు ఆవల రమ్మనియునర్థము" అనిచెప్పి రాకుమారుని సంతోషపరచెను.

వారిరువురును ఆపురంబుననే పదిదినములు గడపి పదునొకండవ దినమున యా యవ్వను మరల పద్మావతి చెంతకు బంపిరి. పద్మావతి యా జరఠాంగననుగాంచి తన మూడువ్రేళ్ళకు కుంకుమ బూసికొని యాయవ్వ వక్షస్థలమున గొట్టి యొక రహస్యమార్గమున నింటినుండి బయట కంపెను.

ఆ వృద్ధాంగన మంత్రిసూనుని గలిసికొని యామె గావించిన చర్యదెల్పెను. మతిమంతుడు రాజకుమారునితో, "మిత్రమా!ఆమెయిప్పుడు పుష్పవతియై యున్నది. మూడు దినములు పోయినతరువాత నీ వృద్ధాంగన వచ్చిన రహస్య మార్గమున మనలను రమ్మనిచెప్పినది" అనిచెప్పి యాతనిని సంతోషింప జేసెను.

మూడుదినములు గడచిన వెనుక వజ్రముకుటుండు వృద్ధాంగన చూపిన రహస్యమార్గమున నేగి పద్మావతిని గలిసికొని మతిమంతుని మఱచి దినములు గడపుచుండెను. ఒకనాడు మతిమంతుడు ఒక కమ్మ లిఖించి వజ్రముకుటున కందఁజేయ నావృద్ధాంగన కిచ్చెను. ఆమెయు నాలేఖఁ గొనిఁ పద్మావతి మేడకరిగి వజ్రముకుటున కాలేఖ నంద జేసెను.

"ప్రియమిత్రమా!

కామోద్రేకులు సర్వమును మఱచి వర్తించుచుందురు గదా!" అనియున్న లేఖను వజ్రముకుటుండు చదువుకొని మతిమంతుండు జ్ఞప్తికి రాగా పద్మావతితో, ప్రేయసీ! మంత్రిసూనుండును నేనును చిన్ననాట నుండియు మిత్రులము. అతఁడే నీసంజ్ఞలకు అర్థముఁదెల్పి నిన్ను నాకొనగూర్చెను. నేనిచ్చటకు వచ్చినది మొదలు ఆతని మాటయే మఱచితిని. కావున నేఁడాతనితో సంభాషించి వచ్చెదనని చెప్పి మతిమంతుని జూడనేగెను.

పద్మావతి తన సఖుఁడేగిన పిమ్మట తనమనంబున నిట్లుతలపోసెను. "మతిమంతుఁడు చతురుఁడు వలెనున్నాఁడు. నాకును నాప్రియునకును యెడబాటు కలుగజేయక మానఁడు. కావున మతిమంతునెట్లైన రాకుమారుని యొద్దనుండి విడదీయవలెను" అనితలచి విషభక్ష్యముల గొన్నిటిని యొకపళ్ళెరమందుంచి యొకదాసితో, "యీపళ్ళెరమును మతిమంతునకు దిననొసంగి, రాకుమారునితో నతని రాకకు వేచియుంటినని తెల్పు"మని పుత్తెంచెను.

రాకుమారుడును మతిమంతుడును సంభాషించుచుండ నచ్చటికా దాసి యరుదెంచి పళ్ళెరమును మతిమంతుని కడనుడి, రాకుమారునితో తమరాకకై పద్మావతి నిరీక్షించుచుండె నని తెల్పి నిష్క్రమించెను. పిమ్మట మంత్రిసూనుడు రాకుమారుని, "మిత్రమా! పద్మావతితో నామెసంజ్ఞలకు నే నర్థముజెప్పితి నని తెల్పితివా యేమి?" అని ప్రశ్నింప, రా కుమారుఁడు తెల్పితి నని ప్రత్యుత్తర మొసంగ, "మిత్రమా! నీవటుల దెల్పుటచే విషపూరితములైన భక్ష్యములు నాకు బంపినది. చూడు"మని యీభక్ష్యములను సమీపమునఁగల యొక కుక్కకిడెను. అంతనది భక్షించిన తోడనె విగతజీవియయ్యెను. "మిత్రమా! పద్మావతికి నీపైగల ప్రేమచే నన్నామెకడనుండి తొలఁగాని

పోదు నని తలచి యిట్టిపని గావించెను. ఇందులకై నీవామె పై గినియకుము. ఎట్లయినను యామెను వంచించి మన నగరంబునకు దీసికొని పోవలయును. నేటిరాత్రి నీవామెకడకేగి సుఖంబుగా కొంతకాలము గడపి ఆమెనిద్రించునపుడు త్రిశూలమునామె తుంటిపై గ్రుచ్చి యామె హార మొకటి దానిని గొనిరమ్ము." అని చెప్పెను. ఆరాత్రి వజ్రముకుటుండు మతిమంతుండు చెప్పినరీతిగా నాచరించి యాతవిని గలిసికొనెను. పిమ్మట నాయిరువురును స్మశాన సమీపమునకేగి మంత్రిసూనుఁడు యోగివేషంబును రాకుమారుఁడు యాతని శిష్యవేషంబును దాల్చిరి. అంత మతిమంతుఁడు రాకుమారునితో "మిత్రమా! నీవీహారమును గొనిపోయి పురమున నమ్మజూపుము. రాజభటులు నీకీహారమెచ్చటిదనిన నాకీహారమును మాగురువు గారొసంగిరని తెల్పుము. అంతకుమిన్న నింకేమియు దెల్పవలదు." అని చెప్పి పంపివైచెను.

వజ్రముకుటుండా హారమును గొని పురమంతయు ద్రిమ్మరుచు నా హారమును విక్రయింప జూపుచుండెను. అంత గొందరు రాజభటు లరుదెంచి "ఓయీ! నీకీహార మెచ్చటి" దనిన వజ్రముకుటుండు "ఇయ్యది మాగురువుగారు నాకొసంగి యమ్ముమని నన్ను బంపిరి." అని చెప్పిన రాజభటులాతనిని రాజుకడకు గొంపోయిరి. ఆరాజుగూడా వజ్రముకుటుని వలన నాయుత్తరమునే బడసి, "ఓయీ! మీగురువు కడకు నన్ను గొంపొమ్ము" అనిపల్కి యాతనివెంట నేగెను.

రాజు కుహనా యోగియగు మతిమంతుని గాంచి నమస్కరించి, "అయ్యా! మీకీహార మెట్లు లభించెనో దెలుప వేడెద" ననెను. అంత మతిమంతుడు "రాజా! గతరాత్రి నొక సౌందర్యవతి యైనస్త్రీయొకచక్కనిబిడ్డను గొని తెచ్చి తినుచుండెను. ఇంతలో కొన్ని నక్కలరుదెంచియా బిడ్డశరీరము లాగుకొని పోయెను. అంతనాస్త్రీ యొడలు తెలియని స్థితిలో నుండినావద్ద కరుదెంచి నాజపమాల లాగుచుండెను. అంత నేను త్రిశూల

ముతో నామెతుంటిపై బొడిచితిని. ఆమె పరుపిడిపోయెను. పోవునపుడు యీహార మామె మెడనుండి జారిపడెను. ఆస్త్రీ తుంటిపై త్రిశూలము గురుతుండును." అనిచెప్పిన రాజు హారము బరీక్షించి తన యమాత్యుని కుమార్తెయగు పద్మావతికి నామె జన్మదినోత్సవమున దాను కానుకగా నొసంగిన దని గుర్తించెను. అంత మతిమంతుడు, "రాజా! యీస్త్రీని నీపురంబున నుండ నిచ్చెదవేని నీకు శుభంబు చేకూరదు. అమెను గను గొని యరణ్యమునకు బారద్రోలుము" అని చెప్పిన భూపాలుం డందులకు సమ్మతించి వెడలిపోయెను.

రాజు అంతఃపురము బ్రవేశించి హారము పద్మావతి దగుటచే ఆమె జఘనమును ఒక పరిచారికచే బరీక్ష సేయించి త్రిశూలపుగుర్తుండుట తెలిసికొని యామెనరణ్యమున డించిరమ్మని భటుల కాజ్ఞాపించెను.

రాజభటులు పద్మావతినరణ్యమునకు దోడ్కొని పోవుచుండుట గాంచి యాతపోధనా మునిపుంగవు లిరువురును వారివెంట నరిగి భటులామెను డించిపోయిన పిదప యామెను దోడ్కొని నిజపురంబునకు జనిరి.

పిమ్మట ఉత్తానపాదుడు పుత్రికాశోకంబున మరణించెను. అతని భార్యసహగమన మాచరించెను. విక్రమార్కభూపాలా! ఉత్తానపాదుడును వానిభార్యయు మరణించి నందున యీదోష మెవ్వరిదో తెల్పుము? తెలిసి యుండియు జెప్పవేని నీశిరంబు వేయివ్రక్క లగుననెను. అంత విక్రమార్కుండు, "ఓయీ! భూపాలుండు మంచి చెడ్డలరయక పద్మావతిని దండించెను. కావున యీదోషమాతనికి జెందును" అని చెప్పిన భేతాళుండు అతని మూపునుండి జారివటవృక్షమును జేరెను.

# (రెండవకథ.)

విక్రమార్కుడు మరల వటవృక్షము నెక్కి యాశవమును భుజముపై నిడి తీసికొని వచ్చుచుండ భేతాళుండు "విక్రమార్క మహీపాలా! నీయలసటదీరుట కొకకథ జెప్పెదనాలింపుము" అని యీక్రిందికథ జెప్పెను.

బ్రహ్మపురమను నగ్రహారమున నొక భూసురోత్తముండు కలడు. అతనికి సౌందర్యవతియైన శీలవతియను కుమారీరత్నము గలదు. ఆమె సౌందర్యమును గాంచి ముగ్గురు విప్రకుమారులామెను మోహించి, ఆమెయందు బద్ధానురాగులైరి. ఆముగ్గురు నొకరితరువాత నొకరుగా యాభూసురోత్తముని కడకేగి తమకా శీలవతినిచ్చి పరిణయంబొనరింపనిచో ఆత్మహత్య గావించుకొని మరణింతుమని తెల్పిరి. ఆభూసురోత్తముండు తనకుమార్తెను వారిలో నెవరికిచ్చి వివాహమొనరింపవలయునో దోచక మిన్నకుండెను.

ఇట్లుండ నొకనాడు శీలవతికి జ్వరమువచ్చి మరణించెను. భూసురోత్తముడు మిగులదుఃఖించి శీలవతిని దహనపరచెను. ఆమువ్వురు విప్రకుమారులు శీలవతిపైగల ప్రేమచే నొకడు ఆమె అస్థికలగొని కాశికేగెను. మఱియొకడు దేశాటనకేగెను. వేరొకడు ఆమెను దహనపరచిన స్థలమునందే వసించెను

దేశాటనకేగిన విప్రకుమారుడు సకల దేశములు ద్రిమ్మరుచు నొక యగ్రహారముజేరి అటగలయొక బ్రాహ్మణుని యింట భుజించుచుండెను. ఆబ్రాహ్మణుని కుమారుడు బిట్టుగా రోదనమొనర్చుచూ తల్లినిజేరెను. ఆబ్రాహ్మణి బిడ్డపై కోపముజెంది బిడ్డను అచ్చట మండు

చున్న అగ్నిహోత్రమున బడవైచెను. వెంటనే ఆబాలుని శరీరము కాలి భస్మమయ్యెను.

విప్రకుమారుడయ్యది కాంచి కోపముతో, "యీయింట శిశుహత్య జరిగినది కావున నేనిందు భుజింపను" అని లేచుటకు సంసిద్ధుడయ్యెను. అంతనా బ్రాహ్మణుడు వానిని వారించి, 'అయ్యా! నాకడ మృతసంజీవినీ మంత్రమున్నది. ఆమె యెరింగినదగుటచే బిడ్డనట్లు వహ్నిని బడవైచెను' అని బూడిదను బ్రోవుజేసి సంజీవనీమంత్రము పఠించగా, బిడ్డ యెప్పటియట్ల లేచి యాడుకొనదొడగెను. అయ్యది విప్రకుమారుడుగాంచి అతని పదంబులపైవ్రాలి తనతప్పు సైరింపుడని వేడుకొని తన వృత్తాంతమంతయుజెప్పి తనకు మృతసంజీవినీ మంత్రముపదేశింపుడనియు పెక్కువిధముల వేడుకొనెను. ఆబ్రాహ్మణుడాతనికిమంత్రముపదేశించి ఆకన్యను వరింయుంబొడి సుఖంబుగా నుండుమని పంపివైచెను.

అతడు తనదేశమునగల స్మశానమున కరుదెంచెను. అచటికంతకుమున్నె కాశికేగినవాడుగూడ నరుదెంచి యీకాటిని గాచికొనియున్న యాతనితో గలిసి రోదనమొనరించుచుండెను. అతడు వారిని వారించి తనమంత్ర ప్రభావముచే శీలవతిని బ్రతికించెను. ఆకన్య బ్రతుకుటజూచి వారిలో వా రామెను పరిణయంబాడుటకు కలహింపసాగిరి

విక్రమార్క మహీపాలా! వింటివిగదాకథ. ఆముప్పురిలో యెవ్వడు ఆమెను పరిణయంబాడ నర్హుడో తెల్పుము? తెలిసియుండియు దెల్పవేని నీశిరంబు వేయివ్రక్కలగును." అని పల్కిన విక్రమార్కుడు "ఓయీ! వినుము, అస్థికలుగొని చనినవాడు పుత్రుడగును. ఆకన్యను జీవింపజేసినవాడు తండ్రిసముడు. కావున నాకన్యను గాటిగాచినవాడె పరిణయంబాడ నర్హుడు." అనిన భేతాళుడు పట్టువిడిపించుకొని వటవృక్షము జేరెను.

# (మూడవ కథ.)

విక్రమార్కుడు మరల నావటవృక్షముకడ కేగి నాశవమును దింపి మూపున నిడుకొని మిగుల యలసటతో నరుదెంచుచుండ భేతాళుడీ క్రిందికథ జెప్పెను.

స్వర్ణపురమను పట్టణమున కిరీటిస్వామియను భూసురోత్తముడు గలడు. అతనికి సర్వలక్షణ సంపన్నయగు పుష్పావతియను కుమారీరత్నము గలదు. ఆకన్య నతడు మిక్కిలి ప్రేమతో అల్లారుముద్దుగా పెంచుచుండెను. ఆమె సౌందర్యమును గాంచియు సద్గుణముల నాలించియు, జ్ఞాని, సూత్రజ్ఞుడు, శూరుడు అనువారలు మువ్వురు ఆమెను మోహించి పరిణయంబాడ మది నిశ్చయించుకొని కిరీటిస్వామి కడ కరిగి యెవరికి వారె తనకిచ్చి వివాహము జేయుమని ప్రార్థించిరి. ఆవిప్రుడును మీలో నొకనికిచ్చెదనని వాక్రుచ్చెను.

ఇట్లుండ ఒకనాడొక రాక్షసుడు పుష్పావతినిగాంచి మోహించి ఆమెనెత్తుకొని పోయెను. ఆకన్య తలిదండ్రులు చింతాక్రాంతులై నగచుచుండ జ్ఞాని యరుదెంచి తన జ్ఞానదృష్టిచే ఆరాక్షసుని స్థలంబు గుర్తించిచెప్పెను. అంత సూత్రజ్ఞుడు "రాక్షసుని జయించు సమర్థులుండినచో అతనికడ కరుగుటకు నేనొక రథంబు చేసి యిచ్చెదననెను. అందుకు శూరుడు రాక్షసుని నేను జయించెదననెను. సూత్రజ్ఞుడు యాకాశయానము నొకటి చేసియిచ్చెను. శూరుడు ఆయుధధారియై రథంబుపై నరిగి యారాక్షసునితో బోరుసల్పి యాతనిని మడియింపజేసి పుష్పావతిని చెఱ విడిపించి యామె తలిదండ్రులకడకు జేర్చెను.

పిమ్మట యాకన్యను వివాహమాడుటకు వారు ముగ్గురును గలహింపసాగిరి.

విక్రమార్క భూపాలా! వింటివికదా కథ! ఈముగ్గురిలో నాకన్యను యెవరికిచ్చి పెండ్లిచేయునగునో దెల్పుము. తెలిసియుండియు దెల్పవేని వెనుకటిశాపమే యనిన విక్రమార్కుడు రాక్షసుని జయించి ఆకన్యను జెఱ విడిపించిన యాతడే పాణిగ్రహణ పాత్రుడని చెప్పగా భేతాళుడు యెప్పటియట్లు నానట వృక్షముజేర నరిగెను.

# (నాల్గవ కథ)

విక్రమార్కుడు మరల చెట్టుకడకు బోయి నాశవమును దెచ్చు చుండ భేతాళుడీ క్రిందికథ జెప్పెను.

పూర్వము పాటలీపురమను పట్టణంబున విక్రమసింహుండను నృపాలుండు పరిపాలించుచుండెను. అతనికడ భూత భవిష్యద్వర్తమానముల నెఱుంగ గల చిలుక యుండెను. విక్రమసింహుండు మగధదేశపు రాకుమారియైన చంద్రకళను బెండ్లియాడెను. చంద్రకళ శ్వశురగృహమున కరుదెంచునపుడు దనతో సరణముగా సర్వవిజ్ఞానశాలులను చిలుకలను గొనితెచ్చెను.

ఆచిలుకలు రెండును నొక్క పంజరముననే యుండెను. ఒకనాడు మగచిలుక యాడుచిలుకను గలియబోవ నాడుచిలుక అందుల కంగీకరింపక పురుషులను నమ్మరాదని తూలనాడెను. మగచిలుకయా

మిగుల కోపంబున స్త్రీలు దుష్టాత్మలని నిందింపసాగెను. పిమ్మట వారిరువురును తమ వివాదము దీర్చ విక్రమసింహుని వేడిరి. అందులకు విక్రమసింహుడు నల్లెగాని యంగీకరించి యాడుచిలుకను యెందువలన పురుషులు క్రూరులో, నమ్మదగనివారో చెప్పు మనిన నాచిలుక యీక్రింది కథ జెప్పెను.

మహీపాలా! తొల్లి అభయ పురియను పట్టణమున లక్ష్మీదత్తుడను వణిగ్వరుడు గలడు. ఆతనికి తర్కదత్తుడను కుమారుడొకడు గలడు. తర్కదత్తుడు చిన్ననాటినుండియు దుర్వ్యసనములకు లోనై పితార్జితమంతయు వ్యయపరచెను. తండ్రి యాతనిపై గినిసి యాతనిని యిలు వెడలగొట్టెను. అతడు దేశముల ద్రిమ్మరుచూ మణిపురంబుజేరి అందుగల నొక్కవైశ్యునిల్లు జేరెను. ఆవైశ్యుడాతని ప్రవర్తన గొన్నిదినములు పరిశీలించి ఆతని పూర్వప్రవర్తన మెఱుగక తన పుత్రికయగు మణిమాల నిచ్చి వివాహము గావించెను.

తర్కదత్తులు శ్వశుర గృహమునసే కొంతకాలముండి కొంతధనము సేకరించుకొనియొక్కనాడు మామగారిని గని "మామా! నేను నా తలిదండ్రులను వీడి చాలకాలమైనది. కనుక నేనును నాభార్యయు బోయి చూచివచ్చెద"మనిన మామయు నల్లెయని సమ్మతించి వారిని సాగనంపెను. తర్కదత్తుడు అభయపురికేగుచూ మార్గమధ్యమున నొక్కచో నలసట దీర్చుకొన విశ్రమించిరి. అంత తర్కదత్తుడిట్లు మనంబున వితర్కింపసాగెను. ఈమెతో నభయపురి కేగుచో నచ్చట నా ప్రవర్తనమంతయు నీమె తెలిసికొనును. అదియుంగాక యీమెను తనకడగల భూషణంబు లిమ్మనిన నీయనొల్లదు. ఇచ్చినను నా అత్త మామలతో జెప్పితీరును. చెప్పినచో నచ్చటమన కిసుమంతయు సౌఖ్యముండదు. ఈమెకడగల భూషణములు దీసికొని యీమెను సమీపమునగల గోతద్రోసెదనని నిశ్చయించుకొని మణిమాల నొడలిపైగల

గల భూషణములెల్ల దీసికొని సమీపమునగల గోతఁద్రోసి అభయపురి
కరిగెను.

పిమ్మట మణిమాల మార్గస్థుల సహాయమున గోతినుండి వెలిక
రుదెంచి మణిపురంబు జేరెను. తలిదండ్రులామె దుస్థితిగాంచి మిగుల
విచారించి కారణమరయగా నామెయిట్లు జెప్పెను. మేమిరువురము వన
మార్గమున నభయపురి కేగుచుండ మమ్ములను దొంగ లడ్డగించి నాక
డగల ధనంబులు గైకొని నన్ను విడిచి నాపతిని దోడ్కొనిపోయిరి. పి
మ్మటనేను అందంద ద్రిమ్మరుచు కొందరీ పురంబునకు వచ్చుచుండగా వా
రలతో నేనరుదెంచితిని. అని చెప్పి దుఃఖింప నారంభించెను. తలిదండ్రు
లామె నూరడించి యెట్టిలోపమును గానీయక మిగుల గారాబమున
బెంచుచుండిరి.

తర్కదత్తుడు తనభార్యను గోతఁద్రోసి అభయపురికరిగి వేశ్యలనుగూ
డి జూదరులతో తిరుగుచూ తనకడనున్న ధనమంతయు వ్యయపరచి మర
ల పూర్వస్థితి కరుదెంచెను. తర్కదత్తుడు తన కడ ధనము లేమిం జేసి
మనంబున నిట్లు వితర్కించుకొనెను. ఇప్పుడు నాబ్రతుకునకు తెరవు
గాన్పించుటలేదు. ధనముకొరకు మరల మామగారి నాశ్రయించవల
యును. ఇట దండ్రినన్ను జేరనీయడు. మామగారికడ కరిగినచో దన
కూతురు విషయమై అడుగును. అడిగినచో అభయాపురిలో సుఖంబుగా
నుండెనని చెప్పి ధన నిమిత్తమై నేనరుదెంచితినని తెల్పి చేతికిజిక్కినధనం
బును గొనివచ్చెదనని మనంబున నిశ్చయించుకొని మణిపురము పయ
నమై యేగెను.

అతడు మామగారి గృహంబు జేరగానె అతని భార్యయెదురే
గెను. ఆమెను గాంచి తర్కదత్తుడు దిగులొంది తన ప్రయత్నములన్ని
యు విఫలములయ్యెనని చింతింపదొడగెను. మణిమాల భర్త భయ
కారణంబెరింగి యాతనితో తాను తన తలిదండ్రులతో జెప్పిన విధ

మంతయు నెఱింగించి భయపడవలదని చెప్పెను. అతడులోనికేగి అత్త మామలను దర్శించి నమస్కరించెను. వారును అల్లునిరాకకు సంతసించిరి.

తక్కదత్తు డెప్పటియట్లె శ్వశుర గృహమున కొంతకాలముండి మరల జూదమునందు వ్యామోహము కలిగినందున నొక్కనాడర్ధరాత్రి మున భార్య నిద్రించుచుండగా క్రూరుడై యామెను మ్రింగించి ఆమె కడగల భూషణంబులుగొని యెవ్వరికంట బడకుండా పురమువీడి చనెను.

విక్రమసింహ భూపాలా! వింటివికదా నాకథ. ఇట్టి క్రూరులైన పురుషులను నమ్మవచ్చునా?" అని పల్కెను.

అంత విక్రమసింహుడు శుకచిలుకను గాంచి, నీవు స్త్రీలు దుష్టాత్మలని నిరూపింప గలిగినచో నిరూపింపుమనెను. అంత నామగచిలుక యీక్రింది కథ జెప్పెను.

పూర్వము వేదపురమను పట్టణమున ధనవంతుడగు నొక్క వైశ్యుడుగలడు. అతనికి వసుమతియను కుమార్తెగలదు. ఆమెకు తగిన వరుడు లభింపమి తండ్రిచే వసుమతికి వివాహ వయస్సు దాటినను బెండ్లిగావింపలేదు. వసుమతి యొక విప్రకుమారునితో సాంగత్యము నెఱపుచుండెను. పిమ్మట పెక్కు దినములకు వసుమతి తండ్రి ఆమెకు తగిన వరుని నిర్ణయింప వలయునని పెక్కుదేశములు గాలించి తుదకు అరిష్టపురమునగల యొక వైశ్యయువకున కిచ్చి బెండ్లి గావించెను.

పరిణయమైన కొన్ని దినములకు వసుమతి భర్త అత్తవారింటి కరుదెంచెను. ఆనాటిరేయి వసుమతి భర్తకు తగిన పరిచర్యలు గావించి యాతడు నిద్రించిన వెనుక నొక పళ్ళెరమందు కొన్ని ఫలాహారములిడికొని తన ప్రియుడైన విప్రకుమారునికడకు బోవుచుండెను. ఆరాత్రి గస్తీ తిరుగు రక్షకభటుడొకడు ఆమెను గాంచి యెచ్చటికేగుచుండెనో గనుగొనదలచి ఆమెను వెంబడించెను. వసుమతియు క్రిమక్రమముగా

పురముదాటి పురబహిఃప్రదేశమునగల యొక శిథిలగృహమును జేరెను.

అంతకు మున్నె యామెపొందుకొరకై అచ్చటి కరుదెంచిన విప్రకుమారుని గొందరు చోరులు జీవ మాత్రావశేషునిగా నొనరించి యాతని కడగల భూషణంబులనుగొనిపోయిరి. వసుమతి యావిప్రకుమారుని యవస్థగాంచి దుఃఖించి యాతని మోముపై తన మోమిడి ముద్దిడుకొనబోయెను. అంతనామె నాసికయాతని నోటబడెను. తోడనే యాతని ప్రాణములు జాతి నోరుమూసికొనిపోయెను. అంతనామె నాసిక తెగెను. తోడనే యామె యచ్చట జాగుసేయక తన శయనాగారమున కేగెను. రక్షకభటు డియ్యది యంతయుగాంచి మరల నామెను వెంబడించెను.

వసుమతి శయనాగారము ప్రవేశించి బిగ్గరగా రోదనమొనర్చుచూ కేకలు వేయసాగెను. అంత గృహమునగల వారందరూ మేల్కొని కారణమరయ వసుమతి తన భర్తనాసిక కోసివేసెనని తెల్పెను. వసుమతి భర్తయు మేల్కొని యదియంతయుగాంచి ఆశ్చర్యపోయి మారుమాట్లాడక మిన్నకుండెను.

ఆమరునాడు న్యాయాధికారి వసుమతి భర్తను విచారింపగా తనకేమియు తెలియదని చెప్పెను. న్యాయాధిపతి వసుమతిని కూడ విచారించి ఆమె పల్కినదంతయు సత్యమని తలచి యాతనిని శిక్షించదలచెను. ఇంతలో రాత్రిగస్తీ తిరుగుచూ ఆమెను వెంబడించిన రక్షకభటుడు న్యాయస్థానమున కరుదెంచి సత్యమును వెల్లడించెను.

అంత న్యాయాధిపతి వసుమతి భర్తను విడుదలజేసి యామెను శిక్షించెను.

విక్రమసింహ భూపాలా! యీకథనుబట్టి స్త్రీలు దుష్టాత్ములు కారా! స్త్రీలకంటె క్రూరులగు పురుషులుగలరా! అనిపల్కిన విక్రమ

సింహుఁడు వారి వివాదము పరిష్కరించి యారెంటికిని మైత్రి నొనగూర్చెను.

విక్రమార్క భూపాలోత్తమా! యీకథ నాలించితివి గదా! పురుషులు దుర్మార్గులా? స్త్రీలు దుర్మార్గులా? తెలుపుము. తెలిసియు చెప్పవేని వెనుకటిశాపమే, అనిన విక్రమార్కుడు, పురుషులకంటె స్త్రీలె యెక్కువ దుర్మార్గ కార్యము లాచరింతురు కావున స్త్రీలె దుర్మార్గులని చెప్పినతోడనె భేతాళుఁడు యెప్పటియట్లె వటవృక్షమును జేరెను.

——:0:-

## (అయిదవకథ)

విక్రమార్కుఁడు మరల భేతాళుని బట్టుకొని వచ్చుచుండగా భేతాళుఁడీ క్రిందికథ జెప్పెను.

ధర్మదత్తుడను వైశ్య యువకుడొక్కడు హర్షపురినుండి నిజపురంబున కరుదెంచుచూ నొక్కసరోవర తీరమున బడలిక తీర్చుకొనుటకై విశ్రమించెను. ఆసరోవరమునకు కొందరు నారీరత్నములు స్నానార్థమై యరుదెంచిరి. ఆమహిళా సమూహమందున్న యొక్క తరుణీమణిపై ధర్మదత్తుని మనంబు లగ్నమయ్యెను. తోడనే యాతడు మనంబున దుర్గాదేవిని ప్రార్థించి యిట్లు మ్రొక్కుకొనెను. "ఓకాళీ! ఆకన్యామణి నాస్వజాతిదై యుండి నాకు లభించినచో నాశిరంబును నీకు కానుకగా నొసంగెదను."

ఆకన్య స్నానానంతరము నిజగృహంబునకు బయనమై పోవుచుండ

ధర్మదత్తుడామె వెంటనేగి యీమెస్వజాతికన్య యగుట దెలిసికొని అమందానందంబునొంది నిజపురంబున కేగెను. ధర్మదత్తుడు తలిదండ్రులతో నాకన్యనుగురించి తెలియజేసి చూచిరమ్మని పంపెను. అంతవారు హర్షపురి కరుదెంచి యాకన్య తలిదండ్రులతో మాట్లాడి ధర్మదత్తునికాకన్యనిచ్చుట కంగీకరింపజేసిరి.

పిమ్మట కొన్ని దినములకు ధర్మదత్తుడు పరిణయంబు గావించుకొని ఆకన్యారత్నముతో సుఖముగానుండెను. ఇట్లుండ నొక్కనాడు ధర్మదత్తుని బావమఱది సోదరిని మఱదిని దోడ్కొని వెళ్ళుటకు వచ్చి ధర్మదత్తుని తలిదండ్రుల సమ్మతిబడసి హర్షపురి కేగుచుండెను. అంత వారు ముగ్గురును మార్గమునగల కాళికాలయ సమీపమున కేగుదెంచి బడలిక దీర్చుకొనుటకై అచట విశ్రమించిరి.

ధర్మదత్తుడు కాళికాలయమునుగాంచి మున్ను తన మనంబున మ్రొక్కుకొన్న మ్రొక్కు స్ఫురింప రాగా భార్యను మఱదిని విడిచి ఆలయమునకేగి దేవిని ప్రార్థించి తన శిరంబును ఖండించుకొనెను. ధర్మదత్తుని రాకకై యెదురుచూచుచు అతని బిలువ దలంపున నాతని మఱది ఆలయమునకువచ్చి యాతని శిరంబు ఖండింపబడి యుండుటగాంచి దుఃఖించి అయ్యో! యీవార్త నాచెల్లెలి కెట్లురింగించెదను? యెరింగించిన నామె నాపల్కులు విశ్వసింపక నన్నే దోషిగా నెంచునేమో? ఎట్లయిననూ నేను మరణించుటయే మంచిది. అని మనంబున నిశ్చయించుకొని తన శిరంబు ఖండించుకొనెను. ఈయిద్దరి రాకకై యెదురు చూచుచున్న ధర్మదత్తుని సతి కూడ ఆలయమున కరుదెంచి మృతులైయున్న భర్తను సోదరుని గాంచి దుఃఖించి తానుకూడ కుత్తుక నుత్తరించుకొనబోయెను. అంత నాదేవి సాక్షాత్కరించి, "కుమారీ! నీసాహసమునకు మెచ్చితిని. నీకు వలయు వరంబులు వేడుకొను" మన, నంత నామె దేవిని నుతించి "ఓజగన్మాతా! పతితోడిదేగదా సతి జీవనము

అయిననూ నాకీ సోదరు డేకమాత్రుఁడు. కావున వీరిద్దరు సజీవులగునట్లు వరంబు ప్రసాదించు" మన దేవి "కుమారీ! ఈశిరంబులు రెండును మొండెములకు తగిలింపుము. వారిరువురు సజీవులు గాగలరు" అనియంతర్ధాన మయ్యెను.

అంత నాతరుణీమణి సంతోషముతో తత్తరపడి సోదరుని శరీరమునకు భర్త శిరంబును భర్త శరీరమునకు సోదరుని శిరంబును గలపగా వారు సజీవులైరి. ఇదిగాంచి యామె నిశ్చేష్టితురాలయ్యెను.

* * * * * * * * *

"ఓ విక్రమార్క భూపాలా! ఈకథనాలించితివికదా! యిద్దరిలో నెవరినామె భర్తగా గొనవలయునో చెప్పుము. తెలిసియు జెప్పకుండెదవేని వెనుకటిశాపమే" యనిన విక్రమార్కుడు, మనుష్యుని యంగములలో నెల్ల శిరము త్తమమైనది. కావున ఆమె భర్తయొక్క శిర మేశరీరమునకు గలదో యాతనినే తనభర్తగా నామె యంగీకరింపవలయును. అని చెప్పిన భేతాళుఁడు మరల నటవృక్షము జేరనరిగెను.

## (ఆ ర వ క థ)

విక్రమార్కుడు మరల నావట వృక్షముకడకేగి భేతాళునిబట్టుకొని తనమూపుపై నిడికొని వచ్చుచుండగా భేతాళుఁడు "ఓభూపాల చంద్రమా! నీకెంతటి కష్టమొదవెను! నీ యలసట దీరుటకొరకు చక్కని కథ జెప్పెద నాలింపుమని యీ క్రిందికథ జెప్పెను.

పూర్వము విక్రమసింహుడను భూపాలు డొకడుండెను. అతని కడ వీరసేనుడను సేవానికలడు. రాజాతనిని ప్రతిదినంబు రాత్రిభాగము నందు సింహద్వార రక్షణకై నియమించెను. అతడు దినమునకు కొన్ని సువర్ణ నాణెములు వేతనము గొనుచుండెను. అతడా ధనమునుగొని తన కుటుంబ వ్యయమునకు గొంత దీసికొని మిగిలిన దానిని బీదజనులకు దానము జేయుచుండెను. అతనికి పదునారు వత్సరముల ప్రాయముగల కుమారుడు గలడు. అతడు రాజు తనను నియమించిన ద్వార రక్షణయందు మిగుల జాగరూకుడై వర్తించుచుండెను.

ఒక్కనాటి రాత్రిభాగమున వీరసేనుడు పహరానిచ్చుచుండెను ఆరాత్రి జడివాన కురియ నారంభించెను. భయంకరమైన ఉరుములు వినవచ్చుచుండెను. జగమంతయు నంధకార మావరించి భయంకరముగానుండెను. అట్టి భయంకరమగు రాత్రి వీరసేనుడు ఆవర్షమున దడియుచూ నిర్భీతితో పహరా నొసంగుచుండెను. ఆనిశా సమయమున విక్రమసింహుడు వీరసేనుడు పహరా నొసంగు చుండెనో లేదో కనుగొన దలచి సింహద్వార సమీపమున కరుదెంచి, "ఎవరచ్చట?" అని ప్రశ్నించెను. అంత వీరసేనుడు "స్వామీ! నేను వీరసేనుడను" అని ప్రత్యుత్తర మొసంగెను. ఆసమయముననే కోటయొక్క వెలుపలభాగమున నొక్క స్త్రీవ్యక్తి రోదన మొనరిచ్చుచుండెను. విక్రమసింహుడు ఆనినాదమాలించి "వీరసేనా! ఆరోదన మెచ్చటనుండి వచ్చుచున్నది?" అని ప్రశ్నించెను. వీరసేనుడు "రాజా! ఆరోదనము ప్రాగ్దిశా భాగమునుండి యరుదెంచుచున్నట్లున్నది. అయ్యది స్త్రీకంఠస్వరంబును బోలియున్నది" అని పల్కిన రేడు "ఓయీ! నీవుపోయి ఆమె రోదనకారణమరసి ఆమె దుఃఖ ముడిపిరమ్ము" అనిన వీరసేనుడు ఖడ్గహస్తుడై చనెను. విక్రమసింహుడుకూడ అతనికి దెలియకుండగా నాతనివెనువెంట నేగెను.

వీరసేనుడట్లు బయలుదేరి కోటవెలుపలకరిగి అచ్చట రోదనము
నర్చుచున్న స్త్రీవ్యక్తినిగాంచి, "అమ్మా! నీవెవ్వరవు? నీదుఃఖకార
ణమేమి? నాయందు దయయుంచి తెల్పినచో నావలన నీకుఁగాదగుసహా
యమొనరింపగలను" అని పల్కిన నాస్త్రీ "ఓయీ నాదుఃఖకారణం
బెఱింగించెద నాలింపుము. నేనీ పురమునగల దేవతను. ఇప్పటివఱకు
విక్రమసింహుని యండఁజేరి సుఖంబుగానుంటిని. ఇంక రేపటిదినంబున
విక్రమసేనుడు దివంబలంకరించును. అందుచే నేనిట్లు గుందుచుంటిని"
అనిన వీరసేనుడు, "అమ్మా రాజునకపాయము తొలగు నుపాయ
మెఱిగింపవలయునని పెక్కువిధముల వేడిన నాదేవి, 'ఓయీ, యీవేకు
వలోపున పదునాఱు వత్సరముల బాలుని నొక్కని కాళికకుబలియొసం
గినచో భూపాలుడు జీవించును' అని పల్కిన వీరసేనుడామె పాదముల
పైబడి, తల్లీ ఇంతవఱకు యీభూపాలుని కృపవలన నేనును నాయాలు
సుతులు జీవించుచుంటిమి. నేడాతని జీవములు నిలుపుటకై నాకుమా
రుని బలియొసంగి సార్థకతగాంచెదను. తల్లీ, ఇకనేబోవ సెలవిమ్మ" అని
దేవికి నమస్కరించి తన గృహాభిముఖుడై చనెను. ఇయ్యదియంతయు
మాటునడాగి కాంచుచున్న విక్రమసింహుడుకూడ అతని వెనువెంట
నరిగెను.

వీరసేనుడు తన గృహంబునుజేరి భార్యనుబిలిచి, తనకును రోద
నమొనర్చుచున్న యీదేవతకును జరిగిన సంభాషణమంతయు వినిపిం
ప నాలలనామణి, 'నాథా ఇన్నిదినములనుండి యీభూపాలునియన్నము
దిని బ్రతుకుచుంటిమి. ఇపుడాతడు లేనిచో మన బ్రతుకేమగును. కా
వున అతని క్షేమము మనము కాంక్షింపవలయును. కాబట్టి మనముపుత్ర
మోహము వీడవలయును.' అనపల్కినవీరసేనుడు సంతసించి కుమారు
ని మేలుకొల్పి యాతనికీ వృత్తాంతమంతయు వినిపింప నాబాలకుడును
సంతోషముతో సమ్మతించెను.

వెలుపలనున్న విక్రమసింహుడు వీరిపల్కులాలించి యెంతయో వింతనొందెను.

ఇంతలో వీరసేనుడు భార్యను కుమారుని దోడ్కొని వెలికరు దెంచి కాళికాలయమునకు బయలుదేరెను. విక్రమసింహుడుకూడ వారి వెనువెంటనరిగెను.

వీరసేనుడు సతీసుతులతో కాళికాలయముజేరి దేవి నారాధించి తనకడనున్న ఖడ్గముతో కుమారునికంఠ ముత్తరించెను. అదిగాంచి వీరసేనునిభార్య మూర్ఛబోయి జీవములు బాసెను. అంతవీరసేనుడు "అయ్యో సతీసుతులను బాసిన నాజీవనంబేటికి? ఎవ్వరినిజూచుకొని నే నీపుడమిపై మనువాడను" అని మనంబున వితర్కించుకొనిఖడ్గంబుతో కంఠ ముత్తరించుకొని మరణించెను.

విక్రమసింహుడు దేవాలయమును ప్రవేశించి మృతులై యున్న వీరసేనుని అతని సతీసుతులనుగాంచి, "అయ్యో యెట్టి రాజభక్తుల గో ల్పోయితిని, యిట్టి వీరవరుని గోల్పోయిన వెనుక నేజీవించుటెందులకు" అని తన ఖడ్గముతో బొడుచుకొనబోయెను. అంతదుర్గాదేవి ప్రత్యక్షమై "ఓభూపాలా సాహసింపకుము. నీకువలయువరంబు కోరుకొను" మననా తేడు, "తల్లీ నాక్షేమమునకై గతించిన వీరిని సజీవులుగా నొనర్పవేడె ద"నని పల్కిన దేవి యట్లేయని వీరసేనుని అతని సతీసుతులను సజీవులుగా నొనర్చెను.

♦ ♦ ♦ ♦ ♦ ♦

"ఓవిక్రమార్క మహీపాలా! వీరసేనుడు అతని కుమారుడు భార్యయు, విక్రమసింహుడు వీరి నల్వురిలో నెవ్వరుత్తములో వివ రింపుము. తెలిసియు దెల్పవేని నీశిరంబు వేయివ్రక్కలగును." అని పల్కిన విక్రమార్కుడు, 'ఓయీ భూపాలునివలన జీవించుచుండి నం దున రాజప్రాణములు గాపాడుట వారివిధి. రాజభక్తునికై జీవములు

కాయవలసిన ధర్మము భూపాలునియందు లేదు. కావున విక్రమ సింహుడే యుత్తమోత్తముడు.” అనిన భేతాళుడు యెప్పటియట్లే వట వృక్షము జేర నరిగెను.

## (ఏడవ కథ.)

విక్రమార్కుండు మరల వటవృక్షము కడకరిగి భేతాళునిదింపి మూపుపై నిడికొని వచ్చుచుండగా భేతాళుడు. “భూపాలా! యాజ డధారి కొఱకై యేలనింత శ్రమనొందెదవు? నీయలసటదీరుటకై యొక కథ చెప్పెద నాలింపుము” అని భేతాళుడీ క్రిందికథ జెప్పెను.

వర్ధమానపురమను పట్టణమును చంద్రకేతుండను రాజు పరిపా లించుచుండెను. అతడొక కన్యకామణిని బరిణయుంబాడి యామెపై గలుగల మోహముచే రాజ్యపరిపాలన దీర్ఘదర్శియను యమాత్యున కప్పగించి రేయింబవళ్లు యాకన్యను విడనాడక యామెతో గ్రీడించు చుండెను. దీర్ఘదర్శియు రాజ్యపరిపాలన మొనరించుచు న్యాయమార్గ మున సంచరించు చుండెను. అయ్యదిగాంచి ప్రజలెల్లరు మంత్రి రాజు నన్యాయముజేసి తానురాజ్య మపహరింప దలచెనని చెప్పుకొనుచుండిరి. అదివిని దీర్ఘదర్శి మరల రాజునకు రాజ్యమప్పగించి తాను దేశాటనకై బయలుదేరెను. దీర్ఘదర్శి మరల రాజునకు రాజ్యమప్పగించి తానుదేశాటనకై బయలుదేరెను. చంద్రకేతుండు దీర్ఘదర్శిస్థానమున మరియొకనిని మంత్రిగాజేసి తానుయెప్పటియట్లు తనప్రియభార్యతో సుఖముగానుండెను.

దీర్ఘదర్శి యొక వర్తకునితో స్నేహముజేసి యాతనితో దేశాటనకై బయలుదేరెను. వారిరువురును పెక్కుదేశము లుదిరిగి యొక్కనాడొక ద్వీపమునుజేరి అందు విశ్రమించిరి. దీర్ఘదర్శి యాద్వీపమున నొక్కకన్యారత్నమును గాంచి ఆమె సౌందర్యమున కచ్చెరువొంది, యాకన్యక తనరేడయిన చంద్రకేతునకు తగినదని మనంబున తలంచెను. అచ్చటనుండి వారిరువురు బయలుదేరి కొంతకాలమునకు నిజపురంబు జేరిరి

దీర్ఘదర్శి చంద్రకేతుని కడకరిగి తాను ద్వీపమున గాంచినకన్యక వృత్తాంతమంతయు దెలిపెను. అంత చంద్రకేతుడు నాకన్యను గాంచ దలచి మనంబున కుతూహలంబొడమ, "ఓయీ! నేనువర్తకుని సహాయమున యాద్వీపమునకుబోయి యాకన్యారత్నమునుగాంచి వచ్చెదను. అంతవరకు నీవీరాజ్యపాలన మొనర్పు చుండు" మని వర్తకుని దోడ్కొని యాద్వీపమునకు పయనమై జనిరి.

చంద్రకేతుడు వర్తకునితో సముద్రయాన మొనర్చి యాద్వీపమునకుబోయి అచ్చటాకన్యనుగాంచి ముగ్ధుడై, "యినుపకచ్చడములు గట్టిన మునిముచ్చులైననూ యీకన్యనుగాంచిన మోహము నిలుపజాలరు. యిట్టి కన్యారత్నమును గూడని నాబ్రతుకేల? యెట్లులైనను యీకన్యను గూడితీరవలయును" అని మనంబున వితర్కించుకొనియాకన్యను జేరనరిగెను. అంత నాకన్య వానింగాంచి లజ్జాభరముచే మరుగునకు పోబోయెను. చంద్రకేతుడామెను నిలిపి తన వృత్తాంతమంతయు నామె కెరిగించి తన్ను బెండ్లియాడుమని యామెను ప్రార్థింప నాకన్యయు నందులకు సమ్మతించెను.

చంద్రకేతు డాకన్యనుగూడి యచ్చోటనే కొన్నిదినములు గడప నిశ్చయించుకొని సుఖంబుగానుండెను. ఇట్లుండ నొక్కనాడాకన్య సముద్రతీరమున విహార మొనర్చుచుండ నొక్కరాక్షసుడామెను మ్రింగెను.

అయ్యదిగాంచి చంద్రకేతుడు రాక్షసుని జంపి యాతని గర్భమునుండి యాబాలికను వెలికిదీసి కాపాడెను. అంతనాకన్య తేనిపదంబులపై వ్రాలి, ,,భూపాలా! మున్ను నాతండ్రి మొక్కనాడు నాపై గినిసి నన్ను రాక్షసుండు మ్రింగునట్లు శాపమొసంగెను. అంతనేనాతని పదంబులపై వ్రాలి కరుణింపవేడ నాతడు "నిన్ను చంద్రకేతుడను రాజు రక్షించును" అని చెప్పెను. ఇప్పుడు మీమూలమున నేను శాపవిముక్తురాలనైతి ననెను.

పిమ్మట కొన్నిదినములకు చంద్రకేతుడా కన్యతో నిజపురంబున కరుదెంచి పూర్వమునకన్న నెక్కుడుగా స్త్రీలోలతా వ్యామోహమున రాజ్యపాలనమునందు జోక్యము కలుగజేసికొనకుండెను. దీర్ఘదర్శి యిది యంతయుగాంచి యాత్మహత్య గావించుకొని మరణించెను.

,,ఓ విక్రమార్క భూపాలచంద్రమా! దీర్ఘదర్శి తానుగాంచిన కన్యను రాజుపరిణయ మాడెనని మరణించెనా? లేక రాజు మరల రాజ్యము కరుదెంచెనని మరణించెనా? చెప్పు"మనిన, విక్రమార్కుడు ఓయీ! దీర్ఘదర్శి మరణమునకు యివేవియు కారణములుగావు. రాజు స్త్రీలోలుడని తానెఱింగియు నాతనికాకన్య వృత్తాంతము దెల్పి అతని వ్యామోహమును వృద్ధిగావించితినిగదా, యని సిగ్గుజెంది మరణించెనన భేతాళుడు మరల వటవృక్షము జేర నరిగెను.

# (ఏనిమిదవకథ.)

విక్రమార్కుడు మరల వటవృక్షము చెంతకేగి భేతాళుని దీసి కొని వచ్చుచుండగా భేతాళుడు విక్రమార్కునితో యీక్రింది కథ జెప్పెను.

బ్రహ్మపురంబును వీరవర్ధనుడనురాజు పరిపాలించు చుండెను. ఆతడొక్కనాడు వేటకై విపినమున కరిగెను. అతడొక వ్యాఘ్రమును దఱుముచూ ననుచరులనుబాసి యొంటిగాడై యాయరణ్యము నందొక్కచో జిక్కి యాతప బాధవలన పీడితుడై యొక్కచో విశ్రమించెను. అంత నాతని యనుచరులలో నొక్కడైన కార్పటికుడనువాడు తేనన్వే షించుచూవచ్చి భూపాలుని గని కొన్ని యుసిరకాయలును కొంత జలమును దెచ్చియిచ్చి యాతని తృష్ణను చల్లార్చి ప్రాణంబులు నిలిపెను.

వీరవర్ధనుడు కార్పటికుడు చేసినమేలు మరువక తన పురంబున కరుగుదెంచినతోడనే యాతనిని తన ప్రధానునిగాజేసి తన యాంతరంగిక కార్యముల నాతనితో ప్రసంగించుచూ నాతని నాదరించుచుండెను.

ఒకనాడు వీరవర్ధనుడు కార్పటికుని బిలిచి, ,, ఓయీ సింహళ రాజపుత్రి అనమాన సౌందర్యవతియని వింటిని. కావున నీవేగి యాక న్యామణిని నాకొనంగునట్లు చేయవలయు''నన్న కార్పటికుడు, ,,దేవా ఆకన్యారత్నమును బరిగ్రహింప మీరర్హులు. నేబోయి నాశక్తి నంతయు వినియోగించి మీకాకన్య నొసంగునట్లు గావించెద''నని పల్కి రాజు కడ సెలవుగైకొని నిజగృహంబునకేగెను. పిమ్మట యొక్కసుముహూర్తమున కార్పటికుడు సింహళద్వీపమునకు బయనమై యేగెను.

కార్పటికు డొకయోడపై సముద్రయాన మొనర్చుచుండ నొక పెద్ద తుపానువచ్చి యోడను సముద్రమునముంచివైచెను. కార్పటికుడు

సముద్రమున మునిఁగి నాగలోకమునకు బోయెను. అతఁడు కన్నులు తెఱచి చూచునప్పటి కాతనికొక కాళికాలయము గాన్పించెను. అతఁడు దేవిని ప్రార్థింపదలచి లోనికేగుచుండ యాదేవళమున పెక్కురు నాగ కన్యకలు దుర్గ నారాధించుచుండిరి. కార్పటికుడు అందుగల యపూర్వ లావణ్య సంశోభితయగు నొక్కకన్యనుగాంచి మనంబున మోహించి, తనయేలిక కార్యము సాధింపలేదే యను విచార మిసుమంతయు లేక కనుఱెప్పలిడక యాకన్యను వీక్షించుచుండెను.

ఆతని కాకన్యపై మోహంబతిశయింప మనంబును నిలుపలేక అందొక్క కన్నియను బిలిచి తన మనోగతాభిప్రాయమును వెల్లడించి యాకన్య నెట్లయినను దనకొనగూర్చుమని ప్రార్థించెను. ఆకన్యతదితరకన్యలతో నాతని వృత్తాంతము దెలిపి వారందరును గలిసి యాతనిని మోసము చేయవలయునని తలచి యాతనిని బిలిచి "ఓయీ నీకోర్కె తప్పక దీర్చెదము. ముందు నీవాగుండమున స్నానమాడి రమ్ము" అనిన కార్పటికుడు వల్లెయని ఆగుండమున మునుగగానె ఆగుండము మహిమ వలన కార్పటికుడు తన నిజపురంబయిన బ్రహ్మపురంబు జేరెను. తోడనే యాతడు వీరవర్ధనునికడకరిగి జరిగిన వృత్తాంతమంతయు దెలుప నాతడు ఆశ్చర్యమొంది "నీవుబోయిన లోకమునకు నన్నుకూడ దోడ్కొనిపొ"మ్మని కార్పటికునితో బయలుదేరి నాగలోకంబు జేరి కాళికాలయముకడకు వారిరువురు కలిసి పోయిరి.

కార్పటికుఁడు మోహించినకన్య వీరవర్ధనుని గాంచి మోహించి తనకోర్కెదీర్ప బ్రార్థించెను. అంత భూపాలుఁడు, "ఓకన్యారత్నమా! ఈకార్పటికుడు నిన్ను మోహించినాడు. ఈతడు నీకు తగినవాడు. ఈతనికోర్కె త్రోసిపుచ్చక సమ్మతివై పరిణయంబాడి సుఖంపుము" అని పెక్కువిధముల బోధించి యామెను సమ్మతింపజేసి, వీరవర్ధనుఁడు వారిరువురికి పరిణయంబు గావించెను.

"ఓవిక్రమార్క మహీపాలా! కార్పటికుడు రాజు ప్రాణములు కాపాడెను. దానికి ప్రత్యుపకారముగా రాజు యాతని ప్రియ తముంబగు కన్యారత్నము నాతనికి గూర్చెను. వీరిర్వురిలో నెవరధికులో తెల్పుము" అనిన విక్రమార్కుడు, "ఓయీ! కార్పటికుడు రాజు ననుచరులలో నొకడయినందున రాజు ప్రాణములు గాపాడుట వానివిధి. కాని రాజు ఆయుపకారమును మరువక తన్ను వలచిన కన్యను వానికర్పించెను. కాన భూపాలుడే యధికుడు" అనిన భేతాళు డదృశ్యు డయ్యెను.

## (తొమ్మిదవ కథ)

విక్రమార్కుడు భేతాళునిబట్టి బంధించి తెచ్చుచుండ భేతాళుడీ క్రిందికథ జెప్పెను.

అంగదమను పట్టణమున జయసేనుడను భూపాలుడు గలడు. అతడు మనుష్యనీతి దప్పక ప్రజలను దన బిడ్డలకంటె మిన్నగా గాపాడుచు రాజ్యమేలుచుండెను. ఆతేడు పండితులను బోషించుచు దానకర్ణుని బగిది అడిగినవారికి లేదనకుండా ధనమిచ్చుచుండెను. క్రమక్రమముగా నాతని వితరణ గుణంబులు లోకమెల్లెడలను బ్రతీతమయ్యెను.

ఇట్లుండగా నాసమీపనగరమున యోగదాసు డను విప్రోత్తముడుగలడు. అతడు సర్వశాస్త్ర పారంగతుడు. ఆతనికి మువ్వురు కుమారులు గలరు. ఈమువ్వురును జయసేనుని వితరణ గుణంబుల నాలించి యాభూపాలుని కడకేగి తమవిద్యల నాతనికి జూపి ధన మర్థించుకొని

వత్తమని నిశ్చయించుకొని బయలుదేరి అంగదముజేరిరి. ఈవిప్రకుమారు లు ముగ్గురును భూపాలకుని యాస్థానమున కేగిరి. భూపాలుడు నిండుపేరో లగంబునందుండి యావిప్రకుమారులను దిలకించి యిట్లనియెను. "విప్రో త్తములారా! తాము శాస్త్రజ్ఞులవలె గన్పట్టుచున్నారు. మీరేయే శాస్త్రములలో బ్రవీణులో దెలుపవేడెద"ననెను. అంత వారిలో బెద్ద వాడు, భూపాలునకు నమస్కరించి యిట్లనియెను. "భూపాలోత్తమా నేను భోజన పరిశీలన యందగ్రగణ్యుడను. నాకుదెలిసినట్లు భోజనసౌఖ్య మింకేరికిని దెలియు"దనెను. తక్షణమే భూపాలుడు తన పురోహితుని బిలిచి యావిప్రకుమారుని కాతనియింట షడ్రసోపేతముగా భోజనము పెట్టుమని చెప్పెను. పిమ్మట జయసేనుడు రెండవవానిని బిలిచి యడుగ గానాతడు "మహారాజా! నేను స్త్రీసౌఖ్యము బాగుగా నెఱుంగుదును. స్త్రీలతో గేళీ వినోదంబులు నెరపుటయందును వారి విశేషములు గ్రహించుట యందును నన్ను మించిన వాడుండబోడు" అని తెలిపెను. అంత రాజాతనిని తన పురమునగల యొక వేశ్యకడకు నాటిరాత్రి పడ కకు వెడల నియమించెను. పిదప మహీపాలుడు మూడవవాని నడుగ నాతడిట్లనియెను. "మహీపాలా! నేను నిద్రాసౌఖ్య పరిశీలనము నంద గ్రగణ్యుడను. దేవరవారు నన్నుగూడ పరీక్షింప వేడెదను." అనిన జయసేనుడు దన సౌధమునందొక గదిని సకలాలంకార యుతంబుగజేసి యందు హంసతూలికా తల్ప మేర్పరుప సేవకుల కాజ్ఞాపించి యా విప్రకుమారుని యందు బరుండ నియమించి వారల ముగ్గురను మరల మరునాడు తనకడకు రమ్మని చెప్పి పంపివైచెను.

ఆమరునాడు విప్రత్రయము భూపాలునికడకేతెంచిరి. రేడు వా రలను గని యందు ప్రథముని బిలిచి "నిన్నటిదినంబున నీవు భుజించిన భోజనమెట్లుండె"నని ప్రశ్నించెను. ఆతడు భోజన పదార్థముల నెల్ల వివరించి యన్నముమాత్రము స్మశానమందలి బూడిదవాసన గలిగియు

న్నదని చెప్పెను. అంత భూపాలుడు పురోహితుని బిలిపించి యడుగ నాత్రివంటకమునకు దేబడిన బియ్యము శ్మశానమునందలి బూడిదను యెరువు గలిగిననని తెలిపెను. పిమ్మట రెండవవానినిగూడ రాత్రి విశేషము లేమని యడిగెను. అంతనాతడు „రాజా! రాత్రి నేవెళ్ళిన వేశ్య శూద్ర సంయోగమువలన బుట్టినదగుటచే దుర్గంధము గలదిగా నుండెను." అని నుడివెను. ఆ డావేశ్యను బిలిపించి యడుగ నామె గొల్లదగుట నిజమెఱింగి సంతసించెను. పిదప భూపాలుడు మూడవవానిని గని యడుగ నాతడు „దేవా! రాత్రి నేబన్నుండిన శయ్యయందు శిరోజముగలదు. అద్దానిచే నాశరీరమంతయు నొప్పియెత్తిన"దని చెప్పెను. అంతరాజు యావిప్రకుమారుడు బన్నుండినపాన్పు బరిశీలింప నందాతడు చెప్పినట్లే యొక్క శిరోజ ముండెను. జయసేనుడు విప్రసోదరుల ముప్పురను మిగుల మెచ్చుకొని వారలను దనయాస్థానమునం దుంచుకొని పోషించుచుండెను.

విక్రమార్క మహీపాల చంద్రమా! యీముప్పురిలో నెవ్వరధికులో చెప్పుము. తెలిసియుండియు మౌనవ్రతము భంగమగునని జెప్పకుంటివేని నీశిరంబు వేయివ్రక్కలగును". విక్రమార్కుడా పలుకు లాలించి యిట్లనియెను. „ఓయీ! భోజనసుఖము, స్త్రీసుఖము జెప్పిన వారు బుద్ధిచే దెల్పిరి. మూడవ వాడట్లుగాదు. దేహపరీక్ష జెప్పెను. కావున నిద్రాసుఖియే యధికుడు' అని తెల్పిన భేతాళు డప్పటియట్లు వటవృక్షమును జేర నరిగెను.

# (పదియవ కథ)

విక్రమార్కుడు మరల నావటవృక్షముచెంత కరిగి విశేషప్రయత్నమున శవమును దింపి మూపుపై నిడికొని వచ్చుచుండగా భేతాళుడు "రాజా! ఆజడదారికొరకై నీవేల శ్రమనొందెదవు! నీశ్రమ నివారణార్థమై యొక చక్కని కథ చెప్పెద నాలింపు"మని యీక్రిందికథ జెప్పెను.

తొల్లి ఉమాపురంబును కిశోరసింహుడను రాజు పరిపాలించుచుండెను. ఆతనికి మణిమాలయను నొక్క పుత్రికారత్నముగలదు. ఆమె యుక్తకాలప్రాప్తయై భర్తృ పరిరంభణ సౌఖ్యమునకై యెదురుచూచుచుండెను. కిశోరసింహుడు, యుత్తమక్షత్రియ సంజాతుడై సర్వకళల నారితేరి రూపమున మన్మథుని ధిక్కరించియుండునట్టి రాజసూనునికే దన పుత్రికామణి నీయనిశ్చయించుకొనెను. వరునన్వేషణార్థమై దేశదేశములుగాలించి తుదకొక్క దేశమున తాదలచినట్టి లక్షణములుగల ఉదయసింహుడను భూపాలునిగాంచి యాతనికి దన కూతునిచ్చి పరిణయము గావించెను.

ఆదంపతు లిరువురును అన్యోన్యానురాగమును గలిగి సుఖంబుగా కాలము గడుపుచుండిరి. ఇట్లుండ నొకనాడు దయసింహుడు మణిమాలాసహితుడై శయ్యాగారమున హంసతూలికా తల్పమున బరుండియుండిరి. ఆశయ్యాగారమున చీమలు బారులుదీర్చి ప్రాకులాడ జొచ్చెను. ముందున్న చీమ యాగిపోయెను. వెనుకగలచీమ లట్లాగుటకు కారణమేమని యడిగెను. అంత నాచీమ "మార్గమున కడ్డుగా నీశయ్యయున్నది. అందుచే నిలిచితి"ననెను. వెనక పిపీలికము లు, "అట్లయినచో దీనిం

ద్రోసివేయుద”మనిన ముందు చీమ, “భార్యాభర్తలు సుఖనిద్ర జెందుచుండిరి. అట్లొనరించినచో మహాపాపము” అనెను. ఉదయసింహుడు పిపీలికభాషం దెలిసినవాడగుటచే అవి చెప్పుకొను మాటలువిని నవ్వుకొనెను. ఆపిపీలికములు రాజు నవ్వుటగాంచి, వానిభాషయందు తమ మాటల నెవ్వరికిని జెప్పవద్దనియు చెప్పినచో, తల వేయివ్రక్కలగునని పల్కినవి.

మణిమాల తన విభునింగని నవ్వుటకు కారణమడిగెను. రాజు పిపీలికముల యాజ్ఞ మీరక మౌనముదాల్చియుండెను. అంతమణిమాల “ఏలజవాబీయక మౌనమువహించిరి? నాపై మీకు అనురాగములేదు. ఇట్టిదాంపత్య మేరికిసుఖము! కావున బ్రాణంబులు బాసెద”నని మరణించుటకు సిద్ధపడెను. భూపాలుడు తాను మరణించినైన తన భార్య మనస్సును సంతోషపెట్టదలచి, శ్మశానమున నొక చితినిపేర్పించి దానిపై బన్నుండి భార్యను జేరబిలిచి పిపీలిక సంభాషణ దెలియజేయ బోయెను. ఆచితిసమీపమున రెండుమేకపోతులు గనబడెను. పోతు, మేకనుగూడి రతిసౌఖ్యమనుభవింపనెంచెను. మేక, పోతునుజూచి“నీకు నాపై మోహంబుగలదేని బావిం గల పచ్చికను దెచ్చియిమ్ము. ఆవల నీతో గూడెద”ననెను. అంతబోతు, మేకనుగని “నీకై నేనాపచ్చికను దెచ్చుటకు బోయితినేని నేనా బావిలోబడి ప్రాణంబులు బాయనా! నేజచ్చినవెనుక నెవరితో జేరుదువు? అట్టినీకూటమి యున్ననేమి లేకున్న నేమి! తన్నుమాలిన ధర్మముగలదా? పోపొ”మ్మని కసరెను. రాజు మృగభాషను దెలిసినవాడగుటచే, నామేకపోతుల సంభాషణాలించి చితిపైనుండి దిగ్గునలేచెను. పిమ్మట భూపాలుడు మణిమాలను వదలి మరియొక భూపాలుని పుత్రికను బెండ్లియాడి సుఖంబున నుండెను.

“ఓవిక్రమార్క భూపాలోత్తమా! ఈకథయం దుదయసింహు డధికుడా? లేక నోరులేని పోతుఅధికమా? తెల్పుము. తెలిసియు జెప్ప

వేని వెనుకటి శాపమే' యనిన విక్రమార్కుడు ,,ఓయీ జ్ఞానముగల భూపాలునికంటెను జ్ఞానశూన్యమగు పోతుయొక్కబుద్ధివిశేషము శ్లాఘాపాత్రమైనది. అనిను డివిన భేతాళుడు విక్రమార్కుని భుజమునుండిజారి వటవృక్షము జేరనరిగెను.

## (పదునొకండవ కథ.)

విక్రమార్కుడు మరల నావటవృక్షముచెంత కరిగి శవాకృతిని వ్రేలాడుచున్న భేతాళుని భుజపీఠపై నిడికొని మౌనమువహించి వడివడి నేగుచుండ భేతాళు డాతనిగాంచి ,,విక్రమార్క భూపాలచంద్రమా! ఏల నాజడదారి కొరకై యింతగా శ్రమనొందెదవు? నీశ్రమ బాయుటకొక చక్కనికథ జెప్పెద నాలింపు''మని యీక్రిందికథజెప్పెను.

మహానదీ ప్రాంతమున మహానందయను పట్టణముగలదు. అందు ధనదత్తుడను వైశ్యుడుగలడు. అతడు ధనదుని ధిక్కరించి యైశ్వర్యముతో దులదూగుచుండెను. ఆతనికి మదనరేకయను కుమారీమణిగలదు. మదనరేక పిన్ననాటి నుండియు మరియొక వణిగ్వరుని కుమారుడగు ధనశేఖరుడను వానితో కలసి మెలసి తిరుగుచు ప్రాణస్నేహముగా నుండెను. ధనదత్తుడు తనకుమార్తెకు వివాహ వయస్సరుదెంచినందున సింహళద్వీపము యేటివ్యాపారియగు దత్తుడను నాతని కుమారుడగు ధర్మదత్తునికిచ్చి వివాహము చేయ నిశ్చయించెను. ఇట్లుండగా నొక్కనాడు మదనరేక మిత్రుడగు ధనశేఖరుండామెనుగాంచి మోహించెను.

ఆమోహము పట్టజాలక యొకనాడామె కడకేగి నచ్చెలీ నేను నిన్ను మోహించితిని. విరహవేదన భరింపజాలకున్నాను. నీవు నన్ను తిరస్కరించినచో ప్రాణములు బాయుదును. అనిన మదనరేఖ "వైశ్యా! నీతోగూడుటకు నాకెట్టి యభ్యంతరమునులేదు. కాని నేనిప్పుడు ప్రౌఢనై యుంటిని. ఇప్పుడు నాజనకుడు నన్ను సింహళద్వీపమున గల ధర్మదత్తునికిచ్చి వివాహము గావింప నిశ్చయించినారు. వివాహమగు వఱకు నాకన్యాత్వమును గోల్పోవుట కిచ్చగింపను. వివాహానంతరము నీకోర్కె దీర్చి పిమ్మట నాపతితో గాపురమొనరింతును. కావున నన్ను విశ్వసించి వెడలిపొ"మ్మనియెను. ధనశేఖరుడు వల్లెయని యందుల కంగీకరించి వెడలిపోయెను.

పిమ్మట కొంతకాలమునకు ధనదత్తుడు మదనరేఖను ధర్మదత్తున కిచ్చి పరిణయము గావించెను. వివాహానంతరము పునస్సంధానమహోత్సవము జరుప సన్నాహములు గావింపబడెను. ధనశేఖరుడు మదనరేఖకడ కరుదెంచి మున్ను ఆమెగావించిన వాగ్దానము జ్ఞప్తికిదెచ్చెను. మదనరేఖయు వాగ్దత్తానుసార మాచరింతునని యాతనితో జెప్పి పంపివైచెను.

నూతన దంపతు లిరువురు శయ్యాగారము జేరిరి. ధర్మదత్తుడు మోహావేశమున భార్యను జేరబోయెను. అంత మదనరేఖాతనింగాంచి నమస్కరించి యిట్లనియెను. "నాథా! నాదొక్క విన్నపమున్న దాలింపుడు. నాచిన్ననాటి స్నేహితుడైన ధనశేఖరుడనువాడొకడు నన్నుజూచి మోహించి విరహబాధచే గుందుచు నాకడకరుదెంచి తనకోర్కె దీర్పవలయుననియు లేనిచో బ్రాణములు బాయుటనిక్కమని వచించెను. అంత నేనాతనిగని జాలినొంది "వివాహానంతరము నావిభునితో జేరుటకుముందుగనే నీకోర్కె దీర్చెదనని వాగ్దానమొనరించితిని. అతడాపల్కులాలించి సమ్మతించెను. తమతో జేరుటకుముందుగా నేనాతని

కోర్కె దీర్చవలయును. కావున నాయందు కరుణించి నన్ను సత్యవాక్పరిపాలనగా నొనర్పవేడెదను.'' అనిన సుగుణుండగు ధర్మదత్తుడుతన ప్రాణప్రియ సత్యసంధతకు మదిమెచ్చుకొని వల్లెయని యంగీకరించెను.

సర్వాభరణ భూషితురాలై యక్కన్యారత్నము మిత్రునికోర్కె దీర్పవలయునని యానిశీధిని నిర్భీతిమై బోవుచుండెను. మార్గమధ్యమున గొందరు చోరులామె నడ్డగించిరి. ఆచోరనాయకుడామె సౌందర్యమును గాంచి మోహితుడై ఆమెను తన్నుకూడవలసినదిగా బలవంతపెట్టెను మదనరేఖ వానికి దన సర్వాభరణము లొసంగెద తన్ను మాత్రము విడిచిపుచ్చుడని వారినివేడుకొనెను. ఆచోరనాయకుడందులకంగీకరింపక ఆమె కూటమియే కోరెను. అంత మదనరేఖ తన వృత్తాంతమంతయు వానికెదెల్పి మరల తానీ మార్గముననే వచ్చి వాని యభీష్టమీడేర్తునని చెప్పి యొప్పించి మదనరేఖ ధనశేఖరుని గృహమునకేగెను. ధనశేఖరుడామెనుగాంచి యామె పాతివ్రత్యమునకు వెరగొంది నమస్కరించి పంపివైచెను. పిమ్మట మదనరేఖ చోరులు గాన్పించిన ప్రదేశమునకరుదెంచి యచ్చట వారలు లేమింజేసి వారల యాగమన మీక్షించుచూ నచ్చోటనే నిలిచియుండెను. కొన్ని నిముషములకా చోరులరుదెంచిరి. నాయకుడు మదనరేఖనుగని యామె సత్యసంధతకు నలరి ధర్మచింతగలవాడై తానానాడపహరించిన ద్రవ్యములో గొంతభాగమామెకొసంగి పంపివైచెను! మదనరేఖ పతినిజేరి జరిగిన సంగతులన్నియు దెల్పెను. ధర్మదత్తుడు తన సతి పాతివ్రత్యమునకు సత్యసంధతకు మెచ్చుకొనెను.

విక్రమార్క భూపాలా! వింటివికదా యీకథను. ఇందుమదనరేఖ, ఆమెభర్త, ధనశేఖరుడు, చోరనాయకుడు, ముఖ్యపాత్రలు. వీరలయం దెవ్వరధికులో దెల్పుము. తెలిసియు దెల్పవేని వెనుకటి శాపమే యనిన విక్రమార్కుడు ''ఓయీ! దొరికినది దొరికినట్టుగా

సంగ్రహింపక ధర్మచింతతో మదనరేఖను నదలిన చోరుఁడే యధికుఁ"డని చెప్పిన భేతాళుఁ డెప్పటియట్ల వటవృక్షము జేరనరిగెను.

## (పండ్రెండవ కథ)

విక్రమార్కుఁడు మరల నావటవృక్షము కడకరిగి శవాకృతిని నున్న భేతాళుని భుజముపై నిడికొని నడివడిగ జడదారికడ కరుగుచుండగ భేతాళుఁడు "విక్రమార్క భూపాలచంద్రమా! మార్గాయాసము బోవుట కొరకు చక్కని కథ చెప్పెదనాలింపు" మని యీక్రింది కథ జెప్పెను.

తొల్లి మగధదేశమును విక్రమసింహుఁ డను రాజు పరిపాలించుచుండెను. అతనికి మోహనాంగి, కనకాంగి, మందారవతి యను మువ్వురు భార్యలుగలరు. విక్రమసింహుఁ డా మువ్వురు భార్యలం గూడి మన్మథక్రతువు లొనర్చుచు ఆనందాంబుధి నోలలాడుచుండెను. ఒకనాడు విక్రమసింహుఁడు దన పెద్దభార్యయగు మోహనాంగిఁ గూడి యుద్యానవనమున పూలసౌరభమాఘ్రాణించుచు మలయమారుతము సేవించుచు విహరించుచుండెను. ఆసమయముననే తుమ్మెద యొక్కటి పుష్పములయందలి మకరందమును బీల్చుచు జిమ్మున పై కెగసి మోహనాంగి వేణీభరముపై వ్రాలెను. అంత మోహనాంగి యాయదుటునకు బెదరి మూర్ఛవోయెను. పిదప విక్రమసింహుఁడు పరిచారికలను రావించి యామెకు బరిచర్యలనుజేయించి ఆమె సేదదేరినపిదప అంతి

పురమునకు దోడ్కొనిపోయిరి.

మరియొకదినమున విక్రమసింహుండు దన రెండవభార్య యగు కనకాంగింగూడి తన ప్రాసాదతలంబున శరత్కాలచంద్రికల సౌఖ్యమును బొందగోరి విహరించుచుండెను. అనాటివెన్నెలయందు కొంచె ముష్ణ ముండుటచే కనకాంగి యావేడిని సహింపజాలక మూర్ఛనొందెను. పిమ్మట పరిచారిక లామెకు బరిచర్యలుసలిపి సేదదేరినపిమ్మట యంతః పురమును జేర్చిరి.

ఇంకొక్కదినమున విక్రమసింహుండు మందారవతితో విలాస మందిరమున సరస సల్లాపములాడుతరిఁ రాజమందిరమునగల వంటశాలలో నెవ్వరో దంచుచుండిరి. ఆదంపుయొక్క రోకలిశబ్ద మామె వీనుల సోకెను. ఆశబ్దము వినినందున ఆమె రెండుచేతులు కంది యెఱ్ఱ నయ్యెను. వెంటనే భూపాలుఁడు దంపును మాన్పించి ఆమెకు దగు నుపచారములు గావించెను. విక్రమసింహుఁడు ముగ్వురి సౌకుమార్యమునకును మిగులవిస్మయమొందెను.

"విక్రమార్క మహీపాలా! ఈ ముగ్వురిలో సుఖదేహి యెవ్వరో దెల్పుము. తెలిసియుండియు చెప్పవేని వెనుకటిశాపమే" యనిన విక్రమార్కుఁడు "ఓయీ! తుమ్మెదవలన మూర్ఛజెందిన మోహనాంగి కాని, వెన్నెలవేడిచే మూర్ఛబోయిన కనకాంగికాని యధికసుఖదేహు లుకారు. రోకలిశబ్దమాలించినతోడనే చేతులుకంది బాధజెందిన మందారవతి సుఖదేహి" అని తెల్పిన భేతాళుఁడు అదృశ్యుఁడయ్యెను.

# (పదమూడవ కథ)

మరల విక్రమార్కుడు వటవృక్షముచెంత కరిగి శవాకృతినున్న భేతాళుని భుజముపై నిడికొని వచ్చుచుండగ భేతాళుడు "విక్రమార్క భూపాలా! ఏల యీజడదారికొరకై యింత శ్రమనొందెదవు? నన్ను విడువుము. పోయి సుఖంబున నుండుము." అనిన విక్రమార్కుడు మౌనమువహించి రెట్టించిన వేగముతో నడువసాగెను. అంత భేతాళుం డిట్లనియెను. "మహీపాలా! నీశ్రమ నివారణమగుటకు నొక చక్కని కథ జెప్పెద నాలింపు"మని యీక్రిందికథ జెప్పెను.

తొల్లి పుష్పపురంబున క్షామము సంభవించెను. ప్రజలెల్లరు బాధలుపడజాలక సస్యసమృద్ధమగు నితర దేశములలో జీవింపబోయిరి. అందొక్క పాడుదేవళము గలదు. ఆదేవాలయములో నొకవిప్రుడు యాకలిబాధచే వెతనొందుచుండెను. ఆదేవళ సమీపమున నొక్క మంత్రయోగి గలడు. అతని మంత్ర పటిమచే అనేకవ్యాధులు భూత ప్రేత పిశాచాదులు పలాయించుటకు కాజొచ్చినవి. ఆయోగి దేవాలయమునగల విప్రుని గని జాలినొంది యాతని యాకలి దీర్ప నమకట్టి తన మంత్రప్రభావముచే పాడువడిన పురమును ప్రజాయుతముగను సస్య సమృద్ధముగను జేసెను. పిమ్మట మంత్రయోగి బ్రాహ్మణుని దోడ్కొనిపోయి యొక బ్రాహ్మణ గృహంబున భుజియింపజేసి వానికిమంత్రో పదేశము గావించెను.

మరునాడా విప్రుడు ఆనందమున మంత్రము పఠింప వలెనని కాసారమున కేగి స్నానమాచరించెను. వెంటనే విప్రుడు తనకుమారుని గాంచినటుల కలగని మంత్రము మిరచిపోయెను. బ్రాహ్మణుడు యోగి కడకరిగి తనకు కలవచ్చినదనియు మంత్రము మరచితిననియు దెల్పెను.

అంత నాయోగి యావిప్రునికి మంత్రము చేరదని తెలిసుకొని వానికి మంత్రోపదేశము చేయుట వృథాశ్రమయని మానివైచెను.

"విక్రమార్క మహీపాలచంద్రమా! మంత్రయోగికి సిద్ధించిన మంత్రము విప్రునికేల సిద్ధించలేదో తెలుపు" మనిన విక్రమార్కుఁడు "ఓయీ! మనోనిశ్చలత లేనివారికి మంత్రము సిద్ధింపదు. యోగి జితేంద్రియుడై మనస్సు నరికట్టి దైవమునందు లయింపజేసెను. యోగమాచరించ వలయునన్న నేకాగ్రచిత్త ముండవలయును. బ్రాహ్మణుని కది లేమింజేసి వానికి మంత్రయోగము సిద్ధింపనేరదు." అని నుడివిన భేతాళు డెప్పటియట్లు వటవృక్షము జేరనరిగెను.

## (పదునాల్గవకథ)

విక్రమార్కుడు మరల నావటవృక్షముచెంతకేగి భేతాళునిబట్టుకొని వచ్చుచుండగ భేతాళుఁడు "విక్రమార్క భూపాలోత్తమా! ఏల యిట్లు శ్రమజెందెదవు? నీయాయాస ముడుపుటకు నేనొక చక్కనికథ జెప్పెద నాకర్ణింపుము." అని యీక్రిందికథ జెప్పెను.

వర్ధమానపురమున నొక గొప్పవర్తకుడు గలడు. ఆతనికి నవయౌవనవతియు సౌందర్యవతియు నైన మల్లికయను నొక్క కుమారీ మణిగలదు. ఆకన్యారత్నమునకు వివాహవయ స్సరుదెంచినను ఆమెకు తగినవరుడు లభింపమింజేసి వివాహము గాలేదు, మల్లికకు విప్రకుమారు డొకఁడు జారపురుషుడై యుండెను. మల్లికా విప్రకుమారులు

రహస్యముగా గలిసికొనుచు రతీమన్మథులవలె కేళీవిలాసముల దేలి యాడుచుండిరి. వారిరువురు మోహబంధముచే గట్టుబడి యొక్కదిన మైనను నొండొరుల బాసి యుండలేకపోయెడివారు. వారిరువురి శరీర ములు వేరైనను మనస్సు యొకటిగనె వర్తించుచుండిరి.

పిమ్మట కొంతకాలమునకు మల్లిక జనకుడు కుమార్తెకు తగిన వరున న్వేషించి వివాహముచేయ నిశ్చయించెను. వరునన్వేషణార్థమై వర్తకుడు దేశదేశములు తిరిగి తుదకొక్కపురమున నొక వణిజునిగాంచి యాతనికి దన కుమార్తెనిచ్చి వివాహముచేయదలచి యాతనికి తన ఉద్దేశమెరింగింప నాతడును నల్లెయని యియ్యకొనెను. వర్తకుడు తన పురమునకు వణిజుని దోడ్కొనివచ్చి యొకశుభముహూర్తమున దన కూతునిచ్చి యతివైభవముగా వివాహము గావించెను. వివాహానంతర ము వర్తకుడు అల్లుని కొన్నిదినములు దనయింట నిలిపికొని పిదప కుమార్తెను అల్లునితో సాగనంపెను.

విప్రకుమారుడు మల్లికయొక్క వియోగమునకు విలపించుచు మంచముబట్టి క్రమక్రమముగా గృశించి మరణించెను. భర్తతో వెడలిన మల్లికయు విప్రకుమారునిపై గల మోహంబుచే బెంగగొని మర ణించెను. ఆవణిజుడును తాను పెండ్లిచేసికొనిన కాంతతో గొంతకాల మైనను సౌఖ్యమనుభవింపలేదే యను బెంగగొని మన్మథ జ్వరపీడితుడై దివం బలంకరించెను.

"ఓవిక్రమార్క మహారాజా! వింటివికదా యీకథను, మల్లిక, విప్రకుమారుడు, వణిజుడు యీమువ్వురిలో నెవ్వరధికులో దెల్పు" మనిన విక్రమార్కుడు "ఓయీ! విప్రకుమారుడు మల్లిక పరస్పర ప్రేమాన్వితులు, అందుచే వారి మరణమంత శ్రేష్ఠముగానేరదు. మల్లి కనుగూడి కొంతకాలమైనను సుఖంబున నుండని వణిజుడుమరణించుట

మిగుల శ్లాఘాపాత్రము.” అని నుడివిన భేతాళుఁడు దిరోహితుఁడై యెప్పటియట్లు వటవృక్షమును జేరనరిగెను.

# (పదునైదవ కథ)

మరల విక్రమార్కుఁడు వటవృక్షముచెంతకరిగి శవాకృతినున్న భేతాళుని బట్టి బంధించి భుజముపై నిడికొని వచ్చుచుండ భేతాళుఁడీ క్రిందికథ జెప్పెను.

వేదపురియను నొకయగ్రహారంబున విష్ణుశర్మయను విప్రపుంగవుఁడు భార్యాసహితుఁడై కాపురమొనరించుచుండెను. ఈతఁడు సంతానహీనుఁడై పరమేశ్వరునిఁగూర్చి తపంబొనరించి నలువురుపుత్రులను బడసెను. విష్ణుశర్మ రాజపురోహితుండగుటచే యాతని ధనధాన్యములకు కొఱఁతలేకుండెను. నిత్యము భగవదారాధనలు యాగంబులు సల్పుచుండెడివాడు. విష్ణుశర్మపుత్రులు నల్వురును విద్యాభ్యాస మొనరించుటకును పుణ్యక్షేత్రములు దర్శింపదలచియు కాశికేగ నిశ్చయించుకొని తమ యభీష్టము జననీజనకుల కెరింగించి వారల యనుజ్ఞగొని పయనమై కాశికేగిరి.

వీరలు నల్వురును కాశీనగరముఁజేరి గంగానదియందు స్నానమొనరించి విశ్వేశ్వరుని దర్శనభాగ్యము పొందుటకై ఆలయముసొచ్చి స్వామిని దర్శించి మగిడివచ్చునపుడు ఒకమహా మహుఁడగు యోగివరుఁడు వీరికన్నులబడెను. వెంటనే యోగీశ్వరుని కడకరిగి నమస్క-

రించి తమకు విద్యాదానము చేయుడని ప్రార్థించిరి. యోగీశ్వరుడు వల్లెయని వారలను తనతో దోడ్కొనిపోయెను. కొంతకాలము నలువురును యోగీశ్వరునికి శుశ్రూష లాచరించి అమృతసంజీవిన్యాది మహా యోగమంత్రములు నేర్చుకొనిరి. పిమ్మట నలువురును యోగీశ్వరునికడ సెలవునొంది నిజపురముజేర బయనమైరి.

మార్గమధ్యమున నొకవ్యాఘ్రము చచ్చిపడియుండెను. అస్థిమాత్రావశిష్టమై పడియుండెను. అట్టియస్థిపంజరము నానలువురు సోదరులుగాంచి యోగీంద్రుడు తమకుపదేశించిన మంత్రరాజములు పరీక్షింపదలచి, యొకడు యెముకలన్నియు దీసి సరిజేసెను. మరియొకడు నరములు సరిజేసెను. మూడవవాడు రక్తమాంసములు గల్పించెను. నాల్గవవాడు దానికియుసురు బోసెను. పులిస్వరూపముతో లేచి నిలిచెను. దానినది క్షుద్బాధ యధికమగుటచే యానలువుర జంపి భక్షించెను.

"విక్రమార్క భూపాలచంద్రమా! ఈదోషమెవ్వరికి జెందునో తెల్పుము. తెలిసియు చెప్పవేని నీశిరము వేయివ్రక్కలగును." అనిన విక్రమార్కుడు "ఓయీ! తాము బ్రతికింపబోయెడిది క్రూరమృగంబని యెఱింగియు పులినిబ్రతికించిన యావిప్రకుమారులకే యీదోషము జెందును." అనిన భేతాళుడు వటవృక్షము జేరనరిగెను.

## (పదునాఱవ కథ)

విక్రమార్కుడు మరల నావటవృక్షము చెంతకరిగి విశేష ప్రయత్నమున నాశవమునుదించి మూపుపై నిడికొని వచ్చుచుండగ భేతాళుడు "ఓరాజా! నీవేల యీజడధారికొరకై శ్రమనొందెదవు? నీశ్రమ

నివారణమగుటకు కథచెప్పెద నాలింపుము.'' అని యీక్రింది కథ చెప్పెను.

అవినాశని యనుపట్టణమున దేవనాథుండను విప్రపుంగవుడు గలడు. అతఁడు సకలశాస్త్ర పారంగతుఁడు. సంతానమునకై యనేక దేవతల నర్చించి వారిప్రసాదమున నొకపుత్త్రుని గనెను. అతనికి వేదనారాయణుఁడని నామకరణము జేసిరి. వేదనారాయణుఁడు యుక్తవయస్కుఁడైన తోడనే తండ్రి మందారవతియను నొకచక్కని కన్యకారత్నమును దెచ్చి పరిణయము గావించెను. దంపతు లిరువురును రతీమన్మథులవలె నొప్పుచుగాఢముగా బ్రేమించుకొనుచు నన్యోన్య మైత్రి నుండిరి. వీరలనుగాంచి దేవనాథుఁడు పరమానందము నొందుచుండెను.

ఇట్లుండ నొక్కశరత్కాల రాత్రియందు దంపతులిరువురును మలయమారుతము వీచుచోట నేకశయ్యపై నిద్రించుచుండిరి. అయ్యది యొకరాక్షసుఁడు గని మందారవతి యందమునకు డెందము చలింపగ ''నెట్టులైన నీమెనుగూడి సుఖించవలయు'' ననితలఁచి రక్కసుఁడా మందారవతి నెత్తుకొనిపోయి బలవంతముగా నామెనుగూడి సుఖింపుచుండెను. పిదప వేదనారాయణుఁడు మేల్కాంచి ప్రక్కనుభార్యను గానక మిక్కిలి దుఃఖించి యేరికిని జెప్పక భార్య నన్వేషించుచు దేశాంతరముల పాలయ్యెను.

వేదనారాయణుఁ డెచ్చటను తనభార్యను గానక దేశములు దిమ్మరుచు నొకనాటి మధ్యాహ్న సమయమున నొకగ్రామము చేరెను. మార్గాయాసమున క్షుద్బాధాపీడితుఁడై యాగ్రామమున గల యొకబ్రాహ్మణ గృహంబున కరిగి తనబాధనివేదించి వారలిడినయన్నమును గైకొని నదీతీరమున గలయొక వృక్షచ్ఛాయను గూర్చుండి దినదొడగెను. ఆచెట్టుపై నొండు గరుడపక్షి కృష్ణసర్పము నొకదానిని గాళ్ళను బట్టి తనముక్కుతో పొడిచి చంపు

చుండెను. ఆకృష్ణసర్పమా మరణ బాధసహింప నేరక విషముగ్రక్కెను. ఆవిషము వేదనారాయణుఁడది గాంచక సంతుష్టిగ నాయన్నముఁ భుజించి మరణించెను,

అనిచెప్పి భేతాళుఁడు విక్రమార్కునిగని "విక్రమారమహా రాజా! యీబ్రహ్మహత్యాదోష మెవ్వరికి జెందునోతెల్పుము. తెలిసియుదెల్పవేని వెనుకటిశాపమే" యనిన విక్రమార్కుఁడు భేతాళుని గాంచి, "ఓయీ, యీదోషము కథలోగల పాత్రలకెవ్వరికిఁ జెందదు. ఆకొంటినని యడుగ బ్రాహ్మణి యన్నముబెట్టెను. విప్రుఁడు వృక్షచ్ఛాయను దినుచుండెను. గరుడుడు క్షుద్బాధా నివారణార్థమై సర్పము ను బాధించెను. ఆబాధకుతాళలేక సర్పము విషము గ్రక్కెను. ఈ సంగతి నెఱుంగక జనులీదోషము నెవరికాపాదింతురో వారికీ దోషము జెందును" అని చెప్పినడభేతాళుఁడు దిరోహితుఁడై వటవృక్షము నాశ్రయించెను.

## (పదునేడవ కథ.)

విక్రమార్కుఁడు మరల వటవృక్షము కడకరిగి భేతాళుని బట్టుకొని వచ్చుచుండగ భేతాళుడీ క్రిందికథ జెప్పెను.

మగధపురమను పట్టణమును వీరవిక్రముడనుభూపాలుడు మనుష్యనీతిదప్పక పరిపాలించుచుండెను. తనప్రజలను తనబిడ్డలకన్న మిన్న

గాజూచుచు పరమధార్మిక బుద్ధితో రాజ్యమున చోరబాధ లేకుండగ రాజ్యపాలన మొనర్చుచుండెను. ప్రజలు రాజునందు భక్తి గలిగి నిర్భయులై గుండెలపై చేతులిడికొని సుఖంబుగ కాలము గడపుచుండిరి.

ఇట్లుండగ బట్టణమునకు వెలుపల నొక దొంగలగుంపు జేరెను. వారినాయకుడు దొంగతనమునందు మిగుల నేర్పరి. దొంగలందరును వారి నాయకుని అడుగులకు మడుగులొత్తుచు వాని పల్కులు వేదాక్షరములుగ భావించి యాతడు చెప్పిన చొప్పున వర్తించుచుండురు. ఆదొంగల జేడు తన యనుచరులతోకూడి మగధపుర ప్రజలను బాధింపుచు ధనమును దోచుకొనుచుండెను. ప్రజలీ బాధలనుభరించలేక రాజు సన్నిధికేగి వారి వారి బాధలను నివేదించుకొనిరి. వీరవిక్రముడు వారల నూరార్చి దొంగలఁబట్టి మీబాధ తొలగింతునని చెప్పి పంపినైచియా దొంగల బట్టుటకు భటుల నియమించెను. భటులు దొంగలనుబట్టుటకు కెంత ప్రయత్నించినను సఫలులు కాజాలరైరి.

వీరవిక్రముడు దన భటులు దొంగలను బట్టుకొనజాలరని తాను స్వయముగా వారలను బట్టుకొనదలచి యొక నిశీధమున బ్రచ్ఛన్నవేషముతో నగరమంతయు గాలించి వారియునికి దెలిసుకొనగోరి నగరమునకు వెలుపలగల మైదానమున కరుదెంచెను. అచ్చట జనసమూహముండుట వీరవిక్రముడుగాంచి తత్సమూహము కడకరిగి వారలుదొంగలని దెలుసుకొని వారి నాయకునిజేరి "ఓయీ! నీవెవ్వడవు? యీనిశీథసమయమున మీరలందరును యిచ్చట దిమ్మరుటకు కారణంబే"మని యడిగెను. అంత చోరనాయకుడు విక్రమునిగని భూపాలుడని గుర్తించి 'రాజా! నేనీ గ్రామదేవతయగు మహంకాళీ పుత్రుడను. నన్ను పోతరాజందురు." అనిన విక్రముడు వానిమాటలు నమ్మినవానివలె, 'మీరు మాగ్రామశక్తి పుత్రులగుటంజేసి యామెవలె మీరును బూజ్యులై దేవివలె మీరును మానగరమును రక్షింపు"చుండుడని ప్రార్థించెను.

దొంగలనాయకుడది నిజముగానెంచి, యెట్లయిన నాతనిం జంపి రాజ్యము గై కొనదలచి, విక్రమునితో "రాజా! నీకోరిక ప్రకారము మాజననివలె నేనును మీనగరము రక్షించుచుందును." అని చెప్పి రాజుతో నగరము లోని కరుదెంచెను. రాజు దన భటులకు వానినప్పగించి కొందరు రాజ భటులను బంపి తదితర దొంగలను గూడ బట్టించెను.

ఆమగధపురమున నొక్క వణిజుఁడుగలడు. అతనికి సర్వలక్షణ సంపన్నయైన రత్నావతియను నొక్క కుమారీరత్నముగలదు. ఆమె రూపలావణ్య సౌశీల్యాది సద్గుణంబులుగాంచి పెక్కురు వైశ్యులామెను వివాహమాడదలఁచిరి గాని రత్నావతి యెవరిని బరిణయంబొాడనని పట్టుపట్టి తండ్రియింట నతిగారాబంబున బెరుగుచుండెను. ఒక్కనాఁడామె సౌధాగ్రమున నిలబడి రాజబాటఁ దిలకించుచుండ, రాజ భటులవలన కొఱతకై గొనిపోబడుచున్న దొంగలనాయకుఁడామె కన్నులబడెను. రత్నావతి దొంగలనాయకుని మోహించి వెంటనే తండ్రియొద్దకేగి తన యభీష్టం బెరిఁగించెను. ఆవణిజుఁడు తనకుమార్తె మూర్ఖమోహమునకు జింతించి యామెమనమును ద్రిప్ప బ్రయత్నించి విఫలుఁడై వీరవిక్రముని యాస్థానమున కేగి యిట్లు వేడుకొనెను. "భూపాలచంద్రమా! ఈదొంగలనాయకుని విడువ బ్రార్థన. ఈతని మత్పుత్రిక ప్రేమించెను. యెన్నివిధముల జెప్పినను వినదయ్యెను. ఈతని బెండ్లి యాడనిచో నామె మరణంబొందుట నిశ్చయము. కావున వానిని విడుదల జేయుఁ"డని పెక్కురీతుల వేడుకొనెను. భూపాలుఁడా వణిజునిపై నాగ్రహించి యట్లుచేయుటకు సమ్మతింపక యాతని గసరి పంపివైచెను. వణిజుఁడు గృహమునకేగి జరిగిన వృత్తాంత మంతయు రత్నావతి కెరిఁగించెను. ఆయుదంతమాలించినతోడనే రత్నావతి దుఃఖించుచు దొంగలనాయకుని గొఱతవేసెడి స్థలమునకేగెను. ఆమె వెంట దలిదండ్రులును దుఃఖించుచు నేగిరి. రాజభటులా దొంగలనాయకుని గొఱ్ఱున వేసిరి.

ఆదొంగ రత్నావతిని యామె తలిదండ్రులనుగాంచి నవ్వి పిదపదుఃఖించి ప్రాణంబులు వదలెను. రత్నావతి చేయునదిలేక చితిపేర్చి యగ్గిరగిల్చి యందు బడనుంకించెను. అంత పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై యామె పాతివ్రత్యమునకలరి యాదొంగల నాయకుని బ్రతికించివారిరు వురకు నతి వైభవంబుగ పెండ్లిగావించిరి. వీరవిక్రముడదిగాంచి యా దొంగలనాయకుని దన సైన్యమున కధిపతిం జేసెను.

అని తెల్పి భేతాళుఁడు విక్రమార్కునిగని, "విక్రమార్క మహీపాలా! ఆదొంగ మరణించుటకుబూర్వము నవ్వి దుఃఖించనేల?" యనిన విక్రమార్కుఁడు "ఓయీ! రత్నావతిమంచిపెద్దలువిచారించక తన్ను ప్రేమించినందున దొంగ నవ్వెను. ఆమెతలిదండ్రులు కూతురుకై విలపించుటగని దుఃఖించెను." అని చెప్పిన భేతాళుఁడు యెప్పటియట్లు వటవృక్షము జేరఁసరిగెను.

## (పదునెనిమిదవకథ)

విక్రమార్కుఁడు మరల వటవృక్షము చెంతకేగి శవాకృతినున్న భేతాళుని భుజముపై నిడికొనివచ్చుచుండగ భేతాళుఁడు "విక్రమార్క భూపతీ! ఏలనీవిట్లు శ్రమనొందెదవు? నన్ను విడువుము. పోయి సుఖంబున నుండుము." అనిన విక్రమార్కుఁడు మౌనమువహించి మిక్కిలి వేగమున నడచుచు యాజడదారికడ కేగుచుండెను. అంత భేతాళుఁడు "రాజా! నీశ్రమ నివారణార్థమై యొక చక్కనికథ జెప్పెద నాలింపు" మని యీక్రిందికథ జెప్పెను.

గోవిందపురంబను పట్టణంబును కార్తికేయుండను రాజు పరిపాలించుచుండెను. అతనికి సర్వలక్షణ సంపన్నయైన మానవతియను కుమారీమణిగలదు. ఆయూరనే మాండవికుడను విప్రకుమారుడుగలడు. ఒకనాటిసాయంసమయమున మాండవికుడు రాజప్రాసాదమువైపు బోవుచు సౌధాగ్రమున జల్లగాలికై దిరుగాడు రాజకుమారినిగాంచి మనంబున మోహించెను. రాకుమారియు మాండవికునిగని వలచెను. ఇరువురు నన్యోన్య మోహాతిశయమున గాఢానురాగ సంతప్తహృదయులైరి. కాని సమయమునకై వెదకుచుండిరి. దినములు గతించుచున్నను వారిరువురికి సంయోగము తటస్థింపలేదు.

మాండవికుడు విరహబాధ భరింపజాలక తన ప్రియమిత్రుడును గడు జతురుడునైన మల్లినాథుడను వానికడకరిగి తన బాధ నాతని కెరింగించెను. మల్లినాథుడు మాండవికుని నూరార్చి యాతని కాడు వేషమువేసి కార్తికేయుని యాస్థానమునకు దోడ్కొనివచ్చెను. మల్లినాథుడు భూపాలునిగని 'రాజా! నేను కాశీయాత్రకేగుచున్నాను. అడుదాని నంతదూరము దీసికొనిపోవుటకిష్టములేదు. కావున నీకన్యను మీయొద్ద భద్రముగ గాపాడుడు. మగిడి నేనే తెంచి దోడ్కొని పోవుదును'' అనిచెప్పిన భూపాలు డందులకు సమ్మతించి యాకుహనాస్త్రీని అంతిపురమునకంపి మల్లినాథుని పోయిరమ్మనెను.

మాండవికుడు స్త్రీవేషముననే రాకుమారి చెలికత్తెలలోనొకతై మెలగుచుండెను. ఒకనాటిరాత్రి మాండవికుడు రాకుమారి శయనాగారముజొచ్చి యామెకు తన యుదంత మెఱింగించెను. ''ఏమీ నీనిర్భయత్వము! మమ్ముల నింతగా మోసపుత్తువా!! ఇపుడె రాజభటులనుబిలిచి నిన్నప్పగింతు'' నని రాకుమారిభయపెట్టెను. అంత మాండవికుడుభీతిజెందక చెలీ! నీవునన్ను భయపెట్టబోకుము. నీపయింగల మోహంబుచేనేనింత సాహసించితిని. రాజభటులను బిలిచి నన్నప్పగించి శిక్షింపజేతునంటివి!

అంతవరకేల, నీవెనన్ను శిక్షింపుము'' అనిపల్కిన నామెదిగ్గునలేచి యాతని దన మానిత బాహుమర్గముల బంధించెను. ఆనాటినుండి వారిరువురును సంతోషసాగర తరంగముల దేలియాడుచుండిరి.

ఇట్లుండ నొక్కనాడొక్క మంత్రిసూనుడు రాజుకడకరుదెంచి రాకుమారిని దనకిచ్చి వివాహము గావింపుడని వేడుకొనెను. రాజందుల కంగీకరింపక తనయొద్ద దాచబడిన వేషధారికన్య నామంత్రికుమారున కిచ్చి వివాహము జేసెను. పునస్సంధానము నాడిరువురును శయ్యాగారము బ్రవేశించిరి. స్త్రీవేషధారియైన మాండవికుడు మంత్రిసూనుం గని ,,నాథా! నేనొక దుష్టనక్షత్రమున రజస్వలనైతిని. గావున మీరు తీర్థయాత్రలు జేసి పుణ్యతీర్థంబు సేకరించి యర్థసంవత్సరము వెనుక యాతీర్థము నాపై బ్రోక్షించినచో నేను పాపవిముక్తురాలనై మీకుభోగ్యనగుదును.'' అని పల్కిన మంత్రికుమారుడది నిజమని నమ్మి దేశాటనకు బయనమై పోయెను.

పిమ్మట కొంతకాలమునకు మల్లినాధుడు యొకశిష్యునితో భూపాలుని కడకరుదెంచి తన కన్య నిప్పింపుడని యడిగెను. రాజు జరిగిన సంగతినంతయు దెల్పి యాకన్యకు బదులు దన కూతునిచ్చెదననెను! మల్లినాధుడు రాకుమారిని దన శిష్యునకు వివాహముజేసెను. వేషధారి యాసంగతినంతయు దెలిసుకొని వేషమువీడి యంతఃపురమునుండి బయటికి వచ్చెను. రాకుమారియగు మానవతికై మాండవికుడునుమల్లినాధుని శిష్యుడును దగవులాడజొచ్చిరి.

భేతాళుడు విక్రమార్కుని గాంచి ,,విక్రమార్క భూపాల చంద్రమా! రాకుమారి యెవరిభార్యయో నిశ్చయింపు''మనిన విక్రమార్కుడు ,,యక్షోత్తమా! రాకుమారి వివాహమాడినవారికే భార్య గాని రహస్యముగ గూడినవారికి భార్య కానేరదని నుడివిన భేతాళుడు దిరోహితు డయ్యెను.

# (పందొమ్మిదవ కథ)

విక్రమార్కుఁడు మరల నావటవృక్షము చెంతకేగి శవాకృతి నున్న భేతాళుని భుజముపై నిడికొని మౌనమువహించి నడివడిగా నడచుచు జడదారికడ కరుగుదెంచుచుండ భేతాళుఁడీ క్రిందికథ జెప్పెను.

పద్మనాభపురమను పట్టణం మొండుగలదు. దానిని ధర్మపాలుఁ డను భూపాలు డేలుచుండెను. అతడు మనునీతిదప్పక ప్రజలను దన కన్నబిడ్డలవలె జూచుచు యర్థులపాలిటి కల్పవృక్షమై, రిపులకు గాలానల సన్నిభుడై రాజ్యమవక్ర పరాక్రమంబున బరిపాలించు చుండెను. ఆత డెల్లప్పుడును ప్రజల యోగక్షేమములు దెలిసుకొనుటకై యజ్ఞాత రూపుడై నగరమున దిరుగుచుండెడివాడు. ధర్మపాలుఁడట్లు దిరుగు సమయమునందొక్కనాడు సమీపమునగల విపినమున కేగెను.

ఆయడవి భూలోకమునగల పురమో నాగయన్నట్లు పెక్కు సర్పరాజములతో నిండియుండెను. అందు సర్పములు దమ యిచ్చవచ్చినట్లు సంచరించుచుండ వైనతేయుడు దన కన్నులబడిన నాగములనెల్ల భక్షించుచుండెను. సర్పములా గరుత్మంతుని బాధలు బడజాలక యొక పెద్ద సభగావించి తత్సభకు గరుత్మంతునిగూడ రావించి నాగములన్నియు నిట్లు మొఱపెట్టుకొనెను. సువర్ణా! నీవుగనిన సర్పములనెల్ల జంపుచుండుటచే మేము భీతిజెంది మరణాసన్నుల మగుచున్నాము. కావున మాపై దయయుంచి మాలో వరుసక్రమంబున దినమునకొకటి వంతున నీవు ఆహారముగా గొనుము. మేము ప్రతిదినము నియమము దప్పక యొక్కొక్క సర్పమును నీకడ కనిపెదము. దానిందిని మమ్ముగాపాడుము.” అని యతిదీనముగా బ్రార్థించిన గరుడుడందులకంగీకరించెను.

అప్పటినుండియు గరుడుడు తనకాహారముగ బంపబడెడి సర్పమును దినుచు దదితర సర్పములజోలికి బోకయుండెను.

ఒకనాటివంతు శంఖవర్ణుండను వానికి వచ్చెను. శంఖవర్ణుడొక్కడే బిడ్డడగుటంజేసి తల్లి మిగుల దుఃఖింపసాగెను. ఆయరణ్యమునకు వచ్చిన ధర్మపాలుడదిగని యచ్చటకేగి యామె దుఃఖకారణమడిగి తెలిసికొని శంఖవర్ణునింగాంచి "ఓయీ! నీకు మారుగా నేనాగరుడునకెఱయయ్యెద"ననిన శంఖవర్ణుడు "రాజా! నేను మరణించిన నాజననియొక్కర్తియే దుఃఖించును. నీవు పోయినచో నీరాజ్యమందలి ప్రజలందరు దుఃఖించెదరు. అదియుగాక నీమూలమున నెందరోబీదజనులు జీవించుచున్నారు. నావలన యెరులకిసుమంతయు లాభములేదు. కాన నేనేబోయెదను." ఇట్లు వారిరువురును పరస్పరవాదము లాడుకొనుచుండిరి. ఇంతలో వైనతేయుడు క్షుద్బాధ సహింపజాలక యానాడు దనకాహారముగ రావలసిన శంఖవర్ణుడు రానందున మిగుల యాగ్రహము వహించి శంఖవర్ణుడున్నచోటికేతెంచెను. అంత ధర్మపాలుడా విష్ణువాహనునిగని "పక్షీంద్రా! నీవాశంఖవర్ణునివదలి నన్ను భక్షింపు"మనిన గరుడుడా భూపాలుని పల్కులకలరి "భూపాలోత్తమా! నీపరోపకార పారీణతకు నేమెచ్చితిని. నీకు నేయువరంబు కోరుకొను"మన ధర్మపాలుడు "గరుడుడా! నేటినుండి నీవు సజీవములగు సర్పములను భక్షింపనని వాగ్దానము చేయు"మనిన గరుడుడట్లేయని యంగీకరించెను. అప్పటినుండియు నాగములు గరుడునివలన భయంబులేక సుఖంబుగానుండిరి.

విక్రమార్క భూపాలా! గరుడుడు ధర్మపాలుడు నీకథలో ముఖ్యపాత్రలు. వీరిలో నెవ్వరధికులో దెల్పు"మనిన విక్రమార్కుడు "గరుడుడే యధికు"డని తెల్పిన భేతాళుడెప్పటియట్లు వటవృక్షము జేరసరిగెను

## (ఇరువదవ కథ)

విక్రమార్కుఁడు మరల నావటవృక్షముకడకరిగి భేతాళుని బట్టి బంధించి భుజముపై నిడికొని వచ్చుచుండగ భేతాళుడు "విక్రమార్క మహీపాల చంద్రమా! నీశ్రమ నివారణమగుటకు నొక చక్కనికథ జెప్పెద నాలింపు"మని యీక్రిందికథ జెప్పెదను.

తొల్లి స్వర్ణపురమను పట్టణమును గనకసేనుఁడను రాజు పరిపాలించుచుండెను. అతడు శృంగారపురుషుడు, స్త్రీలోలుడు, అయూర నొక వణిజునకు వసుదత్తయను పుత్రికారత్న మొకర్తుగలదు. ఆమె మిగుల సౌందర్యవతి. ఆమె సౌకుమార్యము, సోయగము, లావణ్యము వర్ణింప నాదిశేషునకైన తరముగాదు. కనకసేనుఁడా వైశ్యకన్యకామణిని గాంచి మోహించి పెండ్లియాడ దలచెను. భూపాలుడు వెంటనే పురోహితునిబిలిచి తన యభిమతం బెరింగించి వసుదత్త జాతకమును పరిశీలించుటకు నియోగించిపంపెను. పురోహితుఁడు రాజాజ్ఞప్రకారము వసుదత్తగృహమునకేగి యామెజాతకము దిలకించి భూపాలునికడ కరుదెంచి "మహారాజా! వసుదత్త జాతకమును పరిశీలించితిని, ఆమె బహుదుష్టజాతకి, అన్నిలక్షణములు ప్రమాదాస్పదములే, ఆమెను చేబట్టినవాడు క్షణకాలములోనె స్థానభ్రష్టుడగును." అని తెల్పిన భూపాలుడు వెరగంది తానాకన్యను వివాహమాడుటమాని వసుదత్తను తనప్రధానమంత్రికి బెండ్లిజేసెను.

పిమ్మట పెక్కుదినములు గతించినవెనుక పట్టణప్రదక్షిణకాలమాసన్నమైనందున కనకసేనుడు నగరప్రదక్షిణముచేయుచు జల్లగాలికై

యుప్పరిగపై దిరుగాడుచున్న వసుదత్తునుగాంచి మోహపారవశ్యమున వివశుడై విరహము నొందుచుండెను. ప్రధానమంత్రి యదిగాంచి వెంటనే దనగృహమునకేగి వసుదత్తను బిలిచి భూపాలుని విరహముడిపి రమ్మని చెప్పెను. వసుదత్త భర్తయాజ్ఞానుసారము అలంకృతయై భూపాలునికడ కరిగెను. భూపాలుడామెనుగాంచి పరస్త్రీని గూడుట పాపహేతువని దలచి యామెను తిరిగి గృహమునకు బంపివైచెను. పిమ్మట కొన్ని దినములకు కనకసేనుడు విరహానలము భరింపలేక ప్రాణములు విడిచెను. ప్రధానమంత్రియు "వసుదత్తపైగల మోహంబుచేగదా భూపాలుడు మరణించె"నని తానుకూడ మరణించెను.

విక్రమార్క భూపాలచంద్రమా! వింటివికదా యీకథ! రాజు, ప్రధానమంత్రి, వీరిలో నెవ్వరధికులో దెల్పుము. తెలిసియు దెల్పవేని వెనుకటి శాపమే" యనిన విక్రమార్కుడు, "రాజు యేస్త్రీపై తాను మోహంబు గొనియుండెనో యాస్త్రీ తనంతట తానువచ్చినను నామెను గూడక ప్రాణములు విడిచినందున రాజేయధికు"డని తెల్పిన భేతాళుండు దిరోహితుండై వటవృక్షము జేరనరిగెను.

# (ఇరువది యొకటవ కథ)

విక్రమార్కుడు వటవృక్షముచెంతకేగి శవాకృతినున్న భేతాళుని బట్టుకొని భుజముపై నిడికొని జడదారికడకు వడివడిగ చనుదెంచుచుండ భేతాళుడు విక్రమార్కునిగని "భూపాలోత్తమా! ఊరక యాజడదారి కొఱకేల శ్రమపడియెదవు? నన్ను విడిచి సుఖంబున

నుండు"మనిన విక్రమార్కుడు మౌనమువహించి రెట్టించినవేగముతో నడువసాగెను. అంత భేతాళుడు "భూమీశా! నీశ్రమ నివారణమగుటకు చక్కని కథ జెప్పెదనాలింపు"మని యీక్రిందికథ జెప్పెను.

చిత్రపురంబను పట్టణం బొండుగలదు. అద్దాని నొక రాజన్యుడు అవక్ర పరాక్రమంబున బరిపాలించుచుండెను. ఆభూపాలుఁ డొక్కనాడు మృగయా వినోదార్థమై యరణ్యమున కరిగెను. ఆయరణ్యమందాతడొంటరిగా దిమ్మరుచుండ సర్వాంగసుందరియగు నొక కన్యామణి యాతని కన్నులబడెను. ఆమెను గాంచినతోడనే భూపాలుడు మోహ పారవశ్యమున వివశుడై పోయెను. భూపాలుడు అశ్వమును డిగ్గి యామెదరికేగి "కాంతామణీ! నీనామంబేమి? నీయూ రెయ్యది? ఈయరణ్యమున నొంటరిగా గ్రుమ్మరుటకు కారణంబేమి? దయయుంచి నీ వృత్తాంతమంతయు సవిస్తరముగ దెల్పు"మన నాకాంత భూపాలుని గని చిరునవ్వు ముఖంబునచింగులాడ దానొక మునిపుత్త్రికయని ముత్యములొల్కు పల్కుల వచించెను. అంత భూపాలుడు దనహృదయము నామె కెరిగించెను. ఆమెయు నీతనినిగని మోహించిన దగుటంజేసి యాతని కోర్కె కంగీకరించెను. అంత వారిరువురు నొక వేపచెట్టు నీడనుగల పొదరింటంజేరి యందు విలాసక్రియల నెరవేర్చుకొనుచుండిరి.

ఆసమయముననే యొక్క రక్కసుడు క్షుద్బాధచే పీడింపబడుచు నాయరణ్యమున గ్రుమ్మరుచుండెను. ఆరాక్షసుడట్లు గ్రుమ్మరుచు పొదరింటికడ కరుదెంచి భూపాలునిగని మ్రింగబోయెను. భూపాలుఁడు గడగడ వడకుచు రాక్షసుని దన్ను చంపవలదని వేడుకొనెను. అంత రాక్షసుడు భూపాలా! నాకాక లమితముగనున్నది. కాన నీవు మాతాపితృయుతంబగు బిడ్డను నాకాహారముగనొసంగెదవేని నిన్నుజంపను." అనిన భూపాలుడందుల కియ్యకొని వెంటనే అశ్వారూఢుడై తనరాజ్యమునకేగి కొంత ధనమిచ్చి యొకవిప్రబాలునిగొని యారాక్షసుని కడ

కరిగి యావిప్రబాలు నాహారముగా నొసంగెను. రాక్షసుడావిప్రబాలుని మ్రింగబోవ నాతడు వికవిక నవ్వెను. తోడనే రాక్షసుడా బాలునివదలి తిరోహితుడయ్యెను. పిమ్మట భూపాలుడు మునికన్యను దోడ్కొని తన పురమున కేగెను.

"విక్రమార్క మహీపాలా! రాక్షసుఁడు మ్రింగబోవ నాబాలకుడు నవ్వుటకుగల కారణమే"మని భేతాళుఁడడిగిన విక్రమార్కుఁడు "ఓయీ! కన్న తలిదండ్రులును, ప్రజారక్షకుఁడగు భూపాలుఁడును, దైవమునుగూడ కరుణలేక దన్ను జంపజూచిరని యాబాలకుడు నవ్వె"నని నుడివిన భేతాళుఁ డంతర్హితుఁడై వటవృక్షము నాశ్రయించెను.

## (ఇరువదిరెండవ కథ.)

మఱల విక్రమార్కుడు భేతాళునికొఱకు వటవృక్షముకడ కరిగి యావటవృక్ష శాఖలందున శవాకృతిని వ్రేలాడుచున్న భేతాళుని దింపి మూపున నిడికొని మిక్కిలి శ్రమబడుచు నాజడదారికడ కేగుచుండ భేతాళుడు విక్రమార్కునిగని "రాజా! సుఖంబుననుండక నీకేల యీ శ్రమ! నీశ్రమ నివారణార్థమై చక్కనికథ జెప్పెదను. సావధానమతివై యాకర్ణింపుము." అని యీక్రిందికథ జెప్పెను.

విశాలనగరమున సకలశాస్త్ర పారంగతుడైన గోపాలశర్మయను విప్రపుంగవుడు నివసించుచుండెను. ఆతనికి ధర్మశర్మయను కుమారు డొక్కడుగలడు. ధర్మశర్మ సకలవిద్యలనభ్యసించుచు శుక్లపక్షచంద్రుని

వలె దినదిన ప్రవర్ధమానుఁడై వెలుఁగుచుండెను. అతఁడు పదునాఱవ యేట అకాలమృత్యువాతంబడి మరణించెను. తలిదండ్రులు, లేక లేక కలిగిన పుత్రుఁడు మరణించినందున మిగుల దుఃఖింపసాగిరి. పిదప నా ధర్మశర్మ శవము శ్మశానవాటికకుఁ గొనిపోయి చితి పేర్చి దానిపై శవము నుంచి దహనముఁ జేయుటకుఁ జేతులాడక దుఃఖించుచుండిరి. వారి యదృష్టవశమున నొక సిద్ధుఁ డా మార్గమున నేగుచుండెను. ఆసిద్ధుఁడు గోపాలశర్మ దుఃఖించుచుండుటఁగాంచి జాలిగొని తాను పరకాయ ప్రవేశవిద్య నెఱింగిన వాఁడగుటం జేసి తన దేహము నొక పొదమాటున భద్రపరచి తానా శవము నావహించెను.

వెంటనే నిద్రనుండి లేచినవానివలె ధర్మశర్మ లేచి యాచితిపై గూర్చుండెను. తలిదండ్రు లయ్యదిగాంచి యమందానందంబు నొంది కుమారుని అక్కున జేర్చుకొని పిమ్మట గృహమునకు గొనిపోయిరి. ధర్మశర్మ వారివెంట నేగుచు మొదట నేడ్చి యావల నవ్వెను.

అని తెల్పి భేతాళుడు విక్రమార్కునిగని "విక్రమార్క భూపాలోత్తమా! ధర్మశర్మ మొదట నేడ్చి పిమ్మట నవ్వుటకు కారణము దెల్పుము. తెలిసియు దెల్పవేని నీశిరము వేయివ్రక్కలగును." అనిన విక్రమార్కుఁడు "యక్షేంద్రా! అతిగారవమున తలిదండ్రులు పెంచి పెద్ద జేసిన శరీరమును విడిచితిమిగదాయని యేడ్చెను. నవయౌవనశరీరమావహించితిగదాయని సంతోషమున నవ్వెను." అని తెల్పిన భేతాళుడెప్పటి యట్లు వటవృక్షము జేరనరిగెను.

# (ఇరువదిమూడవకథ)

విక్రమార్కుడు మరల నావటవృక్షముచెంతకేగి భేతాళుని భుజముపై నిడికొని వచ్చుచుండ భేతాళుడీ క్రిందికథ చెప్పెను.

వర్ధమాన నగరమును శృంగారశేఖరుడను రాజు పరిపాలించుచుండెను. అతడు విలాసపురుషుడు స్త్రీలోలుడగుటచే వీధులనెల్ల గ్రుమ్మరుచు శృంగారస్త్రీలనెల్ల దిలకించుచుండెడివాడు. ఒకనాడు శృంగారశేఖరుడు వనజాక్షియను తోయజాక్షిం గాంచి యామె సౌందర్యప్రతిభ కలరి మోహించెను. వెంటనే శృంగారశేఖరుడామెకడ కరిగి తనయాభీష్టము నెఱింగించెను. ఆమెయు నందులకు సమ్మతించెను. వారిరువురును నన్యోన్య మోహంబులవిడువలేక నాయూరనుండిన, నేమియపవాదము ఘటిల్లునోయని దేశాంతరములకు బయనమైయేగిరి. వారిరువురు మార్గమధ్యమున గల యొక యడవింబడి నేగుచుండిరి. అంత కొందఱుచోరులు వారిని నిరోధించిరి. శృంగారశేఖరుడు క్షత్రియుండగుటం జేసి భీతిలక తనపరాక్రమము జూపి యాచోరులను జక్కాడెను. పిదప వారు సమీపమున గల యొకపట్టణము జేరిరి.

శృంగారశేఖరుడు వనజాక్షి నాపట్టణమున గల యొక పాడు దేవళంబున నుంచి తాను యాహార పదార్థము సేకరించుటకై పట్టణములోని కరిగెను. అతడు అంగడివీధిని బోవుచుండ వెచ్చములు గొనుటకై వచ్చినయొక వేశ్య యాతనిదరిజేరి, యాతడట్లు దిరుగుటకు గల కారణమడిగి తెలిసికొని తానన్నపానాదులిచ్చి యాదరింతునని తనగృహమునకు గొనిపోయెను. ఆపట్టణమున మోహిని యనువేశ్య గలదు. ఆమె సౌందర్యమున కాదర్శప్రాయమై బహు జాణయై యుండెను. నాటినుండి శృంగారశేఖరునిపై మక్కువజెంది యాతని నాద

తింపుచు నాతనిగూడి సుఖింపుచుండెను. శృంగారశేఖరుఁడు మోహి నీ మోహపాశములకుం జిక్కి తానువాడు దేవాలయమున వదలివచ్చిన వనజాక్షిని మరచిపోయెను.

వనజాక్షి శృంగారశేఖరుని రాకకై నిరీక్షించి రాకపోవుటచే మిగుల విచారించి యాతని జాడ లరయుటకై బైలుదేరబోవ, ధనవంతుడైన వైశ్యుడొక్కండామెను గాంచి యాతనికి భార్యలేమింజేసి వనజాక్షినిగూడి సుఖింపదలచి తన యభీష్టము నామె కెరింగించి యామె సమ్మతిబడసి తన గృహమునకుఁ దోడ్కొనిపోయి యామెనుగూడి సుఖింపుచుండెను. ఇట్లుండఁగ నొక్కనాఁడొక యెలుక వారి శయనాగారముఁజొచ్చి మిగుల వ్యసనముగలిగించి వారికి నిద్రాభంగ మొనరించెను. అమరునాడు వైశ్యుడతి ప్రయాసతో నామూషికమును కడతేర్చి వనజాక్షితో దానాచరించిన కార్యమును గూర్చి పెక్కువిధముల వర్ణించెను. అంత వనజాక్షి వైశ్యునిగని "నీవు మూషికవధకే మహాయోధునివలె చెప్పుచున్నావు! మాశృంగారశేఖరుడు కొందఱ చోరుల నొక్కపెట్టున జంపెను. నీవలె నతడేమియు ఘనముగాజెప్పలేదు. నీవు యల్పుడవు. నీతో సహవాస మొనరింపగూడ"దని వెంటనే వనజాక్షి యురిపోసికొని మరణించెను. తన వలపుకత్తె మరణించినందున తాను బ్రతికి ప్రయోజనము లేదని వైశ్యుడు మరణించెను. మోహినీమోహపాశములకుజిక్కి కాలముగడపుచున్న శృంగారశేఖరుడువనజాక్షివృత్తాంతము దెలిసికొని విషముత్రావి మరణించెను. మోహిని, జరిగినదాని కంతటికి కారకురాలను నేనేకదాయని యామెయు మరణించెను.

విక్రమార్క భూమీశా! మరణించిన నల్వురిలో నధికులెవ్వరో దెల్పు"మనిన విక్రమార్కుడు "వేశ్యయే యధికురాలనిదెల్పెను. అంత భేతాళుడు దిరోహితుడై వటవృక్షము జేరనరిగెను.

# (ఇరువది నాలుగవ కథ)

విక్రమార్కుఁడు మరల వటవృక్షముచెంతకేగి భేతాళుని భుజముపై నిడికొని వచ్చుచుండ. "అయ్యో! భూపతి! జడధారి మూలమున నీకెట్టి కష్టమొదవెను? రాజా! నీయలసట దీరుటకొక చక్కని కథ చెప్పెద నాలింపుము" అని భేతాళుఁడీ క్రింది కథజెప్పెను.

ఒక మనుజుఁడొకడు తనభార్యను కుమార్తెను వెంట నిడికొని కాశి కేగుచుండెను. వారుముగ్గురును నొక విపినమార్గమున జనుచుండ నొక్క క్రూర వ్యాఘ్రమొకటి యామనుజునిపై లంఘించి యాతనిని గరచుకొని పోయెను. తల్లి కుమార్తె లిరువురు కొంత తడవు దుఃఖించి యచ్చటున్నచో క్రూరమృగము లరుదెంచునేమో యను భీతిచే వారికి త్రోవతెలియకపోయినను గాలిబాట ననుసరించి పోవుచుండిరి.

వేఱొక మనుజుఁడు తనకుమారునితో గలిసి కాశికేగుచు నామార్గముననే బోవుచు నాతల్లికుమార్తెల పదగుర్తులను గాంచి తండ్రి, కుమారునితో నిట్లనియెను. "మనకు స్త్రీలు లేమింజేసి మిక్కిలి కష్టముగానున్నది. కావున నాపోవుచున్న స్త్రీల నిర్వురము వివాహమాడుదము. పదముల గుర్తుబట్టి చూడ నొక్కజవ్వనియు నొక లేఁబ్రాయపు బాలికయు నయి యుండనగును. జవ్వని నేబరిణయమాడుదును. ఆబాలికను నీవుపరిణయమాడుము" అని పల్కిన గుమారుడు వల్లెయని యంగీకరించెను.

తండ్రికుమారు లిరువురును వడివడిగాబోయి యాతరుణులను గలిసికొనిరి. ఆస్త్రీలను గాంచినంతనే పెద్దపాదములు గలిగిన రమణి కుమార్తెగను చిన్నపాదములు గలిగిన కాంత తల్లిగను నుండెను.

అంత వారిద్దరును దమయభిప్రాయముల నా స్త్రీల కెరింగించగా వారును దమకు బురుషులు లేకపోవుటచే సమ్మతించిరి. తండ్రి కుమారు లిరువురును మొదట నిశ్చయించుకొన్న విధముగా వారిని బెండ్లియాడిరి. తండ్రి కుమార్తెను, కుమారుడు తల్లిని బరిణయంబాడి వారలయందు గుమారులను గాంచిరి.

ఓవిక్రమార్క మహారాజా! ఈకథ నాలించితివి కదా! ఆతండి క్రకుమారులకు జని ం చి న పు త్రు లొకరి కొ క రే మ గు దు రో వివరింపుము. తెలిసియుండియు దెల్పవేని నీశిరంబు వేయివ్రక్క లగును” అని భేతాళుఁడుపల్కిన విక్రమార్కుడు యెట్టిసమాధాన మీయ వలయునో దోచక నిరుత్తరుడయ్యెను. అంత భేతాళుఁడు “రాజా! యీావరకు నీకుజెప్పిన కథలన్నిటికి నీవు దెల్పినయుత్తరముల నాలించి యానందం బొందితిని. నీవుసమాధాన మీయజాలని కథ జెప్పితిని. నీవుయాకూ్రరుడగు జడధారి కేల నన్ను భృత్యునిగా నొన రించెదవు? నన్ను నీసేవకునిగా గొనుము.” అని పల్కి జ్ఞానశీలుఁడు పన్నిన మాయాజాలమును భేతాళుఁడు రాజున కెఱింగించి యాతనిని నీవు కాళికకు బలియొసంగినచో నీకువశ్యుడనై మెలంగెదనని చెప్పెను.

విక్రమార్కుఁడు భేతాళుని బంధించి ఋషికడ కరుగ ఋషి విక్రమార్కుని ధైర్యసాహసముల బ్రశంసించెను.పిమ్మట నాజడదారి భేతాళుని మంత్రముగ్ధుని గావించి విక్రమార్కునితో సిట్లనియెను. “ఓయీ! నీవుసరోవరమునకేగి స్నాన మొనరించిరమ్ము” అనిన విక్రమార్కుడు స్నానమొనరించుట కేగెను.

పిమ్మట నాఋషి కాళికాదేవి మ్రోల పూజాద్రవ్యములను సిద్ధపరచియుంచెను. విక్రమార్కుడరు దెంచినతోడనే „ఓయీ! యీదేవికి నమస్కరింపుము„ అనిన భూపాలుడు „దేవా! రాజ్య పాలన మొనర్చువాడను. నమస్కరించు టెట్టులో యెరుంగను. దయ

యుంచి యెట్లునమస్కరించవలయునో జూపు"డనిన ఋషి "అట్లయిన నీరీతి నమస్కరింపుము" అనిపల్కి కాళికకు మ్రొక్కెను. వెంటనే విక్రమార్కుడు తన కడనున్న చంద్రాయుధముతో జడధారిని ఖండించెను.

అంత దుర్గ ప్రత్యక్షమై "వత్సా! సంతసించితిని. ఈభేతాళుని నీ భృత్యునిగా గైకొనుము. మున్ముందు నీకు సహాయభూతుండు కాగలడు. యీభేతాళుండు మున్ను త్రిచురాపుర దేవాలయమునందు పూజారిగానుండెడివాడు. ఇప్పుడు నీకు భేతాళుండుజెప్పిన కథ లన్నియును భగవంతుండు తనభార్యకు జెప్పగా భేతాళుండా కథలనాలించి తనసతికిజెప్పెను. అందుచే భగవానుం డాగ్రహించి యీతనిని రాక్షసుడగునట్లు శపించెను. మరల గరుణించి నిన్ను రెండువేల వత్సరములు సేవించిన పిదప శాపవిముక్తుడగునని యనెను. ఇదిభేతాళుని పూర్వ వృత్తాంతము. వత్సా విక్రమార్కా! నీ వీ భేతాళుని భృత్యునిగాగొని శాపవిముక్తిని గావింపుము" అని పల్కి దుర్గ అంతర్ధానమొందెను.

పిమ్మట భేతాళుండు విక్రమార్కునికి నమస్కరించి "దేవా! నాకు సెలవిండు! నన్ను తమరెప్పుడుతలచిన నప్పుడువచ్చి మీరు నియమించిన కార్యములను సాధించెదను" అనిపల్కిన విక్రమార్కుండాతనికి పోవనుజ్ఞ నొసంగి తాను అంతఃపురంబుజేర నరిగెను.

# విక్రమార్కుని నిర్యాణము

## — శాలివాహనుని చరిత్రము —

కావేరీనదిసమీపమున భల్లానపురియను పట్టణముకలదు. అందు రామావధానియను భూసురోత్తముఁడు కలడు. అతఁడు సకలశాస్త్ర పారంగతుఁడు. అతఁడు వివాహమొనర్చుకొనిన కన్య ఋతుమతియైన నక్షత్రలగ్నముఁజూడ నందు పండ్రెండువత్సరముల వెనుక మేషమాసమున మూఁడవవారమున మొదటిదినమున రాత్రిపండ్రెండు గడియలు రోహిణీనక్షత్రమున దా నే పడుచుతో గలిసినను బిడ్డపుట్టుననియు, ఆబిడ్డ జగద్విఖ్యాతచరిత్రుఁ డగుననియు దెలిసికొని ఆదినమేగుదెంచు వరకు భార్యతో జేరకూడదని మనఁబున నిశ్చయించుకొని కాశికి బయనమై వెడలెను.

రామావధాని కాశీయాత్రముగించుకొని లగ్నరాత్రికి దన యూరుజేర నిశ్చయించుకొని బయలుదేరి లగ్నదిన సాయంసమయము నకు గావేరీనది సమీపించి ప్రవాహమధికముగానుండుటచే నదినిదాట వీలులేక వెనుకకుమరలి సమీపముననున్న ప్రతిష్ఠానపురంబుజేరి అందు గల యొక కుమ్మరి గృహసమీపమున గూర్చుండి చింతించుచుండెను.

అంత నాగృహయజమానియైన కుమ్మరీడు తన పదమూఁడు మాసముల కుమార్తెను వెంటనిడికొని గృహమునుండి వెలుపలికరు దెంచుచు నవధానినిగాంచి "అయ్యా! మీయూరెయ్యది? మీరెవ్వరు? మిమ్ములనుజూడ విచారమనస్కులై యున్నటుల గాన్పించుచున్నారు. మీవృత్తాంతమును సవిస్తరముగా దెల్పవేడెదను" అని పల్కిన భూసురోత్తముడు తనవృత్తాంతమంతయు నాకుమ్మరికిదెల్పి, యాతని

కుమార్తె సౌందర్యమును గాంచి ముగ్ధుడై మోహపరవశుడై యాము
హూర్తమున కాబాలికను గలియ నిశ్చయించుకొని తన యుద్దేశమునా
కుమ్మరి కెరింగించెను. అంత నాకుమ్మరియు వల్లెయని యంగీకరించి
యప్పటికాలగ్నము సమీపించినందున తన కుమార్తెను శృంగారించి
భూసురోత్తముని గలియ బంపెను.

కొన్ని నెలలు గడచినపిమ్మట కుమ్మరి బాలిక ప్రసవించి యొక
మగ శిశువునిగనెను. ఆశిశువునకు శాలివాహనుడని నామంబిడిరి.

అంత నుజ్జయినీ పురంబున కొన్ని యుత్పాదములు దోచదొడం
గెను. విక్రమార్కుడు అయ్యదిగాంచి తన పరిపాలనా కాలము ముగి
సెననియుదన యవసానకాలముసమీపించెననియు దెలిసికొని భేతాళునిమ
దినిదలంచగా నాతడు ప్రత్యక్షమై సన్నిధినినిలిచెను. విక్రమార్కుడాత
నితో నిట్లులనియెను. "ఓయీ! కాళికాదేవి నాకనుగ్రహించిన రాజ్య
పరిపాలనా కాలము వేయేండ్లును భట్టియుక్తివలన లభించిన వేయేండ్లును
ముగిసినవి. నాయవసానము సమీపించెను. నాకు పదమూడు మాస
ములు కుమ్మరిబాలిక కుద్భవించిన బాలకునిచే మరణము కలదని
దేవిచెప్పినది. అట్టిబాలకుడు యేపురమం దుద్భవించెనో కనుగొనవల
యును. అందులకు తగినవాడవు నీవే! కావున అట్టిబాలకుడెచ్చట
నుద్భవించెనో జూచిరమ్ము" అని భేతాళుని బంపెను.

భేతాళుడు పెక్కు దేశములు గాలించి చివరకు బ్రతిష్ఠాన పుర
మున, మట్టితో జతురంగబలంబులు జేసి వినోదంబుగా నాటలాడు
చుండిన శాలివాహనుని నాసమీపముననేగల యాతని తల్లిని గాంచి
కొంచెము సందేహించి తన సందేహము నివృత్తి జేసికొనదలచి
"ఈబాలుడెవ్వ"డని యాబాలికను ప్రశ్నింప తనసుతుడే నని
ప్రత్యుత్తర మొసంగెను. అంత భేతాళు డాబాలిక జనకుని యొద్ద

కరిగి శాలివాహనుని జన్మవృత్తాంతము దెలిసికొని తిరిగి యుజ్జయినీ కరిగెను.

విక్రమార్కుఁడు భేతాళుడెఱింగించిన యాబాలకుని వృత్తాంతమంతయు నాలించి సైన్యములను వెంటనిడికొని ప్రతిష్ఠాన పురంబున గల శాలివాహనునిపై దండెత్తెను. విక్రమార్క శాలివాహనులు ఘోరముగా బోరాడిరి. విక్రమార్కునకు శాలివాహనుని జయించ దుర్ఘటముగాదోఁచి మున్ను చతురాననుఁడు తనకిచ్చిన బ్రహ్మాస్త్రమును శాలివాహనుని పై విసరెను. అంతనాయస్త్రమాబాలకుని ప్రభావమున మరలి విక్రమార్కునికే తగిలి అతని శిరము ఖండించెను.

## విక్రమార్కుని గద్దె భూస్థాపిత మొనరించుట.

విక్రమార్కుని అనంతరము అతనికుమారునకు యుక్తవయస్సరుదెంచువరకు మంత్రులు రాజ్యంబు బరిపాలించి యుక్తవయస్కుఁడగు నబ్బాలకునికి బట్టాభిషేక మొనరించి విక్రమార్కుని గద్దె నెక్కింప దలచిరి. అంత నాకాశవాణి యిట్లు పలికెను. “ఓయమాత్యులారా! సకలసుగుణ విరాజితుండైన విక్రమార్కుఁడుదక్క తదన్యు లీ సింహాసన మధిష్ఠింప నర్హులుగారు. కావున నీగద్దె నొక్క సుక్షేత్రమున నిక్షేపింపుఁడు”

ఆపల్కులాలించి యమాత్యులు విక్రమార్కుని కుమారుని వేరొక సింహాసనముపై గూర్చుండజేసి, గగనవాణి పల్కినరీతిగా నా సింహాసనము నొకసుక్షేత్రమున నిక్షేపించి యాభూమి ననుభవింపుమని యొకవిప్రున కొసంగిరి.

# భోజరాజోపాఖ్యానము.

## విక్రమార్కుని గద్దె భోజునకు లభించుట.

ధారా నగరంబు బరిపాలించుచున్న భోజభూపాలుఁ డొకనాడు పరివారంబును వెంటనిడికొని వేటకై బోవుచుండెను. ఆమార్గమునందు నొకబ్రాహ్మణుఁడు తనజొన్నచేనికి గావలిగాయుచు మంచెపై నెక్కి కూర్చుండియుండెను. రాజు తనపరివారంబుతోడ నచ్చుట నావిప్రుడు గాంచి "అయ్యలారా! రారండు. ఈజొన్నచేను నమీపమునుండి పోవుచు గొన్నికంకులనైన దినదలంపరేమి! దినరండు" అని బ్రీతి మాఱు దొడంగెను. పరివారము నాఁకలి దీర్చుకొనదలచి జొన్నచేనుం బ్రవేశించి జొన్నకంకులను దినఁజొచ్చిరి. ఆవిప్రుఁడు యేదియోపనిపై మంచెడిగ్గి, తనచేనునందు గంకులనుదినుచున్న భోజపరివారంబును గాంచి "ఓ పాపభూయిష్ఠులారా! నాచేను నాశనంబుచేయవచ్చితిరా? భోజనగరంబునందే యింతయన్యాయమా?" అని బ్రాహ్మణుఁ డఱవ దొడంగెను ఆపల్కులాలించినతోడనే భోజుఁడు పరివారసహితంబుగా జేనువిడచి బాటంబడిరి. అంత నాబ్రాహ్మణుఁడు మరల మంచెపై నెక్కి తొల్లిటియటుల బల్కజొచ్చెను.

అయ్యదిగాంచి భోజుఁడు బ్రాహ్మణుఁడు మంచెపై నెక్కి బల్కిన వితరణంపుబల్కుల కాభూమియే కారణమైయుండునని తలచి యావిప్రుని దనసన్నిధికిబిలిచి "ఓయీ! యీభూమికెంతధనము గావలయునో అంతధనమిచ్చెదను, విక్రయించెదవా?" యనిన నావిప్రుడును వల్లెయని నాక్షేత్రమును భోజభూపాలునకు విక్రయించి క్రయధనంబును గొని యత్యధికానందముతో గృహంబునకేగెను.

పిమ్మట భోజభూపాలుఁడు మంచెగల స్థలంబును బరిశోధింప

దలంచి త్రివ్వించెను. అచట నవరత్నఖచితమై, తేజోమయంబై ద్వాత్రింశతిసాలభంజికలుగల సింహాసనము గాన్పించెను. ఆసింహాసనమచటి నుండి ధారానగరంబునకుఁ గొనిపోయి శృంగారమంటపంబున నాసింహాసనంబును నిలిపి అభిషేకంబుగావించి యొకశుభముహూర్తమున భూసురాశీర్వాదంబుల బడసి వందిమాగధులు స్తోత్రముజేయ నాసింహాసన మధిష్ఠింప బ్రథమమెట్టుపై బాదమిడినంతనే ప్రథమసోపానముపైగల ప్రతిమ సజీవమై భోజుని నిలునిలుమని వారించి యిట్లుచెప్పదొడంగెను. "ఓరాజేంద్రా! యీసింహాసన మధిష్ఠించువాడు వితరణశాలియై సకలసద్గుణసంపన్నుఁడై యుండవలయును. అట్టివాడు యీసింహాసన మధిష్ఠింపనర్హుడు. తదితరులు యీసింహాసన మధిష్ఠింప ననర్హులు. ఈ పఱగొక్క మనుష్యుడు మాత్రమిద్దానినధిష్ఠించెను, అతడే విక్రమార్కుడు" అనిపల్కిన భోజభూపాలుఁడు "సాలభంజికా! వితరణశీలుఁడై యీసింహాసన మధిష్ఠించిన విక్రమార్కునిగూర్చి తెల్పుమనిన యాప్రతిమ యిట్లుచెప్పెను.

# ఒకటవప్రతిమ చెప్పినకథ

ఓ భూపాగ్రణీ! నేజెప్పునది ఆలింపుము. విక్రమార్కుడు శిభి, కర్ణ, దధీచుల మించువాడు. అతనిబోలు భూపాలుం డుండబోడు. దర్శనార్థమై యరుదెంచినవారికిన్నైదు వేలును, స్తోత్ర మొనర్చినవారికి బది వేలును బాండిత్యమున మెప్పించినవారికి లక్షవరహాలు నొసంగువాడు.

ఒక్కనాడొక్కడు విక్రమార్కుని కడ కరుదెంచెను. అంత

భూపాలుఁడాతని గాంచి, "ఓయీ! నీవెవ్వరవు? నీకు విద్యలయందు ప్రవేశముకలదా?" యని ప్రశ్నింప నాతఁడు, "భూపాలా! నాకు చతురంగమందును, అశ్వశాస్త్రమందును, యుద్ధనీతియందును, గజశాస్త్రమందును, బ్రహ్మజ్ఞానమందును సాహిత్యమందును సమానప్రతిభ కలదు. వలయునేని పరీక్షింపుడు" అని పల్కిన విక్రమార్కుఁడచ్చెరువంది విద్యలయందాతనికి గల పాటవమునకు మదిమెచ్చి యాతనికి లక్షా పదునైదువేల వరహాల నొసంగెను. (తన్ను దర్శించినందులకు నైదువేలును, నుతించినందులకు బదివేలును, విద్యల బరీక్షించినందులకు లక్ష—మొత్తము లక్షాపదునైదువేల వరహాలు) ఓ రాజా! వింటివికదా విక్రమార్కుని వితరణ గుణంబులు. నీకడనిట్టి గుణములు కలవేని యీ సింహాసన మధిష్ఠింప యత్నింపుము. లేనిచో నూరకుండుము." అని సాలభంజిక తెల్ప భోజరాజును నాతని యమాత్యులును నచ్చెరువందిరి. నాటి శుభముహూర్త మతిక్రమించినందున మరియొక దినంబున సింహాసన మధిష్ఠింప దలచి నాటికి వెడలిపోయిరి.

## (రెండవ ప్రతిమ చెప్పిన కథ.)

భోజభూపాలుఁడు మరల మరుచటి దినమున శుభముహూర్తము నిర్ణయించి సింహాసన మధిష్ఠింప రా రెండవ మెట్టుపైగల ప్రతిమ సజీవమై యతనిని వారించి యిట్టులనియెను. "ఓభోజభూపతీ! విక్ర

మార్కునకు గల వితరణ గుణములనుగూర్చి తెల్పెద నాకర్ణింపుమన తేజా ప్రతిమతో నిట్లులనియెను, "ఓసాలభంజికా! ఆతని గుణంబులు దెల్పి నావీనులకు విందొనగూర్చుము," అంత నాప్రతిమ యీక్రింది కథ జెప్పెను.

విక్రమార్కుండొక్కనాడు కొలువు కూటంబున నుండగా నొక విప్రుడరుదెంచి భూపాలునకు నమస్కరించి యిట్లులనియెను. 'విక్రమార్క మహీపాలా! నామనంబున నొక కోరిక కలదు. అదెట్టిదనిన నాకు రాజ్యపాలన యందాసక్తి గలదు. నాకోరిక సిద్ధించుటకై కాళికా దేవిని ప్రార్థించి ఘోరతపం బాచరించితిని. అంత నొక్కనాడు దేవి నాకు సాక్షాత్కరించి, ఓయీ! నీకోర్కె దీర్చుకొనదలచితివేని విక్రమార్క భూపాలునికడ కరుగుము" అని చెప్పి యంతర్థానమొందెను. నాకోరిక నెరవేర్చుకొనుటకై మిమ్ములను దర్శించితిని. మీరనుగ్రహింపవలయు"నని పెక్కురీతుల వేడుకొనెను.

విక్రమార్కుడా పేదవాని కోర్కె దీర్పదలచి తన నగర సమీపంబుననే నొక పట్టణంబు నిర్మించి యద్దానికావిప్రుని నభిషిక్తుని గావించి శత్రుభయంబు లేకుండా చతురంగబలంబు నొసంగి యొక కన్యాలలామను వివాహంబు గావించెను.

'ఓ భోజభూపతీ! యిట్టిగుణములు నీకడ గలవేని యీసింహాసన మధిష్ఠింపుము. లేదేని వెనుకకుబొమ్ము' అనిపల్కిన భోజభూపాలుడు శుభముహూర్త మతిక్రమించినందున నాటికి నంతఃపురంబునకు బోయెను.

# (మూడవ ప్రతిమ చెప్పిన కథ)

భోజభూపతి మరల నొక శుభముహూర్తమున సకలవైభవంబు తోడ సింహాసన మధిష్ఠింపరాగా మూడవమెట్టుననున్న సాలభంజిక యాతని వారింప భోజుడా ప్రతిమను విక్రమార్కుని గుణంబులను దెల్పు మనిన నా ప్రతిమ యిట్లు చెప్పెను.

విక్రమార్కుడా ఱుమాసములు రాజ్యము బరిపాలించిన వెనుక భూసంచారము సేయవలసిన ఆఱుమాసములలో నొక్కనాడు చిత్రకూటముపై సంచరించుచూ అందుగల మారేడువనంబున నొక్కచో తపంబాచరించుచున్న నొకమునిపుంగవునిగని యిట్లులనియెను "మహాత్మా! తమరు చాలకాలమునుండి తపమాచరించుచున్నట్టుల గన్పించుచున్నారు" అనిన నామునిపుంగవుడు "ఓయీ నేను పెక్కువత్సరములనుండి తపంబాచరించుచుంటిని. నేనొనర్చిన హోమబూడిద మేరుపర్వతమును ధిక్కరించుచున్నది చూడుము నేనుకొండొక కార్యార్థమై తపంబాచరించు చుంటిని గాని దేవి ప్రసన్నురాలు గాకుండెను" అని పలికిన విక్రమార్కుడు, 'మునీంద్రా, నీకొఱకై నేను తపంబాచరించెదనని చెప్పి యాతడు కూడ తపంబాచరించెను. కాని దేవి ప్రసన్నురాలు గాకుండెను. అంత విక్రమార్కుడు దేవికి పూర్ణాహుతిగా దన శిరమును ఖండించబోయెను. అంత దేవి ప్రత్యక్షమై "వత్సా! నీభక్తి నేమెచ్చితిని. నీకువలయు వరంబులు కోరుకొను"మనెను. విక్రమార్కుడు దేవికి నమస్కరించి, "జననీ! యీమునిపుంగవుడు పెక్కు వత్సరముల నుండి తపంబాచరించుచున్ననూ ఏల ప్రసన్నత జెందవైతివో తెలుపవేడెదను" అనిన నాదేవి, "యీతడుస్థిరచిత్తము, మనశ్శుద్ధియు లేక తప

మాచరించుచున్నాడు. అందుచే నాదర్శన మీతనికి దుర్లభమయ్యెను. నీకు వలయు వరంబులా వేడుకొను" మన విక్రమార్కుడు "జగదీశ్వరీ, నీకు నాపై సంపూర్ణానుగ్రహమున్న నీమునిపుంగవుని కోర్కె దీర్పుము" అనిన నాదేవి యట్లేయగునని విక్రమార్కు నాశీర్వదించి యంతర్ధానయయ్యెను. తన కోరిక లీడేరుటచే నామునిపుంగవుడు అమోదానందంబునొంది గృహంబున కేగెను.

"ఓ భోజ రాజా! వింటివా విక్రమాదిత్యుని యౌదార్యము. అట్టి యౌదార్యము నీకడ కలదేని యీసింహాసన మధిష్ఠింపుము. లేదేని వెడలిపొమ్ము" అనిపల్కిన భోజభూపాలుడు శుభముహూర్తము మించినందున నాటికి అంతఃపురము జేరబోయెను.

## (నాలుగవ ప్రతిమ చెప్పిన కథ)

మరునాడు సింహాసన మధిష్ఠింపవచ్చు భోజభూపాలుని వారించి నాలుగవ సోపానమందున్న ప్రతిమ యీక్రిందికథ జెప్పెను.

విక్రమార్కుడు రాజ్యపాలన మొనరించిన కాలమున మానవులు వృద్ధులై సహజముగా మరణించుటకాని యాకస్మికముగా మరణించుటకాని యరుదు. అట్టియాకస్మికచావులు సంభవించినచోనయ్యది యాదేశపాలకుడగు నృపాలుని దుష్టపరిపాలనమే కారణమని ప్రజలు తలంచుచుండిరి.

ఒక్కనాడొక బ్రాహ్మణుడు అశ్రుపూరిత నయనుడై విక్రమార్కుని కడకరుదెంచి యిట్లనియెను. "ఓమహారాజా, నాయేకపుత్రు

నెనిమిదేండ్ల వయసుగలవానిని సముద్రమునందలి యొక్క మొసలి మ్రింగినది. నాయందు దయకలిగి నాకుమారుని నాకనుగ్రహింప ప్రార్థన. లేనిచో నేను ఆత్మహత్య గావించుకొందును.”

ఆబ్రాహ్మణుని దీనాలాపములు విక్రమార్కుని హృదయమును ద్రవీభూతమొనరింప, “భూసురోత్తమా! నీకుమారుని నేనాఱుమాసములలో దీసికొని వచ్చెదను. నీవు నిశ్చింతతో నుండు”మనియాతనిని బంపి, అప్పటికి తాను దేశాటన చేయవలసిన యాఱుమాసముల కాలమానన్నమగుటచే రాజ్యాంగ వ్యవహారములు భట్టికి వప్పజెప్పి తాను భేతాళుని దోడ్కొని విప్రకుమారుని మొసలి మ్రింగిన ప్రదేశమున కేగెను.

పిమ్మట విక్రమార్కుడు సముద్రతీరమున గూర్చుండి దుర్గాదేవినిగూర్చి ధ్యానమొనరించెను. అంతట సాగరజలమునుండి యొక్క మొసలి తీరమున కరుదెంచి విక్రమార్కుని మ్రింగెను. రాజా మొసలి గర్భమునజొచ్చి అందుగల నగరమునుగాంచి యాశ్చర్యానందములకు లోనయ్యెను. విక్రమార్కు డందుగల యొక్క బాటననుసరించి కొంచెము దూర మేగినంతనే అచ్చటగల మైదానమునందు కొందరు బాలురాడుకొనుట గోచరించెను. విక్రమార్కుడు అందొక్క బాలుని జేరబిలిచి కొన్నిప్రశ్నలడిగి యాబాలుడే తాను వెదకు బాలుడని నిశ్చయించుకొని యావిప్ర కుమారుని వెంటనిడికొని మరికొంత దూర మరుగుసరికి జనులు గుంపులుగుంపులుగా యెటకో యేగుచుండిరి. విక్రమార్కుడు అందొక్కని బిలిచి యడుగ “అయ్యా! నేడి భూపాలుని కుమార్తె స్వయంవరము. మేమందరము రాజప్రసాదమున కరుగుచుంటి”మని తెల్ప విక్రమార్కుడు యామహాదవకాశమును బోగొట్టుకొనగూడదని తలచి యావిప్రకుమారుని నొక గృహంబునకు దోడ్కొనివెళ్ళి యాగృహస్థునకు కొంత ధనమొసంగి యాబాలుని మరల తానేగుదెంచువరకు గా

పాడుమని చెప్పి తాను రాజ ప్రాసాదసమీపమున కరుగుదెంచి అచ్చట నిర్జనస్థలమున నిలువఁబడి కాళికను ప్రార్థించెను

అంత నాతడు ధరించిన యుడుపులు దివ్య దుకూలములుగా మారి యాతనియెదుట నొక రత్నకంబళమును నద్దానిపై నమూల్యములును విచిత్రవర్ణ విరాజితములును అగు వజ్రములు, వైఢూర్యములు, కెంపులు, రత్నములు నుండెను. ఇంతలో స్వయంవరమున కేగుచుండిన రాజులందరు దేదీప్యమానముగా వెలుగొందుచూ భానుని బంగరు కిరణముల కాంతిలో ధగద్ధగాయమానముగ ప్రకాశించుచున్న యావజ్రములఁగాంచి పరీక్షించుచూ స్వయంవరమును మరచిరి.

స్వయంవర ముహూర్త మాసన్నమగుటయు నొక్కభూపాలుడును రాకుండుటచే నాదేశాధీశుఁడు విస్మయమొంది ప్రధానునా విషయమై యడుగ నాతడు రాజులందరును వజ్రములు బరీక్షించుచున్నారని తెల్పెను. అంత రాజు స్వయముగా బయలుదేరి రాజసూనులున్న స్థానమునకువచ్చి వారి నాహ్వానించి వారితో గూడ నూహానా వజ్రముల వర్తకునిగూడ నాహ్వానించెను.

స్వయంవర సభావేదికలను భూపాలురెల్లరు నలంకరించిన పిదప లోకోత్తర సౌందర్య ప్రభావిభాసితయగు నా రాకుమారి యరుదెంచి భూపాలురెల్లరను విమోహితులను జేసెను. ఆ రాకుమారి యాటనున్న యారాజుల నేరిని వరించక వజ్రముల వర్తకుని నటనున్న విక్రమార్కునిగాంచి తన కరములందలి పూలహారమును విక్రమార్కుని కంఠసీమ నలంకరించెను. పిమ్మట విక్రమార్కుడు తాను వజ్రముల వర్తకుడను గానసియు విక్రమార్క మహీపాలుడనని తెలియజేసెను.

తదుపరి విక్రమార్కుడు తాను దేశాటన జేయవలసిన యారు మాసములు గడచినంతనే నూతన సతీమణిని విప్రకుమారునిదోడ్కొని నిజపురంబున కరిగెను.

"ఓ భోజమహారాజా! వింటివా విక్రమార్కునికథ! అతనికిగల సద్గుణములు నీకడగలవేని నీవీ సింహాసన మధిష్ఠింపుము. లేనిచో నీవి యత్నమును విరమింపుము" అనిపల్కిన భోజుడు నాటి కంతఃపురంబు జేరఁబోయెను.

# (అయిదవ ప్రతిమ చెప్పిన కథ)

మఱల భోజుఁ డొక్క శుభదినమున సింహాసన మధిష్ఠించుటకు రాగా అయిదవ సోపానమందున్న ప్రతిమ యాతనిని వారించి యిట్లుపలికెను "ఓ భోజభూపతీ! విక్రమార్కునకున్న సుగుణంబులు నీకడలేవు. విన దలతువేని యాతని గుణంబులు వివరించెద"నన్న భోజుడు" సాలభంజికా! విక్రమార్కుని సుగుణంబులు దెల్పి నన్ను చరితార్థుని జేయుమన నాప్రతిమ యీక్రిందికథ జెప్పెను.

విక్రమార్కుఁడొకనాడు ఆస్థానమున సకల సామంత సేనా నాయక పరిభృతుల సమక్షమున గొలువుదీర్చియుండగా నొక్క చారుడువచ్చి యిట్లు విన్నవించెను.

"మహీపాలా! తమయాజ్ఞ ననుసరించి యనేకదేశముల ద్రిమ్మరితిని. ఎల్లెడల తమ దివ్యనామమే ప్రతిధ్వనించుచున్నది. విశేషము లంతగాలేవు. కాశీనగరమున మాత్రము తమదృష్టి నాకర్షించు నొక చిత్రమును గాంచితిని.

కాశీనగరమున దానశీలుడను వైశ్యుడుగలడు. అతడెంతయో ధనమును వెచ్చించి గొప్ప చెరువును త్రవ్వించెను. కాని యందు జలముద్భవింప దయ్యెను. దానశీలుడు పాపాత్ముడగుటచే నందు జలమావిర్భవించలేదని ప్రజలెల్లరు చెప్పుకొనుచుండుట నాలించి పాపమా వైశ్యుడు విచారవారాశి నిమగ్న మానసుడై యాత్మహత్యగావించుకొన బ్రయత్నించగా గగనవాణి యిట్లుపలికెను.

"ఓయీ! దానశీలా! ఆ చెరువున జలముద్భవింపవలయునన్న నొక్క దుర్గుణమైన లేని మనుజుడు తనశిరమును బలిగా నీయవలయును."

అంత నావైశ్యుడు అట్టి మనుజుడెవడైనా స్వార్థత్యాగము జేసినచో కొన్నిలక్షల రూప్యముల నొసంగెదనని చాటించెను, గాని ఎవ్వరు నందులకు రాకైరి. అది తెల్పి చారుడు నిష్క్రమించెను.

విక్రమార్కుడీ వృత్తాంతమాలించి భేతాళునితో గాశీనగరమునకు బయనమై యేగెను. అతడు దానశీలుడు త్రివ్వించిన చెరువునుగాంచి దాని నిర్మాణవిధానమును మెచ్చుకొని యట్టి సుకృతము ఫలవిహీనమై పోకుండా జూచుట తనవిధియని తలచి, తనశిరంబును బలిగా సమర్పింప మనంబున నిశ్చయించుకొని, జీవితము బుద్బుదమని యశాశ్వతమనియు, సుందరమైన పుష్పము ప్రభాతమున వికసించి సాయంసమయమున వాడిపోవునటులే మనుజుడు పుట్టుట గిట్టుటకొరకేయని మదిదలచి యా చెరువునదిగి తన కరవాలముతో శిరమును ఖండించుకొనెను. విక్రమార్కుని పవిత్ర రుధిరంబును గ్రోలిన యాదేవతా మహిమ వలన తక్షణమే యాకొలను వినిర్మల జలముతో నిండిపోయెను.

పిమ్మట విక్రమార్కుడు కాళికాదేవి మహాత్మ్యమువలన పునర్జీవితుడై యాకొలను నీరముతో నిండియుండుటగాంచి యానందించి భేతాళునితో నుజ్జయినీ కేగెను.

కొలనాకస్మికముగా నీరముతో నిండియుండుటయాపురమునేలు

భూపాలుడుగాంచి యాశ్చర్యచకితుడై యద్దానికి గారణభూతు లెవరా యని యోజించుచుండ నశరీరవాణి నిజం బెఱింగించెను. అంత నాభూపాలుడు తనకడగల యమూల్యములగు వజ్రములను తన చారులచే విక్రమార్కునకు పంపెను.

విక్రమార్కుడా వజ్రములను వాటిని గొనితెచ్చిన వారికిచ్చి పలురీతుల సత్కరించి పంపెను.

"ఓభోజభూపతీ! యీకథవలన విక్రమార్కుని సహనమును యౌదార్యమును స్పష్టమగుచున్నదికదా! నీయందిట్టి గుణములు లేవు. అట్టిగుణము లున్నవారలు గాని తదన్యులీ సింహాసన మధిష్ఠింపనర్హులు గారు. కావున వెడలిపొమ్ము" న భోజుడు విక్రమార్కుని వితరణ గుణంబునకు మదిమెచ్చుకొనుచూ నాటికి యంతఃపురంబు జేరజనెను.

---

# ఆఱవ ప్రతిమ చెప్పినకథ

మరల భోజుడు శుభముహూర్తమున సింహాసన మధిష్ఠించుటకు రాగా ఆఱవసోపానమునగల ప్రతిమ యాతని వారించి యీక్రిందికథ జెప్పెను.

విక్రమార్కుడు షణ్మాసములు రాజ్యము పాలించినవెనుక దేశాటనకు బయలుదేరబోవు సమయమున నాతని చారులలోనొకడతని కడకరుదెంచి యిట్లుపల్కెను.

"దేవా! నేను దేశములన్నియు దిమ్మరి మరల యుజ్జయినీ కరుదెంచుచుండ మార్గమున నొక్క భైరవాలయమునుగాంచి లోని

కనుగుచుండ నొక్కచో నొక్క శాసనమును గాంచితిని. అందిట్లు లిఖింపబడి యుండెను. "ఎవ్వడేని యీ భైరవుని సమీపమున దన శిరంబు దానె ఖండించుకొనిన యీ దేవాలయము వెనుకనున్న రెండు మొండెములు శిరములు గలిసికొనును" అనిచెప్పి చారుడు నిష్క్రమించెను.

విక్రమార్కుడా వింతజూడవలయునను తలంపున భేతాళుని దోడ్కొని యా భైరవాలయమునకరిగి యందుగల శాసనము జదువుకొని భైరవుని ప్రార్థించి తన కంఠమును దెగవేసికొనకత్తి నెత్తెను. అంత భైరవుండు సాక్షాత్కరించి "ఓవిక్రమార్క సాహసాంక మహీపాలా! నీసాహసమున కేనెంతయో సంతోషించితిని, నీకువలయు వరంబు కోరుకొనుము." అనిపల్కిన విక్రమార్కుడు "దేవా! దేవాలయము వెనుక మృతులైన వారిరువురు సజీవులగునట్లు వరము ప్రసాదింపుము." అని వేడుకొనెను. విక్రమార్కుని సాహసమునకు పరోపకార పారీణతకు భైరవుండు మెచ్చుకొని "ఓయీ! అట్లేయగుగాక" యనినంతనే వారిరువురు సజీవులైరి.

విక్రమార్కుడు అమందానంద భరితుండై భైరవునికి నమస్కరించి "దేవా! వీరి వృత్తాంతమంతయు సవిస్తరముగా దెల్పవేడెద"నవిన భైరవుడు యీ క్రిందికథ జెప్పెను.

ఈతడు ధర్మదత్తుడను వైశ్యకుమారుడు. వ్యాపారమునిమిత్తమై యరుగుచు నొక్కనాడీ యాలయప్రాంతము విడిసియుండెను. ఆదినముననే ధనదత్తుడను వైశ్యకుమారుడుగూడ యిచ్చటనే విడిసెను. అంత వారిరువురకూ మైత్రిగలిగెను. వారిరువురూ నొక్కచో గూర్చుండి వివిధవిషయములు ముచ్చటించుకొనుచూ యీ క్రింది విధముగా సంభాషించుకొనిరి.

ధర్మ;—అయ్యా! మీరే దేశపువారలు? ఎచ్చటకేగుచుంటిరి?

ధన;—నేను మణిపురమను గ్రామమున నివసించుచుంటిని. స్వర్ణపురమునకేగుచుంటిని.

ధర్మ:—ఏకార్యముపై జనుచుంటిరో యడుగవచ్చునా?

ధన:—స్వర్ణపురమున శీలవతియను వైశ్యకుమారిగలదు. ఆమెను పెండ్లియాడగోరి పోవుచుంటిని.

ధర్మ:—(తనలో) శీలవతి సకల సుగుణ విరాజితయనియు యసమాన సౌందర్యవతియనియు పలువురచే వినియుంటిని. యెట్లయిననూ నేనామెను పరిణయ మాడవలయును. అందులకు యీతని నెట్లయిననూ వెనుకకు బంపవలయును.—అయ్యా! తమరూరక శ్రమనొందకుడు. ఆకన్యారత్నము నాకు పెండ్లిగావించుటకు నా మేనత్తండ్రి వాగ్దాన మొసంగెను. నేనునూ స్వర్ణపురమునకే పోవుచుంటిని.

ధనదత్తుడు యి దేదియో మోసమున్నదని తలచి నాటిరేయినే ధర్మదత్తుడెరుగకుండా స్వర్ణపురికి బయనమయ్యెను. ధర్మదత్తుడును ఆరేయినే స్వర్ణపురికేగుచు ముందున్న దర్శించి శీలవతి తనకు లభించినచో తన శిరము కానుకగా నొసంగుదునని మొక్కుకొనెను.

ధనదత్తుడును ధర్మదత్తుడును ఒకేకాలంబున స్వర్ణపురంబు జేరుకొని శీలవతి తండ్రిని గలిసికొనిరి. శీలవతి వారిరువురినిగాంచి అందు ధర్మదత్తుడు సుందరుడై యుండుటగని మోహించి వరించెను.

ధర్మదత్తుడు శీలవతిని బరిణయంబాడి కొన్ని దినంబు లత్తవారింట సుఖంబుగానుండి పిమ్మట తనభార్యను దోడ్కొని నిజపురంబునకు బయనమయ్యెను.

ధర్మదత్తుడు భార్యను దోడ్కొని యిచ్చోటకరుదెంచి మరల విడిసెను. ఒక్కనాటిరేయి శీలవతి నిద్రించుచుండ ధర్మదత్తుడు మున్ను నాడు మొక్కిన ప్రకారము తనశిరంబు ఖండించుకొనెను. పిమ్మట శీలవతి మేల్కాంచి ధర్మ శిరము ఖండింపబడియుండుటగాంచి దుఃఖించి “సతికి పతితోడిదేగదా బ్రతుకు. నేనును నావిభుననుసరించెదను” అనిమనం

బున వితర్కించుకొని కరవాలంబుగైకొని కంఠ ముత్తరించుకొనెను, ఆదంపతుల దిరుగ బ్రతికింప దలంపున యీశాసనమును నేనే వ్రాసి యుంచితిని. నేటికి నీవలన సజీవులైరి. అని భైరవుడు వారి వృత్తాంత మంతయుదెల్పి యంతర్ధాన మొందెను. విక్రమార్కుడు భైరవాలయము విడిచి చనెను.

„ఓభోజభూపాలా! ఇట్టి సహసము నీకడగలదేని యీసింహాసన మధిష్ఠింపుము. లేనిచో వెడలిపొమ్ము” అని సాలభంజికపల్కిన భోజుడు నాటికి అంతఃపురంబు జేరబోయెను.

# ఏడవ ప్రతిమ చెప్పిన కథ

భోజభూపాలుండు మరల నొకశుభముహూర్తమున సింహాసన మధిష్ఠింపబోవ యేడవసోపానమునగల సాలభంజిక యాతనినివారించి “ఓరాజా! విక్రమార్కునకుగల సాహసౌదార్యాదిగుణంబులు నీకడ గలవేని యీసింహాసన మధిష్ఠింపుము, లేనిచో వెడలిపొమ్ము”అన,భోజ భూపతి “ఓసాలభంజికా! విక్రమార్కుని గుణంబులు కథనముసేసి నా వీనుల విందొనగూర్పుము” అని పల్కిన సాలభంజిక యీక్రిందికథ జెప్పెను.

విక్రమార్కమహీపతి యొక్కనాడు కొలువుదీర్చియుండగా నొక్కరత్నవర్తకు డరుదెంచెను. అంత భూపాలుం డాతనికడగల రత్న ములన్నియు పరీక్షించి “ఓయీ! యీరత్నములకంటె నుత్తమోత్తమ మైనవి నీకడనున్నవా?” యన నాతడు, „దేవా! అట్టివి యింటివద్ద

నున్నవి. వాటిమూల్య మత్యధికము. ఒక్కొక్కటి లక్షవరహాలు విలువజేయును. నావెంట నెవ్వరినైన బంపినచో నారత్నములు బంపెద"ననెను. భూపతి అందుకు సమ్మతించి వాటిమూల్యము ముందుగనే యానవర్తకుని కొసంగి, తనసేనానింబిలిచి "ఓయీ! యీవర్తకుని తోడనీవేగి యాతడిచ్చు రత్నములను గొనిరమ్ము. అతనిగ్రామమిచ్చోటికి యిరువది యోజనములుగలదు. కావున నీవు నాలుగుదినములలో తిరిగిరావలయును. అయిదవనాటి సూర్యోదయమునకు రానిచో నిన్ను శిక్షించితీరెదను"అనిపల్కి యానవర్తకునితో సేనానిం బంపెను.

సేనాని యానవర్తకుని గ్రామమునకేగి యాతడొసంగిన రత్నములను గైకొని తిరిగి నిజపురికి ప్రయాణమై వచ్చుచుండగా మార్గమధ్యమున వర్షము కురియజొచ్చెను. అతడు వర్షబాధను యిసుమంతయు లక్ష్యముసేయక ప్రయాణము సాగించుచూ నాలుగవదినము సాయంసమయమునకు యొక్క గ్రామము జేరుకొనియెను. అతడా రాత్రి యంతయూ ప్రయాణము సాగించినగాని విక్రమార్కుని కడకు గడువు లోపలరాలేడు. అతడు వర్షములో తడియుచూ చలిబాధను సరకుసేయక అతిధైర్యముతో ప్రయాణము సాగించుచుండెను.

మార్గమధ్యమున నొక్క యేరు అకాలవర్షముచే పొంగి దాటుటకు వలనుగానంత వేగముతో ప్రవహించుచుండెను. అచ్చట నేరు దాటుటకువలయు దెప్పలేవియులేవు, సేనాని సకాలములో రాజుసన్నిధికి జేరుదునోలేదో యని మదిగుందుచూ ఆనాయేరు యీదిదాటుటకు ప్రయత్నించి విఫలమనోరథుడై సమీపమందున్న పల్లెగూడెములోనికేగి అందున్న యజమానిని గలిసికొని తన్నాయేరు దాటించుమని చెప్పిన నానావికుడు, "అయ్యా! వర్షముచే యేరు పొంగిప్రవహించుచున్నది. మనము దాటుటకు ప్రయత్నించితిమేని యపాయమునకు లోనగుదుము. కావున యీరాత్రి గుడిసెయందు విశ్రమింపుడు. ఉద

నును మిమ్మావలియొడ్డునకు జేర్చెదను.'' అని పల్కిన, సేనాని, ''ఓయీ! రేపు సూర్యోదయమునకు పూర్వమే నేను విక్రమార్కుని సన్నిధికరిగి యీపదిరత్నము లీయవలయును. ఇది భూపాలుని యాజ్ఞ. అగడువుదాటినచో తేమ నన్నుశిక్షించును. అంతియే కాక భూపాలుని యాజ్ఞ ఉల్లంఘించిన వాడనగుదును. కావున నీవుకోరిన ధనంబిచ్చెదను. ఎట్లైనను యిప్పుడు నన్నీ యేరు దాటించవలయు''నని పెక్కువిధముల బ్రతిమాలసాగెను. అంత నా నావికుడు ''అయ్యా! మీరింతగా బ్రతిమాలుచున్నారు కావున నేనీ యపాయకరమైనపని కొడంబడుచుంటిని. కాని మిమ్ములను యేరు దాటించినందులకు ప్రతిఫలముగా మీరు గొనిపోవుచున్న రత్నములలో నాల్గింటిని నాకీయవలయును. అందులకు సమ్మతించితిరేని యిపుడే మిమ్మేరుదాటించెద''ననెను. సేనాని సంకోచింపక సమ్మతించి అతనికడగల రత్నములలో నాల్గింటిని నాపల్లెవానికొసంగి యేరుదాటి సూర్యోదయమునకు పూర్వమే విక్రమార్కుని సన్నిధికరిగి తాను తెచ్చిన రత్నముల నొసంగెను. విక్రమార్కుడాతనిగాంచి ''ఓయీ! యిందు నాల్గురత్నములు తక్కువగానున్నవి, వాటి నేమిజేసితి''వనిన, సేనాని, ''దేవా! మార్గమధ్యమున నొక్క యేరడ్డుతగిలెను. దానిని దాటుటకు శక్యముగానంతటి వేగమున నీరు ప్రవహించుచుండెను. అద్దానిని దాటింపుమని యొక్క నావికుని వేడగ నాతడు నాకడనున్న రత్నములలో నాల్గింటి నొసంగినచో దాటింతుననెను. తడసినచో నియమితకాలమునకు తమ సన్నిధి జేరుట దుర్ఘటము. తమకాజ్ఞాభంగముగలుగును. భూపాలురకు నాజ్ఞాభంగము కత్తిలేకుండా చంపుటవంటిదిగదా! అందుచే నాల్గురత్నములను పల్లెవానికొసంగి యేరుదాటి నియమితకాలములో మిమ్ములను జేరగలిగితిని.'' అనిచెప్పెను. విక్రమార్కుడా పల్కులాలించి యాతనిని గౌరవించి మగిలిన రత్నములను ఆతనికొసంగి బహూకరించెను.

"ఓ భోజభూపతీ! అట్టిగుణములు నీకడ గలవేని యీసింహాసన మధిష్ఠింపుము. లేదేని వెడలిపొమ్ము" అనిన భోజుఁడు నాటికి అంతఃపురము జేరబోయెను.

## (ఎనిమిదవ ప్రతిమ చెప్పిన కథ)

మరునాఁడు శుభ ముహూర్తమున భోజభూపాలుఁడు సింహాసన మధిష్ఠింపరాఁగ యెనిమిదవ సోపానమునందుగల సాలభంజిక యాతనిని వారించి యీక్రిందికథ జెప్పెను.

ఒక్కనాఁడు విక్రమార్కుఁడు తనమనంబున యిట్లు వితర్కించుకొనెను. ఈసంసారము అశాశ్వతము. ఎవ్వనికేవేళ కేమగునో యెరికిని దెలియదు. కావున కూడబెట్టినధనమును సత్పాత్రమందుంచుటయే మంచిది. అని వితర్కించుకొని తనధనమును దక్షిణగా నీయవలసినట్టి యజ్ఞము నొకదానిని సేయ సమకట్టి, మంత్రియగు భట్టిని బిలిచి యిట్లనియెను. "ఓయీ! నేనొకయజ్ఞమును సేయ సమకట్టితిని. కావున నీవు సకలమయిన యజ్ఞసంభారములను సేకరింపుము. నేర్పరులైన శిల్పులను రావించి యజ్ఞశాలను నిర్మింపజేయుము" అనిపల్కిన భట్టి యాపలుకాలించి వల్లెయని వెడలిపోయి కార్యాచరణమునకు గడంగెను.

అచిరకాలములోనె సకలమయినయజ్ఞసంభారములను సేకరించి దేవముని యక్షగంధర్వ సిద్ధ ప్రముఖులకు ఆహ్వానములను బంపెను. విక్రమార్కుఁడు సముద్రుని బిలువుమని తన పురోహితుని పుత్తెంచెను.

పురోహితుఁడు సముద్రముదరికేగి పుష్పలు అక్షతలు మున్నగు ద్రవ్యములతో పూజించి, ఓరత్నాకరుడా! విక్రమార్క మహీపాలుడు యజ్ఞముసేయనున్నాడు అందులకై మిమ్ములను బిలువ నన్ను పంపెను.” అని ఆహ్వానముగావింప సముద్రుడు ప్రత్యక్షమై విక్రమార్కుని యాహ్వానమునకు సంతసించి యావిప్రునితో యిట్లులనియెను. భూసురోత్తమా! నేను మేరతప్పరాదు. కనుక రావీలులేదు కాని నేను తగినట్లు ఉపకరించెదను. నాయొద్దగల యమూల్యములగు రత్నములనాల్గింటి నొసంగెదను. వాని నాతనికిమ్ము. ఈరత్నము కోరిన ధనాదివస్తువుల నెల్లనిచ్చును. ఈరెండవది షడ్రసోపేతములగు తినుబడి పదార్థముల నొసంగును. మూడవది చతురంగ బలములనుగూర్చును. నాల్గవది వస్త్రాభరణముల నొసంగును.” అని యారత్నముల ప్రభావమును వెల్లడించి వాటినొసంగి సముద్రుడు అంతర్థానమొందెను.

పిమ్మట నావిప్రుడు విక్రమార్కుని సన్నిధికరుదెంచి సముద్రుడర్పించినట్లుగా యారత్నములను విక్రమార్కునకొసంగి వాటి ప్రభావమును తెలియజేసెను. విక్రమార్కుడా పురోహితుడొసంగిన రత్నములనుగైకొని సంతసించి “విప్రోత్తమా! యీరత్నములలో నీకువలయు రత్నంబొక్కటి తీసికొను”మనెను. బ్రాహ్మణుడందు నెద్దానిని తీసికొనిన తనవారలు సంతసింతురో తెలిసికొనగోరి మహారాజుంగని, ‘దేవా! యింటివద్దనున్న మావారలకడకేగి వారలెట్టి రత్నమును గావలయునని కోరుకొందురో తెలిసికొని వచ్చెదననిన విక్రమార్కుఁడు వల్లెయని యంగీకరించి యాతనిని గృహంబునకేగి రమ్మనెను.

ఆబ్రాహ్మణుడు గృహంబునకుజని భార్యను, కుమారుని, గోడలిని జేరబిలిచి వారలకు రత్నముల ప్రభావము తెలియజేసి యానాల్గింటిలో నేది గొనిన బాగుండునో జెప్పుమని యామువ్వురి నడిగెను.

కుమారుడు:—ఏరత్నము చతురంగబలములనిచ్చునో దానిని పుచ్చు

కొందము; దానివలన మనకు సుఖముగా రాజ్యము లభించును.

తండ్రి:—రాజ్యము మనకు వలదు. దానివలన రాముఁ డరణ్యముల పాలాయెను, పాండవులకు కూడ రాజ్యమువలన నదేగతి సంభవించినది. కావున బుద్ధిమంతుఁడెవ్వఁడూ రాజ్యముఁగోరడు. ఏరత్నమువలన ధనంబు చేకూరునో దానినే పుచ్చుకొందము.

భార్య:—అన్నిప్రాణులకును అన్నమే జీవధారణము. అదియుగాక కుక్షిని నిరాఘాటముగ హత్తుకొను భ్రిమోజకుఁడుకాలేదు. మనలను సుఖపెట్ట జాలదు. కావున ఏరత్నము షడ్రసోపేతములగు తినుబడీపదార్థములు కలుగజేయునో ఆరత్నము గైకొందము.

కోడలు:—ఏరత్నము వస్త్రాభరణముల నొసంగునో దాని తీసి కొందము.

ఈతీరుగా వారుమువ్వురును తాముజెప్పిన రత్నమును నొసవలసినదని నిర్బంధింపదొడగిరి. అంతట బ్రాహ్మణుఁడు విక్రమార్కుని సన్నిధికరిగి వారినల్వురి అభిప్రాయములను యెరింగించెను. అదివిని రాజు ఆనాలుగు రత్నములను వారి నల్వురికి వారు కోరుకొన్న విధముగా నొసంగి పంపివైచెను.

"ఓభోజభూపతీ! ఇట్టి యౌదార్యగుణము నీకడలేదు. కావున దేవేంద్రదత్తమగు యీసింహాసనమును నీవు అధిష్ఠింప అర్హుఁడవు గావు వెడలిపొమ్ము"అనభోజుఁడు విక్రమార్కుని వితరణ గుణంబులకు మది మెచ్చుచూ అంతఃపురంబు జేరబోయెను.

# (తొమ్మిదవ ప్రతిమ చెప్పిన కథ)

మఱల నొక్క శుభముహూర్తమున భోజభూపతి సింహాసన మధిష్ఠింపబోవ తొమ్మిదవ సోపానమునందుగల సాలభంజిక యాతనిని వారించి "ఓ భూపాలా! సాహసింపకుము. విక్రమార్కునకు గల సాహసౌదార్యగుణంబులు నీకడ లేవు. నీవు సింహాసన మధిష్ఠింపదగవు" అనిన భోజభూపాలుఁడు "ఓ సాలభంజికా! విక్రమార్కుని సాహసౌదార్య గుణంబులు దెల్పు నొక్కకథను వినిపింపు" మనిన నా ప్రతిమ యీక్రింది కథ జెప్పెను.

విక్రమార్కుని యాస్థానమునం దొక పండితోత్తముడు కలడు. ఆతనికి కుమారుఁడు కమలాకరుడనువాడు పసితనమున తలిదండ్రుల మాటలువినక అల్లరి చిల్లరి పనులు జేయుచూ నాటపాటలవినోదించుచూ విషయభోగము లనుభవించుచూ విద్యనేర్వవలసిన కాలమంతయు వ్యర్థము చేయుచుండెను ఆతని తండ్రి కుమారుని చెడునడవడిక జూచి సహింపనోపక ఒక్కనాడు కుమారుని యిట్లు మందలించెను.

ఓరీ! నీవు బ్రాహ్మణ జన్మమెత్తియు మూర్ఖుఁడవై యున్నావేమిరా? ఇప్పుడు నీవు విద్యాభ్యాసకాలమంతయు వ్యర్థము చేసెదవేని దుఃఖభాజనమైన జీవితము గడుపవలసివచ్చును. స్త్రీలకు సిగ్గు—క్షత్రియునకు జయము—వర్తకునకు ఓపిక—యెట్లు తగిన భూషణములో అట్లే విప్రులకు విద్యభూషణము. విద్య తల్లివలె రక్షించును. ఎవ్వరికిని దెలియనీక దాచుకొన్న ధనమువంటిది. కీర్తిని సుఖమును లభింపజేయును. విద్యావిహీనుడైన మనుజుఁడు ద్విపాదపశువు. నీబోటి విద్యాగంధమెరుగని కుమారుడుండుటకంటె లేకుండుటే మేలు. అని పెక్కురీతుల మందలించెను.

అంతట కమలాకరుడు తండ్రిమాటలవలన పశ్చాత్తాపమునొంది, "ఎప్పుడు నేను సకల విద్యా పారంగుడ నగుదునో అప్పుడు తండ్రిగారి ముఖము జూడవలయు"నని మనంబున ప్రతినబూని కట్టుబట్టలతో దేశాంతరములకు బయనమాయెను.

కమలాకరుడట్లు బయలుదేరి కాశ్మీరదేశము జేరుకొనెను. అందున్న గోవిందభట్టు అనువాని నాశ్రయించి, "స్వామీ! నేను విద్యా గంధములేని మూర్ఖుడను. తమకడవిద్యనభ్యసింపదలచియీయూడజేరితిని" అనిచెప్పెను. అంతనాభట్టు కమలాకరునియెడ జాలిజెంది, యాతనిని తన శిష్యునిగా గైకొనెను. కమలాకరుడు ఉపాధ్యాయునిగృహకృత్యం బులు నిర్వర్తించుచు అచ్చటనే భుజించుచు వారికి తనపై మరింతదయ కలుగునట్లు ప్రవర్తించుచుండెను. ఇట్లు కొంత కాలము గడచిన వెనుక గోవిందభట్టునకు కమలాకరునిపై యపారముగు దయకలిగి యాతని కొక మంత్రరాజ ముపదేశించెను. అద్దానిచే కమలాకరునికి విద్యలన్ని యు కరతలామలకములై యుండెను.

పిమ్మట నొక్కనాడు కమలాకరుడు గురువుకడకరిగి యాతనికి ప్రదక్షిణ నమస్కారము లాచరించి తన తలిదండ్రులను జూడవలయు నని చెప్పి యాతని యనుజ్ఞబడసి పయనమై మార్గమధ్యమునగల కాంచీ పురమందు విడిసెను. ఆపురమునందాతడొక్క సుందరీమణింగాంచి ఆమెపై మోహంబుగొని ఆమె వృత్తాంత మొక్కనినడుగ నాతడిట్లు దెలిపెను.

"ఓయీ! ఈమె సర్వాంగసుందరియైననూ ఏమిలాభము? ఈమె యౌలజ్వనమంతయు బూడిదనుబోసిన పన్నీరు చందమాయెను. ఏలనన ఆమె పుష్పవతియైన ఆరుమాసములనుండియు ఆమెనొక్క రాక్షసు డావహించియుండెను. ఆరక్కసుడామెనుబొందవచ్చు పురుషులను జంపు చుండెను." అనిపల్కిన విని కమలాకరుడు నామెపై తనకుగల మోహంబును లోనడంచుకొని యుజ్జయినీ పురంబు జేరబోయెను.

తల్లిదండ్రులు విద్యాప్రవీణుడైన తమకుమారునిగాంచి యాతనినిగౌరవించి సంతోషస్వాంతులైరి. మరునాడు కమలాకరుని తండ్రి యాతనిని విక్రమార్కుని యాస్థానమునకు గొనిపోయెను. కమలాకరుఁడు విక్రమార్కుని యాశీర్వదించి తన విద్యా వైశారద్యమును జూపెను. విక్రమార్కుఁ డాతనికి యపారమగు ధనంబొసంగి సత్కరించి యాతనితో నిట్లనియెను. "ఓయీ! నీవెవ్వనికడ విద్య నభ్యసించితివి? ఏయే దేశముల సంచరించితివి? నీ వరుదెంచునప్పు డేచ్చటనైన వింతల గంటివా?" యనియడిగిన కమలాకరుఁడు "దేవా! నేను కాశ్మీరదేశమున గోవిందభట్టు అనువానికడ విద్యనభ్యసించితిని. పెక్కుదేశములు సంచరించితిని. నేను కాశ్మీరదేశమునుండి మగిడి యేతెంచునప్పుడు కాంచీపురంబునందొక్కవింతగంటిని. అందొక సుందరీమణిగలదు. ఆమెనొక్క రాక్షసుఁ డావహించెను. ఆమెను బొందనరిగినవాడెవ్వడూ సజీవుడై యింతవఱకూ రాకుండెనట. అని ప్రజలు చెప్పుకొనుచుండుట నేనాలించితిని." అని తెల్పెను. ఆపలుకులాలించి విక్రమార్కుఁడు కమలాకరుని దోడ్కొని కాంచీపురంబున కరిగెను.

విక్రమార్కుఁడా సుందరీమణి గృహంబునకుజని యామె రూపముగాంచి విస్మయమునుజెంది అట్టి రూపవతికి యిట్టికష్ట మొదవినందులకు చింతించెను. విక్రమార్కుఁడామెతో యిట్లనియెను. ,,నిన్ను పేక్షించినచ్చితిమి. ఏమందువు" అనిన నారమణి, ,,స్వామీ! నన్నొక రక్కసు డావహించెను. అతడు నాప్రక్కనున్న పురుషులను జంపుచుండును. నేను నిజంబెరింగించితిని. పిమ్మట మీయిష్ట"మనిన విక్రమార్కుఁడు, ఆరాక్షసునివలన మాకావంతయు భయములేదు." అని చెప్పెను. ఆమెయు వారిరాకకంగీకరించి వారికివలయు సౌకర్యములన్నియుగూర్చియుంచెను.

నాటిరాత్రి విక్రమార్కుఁడు కమలాకరుని దోడ్కొని యామె

గృహంబునకరిగి యాపెయిచ్చిన వీడెమును బుచ్చుకొని యామె యొసర్చిన యుపచారములకు సంతుష్టుడై యామెతో సంభాషించుచుండెను. ఇంతలో రాక్షసుడరుదెంచు నలుకుడు వినవయ్యెను. విక్రమార్కుడు ఆయుధమును ధరించి యాశయ్యాగృహమును బ్రవేశించిన రాక్షసునెదుర్కొని యాతనిని వధించెను.

అంతనారమణి తనకు రాక్షసబాధ వదలినందులకు అమందానందంబునొంది విక్రమార్కునికి నమస్కరించి యిట్లనియెను. "ప్రభూ! మీదయవలన నాకు రాక్షసపీడ వదలినది. మీయుపకారము నేనెట్లు తీర్పగలను? నాజీవితశేషమంతయు మీతో గడుపవలయుననియున్నది. కావున నన్ననుగ్రహింప వేడెదను" అనిపల్కిన విక్రమార్కుడామెతో యిట్లనెను." సుందరీ! యీకమలాకరుడు నీపై మక్కువగొని యున్నాడు. ఈతడే, నీవు రాక్షసపీడితవై యున్నావని నాకు దెల్పి నన్నిచ్చటకు దోడ్కొనివచ్చెను. కావున నీవు నాయానతిపై కమలాకరుని సేవింపుచూ సుఖింపుము" అనియామెనొప్పించి వారిరువురినిదోడ్కొని యుజ్జయినీ పురంబుజేరి వారలకు వలయు ధనంబు లొసంగెను.

"ఓభోజమహారాజా! నీకడ నిట్టిగుణములున్నవా? లేవుగాన నీ వీసింహాసన మధిష్ఠింపదగదు వెడలిపొ"మ్మన భోజుడు నాటికిశుభ ముహూర్త మతిక్రమించినందున అంతఃపురంబు జేరజనియె.

## (పదియవప్రతిమ చెప్పిన కథ)

మఱల నొక శుభముహూర్తమున భోజరాజు సింహాసన మధిష్ఠింపరాగా పదియవ సోపానమునందున్న సాలభంజిక యాతనిని వారించి "ఓభోజభూపతీ! విక్రమార్కుని యౌదార్యాదిగుణములు యెవ్వనికి

కలరో అతఁడు దక్క తదన్యు లీ సింహాసన మధిష్ఠింప నర్హులుగారు." అనిన భోజుఁడు "ఓసాలభంజికా! విక్రమార్కునిగుణములు కథనము చేసినాపీనులకు విందొనర్పు"మనిన నాప్రతిమయు నీక్రిందికథ జెప్పెను.

విక్రమార్కుఁడు అమాత్యసామంత సేనానాయకులు గొలువ ద్వాత్రింశతి సాలభంజికల సింహాసన మధిష్ఠించియున్నతరి నొక్క సన్న్యాసియైన సిద్ధుఁ డరుదెంచి విక్రమార్కునిచే బూజింపబడి సుఖాసీనుఁడై భూపాలునితో నధ్యాత్మిక ప్రసంగములు గావించుచుండెను. ఆసమయమున కుష్ఠవ్యాధిచే అవయవములెల్ల చివికినట్టి యొక్క విప్రుఁ డాస్థానమున కరుదెంచి రాజుతో యిట్లు మొఱపెట్టుకొనెను. "ఓమహారాజా! భూపతి కన్నతండ్రివంటివాఁడు. నీవు యెల్లవారియొక్క పీడను హరించువాఁడవు గాన ఈరోగముచే నాశరీరము కృశించుచున్నది. యెట్లయినను నన్నీరోగమునుండి విముక్తునిగావించ వలయు"నని పెక్కువిధముల ప్రార్థింప జొచ్చెను.

అంతట భూపాలుఁ డాతనిని రోగవిముక్తుని గావించవలయునని మనంబున నిశ్చయించుకొని సిద్ధునిగాంచి, "స్వామీ, మీరు ఆవిప్రుని పల్కులాలించితిరిగదా! ఆతనిరోగము బాపుటకు యెద్దియేని సాధనముండిన దెలుపవేఁడెద"ననిన సిద్ధుఁడు, "ఓయీ! నేనొకమంత్ర ముపదేశించెదను. ఆమంత్రరాజమును నీవు బ్రహ్మచర్యమున నొక్కవత్సరకాలము కడుంగడు నిష్ఠతో జపించి హోమంబాచరించితివేని యొక్క దివ్యపురుషుఁడు ప్రత్యక్షమై నీకొకపండొసంగును. ఆపండును భక్షించినవారికి జరామరణంబులుండవు. వ్రజదేహులగుదురు. నీయాశ్రితుని రోగము బాపదలచితివేని నీకా మంత్రరాజ ముపదేశించెద"ననెను. విక్రమార్కుఁడు "స్వామీ! అట్లేని ఆమంత్ర ముపదేశింపుఁడని వేఁడుకొనెను. అంతట యోగీశ్వరుఁడు విక్రమార్కునికి మంత్రముపదేశించి నిజేచ్ఛ జనియెను. పిమ్మట విక్రమార్కుఁడు విప్రునికి రోగవిముక్తుని గావింతునని ధైర్యముగఱపి పంపివేసెను.

పిమ్మట విక్రమార్కుఁడు సిద్ధుఁడుపదేశించిన మంత్రముఁను ఒక వత్సరకాలము బ్రహ్మచర్యమున కడుంగడు నిష్ఠతో నుపాసించి హోమముచేసెను. అంతట హోమకుండమునుండి యొక్క దివ్యపురుషు డుద్భవించి యొక్క దివ్యఫలమును రాజునకొసంగెను. భూపాలుఁడా సందుగ్గ కొని రోగపీడితుఁడైన విప్రునిబిలిచి యాతని కాపండు నొసంగి భక్షింపుమనియెను. ఆరోగి యాఫలంబును భక్షించినంతనే నిరోగు డయ్యెను.

“ఓ భోజభూపాలచంద్రమా! అట్టిత్యాగగుణము నీకడలేదు గాన నీవీ సింహాసన మధిష్ఠింపదగదు పొ”మ్మనిన భోజుడు సిగ్గుపడి అంతః పురంబు జేరబోయెను.

# పదునొకండవ ప్రతిమ చెప్పినకథ

మఱల నొక్క శుభముహూర్తమున భోజభూపాలుడు సింహాసన మధిష్ఠించుటకు రాగా పదునొకండవ సోపానమునందుగల ప్రతిమ యాతని వారించి, భోజమహారాజా, దేవేంద్రదత్తమగు నీసింహాసనమును విక్రమార్కుడుదక్క తదన్యులు అధిష్ఠింప నర్హులుగారు. ఆతనికి గల ధైర్యస్థైర్యములు నీకులేవు.” అనినభోజుఁడు ఓసాలభంజికా, విక్రమార్కుని ధైర్యాది వృత్తాంతము దెల్పుమ”నిన నాప్రతిమ యీ క్రిందికథ జెప్పెను.

విక్రమార్కుఁడు షణ్మాసములు రాజ్యము పాలించినవెనుక

భూసంచారము సేయుచు నొక్కనాడొక్క యడవిం జొచ్చెను. అచ్చట పొద్దుక్రుంకినందున యొక మఱ్ఱివృక్షముక్రింద విశ్రమించెను. ఆసమయముననే మేతలకై యరిగిన విహంగములన్నియు వృక్షముపై జేరుకొనియెను ఆపక్షులలో చిరంజీవియను పక్షి తదితరబంధువులను గాంచి “మీరెచ్చటెచ్చటకు విహారార్థమైయరిగితిరో యెట్టివింతలను గాంచితిరో దెల్పు”డనెను. అంత నొక్కపక్షి చిరంజీవితో నిట్లనియెను. ఉత్తరదేశమున శైవాలకమను పర్వతముగలదు. అందొక్క రక్కసుడు నివసించుచుండెను. ఆసమీపమున నొక యగ్రహారముగలదు. ఆరాక్షసుడు ప్రతిదివసమును యగ్రహారమునగల మనుజుల నెత్తుకొనిపోయి భక్షించుచుండెను. అందుచే బ్రజలు భీతావహులై యొక్కనాడు రాక్షసుడు నివసించుచున్న పర్వతసమీపమునకరిగి యాతనినిట్లు ప్రార్థించిరి. “ఓరాక్షసుడా! నిర్దయుడవై మమ్మేలజంపెదవు? నీయాహారార్థమై యేజంతువులనో భక్షించి మమ్ముజంపుట మానుమ”నిన నారక్కసుడందుల కంగీకరింపక యిట్లనియెను. “మీలో దినమునకొక్కరు చొప్పున నాతిండికై యీపర్వతమునకు వచ్చినచో మిమ్ముల నంతగా బాధింపను” అనిపల్కనప్రజలు సమ్మతించి అప్పటినుండి యాగ్రామము నుండి యింటివరుసను దినమునకొక మనుష్యుని చొప్పున యారక్కసుని కాహారముగ నరుగుచుండిరి.

ఇట్లు దీర్ఘకాలము గడచినది. రేపటిదినమున నొకవిప్రకుమారుని వంతువచ్చినది. ఆవిప్రుడు వృద్ధులైనతలిదండ్రులకొక్కడేసుతుడు. ఆతడు మరణించినచో యింక సంతతిఉండదు. అందుచే వృద్ధులైన యాజననీజనకుల దుఃఖము వర్ణింప నలవికాదు.” అనిచెప్పెను. పిమ్మటవిహంగములెల్ల దమతమ కులాయములజేరి నిద్రించెను.

విక్రమార్కుడు పక్షులభాష నెరిగినవాడు గావున నాపక్షి చెప్పినదంతయు నాలించి యెట్టులయిన నారాక్షసునిబారినుండియాగ్రామ

వాసులను కాపాడవలయునని మనంబున నిశ్చయించుకొని శైవాలక పర్వతమునకు బయలుదేరెను. భూపాలుఁడా పర్వతము జేరుసరికి విప్రకుమారుఁడు రక్కసుని కాహారముగా నేగుదెంచెను. విక్రమార్కుఁ డాతనిఁగాంచి, "ఓయీ! నీకుమాఱుగా నేనారక్కసుని కాహార మయ్యెదను. నీవు వెడలి"పొమ్మని యాతనిని బంపివైచి తాను రక్కసుని గుహాకరిగెను. రాక్షసుఁడు నగుమోముతోనున్న విక్రమార్కుని గాంచి విస్మయంబుజెంది, "ఓయీ! నీవెవ్వడవు? నన్ను గాంచి భయపడవలసిన నీవు ధైర్యశాలివలె నగుమోముతో నున్నాడవు" అనిన విక్రమార్కుఁడు, "ఓయీ! పరులకొరకై నేనీదేహమును ధరించియున్నాడను. నీపనినీవు గావించుకొను"మనెను. అంతనా రక్కసుడు భూపాలుని పరోపకార బుద్ధికిని ధైర్యమునకునుమదిమెచ్చి యిట్లులనియెను. "ఓమహాపురుషా! పరదుఃఖమునుగాంచనోర్లక నీసుఖ భోగేచ్ఛను మానుకొని నీశరీర మర్పింపదలచినాడవు. నీజీవితమే శ్లాఘ్యము. నీకువలయువరంబు వేడుకొను"మన విక్రమార్కుఁడు "నీకు నాయందుదయకలదేని నేటినుండీ మనుష్యులను భక్షింపనని వాగ్దానము సేయుము."అనిన రక్కసుడందుల కంగీకరించెను. విక్రమార్కుఁడు కృతార్థుడై నిజేచ్ఛంజనియె.

"భోజభూపాలచంద్రమా! వింటివా విక్రమార్కుని వితరణ గుణములు అట్టివి నీకడ లేవుగాన నీ పీగద్దె నెక్కతగదు. వెడలి పొ"మ్మనిన భోజుఁడు లజ్జజెంది నాటి శుభముహూర్త మతిక్రమించి నందున అంతఃపురికి బోయెను.

## (పంద్రెండవ ప్రతిమ చెప్పినకథ)

మరునాడు మరల నొకశుభముహూర్తమున సింహాసన మధిష్ఠింప వచ్చిన భోజభూపతిని పండ్రెండవసోపానమునగల ప్రతిమ యాతనిని వారించి యిట్లనియెను. "ఓ రాజా! విక్రమార్కునకున్న వితరణ గుణంబులలో నొక్కటైన నీకు లేదు. ఆతని సాహస వితరణంబులు దెల్పుకథ వినదలతువేని దెల్పెద" ననిన భోజుఁడు "ఓ సాలభంజికా! ఆతనిగుణములు దెల్పు కథజెప్పి ఆకొనియున్న నావీనులకు విందొనర్పుము" అనిపల్కిన నాప్రతిమ తన వచోనైపుణ్యము మెఱయ నీక్రిందికథ జెప్పెను.

విక్రమార్కుని రాజధానియగు నుజ్జయినీపురంబున ధనదత్తుఁడను వైశ్యుడొకఁడుండెను. ఆతనికి పురందరుఁడను కుమారుఁడు గలడు. ధనదత్తుని సంపదలకు పరిమితిలేదు. లుబ్ధుఁడు. పురందరుఁడు తలిదండ్రుల మాటలు పాటింపక దానధర్మములజేయుచు ధనమువ్యయపరచుచుండెను. ఒక్కనాడు ధనదత్తుడు కుమారుని జేరబిలిచి యిట్లనియెను. "బిడ్డా! నీవు వైశ్యకులమున నుద్భవించియు క్షత్రియునివలె వ్యయము జేసెదవేటికి? ఇయ్యది కోమటిబిడ్డకుదగదు. కోమటిబిడ్డ ధనమును కూడబెట్టవలయునుగాని వ్యయముసేయరాదు. అంతియేకాక కూడబెట్టిన ధనము ఆపత్కాలములో పనికివచ్చును." అని పల్కిన పురందరుఁడు, "తండ్రీ! కూడబెట్టినధనము ఆపదలలో రక్షించునని యెవ్వడు వచించునో అట్టివాడు జ్ఞానహీనుఁడు. ఆపదలతోపాటు కూడబెట్టినధనమున్న యెడల నశించునుకాని మనలను రక్షింపదు. ఎప్పుడును పోయిన దానికై వగవరాదు. రావలసినదానికై చింతింపరాదు" అనిన ధన

దత్తుడు కుమారునిపై నాగ్రహించి యాతనిని తనగృహమునుండి వెడలగొట్టెను. పురందరుఁడు చేయునదిలేక దేశాంతరములకుబోయెను కొంతకాలముపిమ్మట పురందరుఁడు దేశాటనమొనరించి నిజపురంబైన యుజ్జయినీ కేతెంచుచూ మార్గమధ్యమున హిమపురియను నగరమున ప్రొద్దుగ్రుంకినందున నొక్కయరుగుపై విశ్రమించెను.

అర్థరాత్రియగుసరికి నానగరసమీపమునగల విపినమందు నొక్క స్త్రీవ్యక్తి విలపించుచున్నట్లు వినవచ్చెను. పురందరుఁడు మేలుకాంచి యారోదనమాలించి యాగృహయజమానునిలేపి యట్లు రోదనమొనరించు స్త్రీ యెవ్వరని ప్రశ్నించెను. అంతనాతఁడు "ఓయీ! యీ సమీపముననే యొకవనముగలదు. అందుండి ప్రతిదినము రాత్రి సమయమున యీరోదనము వినవచ్చుచుండును. విచారించుటకు భయముచే నెవ్వఁడు నచ్చటికిపోఁడు" అని తెల్పెను. అనంతరము తెల్లవారిన పిదప పురందరుఁడు యాపురంబువిడిచి చనెను.

పిమ్మట కతిపయదినంబులకుఁ బురందరుం డుజ్జయినీ పురంబు జేరుకొని విక్రమార్కుని సన్నిధికరిగి హిమపురియందు దావిన్న సమాచారమంతయు దెల్పెను. అంత విక్రమార్కుఁడు పురందరుని దోడ్కొని హిమపురిజేరి మున్ను పురందరుఁడు శయనించిన గృహంబునవిడిసి, నిశాసమయమునకై యెదురుచూచుచుండెను.

ఆరాత్రి యథాప్రకారముగా స్త్రీరోదనము వినవచ్చెను. ఆ యార్తనాద మాలించినతోడనే విక్రమార్కుఁడు ఖడ్గముచేబూని పురందరుని విడిచి తానొంటరిగా నాధ్వనివచ్చిన దిక్కునకేగెను. ఆయంధకారమున విక్రమార్కుడు దారితప్పక విపినముఁజొచ్చి యచ్చో నొక్క రాక్షసుఁడొక్క లలనామణిని బాధించుటగాంచెను. విక్రమార్కుఁ డాకాంతామణి నోదార్చి యారాక్షసునితో పోరాడదలపడి కొన్ని నిమేషంబుల నారక్కసుని జక్కాడెను. పిదప నాస్త్రీనిగాంచి,

"అమ్మా! నీవెవ్వరవు? ఏల యీదుర్మార్గుడగు రక్కసుఁడు నిన్ను పీడించుచున్నాడు? ఎఱింగింపు"మన నాలలన, "దేవా! నేను శీలవతి యనుదానను. నాకునాథ ర్తపై ననురాగములేదు. ఆయనకు నాపై నపారమగు ననురాగముగలదు. నాకూటమికై నెన్నియో మాఱులు నన్నాయన బ్రతిమాలెను. నేను నిరాకరించితిని. తుదకాయన కామజ్వరపీడితుఁడై ప్రాణములు పోవుసమయమున "ఓసీ! దుర్మార్గురాలా! నాకోరికను నీవిట్లు నిరాకరించి నామరణమునకు కారణభూతురాలవైతివిగాన యీనిపినమందున్న రక్కసునిచే, నీవు అంగీకరింపకున్నను సంభోగార్థమై బలాత్కరింప బడుదువుగాక"అనిశపించెను. అంతనే నాతపదంబులవ్రాలి పెక్కురీతుల ప్రార్థింప కరుణించి "కొన్నిదినములకు విక్రమార్కమహీపాలుఁ డరుదెంచి నిన్నారాక్షసుని బారినుండి రక్షించు"నని చెప్పిప్రాణంబులు బాసెను. నాటినుండియు నేనీరక్కసునిచే బీడింప బడుచుంటిని. నేటికి తమదయవలన నాబాధనివర్తించెను. ఇట్టిమహోపకార మొనర్చిన తమకు నేనెట్టిప్రత్యుపకారము జేయజాలను. అయినను నేజెప్పునదాలింపుడు. ఈసమీపమునకొకగుహలో నీరాక్షసుఁడు తొంబదికోట్ల వరహాలను దాచియుంచెను. నాదేహమునుండిప్రాణము లెగసిపోవుచున్నవి. నేజీవింపుటకల్ల. మీరాధనముఁగొనిపొండు"అనిచెప్పి ప్రాణములు విడిచెను. పిమ్మట విక్రమార్కుఁడు పర్వతగుహకరిగి, అందున్న ధనమునుగొని పురందరుని గలిసికొని యాధనమంతయు నాతనికొసంగి"సుఖంబుగా జీవించుమనెను"

"ఓభోజభూపాలా! ఇట్టిగుణములు నీకడగలవా? లేవుగాన నీవీ సింహాసన మధిష్ఠింపదగవు వెడలిపొ"మ్మన నాటి శుభముహూర్త మతిక్రమించినందున అంతఃపురము జేరజనియె.

## (పదమూడవ ప్రతిమ చెప్పినకథ)

మరునాడు శుభముహూర్తమున భోజభూపాలుఁడు సింహాసన మధిష్ఠింపరాగా పదమూడవ సోపానముమందున్న ప్రతిమ యాతనిని వారించి ఈక్రిందికథ జెప్పెను.

విక్రమార్కుఁడు షణ్మాసములు భూసంచారము చేయవలసిన కాలములో భూసంచారము సేయుచూ నొక్కనాడు యమునాతీరమున కేఁగి అచ్చట గలకాళికాలయమున కేగి దేవిని ప్రార్థించి, దేవళములో పురాణశ్రవణము జేయుచుండుటగాంచి తానును పురాణశ్రవణ మొనర్చుట కొక్కచో గూర్చుండెను. అప్పుడొక విప్రుఁడు భార్యతోగూడ నదియందు స్నానము చేయుచుండగా ప్రవాహవేగమునకు తట్టుకొనలేక కొట్టుకొనిపోవుచుండెను. అంతనాతని భార్య రోదనమొనర్చుచూ, "ఏటి ప్రవాహమున కొట్టుకొనిపోవుచు చావనున్న తనభర్తను రక్షింపుడని" మొఱపెట్టుచుండెను. పురాణశ్రవణముజేయుచున్న విక్రమార్కుఁడా దీనాలాపము లాలించి తోడనే యమునాతీరమునకేగి వెఱవక యందుఱికి యాబ్రాహ్మణుని ప్రాణములతో రక్షించి యొడ్డునకు దీసికొనివచ్చి వివిధోపచారముల గావించి యాతని సేదదీర్చెను.

బ్రాహ్మణుఁడు సేదదీరినవెనుక విక్రమార్కునిగని "ఓమహా పురుషా! ఈనాశరీరము, మొదట నాతల్లిదండ్రులవలన బుట్టినది. దీనికి గాయత్రివలన రెండవజన్మము వచ్చినది. ఇప్పుడునీవు మూడవజన్మము గల్పించితివి. నాప్రాణదాతవైన నీకు నేనేమి ప్రత్యుపకారము చేయగలను! అయినను నాకడనొక్క మంత్రరాజమున్నది. అయ్యది జపించిన సర్వపాపములు నశించును. ఆమంత్రప్రభావమున దేవలోక

మునకు గూడఁబోవచ్చును. ఆ మంత్రి రాజమును నీకుపదేశించెద, గొనుము.” అనిచెప్పి భూపాలున కా మంత్రముపదేశించి వెండియునిట్లు చెప్పెను. “భూపాలా! నీవీమంత్రమును యితరుల కుపదేశించినచో నీకయ్యది ఫలింపదు, కాన నీవేరికి నుపదేశింపకుము.” అనిపల్కి విప్రుఁడు నిజేచ్ఛంజనెను.

పిమ్మట విక్రమార్కుఁ డటనుండి బయలుదేరఁబోవు సమయమున నొక్కరక్కసుఁడాతనికడ కరుదెంచి, “విక్రమార్కభూపాలా శరణు శరణ”నిపల్కెను. విక్రమార్కుఁడాతని గాంచి, “ఓయీ! నీ వెవ్వఁడవు? ఇచ్చటికెట్లు వచ్చితివి? ఏకతమున నన్ను శరణు జొచ్చితివి? నీవృత్తాంతమేమి? తెల్పు”మనిన నారాక్షసు డిట్లుచెప్పెను. “దేవా, తొల్లి నేనొక్క భూపాలునికడ ప్రధాన పురోహితుగా నుండెడివాఁడను. ఆరాజు తనకడ కరుదెంచిన పండితులను బరీక్షించుటకు నన్ను నియమించుచుండెడివాఁడు. నేనువిద్యాగర్వముచే నెంతటి పండితుడనైనా పూర్ణప్రజ్ఞలేదని లేనిపోని తప్పులుబట్టి పారద్రోలు చుండెడివాఁడను. ఇట్లుండగా నొకనాఁడొక్క విప్రపుంగవుఁడు. రాజును దర్శింపవచ్చెను. అతఁడు సకలశాస్త్రపారంగతుఁడు. రాజాతనిని బరీక్షింపుమని నన్ను నియమించెను. అంతనేనాతనిని బరీక్షించి లేనిపోని తప్పులు కల్పించి రాజుతోఁజెప్పి యాతనికి పూర్ణ ప్రతిభ లేదంటిని. అంత నా విప్రపుంగవుఁడు నాపై గినిసి నన్నుబ్రహ్మరక్కసుడవు గమ్మ”ని శపించెను. అంత నేను గడ గడ వణకుచు నాతని పదంబుల వ్రాలి కరుణింప వేడితిని. అంతనాతఁడు శాంతమూని “ఓయీ! యమునాతీరమున నొక్క రావిచెట్టుగలదు. అందు నీవు నివసించుచుండుము. అచ్చటకు విక్రమార్కభూపాలుఁ డరుదెంచును. నీవాతనిని రక్షింపవేఁడుకొనినచో నాభూపతి సర్వపాపంబులు హరింపజేయును. అప్పుడు నీవు విగతపాపుఁడవై తొంటిరూపు నొందగల”వని చెప్పెను. నాటినుండియు

నీరావిచెట్టుపై నసించుచు దమరాకకై యెదురు చూచుచుంటిని. నన్ను రక్షించి నాపాప పరిహార మగున ట్లనుగ్రహింపవలయు"నని పెక్కు విధములఁ బ్రార్థింపఁజొచ్చెను. అంత విక్రమార్కుఁడు "ఓయీ, నాకు సర్వపాపనాశన మను మంత్రరాజమును నొక్కవిప్రుఁడు పదేశించెను. అయ్యది నీకుపదేశించెద, గాను"మని యారక్కసుని కామంత్రముపదేశించెను. అంతనాతఁడు బ్రాహ్మణుఁడుగా మారెను. ఆవిప్రుఁడు విక్రమార్కునకు నమస్కరించి పెక్కువిధముల నుతించి యాతనియనుమతిగొని నిజేచ్ఛం జనియె. విక్రమార్కుఁడు భూసంచారము చేయవలసిన షణ్మాసములు పూర్తియగుటచే మగల నుజ్జయిని కేఁగుదెంచెను.

"ఓభోజభూపాలాగ్రణీ! నీకడ నిట్టి యౌదార్యగుణము లేదు. కావున దేవేంద్రదత్తమగు నీసింహాసనమును నీవధిష్ఠింపదగదు. వెడలి పొ"మ్మనిన భోజుఁడు లజ్జచే నాటి కంతఃపురంబు జేరబోయెను.

## (పదునాలుగవ ప్రతిమ చెప్పిన కథ)

మరునాడు శుభముహూర్తమున నెప్పటియట్లసింహాసనమధిష్ఠింప వచ్చిన భోజమహారాజును పదునాలుగవ సోపానమునగల ప్రతిమ వారించి, "ఓభోజభూపాలా! నీ వీ సింహాసనమధిష్ఠించుటకు నుత్సాహపడుచున్నాడవు గాని యిద్దాని నధిష్ఠించుటకుదగిన సుగుణంబులు మాత్రము నీకడలేవు. అందుచే నిద్దానినధిష్ఠింప నీవర్హుడవుగావు. ఈసింహాసన మధిష్ఠించిన విక్రమార్కుని గుణంబులు వినదలతువే?"

యనిన భోజుడు ,,సాలభంజికా!విక్రమార్కుని గుణంబులు కథనము సేసి నావీనులకు విందొనర్చు"మనిన నాప్రతిమ యీక్రిందికథ జెప్పెను.

విక్రమార్కుడు భూసంచారముసేయుచూ నొక్క నగరము చెంతగల తపోవనమునకరిగి, అందుపారుచుండిన ఏటియందు స్నానమాచరించి,అచ్చటగల జగదంబికాదేవ యాలయమున దేవిని సేవించి, ఆవనములో విహరించుచుండెను. అందొక్కచో దపమాచరించుచున్న నొక యోగిపుంగవునిగని అతని జపతపంబులు ముగియువరకు విక్రమార్కుడు అచ్చట వేచియుండి పిదప నాతనికి నమస్కరించెను. ఆసిద్ధుడు విక్రమార్కునిగని ,,ఓయీ, నీవెవ్వరవు? నీనివాసమెద్ది? ఇచ్చటి కేలవచ్చితివి?'' అని యడిగిన విక్రమార్కుడు ,,స్వామీ! నే నుజ్జయిని బాలించు విక్రమార్కుడనువాడను. రాజ్యభారము మంత్రులచేతనిడి దేశములలోగల వింతలనుగాంచవలెనని భూసంచారము చేయుచుంటిని. ఇచ్చో కని విన, దగినవింతలు గాని,దృశ్యములు గాని యున్నచో నెఱింగింప వేడెదను,'' అని పల్కెను. యోగి పుంగవుడా పల్కులాలించి "ఓయీ! రాజ్యమును వీడి, యేల దేశాంతరములందు దిమ్మరెదవు? యిట్టిచో నీరాజ్యమును శత్రువులు ముట్టడించిన సహాయము సంభవింపదా? సత్వలక్షణ సంపన్నుడవగు నీవురాజధానిని వీడ వచ్చునా?'' అని పల్కిన విక్రమార్కుడాపల్కులాలించి, "అయ్యా! తమరు సర్వము తెలిసినవారు. ఈపురుషకారమెల్ల నిష్ప్రయోజనము దైవమే సర్వమునకును గారణభూతుడు. సుఖదుఃఖములు కర్మానుసారము గావచ్చును. రాజ్యమును ఎంత దిట్టపరచుకొన్నను చతురంగ భలమెంతయున్నను. పురుష ప్రయత్న మెంతసమకూడి యున్నను దైవము విముఖమాయెనని యెంతటివాడయినను భంగపడవలసినదే గదా ఇందులకొక్క యితిహాసము గలదు. తెలిపెదనాలింపుడు.'' అని విక్రమార్కుడీ క్రిందికథను యోగిపుంగవునితో జెప్పెను.

——:o:——

# రాజశేఖరుని చరిత్రము

పూర్వము రాజశేఖరుడను మహారాజుగలడు. ఒకప్పుడాతడు శత్రురాజులచే నోడింపబడి రాజ్యమును గోలుపోయి కట్టుగుడ్డలతో గానంబునకేగి కందమూల ఫలంబులు లభించినచో భక్షించుచూ లభింపకున్న నుపవాసములు సలుపుచూ కాలముగడుపుచుండెను. ఒక్కనాడతడొకవటవృక్షచ్ఛాయనుజేరి యుపవాస శ్రమచే విశ్రమించియుండెను. ఆసమయముననే అయిదుగురుయక్షులు రాజశేఖరుడు విశ్రమించిన వటవృక్షముపై జేరి యిట్లు సంభాషింపదొడగిరి.

యక్షుడు:—మద్రదేశాధిపతి మరణించెను. ఆతని యనంతరముసింహాసన మధిష్ఠించుటకు ఆతనికి పుత్రులు లేరుగదా! ఆరాజ్యమెవ్వరిపాలగునో!

2 యక్షుడు:—అమాత్యులు మొదలగుపురపెద్దలు పట్టపుదంతికొక్క పూలహారమునొసంగి యాగజం బాదండ నెవ్వరిమెడ వేయునో యాతనినే తమ పాలకునిగా నెన్నుకొన నిశ్చయించిరి.

3 యక్షుడు:—మున్ను రాజ్యమును గోలుపోయిన రాజశేఖరుడిప్పుడా మద్రదేశమునకు రాజుగానైనచో ప్రజలు సుఖింపగలరు.

4 యక్షుడు;—ఆరాజశేఖరు డిప్పుడీ వటవృక్షముక్రింద నిద్రించుచున్నాడు. ఆతనిదోడ్కొనిపోయి మద్రరాజ్యమున కభిషిక్తుని జేయుదమా?

5 య;—అట్లొనర్చినచో బాగుగానుండును.

3 య:—అట్లుచేయుట యుక్తముగాదు. ఆదంతావళ మాతనిమెడ యందు పూలహారము వైచునట్లు చేయవలయును.

4 యు;—అయినచో సీతని మద్రపురంబునకు దోడ్కొనిచనిపిడుచుట మంచిది.

2 యు;—అట్లయినచో నాతనిని లేపి యీవృత్తాంతము దెల్పుదము.

ఇట్లు సంభాషించుకొని యాయక్షులాతని మేల్కొల్పి యాతనితో యీవృత్తాంతమంతయు దెల్పి మద్రదేశమునకు రమ్మని యంతర్ధాన మొందిరి. రాజశేఖరుఁడుయక్షులుపదేశించినరీతిగా సతీమణింద్రోడ్కొని మద్రదేశమునకు బయనమై యేగెను. రాజశేఖరుడు మద్రదేశమునకరిగి మద్రేశ్వరాలయమున కేగి మద్రేశ్వరుని సేవించి దేవాలయ పురోభాగ మున నిలిచియుండెను. అప్పుడు పట్టపుదంతి యాతనికడకరుదెంచి పూల మాలనాతని మెడయందువైచి యాతనిఁమోఁ మోకరించెను. పిమ్మట మంత్రి సామంతులెల్ల రరుదెంచి రాజశేఖరుని దమ యేలికగానెన్ను కొని యాతనిని పట్టభద్రుని గావించిరి.

పిమ్మట యక్షులసహాయమున రాజశేఖరుడు పూర్వముతన్ను బారదోలిన భూపాలు నోడించి తానోల్పోయిన రాజ్యమును గూడ వశమొనరించుకొనెను.

అని విక్రమార్కుఁ డెఱింగించిన సిద్ధుఁడా కథనాలించి విక్ర మార్కుని మదిమెచ్చి యాతనికొక్క శివలింగము నొసంగి దాని ప్రభావ మిట్లెరింగించెఁ. "ఓరాజా! యీశివలింగము చింతామణివలె కోరిన వస్తువులెల్ల నొసంగును." అని తెల్పగా విక్రమార్కుడాతనికి నమస్కరించి యాలింగమును బుచ్చుకొనెను.

పిమ్మట విక్రమార్కు డుజ్జయినికి బోవుచుండగా మార్గమధ్య మున నొక్కవిప్రుడాతనిఁగాంచి, "రాజా! చిరకాలమునుండి నేను పూజింపుచున్నట్టి నాశివలింగమును యెవరోహరించిరి. మూడునాలుగు దివసములనుండి ఉపవాసము చేయుచున్నాను. శివలింగమునుపూజింపక నేను భుజింపను. మీకడనున్న లింగమును నాకిత్తురేని కృతార్థుడనయ్యె

దొసగిన రాజువిని తనకడనున్న లింగము విప్రునకొసంగి యుజ్జయిని కేగెను.

"ఓ భోజభూపాలా! ఇట్టియుదారస్వభావము నీకుకలదా? లేదు కావున నీవిద్దాని నధిష్ఠింప నర్హుడవుగావు. వెడలిపొ"మ్మనిన భోజుడు నాటి శుభముహూర్త మతిక్రమించినందున వెడలిపోయెను.

# పదునైదవప్రతిమ చెప్పినకథ

మరునాడు మరల భోజుడు సింహాసన మధిష్ఠింపరాగా పదునైదవ సోపానమునగల సాలభంజిక యాతనినివారించి, "భోజభూపాలా! ఈదేవేంద్రదత్తమగు సింహాసనమును విక్రమార్కునికన్న సాహస శౌర్య ధైర్యాది గుణంబులు గలవారుగాని తదన్యులీ సింహాసన మధిష్ఠింప ననర్హులు." అనిపల్కిన భోజుడు "సాలభంజికా! విక్రమార్కునివితరణ గుణంబులు కథనముసేయు" మనిన నాప్రతిమ యీక్రిందికథ జెప్పెను.

ఉజ్జయినీ పురవరంబున వసుమిత్రుడను విప్రుడుగలడు. అతడత్యంత సుందరాకారుడు. వేదశాస్త్రముల నసమాన పాండిత్యముగలవాడు. పరోపకారి. ధనసంపన్నుడు. విక్రమార్కునికావసుమిత్రునిపై మిక్కుటమగుప్రేమ. ఒక్కనాడా వసుమిత్రుడు విక్రమార్కుడును సంభాషించుచుండ నొక్క పురుషుడేతెంచి కాశీకాపురమునుగురించియు గంగామహాత్మ్యమునుగూర్చియు జెప్పెను. పిమ్మట వసుమిత్రుడుగృహమున

కేతెంచి మనంబున నిట్లు వితర్కించుకొనెను. "పావనియగు గంగను దర్శించి నంతనే పాపములు పటాపంచలై పోవును. గంగను జూచినను తాకినను పవిత్రులగుదురు. పెనుబాధకములచే చుట్టబడిన ప్రాణి గంగానదిని స్నానమాచరించినంతనే సర్వపాప విముక్తుడగును. తపస్సుచేతను దానముచేతను మనుష్యుడు గతిబొందలేడు. గంగను సేవించినచో పొందగలుగును" అనిగదా యామనుజుడు వక్కాణించిచనియె. అట్టి గంగానదిని దర్శించని నాజీవితమెందులకు? తప్పక గంగను దర్శించవలయునని మనంబున నిశ్చయించుకొని మరునాడు విక్రమార్కుని యనుజ్ఞగొని బయలుదేరి కాశికాపురి జేరెను.

అచ్చట గంగయందు శాస్త్రోక్త ప్రకారంబుగాస్నానమాచరించి విశ్వేశ్వరుని దర్శించి సేవించి, మాధవునకుమ్రొక్కి కాలభైరవుని దర్శించి యధికభక్తి నాతని నభిషేకించి, పిమ్మట గయ, ప్రయాగాది పుణ్యక్షేత్రములకు జని తీర్థయాత్ర ముగించుకొని మగిడి యుజ్జయినికి బయనమయ్యెను.

మార్గమధ్యమున నాతడొక్క నగరమున విడిసెను. ఆనగరము స్త్రీలచే పరిపాలింప బడుచుండెను. అచ్చట లక్ష్మీనారాయణాలయము గలదు. ఆయాలయ ధ్వజస్తంభము చివర నొక కొప్పెరయందు తైలంబు కళపెళ మరుగుచుండుటగాంచి యచ్చట నొక్క యధికారిని నడుగ నాతడిట్లు చెప్పెను. "ఈనూనెకొప్పెరయందు సాహసమున నెవ్వడురుకునో యాతనికీ నగర పరిపాలకురాలు యచ్చరికన్య లభించును" వసుమిత్రుడా వృత్తాంతమును విని యాసంగతి విక్రమార్కునికి దెలుపవలయునని యెచ్చటను తడయక ప్రయాణము సాగించి యుజ్జయిని జేరుకొనెను.

ఆమరునాడుఉదయంబునరాజప్రాసాదమునకుజని రాజుంగాంచి యాతనికి గంగాజలంబును విశ్వేశ్వరప్రసాదంబును నొసంగెను. విక్రమార్కు

డాతనినిగాంచి, "మిత్రమా! ఏయేపుణ్యక్షేత్రములు దర్శించితివి? ఏయేదేశంబులు జూచితివి? అందునీవుగాంచిన వింతలేమైన నున్నచో దెల్పు"మని ప్రశ్నించెను. అంత వసుమిత్రుఁడు, "భూపాలా! కాశీ, గయా, ప్రయాగాది పుణ్యక్షేత్రములకు బోయి విధ్యుక్తకర్మ లాచరించితిని. మగిడి నే నేతెంచునప్పుడు ఒక్కనగరమును గాంచితిని. ఆ నగరమును యొక ఆచ్చరలేమ పరిపాలించుచుండెను. అందు లక్ష్మీనారాయణ ఆలయముగలదు. ఆయాలయ ధ్వజస్తంభము చివరనొక నూనె కొప్పెరకలదు. అందు తైలము కళ పెళయని కాగుచుండును. ఆతైలమునందు సాహసవంతుఁడెవ్వడైన నురుకుచో వానికి యానగరాధిపత్యమును నచ్చరలేమయు లభించును. ఇదియే నేగనినవింత." అనితెల్పిన విక్రమార్కుడా పల్కులాలించి ఆశ్చర్యంబునొంది యాతఁణామే వసుమిత్రుని దోడ్కొని యానగరంబునకు చనెను.

విక్రమార్కుఁడా నగరంబు ప్రవేశించి దేవళమునకు జని అందున్న లక్ష్మీనారాయణుని బూజించి అచ్చటగల యధికారులు ప్రజలు జూచుచుండ యానూనెకొప్పెర యందురికి పిమ్మట నిరపాయముగ వెలికరుదెంచెను. తోడనే అచ్చటగల యధికారులు విక్రమార్కునికి నమస్కరించి, "మహారాజా! తమకున్న సాహసంబెవ్వరికిని లేదు. తమరు మా రాకుమారీమణిని బరిగ్రహించి యీరాజ్యమును పరిపాలింపవలయును." అని పల్కిన విక్రమార్కుఁడు, "మీరాకుమారిని బరిగ్రహించి మీ రాజ్యమును పరిపాలించుటకు వీలులేదు. నాకును రాజ్యముకలదు. ఈనామిత్రుఁడు మీరాకుమారిపై మక్కువ గొని యున్నాఁడు. ఈతఁడే నాకీవృత్తాంతమును దెల్పి యిచ్చటకు దోడ్కొని వచ్చెను. కావున మీరాకుమారి నీతని కొసంగి యీతనిని మీయేలికగా నెన్నుకొను"డనిన నాయధికారులు రాకుమారికడ కేగి విక్రమార్కుఁడు చెప్పినదంతయు దెల్పి వెండియు వసుమిత్రుని సౌందర్యంబు

బొగిడి యాతనిని పరిగ్రహింపుమని తెల్పిరి. రాకుమారియు వల్లెయని యంగీకరించెను. విక్రమార్కుడు వసుమిత్రునకు వివాహమగువరకు అచ్చట నిలిచి పట్టాభిషేకముగూడ గావించి పిమ్మట నుజ్జయినికి పోయెను.

"ఓ భోజభూపాలాగ్రణీ! నీకడనిట్టి గుణములు లేవు. కాన వెడలి పొ"మ్మనిన భోజుడు సిగ్గుపడి నాటికి వెడలిపోయెను.

## (పదునాఱవ ప్రతిమ చెప్పిన కథ)

అలనొక్క శుభముహూర్తమున భోజుడు సింహాసనమధిష్ఠించుటకు రాగా పదునాఱవ సోపానమునగల సాలభంజిక యాతనిని వారించి, "విక్రమార్కునికి గల వితరణగుణంబులు లేనివారు దేవేంద్రదత్తమగు నీసింహాసన మధిష్ఠింప నర్హులుగారు. వలయు నేని విక్రమార్కుని వితరణగుణంబులు కథనముచేసెద నాలింపు"మని యా ప్రతిమ ఈక్రిందికథజెప్పెను.

విక్రమార్కుం డుజ్జయినీ పురవరంబు బరిపాలించుచుండగా నొక్క విప్రపుంగవుండు సంతానహీనుడై భార్యాసమేతుండై జగదంబిక ఆలయమునకేగి దేవినిసేవించి. "మాతా! జగదంబికా! సంతానహీనులమైన మాకు సంతానము కలుగజేయు"మని వేడుకొనెను. అంత జగదంబికాతనికి ప్రత్యక్షమై "నీకొక్కకుమారీరత్న ముద్భవింప గల ద"ని చెప్పి యంతర్ధానయయ్యెను.

పిమ్మట కొంతకాలమునకు దేవియనుగ్రహించ నతనికొక్క కుమార్తెరత్న మాదయించెను. తలిదండ్రులు ఆబాలికకు జగదంబిక యను పేరిడిరి ఆబాలిక శుక్లపక్షచంద్రుని వలె దినదిన ప్రవర్ధమానయై యప్పటికన్నియల మిన్నయై యొప్పుచుండెను. జగదంబికను గాంచుచు తలిదండ్రులధికానందంబు నొందుచూ యల్లారుముద్దుగా పెంచుచుండిరి.

కొంతకాలమునకు జగదంబిక పరిణయ యుక్తవయస్కురాల య్యెను. ఆవిప్రపుంగవుడు పెక్కుదేశములు గాలించి కడుంగడు వ్యయ ప్రయాసలకోర్చి తుదకు అనుకూలుండైన వరుని నరసెను. కాని యాతనికడ పరిణయమొనర్చుటకు చేతగాసైనను లేకపోవుటచే తాన న్వేషించి తెచ్చిన వరుని, తనకుమార్తెను దోడ్కొని విక్రమార్కుని సన్నిధికరిగెను.

విక్రమార్కుడా విప్రపుంగవునిగాంచి యుచితాసనముపై నుప విష్టుజేసి యాబాలికను జేరబిలిచి యత్యంతప్రేమంబున "బిడ్డా! నీకేమి కావలయునో కోరు కొ"మ్మనియెను. అంత నాబాలిక రాజుంగాంచి మృదు మధురస్వరమున నిట్లనియెను.

ఓ మహారాజా!
రాజ్యంబేలుచు
జ్ఞాతిబంధులను రక్షింపుచు
యాశ్యాదులకు నీమనంబున జోటీయక దేవతల
వరంబులొందుచు
రుద్రుని బూజింపుచు
నిత్యాన్నదానము లాచరింపుచు
విప్రులయెడ భక్తిగలిగి
వారినాదరింపుచు

హారిని భజింపుచు
మునీశ్వరుల యాశీర్వాదములు బడయుచు, అమాత్య
సేనాధిపతి ప్రభృతులు నిన్నుగొలువ
యుజ్జయినీ పురవరంబును
ముదముతో బరిపాలింపుము.

అనిపల్కిననాలించి విక్రమార్కుడు తనబుద్ధికౌశలతచే జగదంబిక చెప్పిన పదునాల్గుమాటలలో నిముడియున్న భావము తొలియక్కరములను గూర్చిగ్రహించెను. "ఓరాజా! యీవరుని వివాహము సేయుము." విక్రమార్కుడామెబుద్ధిచాతుర్యమునకు సంతసించి యామెకు కొంత ధనంబొసంగి వివాహముగావించెను.

"ఓభోజమహారాజా! వింటివా విక్రమార్కుని వితరణగుణంబులు. ఆబాలికారత్నమునకు మిక్కుటముగా ధనమొసగుటయే గాక వారలకు వివాహము గూడచేసెను. ఇట్టిగుణములు నీకడలేవు, కాన నీవీ సింహాసన మధిష్ఠించుటకు అర్హుడవుకావు. వెడలిపొ"మ్మనిన భోజ భూపాలుడు లజ్జజెంది వెడలిపోయెను.

## (పదునేడవ ప్రతిమ చెప్పిన కథ)

మఱల మరునాడు భోజభూపతి సింహాసన మధిష్ఠించుటకు రాగా పదునేడవ సోపానమునగల ప్రతిమ యాతనినివారించి, "ఓభోజ భూపాలా దిన దినంబేటికి ప్రయత్నించి శ్రమనొందెదవు? విక్రమార్కునికి గలవితరణగుణంబులు గలవారు దక్క తదన్యులీ దేవేంద్ర దత్త

మకు సింహాసన మధిష్ఠింప నసర్హులు. అతని గుణంబులు వినదలుతు వేని తెల్పు"మనిన భోజుడు "సాలభంజికా! విక్రమార్కుని గుణంబులు కథనముచేసి ఆకొనియున్న నావీనులకు విందొనర్పుము" అనిన నాప్రతిమ తన వచోనై పుణ్యము మెఱయ నీక్రిందికథ జెప్పెను.

విక్రమార్క మహీపాలుఁ డుజ్జయిని పురవరంబును బరిపాలించుచున్న సమయమున నొక్క భట్టుమూర్తి యొక యన్యదేశ భూపాలుని దర్శించి యాతని సముఖమున విక్రమార్కుని వితరణగుణంబులు వర్ణించి పెక్కు పద్యములు చదివి నుతించెను. ఆనగరాధీశ్వరుఁడు తన సాటి రాజును తనమ్రోల బొగడుటచే నసూయాపరుఁడై యాభట్టునకు స్వల్పధనమొసంగి పంపివైచి విక్రమార్కుని ధిక్కరించు కీర్తిని పొందవలయునని మనంబున నిశ్చయించుకొనెను.

దినములు గడచుకొలఁది నాతని యీర్ష్యానలము ప్రబలము గాంచుచుండెను. విక్రమార్కుని ధిక్కరించుకీర్తి తనకెట్లు లభించునా యని విచారించుచు తగునుపాయము వచింపుడని తన యమాత్యులను వేడుకొన వారు చెప్పినది తృప్తికరముగా లేనందున మనంబున చింత యధికంబగుచుండ వేదనంబడుచుండెను. ఇట్లుండ నొక్కనాఁడొక్క యోగిపుంగవుఁ డాభూపాలుని దర్శింపవచ్చిన ఱేఁడాయోగిని యథావిధిగాఁబూజించియర్ఘ్యాసనముపై నుపవిష్టుజేసియిట్లనియెను "యోగీశ్వరా! కొన్నిదినములకు పూర్వము భట్టొకఁడు నన్ను దర్శింపవచ్చి నామ్రోల విక్రమార్కునిబోలు భూపాలురీ యిలను లేరనియు, అతనికిగల ధైర్య సాహసములు, కరుణ, దాతృత్వము, పరోపకారము యేభూపాలునికి గూడ లేవని బొగడెను. అప్పటినుండియు విక్రమార్కుని వితరణగుణంబులుజయించి, యధికంబగు కీర్త్యున్నతులు పొందవలయునని నా మనంబు నువ్విళ్ళూరుచున్నయది. కావున దేవరవారునాపై గరుణించి

యందుల కెద్దియేని నుపాయంబు దెల్పవేడెదన" అని భూపాలుడు యోగీశ్వరునకు ప్రణామంబాచరించెను.

ఆభూపాలుని పల్కులాలించి యోగిపుంగవుడు కొంత తడవు ఆలోచించి యాతనితో నిట్లనియెను. "ఓయీ! విక్రమార్కునిబోలు భూపాలుడు వేతియొకడు లేడు. ఆమహాత్మునకి తనదేహమునందే తనది యను నభిమానము లేదు. అతనికట్టి కీర్త్యున్నతులు లభించుటకు కారణము అతని వితరణగుణంబులే! నీవు నట్టి కీర్త్యున్నతులు గొనదలచితి వేని ముందుగా ధనము సంపాదింపవలయును. ధనమువలన యెట్టి కార్యములైనను నెరవేరును. అన్నిటికి ధనమే మూలముకారణము. ధనమువలన జక్కబడని కార్యములేలేవు. కాన నీవిప్పుడు ధనమును గూర్చ ప్రయత్నము లాచరింపవలయును. అందులకొక్క సాధనము గలదు. అద్దానిని సాధించుటకు సాహసము ఓరిమి గానలయును. అట్లొనర్చినచో జయము తప్పకలభించును. నీకాసాధన మెరింగించెద నాలింపుము. హిమవత్పర్వత ప్రాంతమున కొందరు యోగిపుంగవులు తపమాచరించుచుండిరి. అచ్చట నొక్క కాళికాలయముగలదు. నీవచ్చటకేగి యాదేవి నారాధించి కృష్ణ చతుర్థియందు దశాంశము హోమమాచరించి, హోమాంతమందు పూర్ణాహుతిగా నీశరీర మర్పింపుము. గుండమునబడిన కోడనే నిన్నా సిద్ధులు వెలికితీసి సజీవునిగా జేతురు. అంత గాళికాదేవి ప్రత్యక్షమై నీకువలయు వరంబులు కోరు కొనుమనును. అప్పుడు నీవు అమితముగా ధనములభించునట్లు వరమొసంగుమనుము. అంత నీకమ్మహాదేవి నీవుకోరిన వరమొసంగును. నీవీకార్యంబు జేసితి వేని అమితమగు ధనములభించును." అని తెల్పిన నాభూపాలుడు అమందానందంబునొంది యోగిపుంగవుని బెక్కువిధముల నుతించి తానా కార్యమును జేయ నిశ్చయించుకొనెను.

పిమ్మట నొక్కదినమున నా భూపాలుఁడు బయలుదేరి హిమవత్పర్వత ప్రాంతమునకరిగి యచ్చోటనున్న దుర్గాలయమున తపంబాచరించుచున్న సిద్ధులనుగాంచి తానును యోగిపుంగవులతో గలసి హోమమాచరింప నారంభించెను. కడుంగడు దీక్షతో హోమమాచరించి హోమాంతమున తన శరీరము పూర్ణాహుతిగా నర్పింపదలచి హోమగుండమున నురికెను. తోడనే యచ్చటగల సిద్ధులాతనిని హోమగుండమునుండి వెలికిదీసి సజీవునిగా నొనర్చిరి. అంత నా భూపాలునికి దుర్గాదేవి ప్రత్యక్షమై, "వత్సా! నీభక్తికి నేగడుంగడు సంతసించితిని. నీకు వలయు వరంబు వేడుకొను"మన భూపతి యాదేవి ననేకరీతుల నుతించి, "జగద్ధాత్రి! జననీ! నాకు ప్రతిదినంబును యేడుబండెలతో నిండిన వరహాలు లభించునట్లు వరమొసంగి నన్ననుగ్రహింపుము" అనిన దుర్గ "ఓయీ! నిత్యమిట్లు నన్ను సంప్రీతి గావింపుము" అని పల్కి యంతర్ధాన మొందెను.

ఆభూపాలుఁడు అచ్చటనుండి నిజపురంబునకు చనుదెంచి యొక్కచో హోమగుండమును నిర్మించి ప్రతిదినంబును దేవిచెప్పినట్లుగా పూజలొనర్చుచు హోమమాచరించుచు హోమాంతమున దనశరీరము పూర్ణాహుతిగా నర్పించుచూ యేడుబండెలతో నిండిన వరహాలు సంపాదించి యాధనము దానధర్మములకు వినియోగించుచుండెను. క్రమక్రమముగా నీతని వితరణగుణములు దేశముల వ్యాపించుచుండెను.

భూపాలుఁడు ప్రతిదినము దుర్గకోరికపై నాదేవిని సంప్రీతి జేయుటకు తన శరీరమును పూర్ణాహుతిగా నొసంగుచుండెనని విక్రమార్కునకు దెలిసెను. తోడనే యాతడు భూపాలునినగరమునకువచ్చి యాతనికి మారుగా తాను హోమమాచరించి తనదేహమును పూర్ణాహుతిగా నర్పించెను. అంతనాదేవి ప్రత్యక్షమై "వత్సా! విక్రమార్క భూపాలోత్తమా! నీభక్తికి నేమెచ్చితిని. నీకువలయు వరంబు వేడు

కొను"మన విక్రమార్కుఁడద్దేవికి నమస్కరించి "జననీ! యీనాతోడి భూపాలుఁడు తన శరీరము ప్రతిదినము పూర్ణాహుతిగా నర్పించికష్టించు చున్నాఁడు. అట్టికష్టము లేకుండఁగనే యాతనికి కోరినధనంబు లొసంగుము." అని వేడుకొనిన నద్దేవి యాతనిబుద్ధికి సంతసించి యాతని వాంఛితము నెరవేరునట్లనుగ్రహించి యంతర్ధానమొందెను.

పిమ్మట నాభూపాలుఁడు విక్రమార్కునిఁగాంచి యాతని పరోపకారపారీణతకు విస్మయముఁజెంది యాతని పెక్కువిధముల నుతించి, ఆతని ఔన్నతులఁగాంచి అసూయఁజెందినందులకు తప్పిదముక్షమింపుమని వేడుకొనెను.

"ఓభోజభూపాలా, వింటివా విక్రమార్కుని వితరణ గుణంబులు. అట్టివి నీకడలేవు గాన నీవీ సింహాసన మధిష్ఠింప నర్హుఁడవుగావు. వెడలిపొ"మ్మనిన భోజుడు లజ్జఁజెంది నాటికంతఃపురంబు జేరఁబోయెను

## (పదునెనిమిదవ ప్రతిమచెప్పినకథ)

మరల నొక్క శుభముహూర్తమున భోజభూపాలుడు సింహాసన మధిష్ఠింపవలయునను నుత్సాహముతో నరుదెంచుచుండ పదునెనిమిదవ సోపానమందున్న ప్రతిమ యాతనినివారించి, 'భోజమహారాజా! విక్రమార్కుఁడుదక్క తదన్యులీ సింహాసన మధిష్ఠింప నర్హులుగారు. ఏలనందువా? విక్రమార్కునికిగల వితరణగుణంబులు మరెవ్వరికినిలేవు. ఆతని గుణంబులు దెలిపెద విను"మని యాప్రతిమ యీక్రింది కథ జెప్పెను.

విక్రమార్కుఁడు దేవేంద్రదత్తమగు ద్వాత్రింశతి సాలభంజికలు

గల యాసింహాసన మధిష్ఠించి రాజ్యంబేలు నొక్కనాడొక్క యోగీశ్వరుడు విక్రమార్కుని దర్శింప నేతెంచెను. విక్రమార్కుడా యోగిపుంగవున కెదురేగి ప్రణామం బాచరించి యుచ్చాసనముపై నుపవిష్టుంజేసి యథావిధిగా బూజించి యిట్లనియెను. "స్వామీ! తమరెచ్చటి నుండి యెచ్చోటి కేగుచుండిరి? యిచ్చటికేల విచ్చేసిరో దెలుపవేడెద" ననిన నామునీశ్వరుడు "మహారాజా! నేను దేశములద్రిమ్మరుచు తీర్థయాత్రలు చేయుచుందును. పుణ్యక్షేత్రములు దర్శించుచు యిచ్చోట కేతెంచితిని." అనిన విక్రమార్కుడు "యోగీంద్రా! మీరు సంచరించిన స్థలంబులలో కనివిన వలసిన వింతలున్నవో దెల్పవేడెదను" అనపల్కిన యోగిపుంగవుడిట్లు దెల్పెను. "భూపాలా! నే గనినవింత యొక్కటి దెల్పెదను వినుము. ఈప్రాంతారణ్యమున కవ్వలిభాగమున స్వర్ణపురమను పట్టణరాజం బొండుగలదు. అందు పాపనాశనియను నదిగలదు. అందు స్నానమాచరింప బెక్కుదేశములనుండి జనులరుదెంచుచుందురు. ఆపాపనాశనియందు స్నానమాడి ముక్తినొందగోరి నేనచ్చటి కేగితిని. అప్పుడా నదియందు నేనొక వింతగంటిని. అది యెద్దియనిన, పాపనాశనీ నదిమధ్యమున స్వర్ణ కంబము సూర్యోదయముతో బాటు నుదయించి ప్రభాకరుడుదయాద్రి నెక్కుకొలది నాకంబము వృద్ధినొంది మధ్యందిన వేళకు మార్తాండునిజేరును, మరల దినాంతమున కాస్తంభము క్షీణించుచు సూర్యాస్తమయమునకు నీటిమట్టమున మునుంగుచుండును. ఇట్లు పెక్కువత్సరములనుండి జరుగుచుండెనని యాస్వర్ణపురవాసులు నాతోజెప్పిరి. ఈవింత నీకెరింగించుటకే నేనిచ్చట కేతెంచితిని." అని చెప్పి భూపాలు నాశీర్వదించి నిజేచ్ఛంజనియె.

ఆయోగీశ్వరుం డరిగినపిమ్మట విక్రమార్కుండా వింతనుగనులార గాంచవలయునని స్వర్ణపురికి బయనమైయేగెను. విక్రమార్కుడు పాపనాశనియందు స్నానమొనరించి యాతీరమున గూర్చుండి కంబము

క్షీణించుటగాంచి విస్మయము జెందెను. ఆకంబము క్రమక్రమముగా సూర్యాస్తమయము మగుసరికి నీటిలో మునిగిపోయెను.

అనురునాడు విక్రమార్కుడు నదియందు స్నానమాచరించు వారిపగిది నీదులాడుచు కంబము నీటిమట్టమునకు వచ్చునరికి విక్రమార్కుడు స్తంభముపై నెక్కి కూర్చుండెను. సూర్యుడుదయాద్రిని జేరు సరికి కంబము నీటిమట్టమునుండి మూడడుగులు పైకిలేచెను. క్రమక్రమముగా మధ్యాహ్నమగుసరికి కంబము సూర్యునిజేరెను. దినకరుడును విక్రమార్కునిగాంచి యధికాశ్చర్యంబునొంది యాతని సాహసమునకు నలరి యాతనితో నిట్లనియెను. "విక్రమార్క మహీపాలా! నీసాహసమునకు నేనెంతయో మెచ్చితిని. నాకిరణంబుల బాధకోర్చి యింత దూర మతి సాహసముగా నరుదెంచితివి. మానవమాత్రుడెవ్వడును నాసమీపమునకు రాలేదు. నాకడ రెండు దివ్యకుండలములు గలవు. అవి దినమునకు రెండుబారువుల బంగారము నొసంగును. ఆరెండు కుండలములను గొనిచనుము." అని యాకుండలములను విక్రమార్కున కొసంగెను.

మఱల స్తంభము క్షీణించుచు సూర్యాస్తమయమునకు నీటిమట్టము జేరుకొనెను. విక్రమార్కుడు కంబముదిగి నగరములోనికి జనెను. ఆదినంబున నానగరమందు విశ్రమించి మరునాడు వేకువనులేచి యుజ్జయినికి బోవుచుండ నొక్కవిప్రపుంగవుండాతనికడ కరుదెంచి భూపాలు నాశీర్వదించి యాచించెను. విక్రమార్కుడా విప్రునికి తనకడనున్న రెండు దివ్యకుండలముల నొసంగి వాటిప్రభావము దెలియజేసెను. ఆవిప్రుడా కుండలములనుగొని విక్రమార్కుని నుతించుచూ నేగెను.

ఓభోజభూపాలా, నీకడనిట్టి గుణమున్నదా? లేదుగాన నీవీసింహాసన మధిష్ఠింప ననర్హుడవు, వెడలిపొ"మ్మనిన భోజుడు నాటి శుభముహూర్త మతిక్రమించినందున అంతఃపురంబు జేరబోయెను.

# పందొమ్మిదవ ప్రతిమ చెప్పిన కథ

మరల మరునాడు భోజభూపాలుఁడు సింహాసనమధిష్ఠించుటకు రాఁగా, పందొమ్మిదవసోపానమునఁగల సాలభంజిక యాతనిని వారించి యిట్లనియెను. "ఓరాజా, ఏల దినదినమును శ్రమనొందెదవు? నీ వీ సింహాసనము నధిష్ఠింపఁదలఁచితివేని విక్రమార్కుని వితరణ గుణంబులు ధిక్కరించు సుగుణంబులు నీకడనుండవలయును. విక్రమార్కుని గుణంబులు వినఁదలఁతువేని చెప్పెద"ననిన భోజభూపతి "ఓసాలభంజికా! ఆమహాపురుషుని గుణంబులు దెల్పి నన్ను ధన్యునిఁజేయు"మనిన నా ప్రతిమ యీక్రిందికథ జెప్పెను

విక్రమార్కుఁడు కొలువుదీర్చియుండఁగా సమీపారణ్యమందుండు నొక్కబోయఁడు యరుదెంచి భూపాలునకు నమస్కరించి యరణ్యజనితములగు వస్తువుల గొన్నిటిని కానుకగా నొసంగి వినయముతో నిట్లు విన్నవించెను. "ప్రభూ, ఇంతవరకు మీపరిపాలనమున సుఖముగానుంటిమి. కానికొన్ని దినంబులనుండి కష్టంబులొందుచుంటిమి. వ్యాఘ్రములవలనఁగాని సింగములవలనఁగాని మాకీసుమంతయు బాధ లేదు. కాని యొక్క అడవిపందివలన బాధజెందుచున్నారము. దేవా! అద్దానియాకారము కాటుకకొండనుబోలి చూపరకు భీతిజనింపుచున్నయది. దానిని జంపుటకు నెంతప్రయత్నించినను యిసుమంతయు మా ప్రయత్నము లీడేరుటలేదు. పంటలన్నియు ధ్వంసముఁజేయుచున్నయది. కావున దేవరవార రుదెంచి యాసూకరమునుజంపి మమ్ము గాపాడవలయును" అనిన విక్రమార్కుఁడు "ఒరీ నీవు నీగృహంబునకరుగుము. నీవెనువెంటనే నేను సేనాసమేతుఁడనై యరుదెంచి మీబాధ బాపెదను' అనిపల్కి వెంటనే సైన్యమును సిద్ధపరుపుమని యమాత్యునికాజ్ఞాపించెను.

పిమ్మట విక్రమార్కుడు సేనాసమేతుండై యావిపినమును జొచ్చి క్రూరమృగములను వేటాడజొచ్చెను. అందొక్క పొదలోపల పరుండియున్న పంది వేటకాండ్ర కోలాహలమునువిని బిగ్గరగా గర్జించుచు వెలికివచ్చెను. విక్రమార్కుండద్దానింగాంచి సంహారింపవలయుననునుత్సాహముతో దానిని దరుముచూ అమ్ములు వింట సంధించివిడచుచుండెను.

ఆసూకరము విక్రమార్కుని బాణంబులకు సరకుసేయక పెక్కుమార్గములు త్రిప్పుచూపరువిడుచుండెను. విక్రమార్కుండినుమడించిన యుత్సాహముతో దానిని దరుముచూ వెంబడించెను. కొంతదూరమట్లరిగినపిమ్మట యాసూకర మొక్క గుహాంజొచ్చెను. విక్రమార్కుడదిగని హాయమును డిగ్గి తానును గుహాంజొచ్చెను. అగుహా యంతయు గాఢాంధకార మలముకొని యుండెను. విక్రమార్కుడు కొంత దూరము నడున నొక్క విశాలప్రదేశము జేరెను. అవరాహాము మాత్రము విక్రమార్కునికి గన్పింపలేదు. విక్రమార్కుడా విశాలప్రదేశమునుండి నలుదిక్కులను పరికించిచూడ దూరమునందొక్క నగరము గానవచ్చెను.

విక్రమార్కుండా నగరమును బ్రవేశింపనుంకించుచుండ నొక్క పురుషుండాతనికి గాన్పించి "విక్రమార్కమహీపాలా! సుస్వాగతము" అనిన విక్రమార్కుడు "ఓయీ! నీవెవ్వరవు? నన్నెట్లెఱుంగుదువు?

పురుషుడు;—మహీపాలా! మిమ్మెరుంగనివారు యీమూడులోకములలో నొక్కరైనను గలరా?

విక్రమార్కుడు:—ఓయీ! యీనగరనామంబేమి? దీనిని బరిపాలించువారెవ్వరు?

పురు;—దేవా! ఇయ్యది భోగవతియను నగరము. దీనిని విరోచనుని కుమారుడగు బలిచక్రవర్తి పరిపాలించుచుండెను. ఆతని

విక్రమార్కుఁడా పల్కులాలించి యధికాశ్చర్యమును జెంది యావింతను గాంచవలయునని మనంబున నిశ్చయించుకొని అనర్ఘుని దోడ్కొని యచ్చోటి కేగెను. విక్రమార్కుఁడు ముందుగా దేవాలయం బునకేగి ఈశ్వరుని బూజించి పిదప యాగుండమునుగాంచి యర్థరాత్రి యగువరకు నచ్చోటనే వేచియుండిరి.

అర్థరాత్ర మగుసరికి యెనమండ్రు దివ్యాంగనలు ఆగుండము నుండి వెలికరుదెంచి దేవాలయములోని కేగిరి. విక్రమార్కుఁడు గూడ వారి వెనువెంటనే దేవాలయము ప్రవేశించి వారి కంటబడకుండా నొక్కచో దాగియుండెను. ఆస్త్రీలు ఈశ్వరుని బూజించి, వీణెలను గైకొని స్వామిని గీర్తించి కొంతతడవు నృత్యమొనరించి వెడలిపోవుచూ విక్రమార్కునిజూచి, ,,ఓయీ, నీకు మా యందపేక్ష యున్నచో మా వెంటరమ్ము''అని పల్కి యాగుండమునదిగి యదృశ్యులైరి.

విక్రమార్కుఁడు తనవెంటనున్న అనర్ఘునికి తాను మగిడి యే తెంచువరకు అచ్చటనే యుండుమని చెప్పి తానా గుండమున దూకెను.

విక్రమార్కుఁడా గుండమునదూకి పాతాళలోకమునకుబోయెను. అంత నాకన్యలాతనినిగాంచి యాతని సాహసమున కలరి ,,ఓయీ!నీవె వ్వరవు?'' అనిన విక్రమార్కుఁడు, ,,నేను ఉజ్జయినీపుర మేలువాడను. నన్ను విక్రమార్కుడందురు'' అనిపల్కిన వారు సంతసించి యిట్లనిరి. ,,ఓయీ, మేము అష్టసిద్ధులము, అష్టసిద్ధులతో గూడుకొన్న యీ రత్నంబులను నీవు గొనిపొమ్ము, ఈరత్నంబుల వలన సమస్తమైనకోర్కె లీడేరును'' అనిచెప్పి యాతని కెనిమిది రత్నము లొసంగిరి విక్రమార్కు డవిగొని నీటిగుండమునుండి భూలోకమునకరుదెంచి అనర్ఘుని గలిసి కొని యాతని వృత్తాంతమంతయు దెల్పి యాదివ్యరత్నము లాతని కొసంగెను.

,,ఓభోజభూపాలోత్తమా, వింటివా విక్రమార్కుని వితరణ

అంతలో ప్రొద్దుగ్రుంకెను. అనర్ఘుడు ఆగుండమున యింక నెట్టిచిత్రము లుద్భవించునో జూడనలయునని యచ్చటనే యుండెను. అర్ధరాత్రి మగుసరికి ఆగుండమునుండి యెనమండ్రు దివ్యాంగన లరుదెంచి దేవళములోని కేగిరి. అనర్ఘుడును వారివెనువెంట దేవాలయము ప్రవేశించెను. ఆతరువాత యజాక్షులు ఈశ్వరుని బూజించి మగిడి పోవుచు ననర్ఘునిగాంచి "ఓ యీ! నీవుమావెంట బడుటజూడ నీవుమాయందు మక్కువగలిగి యున్నటుల దోచుచున్నయది. నీమనంబున నట్టికోర్కె యున్నచో మావెంటరమ్ము" అనిపల్కి యాగుండమునమూకి యదృశ్యులైరి. అతడు వారివెంట జనుటకు తగిన ధైర్యము లేకపోవుటచే నచ్చటనే గూర్చుండి యానిశాశేషమును గడిపి ఆమరు దుజ్జయునికి బయనమై పోయెను.

బుద్ధిసింధుడు విద్యాధికుడై చనుదెంచినకుమారు నాదరించి గౌరవించెను. పిమ్మట నొక్కనాడు బుద్ధిసింధుడు కుమారుని వెంట నిడికొని విక్రమార్కుని సన్నిధికరిగెను. విక్రమార్కుడు అనర్ఘుని పరీక్షించి యాతని పాండిత్యమునకు మెచ్చి వస్త్రభూషణాదులచే బహూకరించి యిట్లనియెను. అనర్ఘా! ఏయేదేశములు సంచరించితివి. నీవుగాంచిన వింతలేమైన నున్నచో దెల్పు"మనియెను.

అంత ననర్ఘుడు, "దేవా! నేను గాశికాపురినుండి మగిడియేతెంచునపుడొక్క వింత గాంచితిని. నేనొక్క యరణ్యమునబడి వచ్చుచుండ నాకొక్క దేవాలయము గాన్పించెను. ఆదేవళము సమీపమున నొక్క నీటిగుండము గలదు. ఆగుండమున నీరెల్లప్పు డుడుకుచుండును ఆగుండమునుండి అర్ధరాత్రిమున నెనమండ్రు స్త్రీలరుదెంచి దేవాలయమున పూజలొనర్చి మరల ఆమార్గముననే వెడలి పోవుదురు." అదియే నేగాంచిన వింతయని చెప్పెను.

విక్రమార్క మహీపాలునకు బుద్ధిసింధుడను నమాత్యపుంగవుఁడు గలఁడు. ఆతనికి అనర్గళుఁడను కుమారుఁడు కలఁడు. అనర్గళుఁడు తలిదండ్రుల మాటల నాదరింపక యేవిద్యను నభ్యసింపక యాటపాటలతో వినోదించుచు కాలము గడుపుచుండెను. ఒకనాడు బుద్ధిసింధుఁడు కుమారుని జేరబిలిచి యిట్లు మందలించెను. "కుమారా! నీవు చదువుసంధ్యలను నేర్వక మామాటలను పాటింపక మూర్ఖుఁడవగుచుంటివి. నీవు నాకడుపున చెడబుట్టితివి. విద్వాంసుడును ధార్మికుఁడును గాని పుత్రు డుండినను లేనట్లె. నీతల్లి గొడ్రాలయినను మేలు. నీబోటి సుతుఁడుండుట మేలుగాదు. బాల్యమునందు విద్య నేర్వనివారు యౌవనమందు కామాతురులై చెడిపోవుదురు. ఎవరికి విద్యగాని దానగుణముగాని లేదో అట్టివారు పశువులతో సమానులు 'విద్యావిహీనః పశుభిః సమానః' అనునార్యోక్తిని వినలేదా! విద్య కల్పలతవంటిది. పరికిని తెలియరాక దాచుకొన్న ధనమువంటిది. విద్యతల్లివలె రక్షించుచుండును. విద్యావంతుని నెల్లరు పూజింతురు. కావున యింకనైనను బుద్ధిఁగలిగి విద్యనభ్యసించుము" అని పెక్కువిధముల మందలించెను. అనర్గళుఁడు తండ్రిమాటలవలన పశ్చాత్తాపము జెంది యేరికి జెప్పకయే దేశాంతరములకు బోయెను.

అనర్గళుఁడు పెక్కుదేశములు సంచారముగావించి తుదకు గాశీనగరము జేరి అందొక్క పండితోత్తము నాశ్రయించి యాతని యనుగ్రహమునకు బాత్రుఁడై యాతనికడ సకలశాస్త్రములును నభ్యసించి మహాపండితుఁడాయెను. పిమ్మట అనర్గళుఁడు తనయొజ్జ యనుజ్ఞనొంది యుజ్జయినికి బయనమయ్యెను, మార్గమధ్యమునగల యొక్కయరణ్యమున బడి నడచుచుండ అందొక్క దేవాలయ మాతనికి గానిపించెను. అతఁడా దేవళముకడ కేగి యాసమీపమున నొక్కకుంటలో నీరు తెక తెకయుడుకుచుండుటగాంచెను అగ్నిమున్నగు సాధనములు లేకనే నీరట్లుడుకుటగాంచి విస్మయముజెంది అనర్గళుఁడచ్చటనే కూర్చుండెను.

దైవాధీనంబులు. కావున జయము లభించినచో సంతోషించుట-అప జయంబు తటస్థించిన దుఃఖంచుట కాపురుషలక్షణము. అసలుక్షత్రియ జాతి పౌరుషవంతమైనది. అట్టి జాతియందుద్భవించిన నీవు యెట్టులైనను శతృబలంబులను నిర్మూలింప ప్రయత్నించుటకుమారుగా అబలవలె చితిపేర్చుకొని మరణింపజూచుట పౌరుష హేయముగాదా! నాకడగల యీబలపమును యోగదండమును బొంతయు నీవుగొనిపోయి నీశత్రువు లను జయించి సుఖంబుగా నుండు''మని వాటినొసంగి వాటి ప్రభావ మును దెలిపెను. ఆభూపాలుడు వాటిని గ్రహించి విక్రమార్కునికి నమస్కరించి స్తుతించి వెడలిపోయెను. విక్రమార్కుండుజ్జయినికరిగెను.

''ఓభోజభూపతీ! నీకడ నిట్టిత్యాగగుణముకలదా? లేదు కావున నీవీ సింహాసన మధిష్ఠింప నర్హుడవుగావు వెడలిపొ''మ్మనిన భోజుండు లజ్జజెంది అంతఃపురంబు జేరజనియె.

——:O:-

# ఇరువదియొకటవప్రతిమ చెప్పినకథ)

మఱలనొక్క శుభముహూర్తమున సింహాసనమధిష్ఠించుటకు వచ్చు భోజభూపాలుని యిరువదియొకటవ సోపానమందున్న ప్రతిమ వారించి ''ఓభోజమహారాజా! విక్రమార్కునకు గల సుగుణంబులు గలవారుదక్క తదన్యులీ సింహాసన మధిష్ఠింప దగదు. వినదలతువేని విక్రమార్కునగుణంబులు దెల్పెద'' ననిన భోజుండు ''సాలభంజికా! అతని గుణంబులు దెల్పి ఆకొనియున్న నావీనులకు విందొనర్పు''మనిన సాలభంజిక యీక్రిందికథజెప్పెను.

దైవాధీనంబులు. కావున జయము లభించినచో సంతోషించుట-అపజయంబు తటస్థించిన దుఃఖించుట కాపురుషలక్షణము. అసలుక్షత్రియజాతి పౌరుషవంతమైనది. అట్టి జాతియందుద్భవించిన నీవు యెట్టులైనను శత్రుబలంబులను నిర్మూలింప ప్రయత్నించుటకుమారుగా అబలవోలె చితిపేర్చుకొని మరణింపజూచుట పౌరుష హేయముగాదా! నాకడగల యీబలపమును యోగదండమును బొంతయు నీవుగొనిపోయి నీశత్రువులను జయించి సుఖంబుగా నుండు"మని వాటినొసంగి వాటి ప్రభావమును దెలిపెను. ఆభూపాలుడు వాటినిగ్రహించి విక్రమార్కునికి నమస్కరించి స్తుతించి వెడలిపోయెను. విక్రమార్కుండుజ్జయినికరిగెను.

"ఓభోజభూపతీ! నీకడ నిట్టిత్యాగగుణముకలదా? లేదు కావున నీవీ సింహాసన మధిష్ఠింప నర్హుడవుగావు వెడలిపొ"మ్మనిన భోజుండు లజ్జజెంది అంతఃపురంబు జేరజనియె.

——:0:-

# ఇరువదియొకటవ ప్రతిమ చెప్పినకథ

మఱలనొక్క శుభముహూర్తమున సింహాసనమధిష్ఠించుటకు వచ్చు భోజభూపాలుని యిరువదియొకటవ సోపానమందున్న ప్రతిమ వారించి "ఓభోజమహారాజా! విక్రమార్కునకు గల సుగుణంబులు గలవారుదక్క తదన్యులీ సింహాసన మధిష్ఠింప దగదు. వినదలతువేని విక్రమార్కునిగుణంబులు దెల్పెద" ననిన భోజుండు 'సాలభంజికా! ఆతని గుణంబులు దెల్పి ఆకొనియున్న నావీనులకు విందొనర్పు"మనిన సాలభంజిక యీక్రిందికథజెప్పెను.

విక్రమార్క మహీపాలునకు బుద్ధిసింధుడను నమాత్యపుంగవుఁడు గలఁడు. ఆతనికి అనర్గళుఁడను కుమారుఁడు కలఁడు. అనర్గళుఁడు తలిదండ్రుల మాటల నాదరింపక యేవిద్యను నభ్యసింపక యాటపాటలతో వినోదించుచు కాలము గడుపుచుండెను. ఒకనాడు బుద్ధిసింధుఁడు కుమారుని జేరబిలిచి యిట్లు మందలించెను. "కుమారా! నీవు చదువుసంధ్యలను నేర్వక మామాటలను పాటింపక మూర్ఖుఁడవగుచుంటివి. నీవు నాకడుపున చెడబుట్టితివి. విద్వాంసుడును ధార్మికుఁడును గాని పుత్రు డుండినను లేనట్లె. నీతల్లి గొడ్రాలయినను మేలు. నీబోటి సుతుఁడుండుట మేలుగాదు. బాల్యమునందు విద్యనేర్వనివారు యౌవనమందు కామాతురులై చెడిపోవుదురు. ఎవరికి విద్యగాని దానగుణముగాని లేదో అట్టివారు పశువులతో సమానులు 'విద్యావిహీనః పశుభిః సమానః" అనునార్యోక్తిని వినలేదా! విద్య కల్పలతవంటిది. పరికిని తెలియక దాచుకొన్న ధనమునంటిది. విద్యతల్లివలె రక్షించుచుండును. విద్యావంతుని నెల్లరు పూజింతురు. కావున యింకనైనను బుద్ధిఁగలిగి విద్యనభ్యసించుము" అని పెక్కువిధముల మందలించెను. అనర్గళుఁడు తండ్రిమాటలవలన పశ్చాత్తాపము జెంది యేరికి జెప్పక యే దేశాంతరములకు బోయెను.

అనర్గళుఁడు పెక్కుదేశములు సంచారముగావించి తుదకు గాశీనగరము జేరి అందొక్క పండితోత్తము నాశ్రయించి యాతని యనుగ్రహమునకు పాత్రుఁడై యాతనికడ సకలశాస్త్రములును నభ్యసించి మహాపండితుఁడాయెను. పిమ్మట అనర్గళుఁడు తనయొజ్జ యనుజ్ఞనొంది యుజ్జయినికి బయనమయ్యెను, మార్గమధ్యమునగల యొక్కయరణ్యమున బడి నడచుచుండ అందొక్క దేవాలయ మాతనికి గానిపించెను. అతఁడా దేవళముకడ కేగి యాసమీపమున నొక్కగుంటలో నీరు తెకతెకయుడుకుచుండుటగాంచెను అగ్ని మున్నగుసాధనములు లేక నేనీరట్లుడుకుటఁగాంచి విస్మయముజెంది అనర్గళుఁడచ్చటనే కూర్చుండెను.

అంతలో ప్రొద్దుగ్రుంకెను. అనర్ఘుఁడు ఆగుండమున నింక నెట్టిచిత్రము లుద్భవించునో జూడవలయునని యచ్చటనే యుండెను. అర్ధరాత్రి మగుసరికి ఆగుండమునుండి యెనమండ్రు దివ్యాంగన లరుదెంచి దేవళములోని కేగిరి. అనర్ఘుఁడును వారివెనువెంట దేవాలయము ప్రవేశించెను. ఆతోయజాక్షులు ఈశ్వరుని బూజించి మగిడి పోవుచు ననర్ఘునిగాంచి "ఓయీ! నీవుమావెంట బడుటజూడ నీవుమాయందు మక్కువగలిగి యున్నటుల దోచుచున్నయది. నీమనంబున నట్టికోర్కె యున్నచో మావెంటరమ్ము" అనిపల్కి యాగుండమునదూకి యదృశ్యలైరి. ఆతఁడు వారివెంట జనుటకు తగిన ధైర్యము లేకపోవుటచే నచ్చటనే కూర్చుండి యానిశాశేషమును గడిపి ఆమరు దుజ్జయినికి బయనమై పోయెను.

బుద్ధిసింధుఁడు విద్యాధికుఁడై చనుదెంచినకుమారు నాదరించి గౌరవించెను. పిమ్మట నొక్కనాఁడు బుద్ధిసింధుఁడు కుమారుని వెంట నిడికొని విక్రమార్కుని సన్నిధికరిగెను. విక్రమార్కుఁడు అనర్ఘుని పరీక్షించి యాతని పాండిత్యమునకు మెచ్చి వస్త్రభూషణాదులచే బహూకరించి యిట్లనియెను, అనర్ఘా! ఏయేదేశములు సంచరించితివి. నీవుగాంచిన వింతలేమైన నున్నచో దెల్పు"మనియెను.

అంత ననర్ఘుఁడు, "దేవా! నేను గాశికాపురినుండి మగిడియేతెంచునపుడొక్క వింత గాంచితిని. నేనొక్క యరణ్యమునబడి వచ్చుచుండ నాకొక్క దేవాలయము గాన్పించెను. ఆదేవళము సమీపమున నొక్క నీటిగుండము గలదు. ఆగుండమున నీరెల్లప్పుడు దుడుకుచుండును ఆగుండమునుండి అర్ధరాత్రిమున నెనమండ్రు స్త్రీలరుదెంచి దేవాలయమున పూజలొనర్చి మరల ఆమార్గముననే వెడలి పోవుదురు." అదియే నేగాంచిన వింతయని చెప్పెను.

విక్రమార్కుడా పలుకులాలించి యధికాశ్చర్యమును జెంది యావింతను గాంచవలయునని మనంబున నిశ్చయించుకొని అనర్ఘుని దోడ్కొని యచ్చోటి కేగెను. విక్రమార్కుడు ముందుగా దేవాలయంబునకిరిగి ఈశ్వరుని బూజించి పిదప యాగుండమునుగాంచి యర్థరాత్రి మగువరకు నచ్చోటనే వేచియుండిరి.

అర్థరాత్రి మగుసరికి యెనమండ్రు దివ్యాంగనలు ఆగుండము నుండి వెలికరుదెంచి దేవాలయములోని కేగిరి. విక్రమార్కుడు గూడ వారి వెనువెంటనే దేవాలయము ప్రవేశించి వారి కంటబడకుండా నొక్కచో దాగియుండెను. ఆస్త్రీలు ఈశ్వరుని బూజించి, వీణెను గైకొని స్వామిని గీర్తించి కొంతతడవు నృత్యమొనరించి వెడలిపోవుచూ విక్రమార్కునిజూచి, ,,ఓయీ, నీకు మా యందపేక్ష యున్నచో మా వెంటరమ్ము''అని పల్కి యాగుండమునదిగి యదృశ్యులైరి.

విక్రమార్కుడు తనవెంటనున్న అనర్ఘునికి తాను మగిడి యే తెంచువరకు అచ్చటనే యుండుమనిచెప్పి తానా గుండమున దూకెను.

విక్రమార్కుడా గుండమునదూకి పాతాళలోకమునకుబోయెను. అంత నాకన్యలాతనినిగాంచి యాతని సాహసమున కలరి ,,ఓయీ!నీవెవ్వరవు?'' అనిన విక్రమార్కుడు, ,,నేను ఉజ్జయినీపుర మేలువాడను. నన్ను విక్రమార్కుడందురు'' అనిపల్కిన వారు సంతసించి యిట్లనిరి. ,,ఓయీ, మేము అష్టసిద్ధులము, అష్టసిద్ధులతో గూడుకొన్న యీ రత్నంబులను నీవు గొనిపొమ్ము, ఈరత్నంబులవలన సమస్తమైనకోర్కె లీడేరును'' అనిచెప్పి యాతని కెనిమిది రత్నము లొసంగిరి. విక్రమార్కుడవిగొని నీటిగుండమునుండి భూలోకమునకరుదెంచి అనర్ఘుని గలిసికొని యాతని వృత్తాంతమంతయు దెల్పి యాదివ్యరత్నము లాతని కొసంగెను.

,,ఓభోజభూపాలోత్తమా, యింటివా విక్రమార్కుని వితరణ

గుణంబులు! నీకడ నిట్టిగుణములు లేవుగాన నీ వీ సింహాసన మధిష్ఠింప దగవు. వెడలిపొ”మ్మనిన భోజుఁడు సిగ్గుజెంది నాటి శుభముహూర్త మతిక్రమించినందున వెడలిపోయెను.

# ఇరువది రెండవ ప్రతిమ చెప్పిన కథ.

మఱల నొక్క శుభముహూర్తమున భోజభూపాలుఁడు సింహాసన మధిష్ఠించుటకు రాగా ఇరువది రెండవ సోపానమునగల సాలభంజిక యాతనిని వారించి యీక్రిందికథ జెప్పెను.

విక్రమార్కుడు షణ్మాసములు రాజ్యము పరిపాలించి భూసంచారమునకు బయలు దేరి పెక్కుదేశములదిమ్మరుచు పుణ్యక్షేత్రములదర్శించుచు నొక్కచో నొక్క కొలనుగాంచి యచ్చటి కేగెను. ఆసమీపముననే యోగనిద్రా పరవశుడై తపమాచరించుచున్న యొక్క విప్రుని గాంచెను. విక్రమార్కు డాతనికడకేగి యాతడు తపస్సమాధి నుండి మేల్కొనువఱకచ్చటనే కూర్చుండి యుండెను.

కొంతవడికా విప్రపుంగవుడు కన్నులుదెరచి విక్రమార్కుని గాంచి అయ్యా! మీరెవ్వరు? తమయూరెయ్యది? ఇచ్చటి కేల విచ్చేసిరి? అనిప్రశ్నించిన విక్రమార్కుడు “స్వామీ! నే నుజ్జయినీ పాలకుండను. నన్ను విక్రమార్కుడందురు. నేను భూసంచారముసేయుచూ యిచ్చోటికి విచ్చేసి మిమ్ములను గని ధన్యుడనైతిని. తమ రేకతంబున యిట్లు తపంబాచరించుచున్నారు? దయయుంచి తమ వృత్తాంతమును

దెలుప వేడెదను." అని మిక్కిలి వినయముగా నడుగ నావిప్రుడు "మహారాజా! నావృత్తాంతము దెలిపెదనాలింపుడు. ఇచ్చోటికి కొలది దూరమున నొక్క పర్వతరాజముగలదు. అందులో నొక పాతాళబిల మున్నయది. దానియడుమ కామాక్షీదేవి దేవళముగలదు. దానినడుమ రసకుంభ మొకటి యున్నది. ఆరసము యేలోహమునుతాకినను బంగార మగును. ఆరసకుంభముకొరకై నేను పండ్రెండు వత్సరములనుండి కామాక్షీ మంత్రమును జపించుచుంటిని. కాని యాబిలద్వారమును తెలుపలేకున్నాను." అనితన వృత్తాంతము దెలిపెను. విక్రమార్కుడు రసకుంభము నాతనికి లభించునట్లు చేయవలయునని మదిదలచి యామ రునాటినుండి దుర్గను బూజింపవలయుననుకొని యానాటికందు విశ్రమించెను.

నాటిరేయి కామాక్షీదేవి విక్రమార్కుని స్వప్నములో సాక్షాత్కరించి యాతనితో యిట్లనియెను. "విక్రమార్క భూపాలా! యీ విప్రునకు రసకుంభము లభింపజేయుటకై నీవేల బూనుకొందువు? బిల ద్వారము తెరచుటకు ముప్పదిరెండు సుగుణములుగలిగిన భూపాలుని బలిగా నొసంగవలయును." అని తెల్పి దేవి యంతర్థానమొందెను.

వేకువనే విక్రమార్కుడు మేల్కొని యెట్లయినను విప్రుని కోర్కె దీర్చవలయునని నిశ్చయించుకొని, కాలకృత్యముల దీర్చుకొని సుస్నాతుడై యాబ్రాహ్మణునిదోడ్కొని పర్వతముకడ కరిగి బిల ద్వారముచెంత నిలువబడి దేవినిబూజించి, "దేవీ! యిచ్చో యిప్పుడు నన్నుబోలిన సుగుణములుగలవారు కాన్పింపరైరి. కావున నన్నే బలిగా గొని యీవిప్రోత్తమునకు రసకుంభము లభించునట్లనుగ్రహింపు"మని కరవాలముతో శిరంబు ఖండించుకొనబోయెను. అంత దేవి ప్రత్యక్షమై "ఓసాహసాంకమహీపాలా! విక్రమార్కా! సాహసింపకుము. నీపరోప కార పారీణతకు నేనెంతయో నంతసించితిని. నీకు వలయు వరంబు వేడు

కొను" మని విక్రమార్కుఁడా దేవికి సాష్టాంగ దండప్రణామంబు లాచరించి, "తల్లీ! ఈభూసురోత్తముఁడు నీదేవళము నడుమనున్న రసకుంభమునకై పండ్రెండువత్సరములనుండి నీమంత్రము జపించుచున్నాఁడు. ఇంకనైన నీతనిపై ననుగ్రహించి యీతనికి రసకుంభము లభించునట్లు వరమొసంగు" మనిన నద్దేవి విక్రమార్కుని సాహసమునకు పరోపకారపారీణతకు నదిమెచ్చి బిలద్వారము తెరచి యాబ్రాహ్మణునికి రసకుంభము నొసంగి యంతర్ధానమొందెను.

పిమ్మట విప్రుఁడు విక్రమార్కునివలన తనకోర్కె సిద్ధించుటచే నాతనికి నమస్కరించి పెక్కువిధముల నుతించి యాతని యనుజ్ఞగొని నిజేచ్ఛంజనెను.

"ఓభోజమహారాజా, వింటివా విక్రమార్కుని సాహసము. అట్టి గుణము నీకడకలదేని యీసింహాసన మధిష్ఠింపుము. లేనిచో వెడలిపొ" మ్మనిన భోజుఁడు సిగ్గుపడి నాటికంతఃపురము జేరబోయెను.

## (ఇరువదిమూడవప్రతిమచెప్పినకథ)

మరునాఁడు మరల భోజభూపాలుఁడు సింహాసనమధిష్ఠించుటకు రాఁగా ఇరువదిమూడవసోపానమందున్న సాలభంజిక యాతనిని వారించి "ఓభోజభూపాలా, విక్రమార్కునికిగల సుగుణంబులుగలవారుదక్క తదన్యులీ దేవేంద్రదత్తమగు సింహాసనమధిష్ఠింపదగరు. వినదలఁతువేని విక్రమార్కుని గుణంబులు దెల్పెద" ననిన భోజుఁడు "ఓసాలభంజికా విక్రమార్కుని సుగుణంబులు కథనముచేసి ఆకొనియున్న నావీనులకు

విందొనర్పుము" అనిపల్కిన నాప్రతిమ తనవంతునై పుణ్యము మెరయ నీకిందికథ జెప్పెను.

విక్రమార్కుండు భూసంచారము సేయుచూ నొక్కనాడొక్క యడవింబడి నేగుచుండెను. సూర్యాస్తమయ మగుచుండుటగాంచి యెద్దియైన సమీపగ్రామము జేరదలచి త్వరితగతిని జనుచుండెను.

అతండట్లేగుచుండ మార్గమధ్యమున నొక్కయావు పెనుబొంపిలో జిక్కి మోరబైకెత్తి దీనముగా నాక్రోశించుచుండెను. విక్రమార్కుం డదిగాంచి మనంబున జాలినొంది యెట్లనను యాధేనువును రక్షింప నిశ్చయించుకొనెను. సూర్యుండు బూర్తిగా నస్తమించెను. అంధకార మలముకొనుచుండెను. అట్టితరి విక్రమార్కుడు గోవునురక్షింపబూను కొని పెక్కువిధముల ప్రయత్నము లొనరించుచు డెను. కాని లాభ మిసుమంతయు గాన్పింపలేదు. త్వరలో నాధేనువుసి గాపాడనిచో నయ్యది ప్రాణములు బాయునని తలచి యాగోవును సమీపింపబోవ తానును యాబురదలో దగుల్కొనెను.

ఇంతలో నొక్కవ్యాఘ్రము యాధేనువుపై దుముకబోవ విక్రమార్కుడయ్యది గాంచి తనకడనున్న ఖడ్గమునుదీసి గుఱిచూచి యా వ్యాఘ్రముపై విసరగా నోడనే యయ్యదిక్రిందబడిజీవములుబాసెను. పిమ్మట విక్రమార్కు డతికష్టముపై నావునుసమీపించి బురదను ప్రక్కకుతప్పించి విశేషశ్రమతో నాధేనువును బురదనుండి యీవలకు దీసికొనివచ్చెను. పిమ్మట విక్రమార్కుడు తనకడనున్న వస్త్రముచే నాధేనువు యొడలి కంటుకొనిన బురదను దుడిచి, తానును దుడుచు కొనుచుండ నాధేనువు దిరోహితయయ్యెను. విక్రమార్కుడు యా ధేనువుకై నలుదెసలును బరికించి చూచిన గాన్పింపదయ్యెను.

విక్రమార్కుండాశ్చర్యమగ్న మానసుండై యుండ కామధేనువు నిజరూపంబున విక్రమార్కునిముందల నిలువబడి, విక్రమార్కభూపాల

చంద్రమా! నీసాహసంబును బరీక్షింపదలచి నేనే యాగోవు రూపమును దాల్చి పెనురొంపిలో జిక్కుకొనియుంటిని. నీసాహసమునకు నేమెచ్చితిని. నేను నీకడ గొంతకాల ముండదలచితిని. కావున నన్ను నీవెంట గొని పొమ్ము" అనిపల్కిన విక్రమార్కుడు కామధేనువును దోడ్కొని యుజ్జయిని కేగుచుండెను.

మార్గమధ్యమున నొక్కశతవృద్ధుడగు విప్రుడు విక్రమార్కుని గాంచి "విక్రమార్క భూపాలోత్తమా! నేను శతవృద్ధుడను, నిరుపేదను. ఆకటిబాధచే నలమటించుచున్నాడను. కష్టించి ద్రవ్యము సంపాదింతమన్న శరీరపాటవము సడలినది. మీదర్శనార్థమై యుజ్జయిని కేగుచుండ నాఅదృష్టవశాత్తు వెదుకబోయిన తీగె కాలికి దగుల్కొన్నట్లు శ్రమజెందకయే తమ దర్శనము లభించెను," అని పల్కిన విక్రమార్కుడు "విప్రోత్తమా! నేను భూసంచారము గావించి యుజ్జయిని కేగుచుంటిని. ఇప్పుడు నాచేత గాసైనను లేదు. కాని నాచెంత నొక్క కామధేనువు గలదు. ద్రవ్యమునకు మారుగా దీనిని గొనిపొమ్ము. ఈ కామధేనువు నీవుకోరిన యెల్లవస్తువులను సమకూర్చును. దీనిని గొని పోయి సుఖింపుము" అనిపల్కి యాకామధేనువుతో "నీవు నాకడ నెట్టి వాత్సల్యముతో నుండగోరితివో యట్లే యీవిప్రోత్తముని గృహమున నుండవేడెద"నని పెక్కువిధముల వేడుకొని కడకు ధేనువును సమ్మతింపజేసి యావిప్రునితో బంపెను.

ఓభోజభూపాలచంద్రమా! ఇట్టిగుణములు నీకడగలవా? లేవు. కాన నీవీ సింహాసన మధిష్ఠింప దగవు. వెడలిపొ"మ్మనిన భోజుడునాటి శుభముహూర్త మతిక్రమించినందున అంతఃపురము జేరబోయెను.

# (ఇరువది నాలుగవ ప్రతిమ చెప్పిన కథ)

మఱల నొక్కశుభముహూర్తమున సింహాసన మధిష్ఠించుటకు వచ్చినభోజమహారాజును యిరువదినాలుగవ సోపానమునగల సాలభంజిక వారించి యిట్లనియెను. "ఓభోజభూపాలచంద్రమా! ఏల వృధాశ్రమజెందెదవు? విక్రమార్కునకుగల సాహస వితరణాదిగుణంబులు గలవారుదక్క యితరులీ సింహాసనము నెక్కఁదగరు. వినదలంతు వేని యాతనిగుణంబులు దెల్పెద నాకర్ణింపు"మని యాతని యనుజ్ఞ గొని యాప్రతిమ యీక్రిందికథ జెప్పెను.

విక్రమార్క భూపాలుం డుజ్జయినీ పురవరంబేలుతరి నొక్క రాత్రి యాతనికి నిద్దురలో వేగుజామున తాను దున్నపోతునొక్కదాని నెక్కినట్లు స్వప్నము వచ్చెను. ఆమఱుచటిదినంబున కొలువుకూటమున కరుదెంచి పండితవర్యులను రావించి వారికి దాఁగనినకల వినిపించి ఫలంబు జెప్పుడనియెను.

సర్వజ్ఞభట్టను నాతఁడు లేచి విక్రమార్కునితో నిట్లనియెను. "భూపాలా! స్వప్నంబులు శుభాశుభ ఫలంబులొసంగుచుండును. స్వప్నమున ధేనువును, గజమును, వృషభమును, పర్వతమును మొదలగువానిని గాంచిన శుభములు చేకూరునని సర్వజ్ఞులు శాస్త్రమందు లిఖించిరి. సర్పము, మర్కటము, దున్న మొదలైన ఘాతుక మృగములను గాంచినచో మరణంబు చేకూరును. అద్దానికీఫలకాలముగూడ నిర్ణయించిరి. అది యెట్లనిన, మొదటిజామున గనిన కల సంవత్సరమునకు—రెండవజామునవచ్చిన స్వప్నము యెనిమిది మాసములలోను—మూడవయామంబున గనిన కల మూడుమాసములకును—వేకువనుగనిన

కల పదిదినంబులలోను శుభాశుభ ఫలంబు లొసంగును. విక్రమార్క మహీపాలా! తాముగనినకల మంచిదిగాదు.” అనిన విక్రమార్కుడు “ఓపండితోత్తమా! ఈదుస్స్వప్నదోషము నివ్వర్తింప జేసికొనుటకు ప్రాయశ్చిత్త మెఱింగించు” మనినసర్వజ్ఞభట్టు, “దేవా! తామునుస్నానులై వస్త్రాద్యలంకారములు ధరించి తైలంబున మొగంబు జూచుకొని ధరించినవస్త్రాదులను బ్రాహ్మణుని కొసంగి మరల నూతన వస్త్రాదికములను ధరించి విశ్వేశ్వరుని కభిషేకము గావించి నవరత్న మణులతో బూజించి బ్రాహ్మణులకు గోదానాదుల జేసి బ్రాహ్మణాశీర్వాదములు బొందినమొకలదుస్స్వప్నమువలన చెడుఫలము నశించును” అని చెప్పెను. విక్రమార్కుడట్లు గావించి దానపురస్సరంబుగ మూడుదినంబులు తన భోజనమును కొల్లగొననిచ్చెను.

ఈకథను సాలభంజిక భోజునకుచెప్పి యాతనితో నిట్లనియెను. “ఓ భోజభూపతీ! విక్రమార్కుని వితరణగుణంబు వింటివా! అట్టి గుణము. నీకడగలదేని యీసింహాసన మధిష్ఠింపుము. లేదేని నీ వీ సింహాసనమధిష్ఠించుటకు అర్హుడవుగావు, వెడలిపొ”మ్మనిన భోజుడు సిగ్గుపడి శుభముహూర్త మతిక్రమించినందున అంతఃపురము జేర బోయెను.

---

## (ఇరువది యైదవ ప్రతిమచెప్పిన కథ)

మఱల నొక్క శుభముహూర్తమున భోజభూపతి సింహాసన మధిష్ఠింపరాగా నిరువదియైదవ సోపానమునగల సాలభంజిక యాతనిని వారించి యీక్రిందికథ జెప్పెను.

విక్రమార్కుడు భూసంచారము సేయుచు నొకప్పుడొక నగరమును జేరి అందు కొన్నిదినములు విశ్రమించెను. విక్రమార్కుడు ప్రతిదినము యానగరమునగల దేవాలయమున కరిగి పురాణశ్రవణ మొనరించుచుండెను. ఇట్లుండ నొక్కనాడు నల్వురుమనుజులు విలువగల వస్త్రభూషణాదులను ధరించి సవిలాసముగా నతిగర్వముతో నచ్చటగల బీదజనుల దిక్కైనను గాంచక యాదేవళములోని కరుదెంచిరి. విక్రమార్కుడు వారలనుగాంచి సామాన్యులని దలచి తనదారిని తాను బోయెను.

ఆమరుచటి దినంబున విక్రమార్కుడును, దేవాలయములో పురాణశ్రవణ మొనర్చుచున్న సమయమునకుగతదినంబున నరుదెంచిన యానల్వురు మనుజులును వచ్చిరి. అందొక్కడు చింకిబట్టలనుధరించి బిచ్చగానివగిది నుండెను. విక్రమార్కుడాతనిగాంచి గతదినంబు నేతెంచిన యానల్వురలో నీతడొక్కడని గుర్తించి యాతసిని సమీపించి, "సోదరా! నిన్నటిదినంబున లక్షాధికారిగా గాన్పించి నేడు భిక్షాధికారిగా నుంటివేమి? ఇందులకేదియో ప్రబలకారణముండనోపును. కానసయ్యది నాకెరింగింపుము" అనిననామనుజుడు "స్వామీ! నేనొకజూదరిని. జూదమే నాజీవనాధారము. ఈజూదమున నేగోలుపోయిన ధనమునకు పరిమితిలేదు. నిన్నటిదినంబున ద్రవ్యమపారముగా నార్జించితిని. ఆకారణమునదమకు లక్షాధికారిగా గాన్పించితిని. నేడాధనమంతయు గోల్పోయితిని. అందుచే నేడిట్టివేషము దాల్చవలసివచ్చినది." అని చెప్పిన విక్రమార్కుడు "ఓయీ! జూదము కడునీచమైనది. అద్దానివలననే గదా ధర్మజుడు అరణ్యవాసముచేయుట, నిషధాధీశ్వరుండైన నలుడు సతీమణితో సహితము పెక్కుయిడుముల బడెను! జూదమునందు గల యభిమానముచే పెక్కురు తమసర్వస్వమును గోల్పోయి పడరానిపాట్లు బడిరి. కావున నాపల్కులాలించి యికనైనను జూదమునందుగల యభి

మానముచే బెక్కురుతమ సర్వస్వమును గోల్పోయి పడరానిపాట్లు
బడిరి. కావున నా పల్కులాలించి యికనైనను జూదమునందు గెలయభి
మానమువీడుము" అని హితోపదేశము గావించెను. ఆపల్కులాలించి
యాతఁడు, "అయ్యా! జూదమునందు జెడిపోవుననుటకల్ల. ఒకప్పుడు
ధనమపారముగా లభించును, మరొకప్పుడు సర్వస్వమును గోల్పోవును.
ఎల్లప్పుడును ఓటమిగాని గెలుపుకాని యుండదుకదా! నేను ఓటమి
సంభవించిన రేపు జయమును గాంచవచ్చును. దేనికైనను పరాత్పరుని
యనుగ్రహము బడయవలయును గదా!ఇందులకుదాహరణముగానొక
కథజెప్పెదనాలింపుము.

## మతిమంతుని చరిత్రము

పూర్వమొకప్పుడు రత్నావతియను పట్టణమును విక్రమసేనుం
డను భూపాలుఁడు పరిపాలించుచుండెను. ఆభూపాలునకు మతిమంతుడను
కుమారుఁడుగలఁడు. మతిమంతునకుయుక్తవయస్సరుదెంచినతోడనే విక్రమ
సేనుడాతనికి పట్టంబుగట్టి తానుతపంబొనరింప నరణ్యములకేగెను. మతి
మంతుఁడు ప్రజలను బిడ్డలవలె గాపాడుచు న్యాయమార్గమున రాజ్య
ము బరిపాలించుచుండెను.

ఇట్లుండ నొక్కనాడాతని యాస్థానమునకు నొకదైవజ్ఞుం డరు
దెంచెను. ఆదైవజ్ఞుఁడు మతిమంతుని జాతకమునుబరీక్షించి, "దేవా!
తమరీధరాచక్రమును బెక్కువర్షములు బరిపాలింపగలరు కానియీజన్మ

మున మీరు చౌర్యమొనర్చినవారు యెట్టిశిక్షననుభవింతురో యట్టిశిక్ష ననుభవింతురు.” అనిన భూపాలుఁడు “ఓయీ! నేను మహారాజునై యుండగ నేనా-చోరదండన మనుభవించు టెట్లుపొసగును? అనిమతి మంతుఁడడిగిన దైవజ్ఞుడు “అయ్యా! తమజాతకమున నట్లున్నయది. ఇయ్యది నిక్కమును. తమరు దప్పక దండనమనుభవించి తీరుదురు ఇక నేను బోయెదను సెలవిండు.” అనిపల్కి భూపాలుని యాజ్ఞగొని దైవజ్ఞుఁడు చనెను.

మతిమంతుఁడు తనకుజోరదండన మెట్లుసంభవించునో చూడ వలయునని రాజ్యపరిపాలనాభారమును మంత్రులపైనిడి తానుతపం బొనరింప నరణ్యమునకేగి అందొక్క వటవృక్షముక్రింద గూర్చుండి తపం బొనరించుకొనుచుండెను. ఇట్లు కొన్నిదినములు గడచెను.

మతిమంతుడు తపంబొనరించుచున్న యరణ్యమున కవ్వలిభాగ మున మందారపురమను పట్టణముగలదు. ఒకనాటిరేయిని కొందరు చోరులు అంతఃపురము ప్రవేశించి విశేషముగా ధనమును దొంగిలించి మూటగట్టుకొని పోవుచుండగ రాజభటులు కొందరుమేల్కాంచి దొంగలవెంటబడిరి. ఆచోరులు తమప్రాణములను రక్షించుకొనదలచి యాయరణ్యమునబడి పరుగిడనారంభించిరి. రాజభటులుకూడ వారిని వెంబడించుచుండిరి. చోరులు, మతిమంతుఁడు తపమొనరించుకొన్న స్థలమునకేతెంచి, రాజభటులు తమ్మువిడువక వెంబడింతురని తాము దొంగిలించిన భూషణములలో గొన్నిటి మతిమంతుడనికనిడి పలాయన మొనర్చిరి.

రాజభటులు దొంగలకై వెదకుచు వచ్చి అచ్చట దపమొన రించుచున్న మతిమంతునిగాంచి యాతని సమీపింపబోవ వానికడగల మూటనుగని యాతడే దొంగయనిభావించి మతిమంతుని వారిభూపా లుని కడకుఁగొంపోయిరి. భూపాలుఁడు మతిమంతునిగని జాలినొంది

క్రూరముగా శిక్షింపక యాతనిచిటికెనవేళ్లు ఖండింపబడ నాజ్ఞాపించెను. రాజభటులాతనిఁ గొనిపోయి భూపాలునాజ్ఞనిర్వర్తించి విడిచి పెట్టిరి.

మతిమంతుఁడు సాయంసమయమువరకు నాపురముననే ద్రిమ్మరి నిశాసమయమున రాజసౌధమున నొకయరుగుపై గూర్చుండి తన దుస్థితినిగూర్చి చింతించుచుండెను. ఆనిశాసమయమున రాకుమారి చల్లగాలికై సౌధోపరిభాగమునకరుదెంచి మతిమంతునిగాంచి యొక్క భటునిఁబిలిచి యాతనిఁదోడ్కొని రమ్మనిపంపెను. ఆభటుడు రాకుమారి యాజ్ఞానువర్తియై మతిమంతుని సౌధోపరికి గొనివచ్చెను. రాకుమారి యాతనివృత్తాంతమంతయు నాతనివలననేవిని యాతనిపై మక్కువగొని నాతనినొక యుచితమందిరమున శయినింపజేసి, యామరునాఁడుదయమున దన తండ్రికి మతిమంతుని వృత్తాంతమంతయు దెల్పి యాతనిపై దన కనురాగముకలదని సూచించెను. ఆభూపతి రాకుమారి యభిమత మెఱింగి మతిమంతునకు దనకుమారికనిచ్చి పరిణయము గావించెను.

“అయ్యా! వింటివా మతిమంతునిచరిత్రము! విధి యనుకూలించనిచో మహారాజైనను జిక్కులలో దగుల్కొనును. పరాత్పరునికి నేడు నాయందనుగ్రహము లేనందున ఓటమి సంభవించెను.” అని యిరువురు మాటలాడుచుండ ఆసమీపముననే యిరువురు పథికులిట్లు సంభాషించుచుండిరి.

ఒకటవ పురుషుఁడు;—ఓయీ! యీమధ్య గానిపించుటలేదేమి?

రెండవ పురుషుడు:—పుణ్యక్షేత్ర దర్శనార్థమై దేశముల ద్రిమ్మరుచుంటిని.

ఒ॥ పు;—నీవు ద్రిమ్మరిన దేశములలో నెట్టివింతలను గాంచితివి?

రెం॥ పు;—నేను పుణ్యక్షేత్రములెల్ల గాంచుచు నింద్రశైలమను పర్వతమును గాంచబోతిని. అందొక్క కాళికాలయము గలదు.

ఆయాలయమున నొక్క శిలాశాసనమున్నది. ఆశాసనమున నిట్లున్నది. ఎవ్వడుతనయష్టాంగముల రక్తముతో నద్దేవినభిషేకింతురో యాతని కాదేవిప్రత్యక్షమై వలయు కోరికలొసంగును.

అట్లు వారిరువురును సంభాషించుకొనుచు నడచిపోయిరి. విక్రమార్కుడయ్యదియంతయు నాలించి, యాజూదరిని వెనతో దోడ్కొని కతిపయదినంబులకు శైలపర్వతము జేరెను. విక్రమార్కుడా యాలయమునగల శాసనమును జదివి యాలయములోనికేగి తన యష్టాంగములు ఖండించుకొని యారుధిరముతో దేవి నభిషేకించెను. అంతనాదేవి విక్రమార్కునికి సాక్షాత్కరించి, "ఓసాహసాంతక భూపాలా! నీభక్తికి నేనెంతయో సంతసించితిని." అని పల్కి యాతనియంగముల నెప్పటివలె నొనరించి "వత్సా నీకువలయు వరంబు గోరుకొనుము"నెను. విక్రమార్కుడా దేవికి నమస్కరించి "తల్లీ! ఈతడు జూదమే ఆధారముగా గొని జీవించువాడు. నాయందుగరుణించి, యీతడు జూదమునందు జొఅకుండగా నీతనికి నిత్యమువలయు ధనము లభించునట్లనుగ్రహించుము" అనివేడుకొనెను. అంతనాదేవి అట్లేయగునని పల్కి యంతర్ధానమొందెను.

పిమ్మట విక్రమార్కుడా జూదరిని, "దేవి యనుగ్రహము వలన లభించిన ధనమును గొని జీవింపుము. జూదమునందభిమానము వీడు" మని హితోపదేశమొనరించి తానుజ్జయిని కేగెను

"ఓభోజభూపాలచంద్రమా! నీకడనిట్టి గుణములులేవుగాన నీవీ సింహాసన మధిష్ఠింపదగవు వెడలిపొ"మ్మనిన భోజుడు సిగ్గుజెంది నాటి కంతఃపురము జేరబోయెను.

—

# (ఇరువది యారవ ప్రతిమ చెప్పిన కథ)

మరునాఁడు భోజభూపాలుఁడు సింహాసన మధిష్ఠింపఁగా నిరువది యాఱవ సోపానమునగల ప్రతిమయాతనిని వారించి యిట్లనియెను. "ఓ భోజభూపతీ! విక్రమార్కునికి గల వితరణగుణంబులు గలవారు దక్క తదన్యులీ సింహాసన మధిష్ఠింపదగరు." అనిన భోజుఁడు "సాలభంజికా! విక్రమార్కుని వితరణగుణంబులు చెప్పి నన్నానందింపజేయు" మనిన చెప్పెదనాలింపుమని యాప్రతిమ తనసరసవచోనైపుణ్యమున నీక్రిందికథ జెప్పెను.

ఒక్కనాడు విక్రమార్కుఁడు సకల సామంత సేనానాయక ప్రభృతుల సమక్షమున గొలువుదీర్చియుండగా నల్వురుపురుషులు భయకంపితశరీరులై నిట్టూర్పులువిడచుచు సభారంగమునుప్రవేశించిరి. వారిని గాంచి విక్రమార్కుఁడు కూర్చుండ నియమించి, వారు సేదదేరిన పిమ్మట భూపాలుఁడు వారినిగాంచి యిట్లడిగెను. "మీరు యెచ్చటనుండి యిచ్చటకరుదెంచిరి. మీభయకారణంబేమియో చెల్పుడు." అనిన వారిలోనొక్కడిట్లనియె.

"మహారాజా! మేమిచ్చటికనతిదూరంబునగల మంచుకొండపైనున్న దేవాలయమునకేగి యచ్చటకాళికాదేవినిబూజించి శ్రమవాయనొక్కచో గూర్చుంటిమి. ఆసమయముననే యెక్కడనుండియో కొని భయంకరారావములు వినబడెను. అధ్వనులెచ్చటనుండి వచ్చుచుండెనాయని మేమునలుదెసలు పరికించుచుండ బొక్క లలనారత్నంబు మాకడకరుదెంచి, "మీరిచ్చటకేల విచ్చేసిరి? ఇచ్చటనుండి తడయక పరుగునబొండు." అనిన మేమాశ్చర్యమునుబొంది, "మేమిచ్చట నేల

నుండరాదు. ఇచ్చటనున్నచో మాకెద్దియైన హానిసంభవించునా? యన నాతోయజాక్షి, "అయ్యలారా! మీరిచ్చటనుండినచో నిచ్చటకు గొందలుబోయ లరుదెంతురు. వారు మిమ్ములను గాళికకు బలిగా నొసంగుదురు. కావున నామాటలాలించి యిచ్చటినుండి సత్వరమే కదలి పొండు. నిమిషమాత్రమైన నాలసింపకు" డని చెప్పెను. ఇంతలో గొందరు బోయలచ్చటి కరుదెంచుచుండిరి. తోడనే మేము నల్వురము బరుగిడ నారంభించితిమి. వారుమమ్ములను గని పట్టుకొనవలయునని మమ్ము వెంబడించిరి. మేమా కొండను డిగ్గి యరణ్యమార్గముల బడి యిచ్చోటికరుదెంచితిమి ఇదియె మా భయకారణము.

విక్రమార్కుడు వారుచెప్పినదంతయు నాలించి యాకాళికాలయమున జరుగు చిత్రముగాంచవలయునని మనంబునదలచి రాజ్యపాలనాభారంబు భట్టిపైనిడి తానుమంచుకొండ జేరనరిగెను. ఆకొండపైనున్న రుధిరప్రియగు కాళికాదేవి యాలయమును బ్రవేశించి యొకచో గూర్చుండెను.

కొందరు బోయవాండ్రొక ముదుసలినిబట్టి యాతనిని సుస్నాతునిజేసి నూతనవస్త్రములు గట్టబెట్టి రక్తవర్ణముగల చందనములంది, వేపాకును దండలుగాగట్టి మెడయందిడి కాళికకు బలియొసంగవలయునని యాలయములోని కాతనిని దీసికొనివచ్చిరి. విక్రమార్కుడు ఆబోయలనుగని వారలచెంతకేగి బోయనాయకునితో యిట్లనియెను. "ఓరీ! యీముదుసలి నిట్లేలయలంకరించితిరి? వీనినిపు డేమిచేయుదు"రని ప్రశ్నించిన నాతడు "నేడీ ముదుసలిని కాళికకు బలి యొసంగెదము. అందుచే నిట్లలంకరించితిమి. దినమున కొక్కమనుజుని చొప్పున నీదేవికి బలియొసంగెదము!" అనిచెప్పినవిని విక్రమార్కుడు "ఓరీ! యీబక్క జిక్కినముదుసలిని దేవికిబలి నొసంగినచో దేవి సంప్రీతిం జెందదు. వీనికి బదులుగా దేవికి నేనుబలియయ్యెదను. ఈముదుసలిని

విడిచిపుచ్చుడు" అనిచెప్పి వారలనొప్పించి యాముదుసలిని విడిపించి వాని యలంకారములన్నియు దానుధరించి "ఓరీ! ఇంక దేవికి నన్ను బలి నొసంగుడు." అనిపల్కెను. అంతనాబోయవాడు విక్రమార్కునితో నిట్లనెను. "ముందుగా నీవు దుర్గకు నమస్కరింపుము. నేనీఖడ్గమున నీశిరంబు ఖండించి తద్రక్తముతో దేవినభిషేకంబు గావించెద"ననెను. అంత విక్రమార్కుడు "ఓరీ! నీవంతగా శ్రమజెందనక్కరలేదు. నాకంఠము నేనే యుత్తరించుకొనెదను, మీరు ప్రక్కకు దొలగు"డని విక్రమార్కుడు తనకడనున్న చంద్రాయుధము వెలికిదీసి కంఠము నుత్తరించుకొనబోయెను.

అంతనమ్మహాదేవివిక్రమార్కునిసాహసమునకలరి సాక్షాత్కరించి యాతనివారించి "విక్రమార్కమహీపాలా! నీసాహసంబునకు నేనెంతయో మెచ్చితిని. నీయిచ్చవచ్చినవరముగోరుకొమ్ము" అనిన విక్రమార్కుడు దేవికి నమస్కరించి, "తల్లీ! నీదయవలన నాకు సకలశుభంబులు చేకూరియున్నవి. నీవు వరము ప్రసాదించెదనంటివి గాన నిటుపైని నీవు మనుజులనుగాని నోరులేని జీవములనుగాని బలిగొనకుండా నుండ బ్రార్థన." అని పెక్కువిధములవేడిననా దేవి "వత్సా! విక్రమార్కా! నీవుగోరినట్లికపైని మనుజులనుగాని నోరులేని జీవములనుగాని బలి గొనను" అనిపల్కి బోయలతో నట్లు బలియొసంగవలదని చెప్పి యంతర్ధానమొందెను పిమ్మట విక్రమార్కుం డుజ్జయినీకేగెను.

భోజభూపాలచంద్రమా! ఇట్టి సాహసము నీ యందుండెనేని యీసింహాసన మధిష్టింప ప్రయత్నింపుము. లేనిచో వెడలిపొ"మ్మనిన భోజుడు నాటి శుభముహూర్త మతిక్రమించినందున నంతఃపురము జేర బోయెను.

# (ఇరువదియేడవప్రతిమ చెప్పినకథ)

మఱల నొక్క శుభముహూర్తమున భోజభూపాలుఁడు సింహాసన మధిష్ఠింపఁగాఁ నిరువదియేడవ సోపానమునఁగల సాలభంజిక యాతనినివారించి యిట్లనియెను. "భోజభూపాలాగ్రణీ, యేల వృథా శ్రమ నొందెదవు. విక్రమార్కునికిఁగల సాహసౌదార్యాది వితరణ గుణంబులు నీకడ గలవేని యీసింహాసన మధిష్ఠింపుము. లేనిచో నీవి గద్దెనెక్క ననర్హుఁడవు. వినదలతువేని విక్రమార్కుని గుణంబులు దెల్పెద నాకర్ణింపుము" అని యాప్రతిమ యీక్రిందికథ జెప్పెను.

విక్రమార్కుని యాస్థానమున నొక్క దైవజ్ఞుఁ డరుదెంచి పంచాంగము జెప్పెను. భూపాలుఁడా దైవజ్ఞుని "యీసంవత్సరముఫలముయెట్లున్న"దని యడుగ దైవజ్ఞుడు, "యీవత్సరముసూర్యుడురాజు, అంగారకుడు మంత్రి, ధాన్యాధిపతిశని. ఇది యుగాక శనైశ్చరుడును, అంగారకుడును,రోహిణీ శకటము భేదించుకొని పోవుదురు. శనైశ్చరుడు భేదించిన రోహిణీశకటమందు అంగారకుడు శుక్రుడు నున్నచో, మేఘుడు పండ్రెండు వత్సరములు వర్షింపడు. అద్దానివలన కఱవు గలుగును." అని తెల్పెను. దైవజ్ఞుడు చెప్పిన మాటలువిని విక్రమార్కుడు "యీయనావృష్టిని నివారించుట కుపాయంబేమైన నున్నదో దెల్పు" డనిన దైవజ్ఞుడు "మహారాజా! యీయనావృష్టిని నివారింపవలెనన్న నవగ్రహ హోమాదికము ననుష్ఠింపవలయును. అద్దానిచే వానలు గురియును" అనితెల్పెను. పిమ్మట విక్రమార్కుఁడా దైవజ్ఞుని బహూకరించి పంపివైచి తాను హోమ మాచరింపదలచి కార్యాచరణమ్ము గడంగెను.

విక్రమార్కుఁడు శ్రోత్రియులైన బ్రాహ్మణులను రావించి వృత్తాంతమంతయుఁ దెల్పి హోమసామాగ్రియంతయు సమకూర్చి వారిచే సుముహూర్తమున వారిచే హోమము చేయించెను. కల్పోక్తప్రకారమున నవగ్రహహోమము గూడ చేయించెను. భూపాలుఁడు వస్త్రభూషణాదులచే బ్రాహ్మణులను తనియించెను. కాని వర్షము మాత్రము కురియదాయెను. అనావృష్టిచే దేశములో కరువు గలిగి ప్రజలు మిక్కుటమైన బాధలు పడుచుండిరి.

విక్రమార్కుఁడు తనప్రజలయొక్క బాధలు చూడజాలక యజ్ఞశాలలో గూర్చుండి చింతించుచుండెను. అంతట నశరీరవాణి యిట్లు బల్కెను. "విక్రమార్కభూపాలచంద్రమా! నీప్రజాక్షేమము నీవాసింతువేని యాశాపూరణీ దేవాలయమున నాదేవిమ్రోల ముప్పదిరెండు సుగుణములుకలిగిన పురుషుని బలియిమ్ము. వర్షముకురియును. అద్దాని వలన కఱవునశించును.

అదివిని విక్రమార్కుఁడు తోడనే యాశాపూరణి దేవాలయమునకేగి దేవినిబూజించి తనకడనున్న చంద్రాయుధముతో కంఠమును త్తరించుకొనబోయెను. అంతనా దేవి యాతనిసాహసమునకలరియాతని వారించి "ఓసాహసాంక మహీపాలా! సాహసింపకుము. నీసాహసంబునకే నెంతయో సంతసించితిని. నీయిచ్ఛవచ్చిన వరంబుకోరుకొను"మనవిక్రమార్కుఁడు "జననీ! నీవునాయందు ప్రసన్నతజెందితివేనియీయనావృష్టిని వారింపుము" అనివేడిన దేవి యట్లేయనియంతర్ధానమొందెను. విక్రమార్కుఁడధికానందముతో నంతఃపురమునకు బోయెను.

"ఓభోజభూపాలాగ్రణీ! నీకడనిట్టిసాహసమున్నదా? లేదుగాన నీవీసింహాసనమధిష్ఠింపదగవు వెడలిపొ"మ్మనిన భోజుఁడు నాటిశుభముహూర్తమతిక్రమించెనని యంతఃపురము జేరబోయెను.

# ఇరువదియొనిమిదవ ప్రతిమ చెప్పిన కథ.

మరునాడు మఱల భోజభూపాలుడు సింహాసన మధిష్ఠించుటకు రాగా నిరువది యెనిమిదవ సోపానముననున్న సాలభంజిక యాతని వారించి "ఓ భోజభూపాలచంద్రమా! విక్రమార్కునికి గల సాహసౌదార్యాది గుణంబులు నీకడ లేవు. అట్టి గుణంబులు గలవారుదక్క తద న్యులీ దేవేంద్రదత్తమగు సింహాసనమధిష్ఠింపదగరు. అతని గుణంబులు కథనము చేసెద నాకర్ణింపుము." అనిపల్కి యాతని యనుజ్ఞగొని యీక్రిందికథ జెప్పెను.

విక్రమార్కుడు షణ్మాసములు రాజ్యము పరిపాలించిన వెనుక భూసంచార మొనర్చుచు నొక్కనాడు కాంచీపురంబు జేరియందు దిమ్మరుచుండ నొక్కమనుజుడొక్క యరుగుపై గూర్చుండి రోదించు చుండెను. విక్రమార్కుడాతనిం జూచి యాతడొక్క విప్రుడని గ్రహించి "విప్రోత్తమా! ఏల బాలునిభంగి రోదన మొనర్చుచున్నాడవు? నీదుః ఖ కారణం బెఱింగించినచో నావలన నగు సహాయ మొనరించెదను" అనిపల్కిన నాద్విజోత్తముడు "ఓయీ! నావిచార కారణంబెఱింగించినను నాసంతాపమును సామాన్యులు వారింపలేరు. లాభములేనపుడు దెల్పిన ప్రయోజనమేమి? కావున నెరికిని దెల్పరాదని నిశ్చయించు కొంటిని. నీదారిని నీవేగుము" అనిపల్కిన విక్రమార్కుడు "ఓయీ! నీవిచార కారణము నాకొక్కని కెఱింగించుము. నీవిచారమును బాపుటకు యెన్నికష్టములకైన నోర్చెదను." అని విప్రుని బలవంతపరచిన నెట్టకేల కాతడిట్లు చెప్పెను. "ఓయీ! నాతండ్రి నాబాల్యమున గతించెను. పిమ్మట కొంతకాలమునకు నాజనయిత్రి కూడ గతింపగ

నామె దహన సంస్కారముల నిమిత్తమై ధనముకొరకు పెట్టెలను వెదకుచుండ నొక్కపెట్టెలో నొక్క తాళపత్రము గానిపించెను. అందిట్లు మాతండ్రిగారిచే లిఖింపబడియుండెను. "నళసంవత్సర చైత్ర శుద్ధ నవమినాడు, రాత్రి పదిఘడియలకు కంచి పెద్దగోపురపు మూడవ యంతస్తుకు సరిగా మూడు నిలువులలోతున నైదులక్షలవరహాలుదాచి యుంచితిని. ఆపత్రమును బదిలపరచి యింటగల స్వల్పధనంబుతో మాతల్లిగారి దహనసంస్కారములు జరిపితిని.

పిమ్మట కొన్నిదినములకా తాళపత్రమునుదీసి, ధనమున్న స్థలమును గనుగొన దలంచితిని కానియది నావల్లగాదాయెను. నేనసలు దరిద్రుడను, దానికిదోడుగా నాకుజెందవలసిన యైదులక్షల వరహాలు నేలపాలయ్యెను గదాయని విచారమున గుందుచుంటిని. ఇదియే నాదుఃఖకారణము." అనిచెప్పి యాతాళపత్రమును విక్రమార్కునకు జూపెను. విక్రమార్కుడాపత్రమునుగాంచి "ఓయీ! విచారమందకుము. నీధనమును నీకు లభింపజేసెదను. నీకాధనము చైత్రశుద్ధనవమినే లభించును. ఈలోపున లభింపదు. ఇంకొక్క నెలదినములేకదా! అప్పటి వరకును నాకడనున్న ధనముతో జీవించవచ్చును" యని యాతని నూరడించెను.

చైత్రశుద్ధ నవమివచ్చినది. ఆనాటిరేయిని విక్రమార్కుడు విప్రపుంగవునిదోడ్కొని కంచి పెద్దగోపురముకడకేగెను. పదిఘడియలవరకు వారచ్చటనేవేచియుండి మూడవయంతస్తు నీడ యెటనుండెనో గుర్తుజూచుకొని విక్రమార్కుడాతనితో, ఓయీ! ధనమున్నస్థలము దొరికినది. రేపుదయమునవచ్చి త్రవ్వించి ధనమును గొనిపోవచ్చును. రమ్మని" యాతనిదోడ్కొని గృహమునకేగెను.

ఆమరునాటి యుదయమున విక్రమార్కుడు కొందఱు బనివాండ్రను రావించి రాత్రితాముగుర్తించుకొనిన స్థలమున మూడునిలు

వుల లోతును ద్రవ్వించెను. అచ్చటనాకమ్మలో లిఖించినట్లైదు లక్షల వరహాలుగలవు. ఆవరహాలను విప్రునకొసంగును. అంతనావిప్రుడమం దానందంబునొంది "అయ్యా! యిచ్చోట ధనముండెనని మీరెట్లు గ్రహించిరి?" యన విక్రమార్కుడు, చైత్రశుద్ధనవమినాడు రాత్రిపది ఘడియలకు కంచి పెద్దగోపురపు మూడవయంతస్సునకుసరిగా మూడు నిలువులలోతున" యనిగదాయున్నది! కావునమూడవయంతస్తునీడ యారాత్రి పదిఘడియాల కెచ్చటనుండునో యచ్చట బాతిపెట్టబడెనని తెలియుచున్నయది. ఈయర్థముబుద్ధికుశలతగలవారికి దక్క తదన్యులకు బోధపడదు" అనిచెప్పి తనవృత్తాంతము నెఱింగించి యాతనిదోడ్కొని యుజ్జయిని కేగెను.

ఓ భోజభూపాలాగ్రణీ! ఇంటివాయాతని బుద్ధికుశలత దెల్పుకథ నీకడ నిట్టి బుద్ధికుశలతలేదు వెడలి పొ"మ్మనిన భోజుఁడు నాటి శుభ ముహూర్త మతిక్రమించినందున నంతఃపురము జేరబోయెను.

## (ఇరువది తొమ్మిదవ ప్రతిమచెప్పిన కథ)

ఆమరుచటిదినము భోజభూపాలుడు మంచి శుభముహూర్తము నిర్ణయించి నవరత్నఖచితమైనట్టిదియు, ముప్పదిరెండు ప్రతిమలు గలిగి నట్టిదియునైవిక్రమార్కమహీపాలునిసింహాసనమునధిష్ఠింపనాతురతతో నరుదెంచుచున్న భోజమహారాజును గాంచి సింహాసనమునందుగల ఇరువది తొమ్మిదవ ప్రతిమ యిట్లనియెను. ఓభూసురోత్తమా!

సీవీసింహాసన మధిష్టింప నాతురతతో వచ్చుచుంటివి. ఇయ్యదిసామా న్యముకాదు. కేవలము ఇంద్రునిచే యివ్వబడినసింహాసనము. అట్టి యీసింహాసన మధిష్టింపనర్హుఁ డొక్క విక్రమార్కమహీపాలుఁడే. ఆత నికిఁగల బుద్ధికుశలతగాని, యుదారభావముకాని, సాహసవిక్రమంబులు కాని నీయందు కానబడవు. అట్టిగుణంబులు కల్గు వారీభూవలయంబున వరుఁడు. ఆతని బుద్ధికుశలతను జూపుగథయొక్కటికలదు. అద్దాని నాలింపుము" అని యాసాలభంజిక భోజభూపాలునితో నుడువ నమ్మహీపాలుఁడు మిగులసంతసించి "ఓసాలభంజిక! విక్రమార్కనృపా లునికథలు వినినకొలది నాకుతనివితీరుటలేదు. అమ్మహీపాలుని వితరణ గుణంబులు వినినకొలంది వీనులు మరింత ఆతురతపడుచున్నవి. కావున నక్కథలు వినిపించి నన్ను కృతార్థునిజేయుము." అని నుడువ నప్రతిమ యిట్లుచెప్పదొడంగెను.

ఓభోజభూపాల చంద్రమా! విక్రమార్క మహీపాలునుజ్జయినీ పురమందు మిక్కిలి ధనము నార్జించిన యొక కాపుబిడ్డగలఁడు. వాడు తనవిత్తన మంతయు తనపడకగదియందు గుప్తముగ దాచియుంచెను. ఆకాపువానికి నలుగురు కుమారులుగలరు. కాని వారికీధనమును చేజిక్క నీయక తనగదియందు భద్రముగ పదిలపరచి, తనయవసానకాలము సమీపింపగనే తన నల్వురికుమారులను బిలిచి యిట్లనియె."ఓకుమారు లారా! నాయవసానకాలము సమీపించినది. మీరుయుక్తవయస్కులు కావున నే సంపాదించి దాచిపెట్టిన నాలుగువేల బంగారునాణెములు మీహస్తములందిడుచున్నాను. అయ్యది మీరు పదిలముగా వినియో గించి జీవింపుడు. నాయుత్తరక్రియలకొరకు మిక్కిలిస్వల్పముగవినియో గింపుడు. మీజీవనోపాధికొఱకుమీస్వార్జితవిత్తంబునేవినియోగింపుడు. అంతియేకాని మీరొకరినొకరు కలహింపకుడు. ఐకమత్యము కలిగి యుండుడు. సంఘీభావమే నగము బలము. అప్పుడునిమ్ము జయించు

వారెవ్వరు నుండరు. ఇదియే నా అభిమతము. అక్కఱకువచ్చు వస్తువుల కొఱకే యీధనము వెచ్చింపవలయును కాని, పనికిమాలిన వస్తువుల కొఱకు ధనమును వినియోగించిన లాభమేమియు నుండదు. అదియును గాక మీరు ముందుముందు సంసారతాపత్రయములు పడునప్పుడు, అనగా కుటుంబవ్యయమునకు చాలనప్పుడు, సంతానముకలిగినప్పుడు మీనలుగురార్జించిన ధనము చాలనోపు. అప్పుడు మీరధిక ప్రయాసలకు లోనగుదురు. అట్టికష్టములకు లోబడకుండగనే మరియొక ధనపాత్ర కలదు. అయ్యది నామంచముక్రిందనే యుండెను. దానిని మీనలుగురు సమభాగములుగ జేసికొని సుఖముగ జీవింపవచ్చును. అని చెప్పి కొన్ని దినములుండి యాకాపు తనసర్వస్వమును గుమారుల చేతులందిడి దివి నలంకరించెను.

తండ్రి పరలోకమున కేగిన కతిపయదినంబులకు వీరినలుగురలో నేకీభావము భిన్నమయ్యెను. కుటుంబకలహములు హెచ్చాయెను. వారి భార్యలలోగూడ నొకరికొకరు జగడమాడుచుండిరి. వీరి కలహములే కారణముగ తండ్రిదాచియుంచిన ధనమును భాగించుకొన సంకల్పించుకొని యొకరిసంపర్కమొకరికి లేకుండ నేర్పరించుకొని తండ్రి శయనాగారమందున్న ధనపాత్రను నలుగురుద్రవ్విరి. ఇరువది గజముల లోతున ద్రవ్విచూడధన మగుపడలేదు. మరికొన్ని గజములలోతు త్రవ్విరి.-కనిపించుటలేదు ఇంకనుత్రవ్విరి. ఏ త్తనముజాడయే కనబడలేదు. ఇంకనుత్రవ్విచూడ ధనముగుపడలేదుగాని, నీరూరుట కనబడెను. ఒకరినొకరు జూచుకొనుట ప్రారంభించిరి. వారిలోనొక్కరు డెవరో ఆధనము నపహరించి యుండుననే యనుమానమేకాని, వీడేధనమపహరించెనని చేయెత్తి చూపుటకు దగినయాధారము కానబడలేదు. అనునైనమార్గమూ తోపలేదు. అందరొకేవిధముగ గన్నీరు జారవిడిచిరి విచారించిరి. చివరకు తగవులాడిరి. వీరితగవులు యిరుగుపొరుగిండ్లకు

బాసికెను. వీరినల్వురు సరుగు పొరుగువాళ్ళను తగవు పరిష్కరింపుడని కోరిరి. ఎవరికి నేయుపాయము తోచలేదు. అందెవ్వరో యొక్క రాధన మపహరించియుందురని చెప్పినవారే కాని వీడే తీసియుండునని చెప్పుట కెవరికిని సాహసము చాలియుండలేదు. ఈతగవెట్లు పరిష్కరింబనునా, పరిష్కరించువారు లేనే లేరా! అని మరింత విచారించుచుండ నొక పెద్దమనిషి వారినల్వురిని పిలిచి యిట్లనియె. "అయ్యలారా! మీరు విచారింపబనిలేదు. ఏలనన యీపట్టనంబు పాలించుచున్న విక్రమార్క మహీపాలుండు మిక్కిలి మేధాశక్తిగలవాడు. అట్టిమేధావంతుడీ భూవల యంబున లేడు. మీవాదము బరిష్కరింప జేయగల మేధాసంపన్నుడా విక్రమార్కమహీపాలుడే. ఆతనియొద్దకుబోయిన మీతగవు నిక్కు వంబుగ బరిష్కరింపగలడు." అని సలహాచెప్పగా నానలుగురు విక్ర మార్కునియొద్దకుపోయి తమవృత్తాంతమంతయు వినిపించిరి.

అమ్మహీపాలు డావృత్తాంత మంతయు విని యయ్యది మిగుల చిత్రముగానున్నది అని మనంబున తలచి, వారినల్వురను దగ్గఱకు పిలిచి మీ వివాదము పూర్తియగుటకు నాలుగు మాసములు పోయిన పిదప రండు. అంతదనుక మీ నల్వురు కలిసిమెలసి యుండుడని చెప్పి పంపి వైచెను.

కొంతకాల మయ్యెను. నాలుగు మాసములు పూర్తియగుటచే నల్వురు సోదరులు విక్రమార్క మహీపాలుని సన్నిధానమునకు విచ్చేసి నమస్కరించి నిలువబడిరి. వారి నల్వురనుజూచి విక్రమార్క భూపా లుండు "ఓయీ! నేడేలనో నాకు తాపముగ నున్నది. నాబడలిక తీరునరకు సంతోషముతో నేటిసాయంకాలము గడుపనెంచితిని. అంత మీరరుదెంచిరి. మిమ్ముల్లను పొమ్మనుట యుచితముకాదు. కావున వినోదమునకు గాను నేనొక చక్కని కథచెప్పెద. అయ్యది మీ నల్వురు నాలించి మీ గృహములకు పొండు" అని యీక్రింది కథ

విక్రమార్కుడుయిట్లుజెప్ప దొడంగెను.

చందనావతి యను పురికలదు. దానిని చంద్రసేనుడను రాజు పాలించుచుండెను. ఆతనికి శీలవతి యను కుమార్తెకలదు. ఆమె చక్కని చుక్క. వివేకవతియు నంతకన్న శీలవతియు. విద్యలకు సరస్వతి. సమస్త శాస్త్రముల నభ్యసించిన నారీమణి. ఆయమ సంగీతమభ్య సించుట యందెక్కుడు ప్రీతి. కతిపయ దినములకే కంకుభట్టను బ్రాహ్మణునియొద్ద సంగీతమభ్యసించియసమానమైన పుణ్యము సంపాదించెను. వేయేల! ఆమెయన్నివిద్యలయందు దసమానపాండిత్యము సంపాదించియుండె ననుటయు నతిశయోక్తి కానేరదు. ఒక్కనాడు చంద్రసేనుడు తనకుమార్తెను జేరంబిలిచి యిట్లనెను. "అమ్మా! నీకు సమస్త విద్యలు కరతలామలకములుకదా! సంసారభారము వహించుటకు ముదిమి ఛాయలు తొంగిచూచుచున్నవి. నీకింక వివాహమునకై వరుని జూడవలెను. నీవు సామాన్య బాలికలతో గలిసి గురువునింటికిబోయి విద్య నేర్చుట తగదు. లోకజ్ఞానము తెలిసి యున్నదానవు. కావున యిప్పటికి నీ విద్యచాలించి మీ గురువుగారికి, నీ కింతకాలము విద్యగఱపినందు లకుగాను గురుదక్షిణ యొసంగి, యాతని కోరిక నిష్కల్మష హృదయముతో నెరవేర్చి, ఆతని విలాసభవనమున ప్రవేశింపుము అనిన తండ్రి పలుకులువిని శీలవతి సమ్మతించి విలువలేని రత్నములను, ముత్యాల హారములను కనకపుబళ్ళెరమున నునిచి యొక్కదాసి వెంటగా గొని గురువు గృహంబునకు బోయెను. గురువుగారు, శీలవతి తన గృహంబునకు విచ్చేసినందుల మనంబున నెంతయు సంతసించి వెంటవచ్చిన చెలికత్తెను పల్లమటనుంచి యింటికి పొమ్మని ఆజ్ఞాపించెను. శీలవతియు నందుల కంగీకరించెను. శీలవతి గురువుగారిని నమిూపించి గురూత్తమా! మాజనకుడు నన్ను మిూ విలాసభవనమున ప్రవేశింపుమని చెప్పి పంపెను నేనావని నెరవేర్పకుండగనే మా శక్త్యానుసారము మాకు గలిగిన యీ

గురుదక్షిణ దీసికొని వచ్చితిని. వీటినిగైకొని నన్ను క్షమింప బ్రార్థన. ఈ దీనురాల ననుగ్రహింప బ్రార్థన. అని వేడుకొనెను.

ఆ బాలామణి పల్కినపల్కు లాలించిన కంకుబట్టు యిట్లనియె. "శీలవతీ! నాకీ రత్నమయభూషణాదు లేల? నావంటివారి కెందులకు? వీటితో నాకేమి నిమిత్తంబుకలదు?" అనిపలుక శీలవతి, తాదెచ్చిన గురు కట్నము చాలదని కాబోలు మాగురువుగా రిట్లనుచున్నారని తలపోసి "మహాత్మా! సంకోచమేల?" మీకు గావలయు వస్తువులేవో కోరుడు. నేను వాటిని తప్పక యిచ్చెదను.

నే నిచ్చిన కానుక స్వల్పమని తలంపకుడు. నేను మీ శిష్యురాలను కానా? మీరు నాకు గురువులు కారా? మీ యభీష్టము నెరవేర్చుటయే నా యభిమతము. మీ యిచ్ఛవచ్చినది కోరుడు. సంసిద్ధురాలనై యున్నాను. అట్లుకానిచో నాతండ్రి కెరింగించి మీ కోర్కెనీడేర్చెద. చెప్పుడు. సంకోచమేల! అని పెక్కువిధముల నా శీలవతి గురువును ప్రార్థింప, నాతడింకను తన మనోభీష్టమును చెప్ప సంకోచించుచుండుట గాంచి శీలవతి ఆర్యోత్తమా! ఏల సంశయించెదరు. తమ కోరికేదైనను తప్పక నెరవేర్చెదను. అదేదియో సత్వరముగ చెప్పుడు. అని నిర్బంధించెను.

అంత గురువు "భామరో! ఆ మాటయందే నిలచియుండువా! మాట తిరుగకూడదు సుమా! ఆడిబొంకనినాడే స్వర్గమునకుమార్గము! ఇంక నామనోభీష్టమును చెప్పుచున్నవాడ నాలింపుము. నీ యలౌకిక సౌందర్యభావము నాకన్నులను పూర్తిగా కప్పివైచెను. నీ మోహముద్రలకారణముననే నామనఃబింబక మన్మథవికారమునకులోనయ్యెను. అదిప్పుడు పూర్తిగా నన్నావరించినది. అంతకుమున్నే నీయందు నా మనస్సు లగ్నమయ్యెను. నీ మోహవాహినియందు నేనొక బిందువై యెచ్చటికి కొట్టుకొని పోవుచుంటినో నాకే తెలియదు. నీ పొందుగోరు

నభిలాష నాకిదివరకే యున్నది. అయ్యది యెరింగించిన నేమి ముప్పు వాటిల్లునో యను భయము నాకు కలిగెను. ఈవిషయము మీ తండ్రి కెరింగింతువేమో యనెడి భయంబున నీకీ యుదంతంబు తెలుపనైతిని. నాకోర్కెనీడేర్చుటయే నీవు నాకొసగు గురుదక్షిణ. అట్టి గురుదక్షిణనే స్వీకరించిన నీతోగూడ ప్రేమాంబుధిని నరిగంగస్నానము లాడుదును. లేనిచో వియోగసముద్రమునందు త్రాడుతెగిన పడవవలె నెటకో కొట్టుకొని పోవుట నిక్కంబు. అటుపైన మరణమే శరణంబు. అని పల్కిన నా శీలవతి తన మనంబున నిట్లు వితర్కింపసాగెను.

ఆహా! భగవంతుడు నాకేల యీ సౌందర్యమిచ్చెను? నాయీ సౌందర్యమనే ప్రభావంబుచేతనే కదా సుప్రసిద్ధ బ్రాహ్మణవంశమందు జన్మించిన మా గురువునకిట్టి నీచమగు కోర్కె జనించుటకు కారణము. ఏల నా యీ తుచ్ఛప్రాణము లీయభాగిని నాశ్రయించుకొనుట! ఈ మహాభాగుని కోర్కె నీడేర్చితినా మానభంగము నిక్కంబు. లేదా! యీతడు మరణించుట నిశ్చయము. మాటతప్పితినా నావాగ్దానమునకు భంగమువాటిల్లును. ఇటు- సత్యవాక్యపరిపాలనా భంగము. అటు-సద్బ్రాహ్మణ హత్యాపాతకము. గురుధిక్కారము మహాపాతకము. నన్ను జుట్టుముట్టి, నన్ను పాతాళమున కణగద్రొక్కి వధియింపకుందునా? అని తన మనంబున బహుభంగుల నా శీలవతి వితర్కించుకొనుచుండెను. వెండియునిట్లనియె. ఆర్యోత్తమా! మనంబున విచారము విడువుము. నేనుతప్పక మీకోర్కె నీడేర్చు భారము నాయది. తొందర పడకుడు. ఇప్పుడీకార్యమున నేను సాహసించితినేని మీకును నాకును నాజనకునకును బంధుమిత్ర జనంబులకును తీరని విచారము చేకూర్చిన దాన నగుదును. కావున కతిపయ దినంబులలో నాతండ్రి నాకు వివాహమొనర్చును. అంతవరకు మీరు వేచియుండుడు. లేని యెడల నన్నెవ్వరు పరిణయమాడ నంగీకరింపరు. నా నాథునితో కలి

యుటకు బూర్వమె మీ సన్నిధానమునకు విచ్చేసి మీ పెన్నిధాన ముగ భావించి మీ మనోభీష్టమునీడేర్చి మిమ్ముగలను కృతార్థునిజేయు భారమునాయది. ఇది నిక్కము. ఇందెంతమాత్ర మసృతములేదు. అని తాదెచ్చిన గురుకట్నము అచ్చటనే విడిచి పోయెను.

కొన్ని మాసములు గడచిన తరువాత చంద్రసేనుడు తన కుమార్తెను తగిన వరునకిచ్చి మంచిశుభముహూర్తమున పెండ్లిగావించి మహావైభవముతో నూరేగించెను. వివాహమైన రాత్రియే రాకుమారి సమస్త భూషణాదులను దాల్చిశయ్యాగారమున దనరాకకెదురుచూచు చున్న నాధుని యెదుటనిలిచి నమస్కరించి యాతని యాజ్ఞను గైకొని తన సంగీత ప్రావీణ్యమునుజూపి తననాధుని సంతసింపజేసెను. అర్ధరాత్రి సమయముగావచ్చెనను విషయముగ్రహించి మగనిమోాల మోకరించి తన నాధునితో నిట్లుచెప్పెను. నాధా! మీదాసి ప్రార్థన మొక్కటికలదు ఆలింపుడు. నేను బాల్యమునుండియు సమస్తవిద్యలను కంకు భట్టను గురువర్యునియొద్ద నభ్యసించితిని. కొంతకాలమిట్లు జరుగ నొకనాడు నాతండ్రి నన్నుబిలిచి, అమ్మా! నీకు యుక్తవయస్సు వచ్చి నది. నీగురువునకు గురుదక్షిణ తీసికొని వెళ్లుము, అనిచెప్ప నేనందుల కంగీకరించి రత్నభూషణాంబరములను దీసికొనిపోయి యియ్య నాతడు నిరాకరించెను. "అదేమి?" అని ప్రార్థించి యడుగ నాతడు కొంత సేపటివఱకు జెప్పసంకోచించెను. తరువాత నాతడిట్లు చెప్పెను. "శీల వతీ! నాకెందులకు రత్నభూషణాదులు. వీటితో నాకునిమిత్తంలేదు. నామనంబుననుండుకోరిక యియ్యదికాదు. నీ యంగచందములు నన్నా కర్షించినవి. నాదెట్టికోర్కెయయినను నీడేర్తునని వాగ్దానము చేసితివి. నేగోరినది నీనమేయగుగాక! అది యెట్టిదైనను యవశ్యము తీర్చెదనని మాటయిచ్చితివి. మాటతిరుగుట మానధనులకు పాటికాదు. సత్యమే స్వర్గమునకు మార్గము. కావున నీపొందుగోరి సుఖింప వాంఛగలదు.

అదియే నీవునాకొసగు గురుదక్షిణ” అని నుడువ నేనాతనితో నిట్లం టిని. ఆర్యా! నన్నిప్పుడు నిర్బంధింపకుడు. విగాకువాగ్దాన మొసగి మరల పోవుదునా? నిక్కువంబుగ మీయభీష్టము నీడేర్చు భారమునాయది. అందుకుగాను నానాథునితో నీవిషయముజెప్పి యాతనియనుజ్ఞ గైకొని, యాతనిఁగోగలి ఘుటకము న్నె వచ్చి మీకోర్కెదీర్చెదనని వాగ్దానముచేసియుంటిని. అందులకత డియ్యకొనెను. కాని యతడు నిక్కువంబుగ నన్ను మోసగించలేదు. అట్టిచిహ్నములేమియు యాతని యందుకానబడవు. నాసత్యవ్రతదీక్షను పరీక్షింపగోరి యట్లొనరించెను. నాదృఢవిశ్వాసము కావునఓనాధా! మీరు కరుణించి నాసత్యదీక్షా వ్రతమును కాపాడజేయుడు. అని శీలవతి తననాథునితో నుడువ నాసుగుణశాలియగు రాకుమారుడు “తరుణిరో! సంకోచింపకుము. అవశ్యము గురువువాంఛను దీర్పుము, పరమేశ్వరునితో సమానుడు. ఆతనిని సంతుష్టిపరచుటే పరమేశ్వరుని సంతసింపజేయుట. నీతండ్రి కూడ నాతడు కోరినదాని నొసంగుమని నుడివి నిన్ను బంపెను. అతడు నిశ్చయముగ నీమనోవీధినెరుంగుటకింత చేసియుండును. కావున పోవునపుడుకొన్ని మధురపదార్థములను వెంటదీసికొనిపొమ్ము” అని చెప్పి శీలవతిని గురువునింటికి పోవుట కనుజ్ఞయిచ్చెను.

భర్తయనుజ్ఞగైకొని శీలవతి సర్వాలంకారభూషితయై గురువు నభీష్టంబు నీడేర్పనుద్దేశముతో పడకగదినివీడి యానిశీధసమయంబున బోవుచుండి మార్గమధ్యమున కొందరు చోరులామె నడ్డగించి ఓసీ! నీవు ధరించిన కంఠాభరణములెల్ల నిచ్చెదవా? లేక యీదండముచే నీతలబ్రద్దల గొట్టుమనెదవా! త్వరగాజెప్పుము. అనిన నారాజకుమారి సోదరులారా! నన్ను బాధింపకుడు. మీరు కోరినయట్టి యాభరణముల నన్నిటిని మీకొసగెద. కాని నాగురువుగారింటికి బోవుచుంటిని. ఆయన తో నేనలంకారభూషితనై వచ్చెదనని వాగ్దానము చేసియుంటిని.

అతడు నాకై నిరీక్షించుకొని యుండును. ఆతడు నన్నాశించెను. ఆతని కోర్కె దీర్చుటకు బోవుచుంటిని. తిరిగి వచ్చునపుడు మీరు కోరిన ప్రకారము నా భూషణాదులన్నియు మీ కొసంగెదనని పలువిధముల బ్రతిమాల నా చోరులు, కాంతామణీ! ఎందులకీ ఓటిమాటలు! నీ మాటలయందు మా కేమి నమ్మకము? నీవువేరొకమార్గమున బోయినచో మేమేమి చేయగలము? నేనుతిరిగి యిటువచ్చెదననుట యేటిమాట? నీవు వచ్చునందాక మేముండిన నుందుము, లేదా పోయిన పోదుము. విధి ప్రతికూలముగ నుండెనా, మేమందరము రాజభటులకు బట్టుబడి కారాగృహప్రాప్తి నొందుదుము. ఏక్షణమున కేది యెట్లు పరిణమించునో నిర్ణయింప నెవ్వరికి శక్యము? కావున నీ మాటలయందు మాకు నమ్మకము చాలదు. ఆవస్తువుల నిటబెట్టుము, అని చోరులు పల్కినపల్కులు విని శీలవతి, అయ్యలారా! మీరుచెప్పు మాటలయందసత్యము లేదు. కాని నాయీ పల్కులు సత్యజీవనమున కాధారములు. సత్యమేజీవన వ్రతము కలదానను, నా ప్రాణములు విడుచుటకైన నంగీకరింతు గాని, సత్యమును వీడుట కంగీకరింతునా? మీకచ్చట లేకున్నచో మీరువచ్చినంతదనుక గోడికూత వేళవఱకు నేనిచ్చట వేచియుండెదను. అట్లుమీరు రానియెడల నేను నా సౌధమునకు బోయెదను. కావున మీరీ ముద్రికను తీసికొనుడు. ఏలనన, మీకీ భూషణములు నేడిచ్చుటకు వీలులేనియెడల, దీనినానవాలుగ దీసికొని మీరుతిన్నగ నా సౌధమునకు విచ్చేయుడు. అచ్చట మీకు గావలసి నన్ని యాభరణములిచ్చెదను. రాజభటులు దండింతురన్న భయము మీకు వలదు. అద్దానికి ఉత్తరవాదిని నేనుగాని మీరు కారు. గురువు దేవుడువంటి వాడు. అట్టివాడు నన్ను కోరుటచే నేనవశ్యము యీ భూషణాదులతో బోవలయు. ఆతనికి వాగ్దానము చేసితిని. ఆతని కోర్కెనెరవేర్ప వ్రతము బూనితిని. ఇందు నాకేమియు నాటంకము రానీయకుడు. ఒకవేళ నేనీ

భూషణాదులను ధరింపకుండ బోతినేని యాతఁడేవగించుకొని శపించిన శపించవచ్చును. తిరిగివచ్చుటలో మీకానగలన్నియు నిచ్చి నాకై నిరీక్షించుచున్న నాపతిని గలిసికొనవలయు, నంతవరకు మీరిచ్చుటనే యుండుడని శీలవతి, పలుక నా చోరులు మిగుల సంతసించి, యిట్టి రాకుమారి నెన్నడు గని విని యెఱుగము, అని తమలో దామనుకొని యామె పల్కులకలరి పోయిరమ్మని యాజ్ఞయిచ్చిరి.

పిమ్మట నా తరుణి గురువుకొద్దకు బోయి నమస్కరించి కట్టెదుట నిలువబడి యిట్లువిన్నవించెను. గురూత్తమా! మీకోర్కె నెరవేర్చుటకై నా నాథుని యాజ్ఞగైకొని వచ్చితిని. నేవచ్చు మార్గమధ్యంబున కొందరు చోరులు నన్నడ్డగించుటచే విళంబమయ్యెను. క్షమింపబ్రార్థన. అంత నాగురువు శీలవతీ! ఏమేమి! చోరులు నిన్నడ్డగించిరా? వారిని వేడుకొని వచ్చితివా? అదెల్ల సవిస్తరముగ వినిపింపుమనిన నాయుదంతమెల్ల శీలవతి గురువున కెరింగించెను. ఆయుదంతంబెల్ల విని గురువు యామె శీలప్రవర్తనమునకెంతయు సంతసించి నిష్కల్మష హృదయముతో మోహమును విసర్జించి యామెతో నిట్లనెను. రాజకుమారీ! నేజేసినతప్పుల క్షమింపబ్రార్థన. బుద్ధిచాంచల్యముచే నేనట్టి కోరికగోరితిని. అనిత్యములగు యీతుచ్ఛ సౌఖ్యములు నిత్యములని భావించి నేనిట్టిపాపమున కొడిగట్టబోతిని. నీవు నా కుమార్తెవంటిదానవు. నా యకృత్యములు తలంపున నుంచక నా యపరాధముల నన్నిటిని సహింపుము. ఈ భూషణాదులను దీసికొనిపొమ్ము. నీరాకకై నీపతి యెదురు చూచుచుండును. అనిపల్కి గురువు మరికొన్ని భూషణాదులను, పసుపుగుంకుమల నిచ్చి యింటి యాడుపడుచును బంపునట్లు బంపెను.

ఆయమ గురుని గృహమువీడి తన మనంబున మానభంగమేదియు గాకునికి మిక్కిలి సంతసించుచు జోరులకు వాగ్దానము చేసిన

ప్రకారము వారి యాగమనమునకై నిరీక్షించియుండెను. కొంతసేపటికి చోరులు మిక్కిలి ధనముగొని నచట కరుదెంచిరి. అంతనా శీలవతి అన్నలారా! వచ్చితిరా రండు. మీ యాజ్ఞప్రకారము నేనిదె వచ్చితిని. ఈ భూషణములను స్వీకరింపుడు. నాగురువు తనబుద్ధి మరల్చుకొని పోయిరమ్మని వెంటనే నన్ను సాగనంపెను. నాపతినాకై నిరీక్షించియుండును. అని చెప్పగా నాచోరులు తల్లీ! మే మిల్లు విడిచి వచ్చుచుండ నీవు శకునమైతివి. ఫలితముగ నేడు మేము విశేషధన మార్జింపగలిగితిమి. నీ సత్యవాక్పరిపాలన మెంతయు శ్లాఘనీయము. నీ భూషణములు మా కవసరములేదు. మేము కొన్ని విలువైన భూషణముల నిచ్చుచుంటిమి. వీటిని స్వీకరించుము అని చెప్పి వారుకొన్ని నగలను యిచ్చి ఆమెను రాజసౌధమువరకు సాగనంపిరి.

తనరాకకై నిరీక్షించుచున్న పతిపాదములపై బడి నమస్కరించి జరిగిన యుదంతంబెల్ల నా శీలవతి తన భర్తకెఱింగింప నాతడు మిక్కిలి సంతసించి మనసార శీలవతిని తన కౌగిటజేర్చుకొని భామరో! నీవు పోయిన వెంటనే నామనంబునందొక విచారముపొడసూపె. అయ్యది నీవొంటిగ నిశీథసమయంబున యిల్లువిడిచి పోవుటయే తోడెవ్వరులేరు కదా! నీవెట్టికష్టములకు లోనగుదువోయని నేనే స్వయముగ ఖడ్గమును బూని నీవెను వెంటనే వెంటాడితిని. నీవు చోరులతో సంభాషించినది. అట్చటనుండి గురువుగారింటికిబోయి నీవు సంభాషించిన సంభాషణ, అంతయు మారువేషములో నుండియే నే వినుచుంటిని వేయేల నే నన్ని విషయములు స్వయముగా గని వినియుంటిని. అని యా రాకుమారుడు శీలవతితో జెప్ప నాదంపతు లిరువురు సంతోష పారావారమున దేలి యాడిరి. చిలుకా గోరింకలవలె వారి యనురాగమునకు మేరలేదు. ఆదంపతులు పెక్కుధర్మంబు లాచరించి చాలకాలము రాజ్యమేలిరి.

ఓయీ! కాపుబిడ్డలారా! వింటిరికదా కథంతయు! ఇందు పాత్రి

ధారులు రాజకుమారుడు, శీలవతి, కంకుభట్టు, చోరులు, ముఖ్యపాత్రలు. వీరలయందెవ్వ డధికుడో కారణము చూపుచు మీ నల్వురు తాళపత్రములపై వ్రాసి, బాగుగ నాలోచించి, తమ తమ యభిప్రాయములను దెలియపఱుపుడని చెప్ప, వారలట్లే వారి యభిప్రాయములను వ్రాసి విక్రమార్క భూపాలునకిచ్చిరి.

విక్రమార్కుడా వ్రాసిన నల్వురి పత్రములను దీసిచూడగా నందు పెద్దవాడు రాజకుమారుని బొగడుచు, దనభార్య పరునితో గలియదన్ను సెలవీయుమని నంతనే యనుజ్ఞనొసంగి పంపెను. ఇట్టి గుణవంతు డెందైనగలడా? వీడే యందరిలో నధికుడని వ్రాసెను.

రెండవవాడు శీలవతిని బొగడుచూ వ్రాసెను. సత్యవాక్పరిపాలనా దీక్షకై సత్యదీక్షయే మోక్షసాధనమని తలంచి గురువుకోర్కె నీడేర్చుటకుగాను నిష్కల్మష హృదయముతో బోయెను. ఆమెయే యందరిలో నధికురాలు అని వ్రాసెను.

మూడవవాడిట్లు వ్రాసెను. కంకుభట్టు మిక్కిలి యుత్తముడు. ఏలనన నిష్కల్మషహృదముతో నన్నుగూడ వచ్చినశీలవతి గాంచినంతనే తన చిత్తమును మఱల్చుకొని కుమార్తెవలె దలంచి తన యభీష్టమును విసర్జించి యామెను సాగనంపెను. అతడే యందరిలో, నుత్తముడని వ్రాసెను.

నాల్గవవాడిట్లు వ్రాసెను. గురువు నభీష్టము నీడేర్చ నభిప్రాయముతో బోవుచున్న శీలవతిని మార్గమందు చోరులడ్డగించిరి. వారిని బ్రార్థించిన మాత్రాన వారామెను విడిచిపుచ్చుటయే కాక కొన్నినగలనిచ్చి రాజప్రసాదమువరకామెను సాగనంపిరి. అట్టి యుదారస్వభావము చోరులలో నుండుట యాశ్చర్యము, కావున వారలే యధికులు అని వ్రాసెను.

వారి యభిప్రాయములను దెలుకొని విక్రమార్కమహీపాలుండు

వారి నల్వురిని వారివారి గృహంబులకు బొమ్మని చెప్పెను. మరికొన్ని దినంబులు గడచిన పిమ్మట విక్రమార్కుడు నాల్గనవానిని రహస్యముగా రప్పించి వానితో నిట్లనియెను.

"ఓయీ! మీ వివాదము నేను గేపటిదినంబున బరిష్కరింప దలంచితిని. అందులకు నాకొకచక్కనిమార్గము గోచరించినది. ఆవిత్తము నపహరించినవాడు అంత విశేష వంతుడుగాడు. కావుననే వాడు తాం జేసిన నేరమును దానే బయల్పెట్టుకొనెను. లోకులాతనిని నేరస్థుడని నిర్ణయించిన పిదప వానిని శిక్షించక మానరు. సాధారణముగా జోరునకు శాసనప్రకారముగ గఠినశిక్ష విధించబడును. ఆ చోరుడు మీ నల్వురి సోదరులలోనె గలడు. నిష్కారణముగా మీలో నొక్కడు శిక్ష యనుభవించినచో వాని భార్యాబిడ్డలు తిండిలేక పెక్కుకష్టములకు లోనగుదురు. మిగిలిన ముప్వురు సోదరులును దొంగిలించినధనము సమభాగములు జేసికొని భార్యాపుత్రులతో సుఖజీవనము చేయుదురు. అట్టి నేరస్థుని కుటుంబము కష్టములపాల్జేయుట కిష్టములేకయే నేను యింత వరకు దీర్పుజెప్పకయే జాగుచేసితిని. రేపటిదినంబున దప్పక మీ తగవును బరిష్కరించి నేను దేశాటనకు బోవుదు" నని చెప్పిన యాతండా పల్కులాలించి గజగజ వణంకచు విక్రమార్కుని పాదములపైబ్రాలి "మహారాజా! బుద్ధిచాంచల్యముచే నాధనమును దొంగిలించిన నేరస్థుండను నేనే. ఆధనమును గొండొకచోట బదిలపఱచియుంచితిని. నా నేరమును మన్నింపుడు. అందొక చిల్లిగవ్వయైన నేను వినియోగించి యుండలేదు. ఆధనమునందు భాగము నాకీయనవసరము లేదు. నేను తిరిపెమెత్తుకొని జీవించెదను. ఆధనమును నా ముప్వురు సోదరులకుబంచి యిండు. నన్నుక్షమించి విడిచిపుచ్చుడు." అని యాతడు భూపాలుని పాదములు విడువక పెక్కువిధముల బ్రార్థించెను.

విక్రమార్కుం డాతనిపై దయదలంచి వాని శిక్షయుప్రధాన

మొసంగి యిట్లులనియెను. "ఓయీ! నీవు సత్వరంబుగా బోయి ఆ ధనమును దీసికొనిరమ్ము. ఆధనమును మీనల్వురు సోదరులకు సమముగా బంచియిచ్చెదను. పిమ్మట మీనల్వురు సోదరులు తొల్లిటివలె సుఖముగా జీవయాత్ర సాగించవచ్చును. నీవు ఆధనమును దొంగిలించినట్లెరికిని దెలియనీయను" అని చెప్పి పంపివైచెను.

మరునాఁడు విక్రమార్క భూపాలుఁడు నల్వురుసోదరులను రప్పించి, సమముగ ధనమును బంచియిచ్చి, యెప్పటివలె వారి నన్యోన్యత గలిగి యుండుఁడని చెప్పి ధనముదొరకుటచే దొంగిలించినవానిని జేయెత్తి చూప నవసరము లేదని చెప్పి పంపివైచెను.

"ఓ భోజభూపాలచంద్రమా! వింటివా యాతని బుద్ధికుశలత దెల్పుకథ. ఆతనిబోలిన భూపాలుండీ జగంబునగలఁడా? అట్టివివాదమును బరిష్కరించుటకు సామాన్యులకు శక్యమా? అట్టి బుద్ధికుశలతగాని మేధాసంపత్తిగాని నీయెడలేదు. కాన నీ వీ దేవేంద్రదత్తమగుసింహాసన మధిష్ఠింప ననర్హుఁడవు. వెడలి పొ"మ్మనిన భోజభూపాలుఁడు నాఁటిశుభముహూర్తమతిక్రమించినందున నంతఃపురము జేరిబోయెను.

## ముప్పదియవప్రతిమ చెప్పినకథ.

మరునాఁడొక్క శుభముహూర్తమున భోజభూపాలుఁడు సింహాసన మధిష్ఠింపరాగ ముప్పదియవసోపానమునగల సాలభంజిక యాతనినివారించి యిట్లులనియెను. "భోజభూపాలచంద్రమా! విక్రమార్కునికిగల

సాహసౌదార్య వితరణగుణంబులు నీకడగలవేని యీసింహాసన మధిష్ఠింపుము. లేనిచో నీ వీ గద్దెనధిష్ఠించుటకు నసమర్థుడవు.వినుదలంతువేని విక్రమార్కుని వితరణగుణంబులు దెల్పెద నాకర్ణింపు" మని యాప్రతిమ యాతని యనుజ్ఞగొని యీక్రింది కథజెప్పెను.

ఒకప్పుడు విక్రమార్కుడు సకల సామంతరాజులును, నమాత్యపుంగవులును,బండితప్రకాండులును, బురోహితులును, భృత్యులును గొలువ నీద్వాత్రింశతి సాలభంజికలు గల యీసింహాసన మధిష్ఠించి యుండు పేరోలగంబున నుండి యాసభారంగమున కొక మాంత్రికుండరుదెంచి విక్రమార్క భూపాలునకు వినయపూర్వకముగా నమస్కరించిన లెంత,విక్రమార్కుం డాతనిని వీక్షించి"ఓయీ! నీవెవ్వరవు? నీయూరెయ్యది? నీవేకతంబున నిచ్చోటికరుదెంచితివి? తెల్పు" మనిన నామాంత్రికుండుసాష్టాంగ దండప్రణామము లాచరించి యిట్లనియెను.

"దేవా! నేనొకమాంత్రికుడను. నాకు బూర్వమునుండియు నింద్రజాల మహేంద్రాది విద్యలయందు మిక్కిలి ప్రావీణ్యము సంపాదించియుంటిని. దేవరవారిటువంటి విద్యలను బెక్కురు యీసభారంగమునందు బ్రదర్శించుట వీక్షించియే యున్నారు. వారు హారికున్న యింద్రజాల మహేంద్రజాలవిద్యాపాటవము తమపరోక్షమున జూపి తమమెప్పులను బడసియేయుందురు. నానేర్చిన విద్యగూడ దేవరవారు పరీక్షవలయునని వేడుచున్నాడను." అని నుడివిన విక్రమార్కుండును, "ఓయీ! మేమెల్లరము నిప్పుడు రాచకార్య నిమగ్నులమైయుంటిమి. కావున నీవిద్యానైపుణ్యము జూచుటకిది సమయముగాదు. రేపటి దినంబున నాయీసభాగారమునందు బ్రదర్శింప సర్వాయత్తమై యరుదెమ్ము. అంతవరకు నీకు గావలయు భోజనసామాగ్రివసతులు మా సత్రాధికారియొద్ద దీసికొని యుండు బండుకొ"మ్మనిచెప్పి సేవకుని సాయమిచ్చి పంపివేసెను. తరువాతవిక్రమార్క భూపాలుండు, తాను

పరిష్కరింప వలసిన రాచకార్యములగూర్చి మంత్రిసామంతాదుల సహాయమున బరిష్కరించి నాఁటిసభఁ ముగించెను.

మరునాఁడుసూర్యోదయమాయెను. విక్రమార్కమహీపాలుఁడు సత్కకర్మానుష్ఠానముల నిర్వర్తించుకొని సభామంటపమున కరుదెంచెను. అంతకుమున్నె మాంత్రికుని యింద్రజాల మహేంద్రజాలాది విద్యను వీక్షింపవలయునను నాతురతతో సభాస్థలియంతయు సామంత భూపాలురతోను, బండితప్రకాండులతోను, బురోహితులతోను, నమాత్యపుంగవులతోను, సేవకాజనముతోడను, రాజకీయోద్యోగులతోను, బురజనులతోడను గిక్కిరిసి యుండెను. విక్రమార్క మహీపాలుఁడు సింహాసన మధిష్ఠించి యింద్రజాలికునకు దన విద్యాపాటవంబును బ్రదర్శింప రమ్మని తెలుపనొక సేవకుని బుత్తెంచెను.

అంత గొంతసేపటికి స్థూలకాయుఁడును నాజానుబాహుండును రక్తసిక్తములైన యక్షిద్వయమునుఁ గారునలువుగలిగిన కోరమీసములును శత్రురుధిరంబున రత్నాయుధంబుఁజేయు శ్వేతాయుధంబు దన కరంబునదాల్చి రక్తాంబరధారుఁడై చూపరులకు భీతిగొల్పునొకవ్యక్తి, అసామాన్యసుందరియు నలోకసౌందర్యవతియు నయినయొకనారీ రత్నమును దనవెంట నిడికొని విక్రమార్కభూపాలుని సభారంగమును బ్రవేశించి యాతనికి సవినయముగా నమస్కరించి నిలిచెను. అంత నా భూపాలోత్తముఁ డాతనిఁగాంచి "ఓయీ! నీవెవ్వరవు? నీపేరెయ్యది? నీయూరెయ్యది? నీవిచ్చటకు రాగతంబేమి? ఈలలనారత్నంబెవ్వతె? నీ వాలకంబుగాంచిన నీయందేదియో గొప్ప విశేషంబున్నట్లు నామనంబు నకుదోఁచుచున్నయది. కావున సత్వరంబున నీవృత్తాంతమంతయు సవిస్తరముగా నాకెఱింగింపుము." అనిపల్కిన నాతఁడు భూపాలునకు బునఃప్రణామమాచరించి యిట్లులనియెను. "ప్రభూ! నేను చతుస్సామ్రాజ్య శ్రీధురంధరుఁడైన పురూరవుని సేవకుఁడను. ఒకనాఁడు

కొండొక కార్యాంతరముచే గొలువుకూటంబున కేగుట ఆలస్య మాయెను, నా యాలస్యకారణంబున నాటిదినమున బరిష్కరింపబోవు నొక కార్యము భగ్నమాయెను. అందుపై నా ఖండలుండు రోషావేశా యుతలోచన ఘూరితుండై నన్నుజూచి మండిపడి "ఓరీ! చెడుగా! యువ్వన మదాంధుడవై కన్నుమిన్నుగానక స్వామికార్యమును విఘ్నము జేయుటకా నీభృత్యత్వము! సర్వకాలములు నిందుజవ్వని యగునీభార్యతో విలాసక్రీడలుసలుపుచు నీసేవకాన్యత్తినిమరచి వర్తింపుచుంటివి. కావున యౌవనవతియగు నీభార్యతో భూలోకంబునకుబోయి నీ యిచ్ఛవచ్చినటుల మెలంగి నసియింపుము. నీవిచ్చటనుండ నర్హుడవు కావు. ఇదియే నీ యపరాధమునకు దగినశిక్ష" యని శపియించెను. ఆ పల్కులాలించిన తోడనే నా కాపాదమస్తకము భయంకంపిత మాయెను. కొంతతడవు నోటివెంబడి మాటరాక నిశ్చేష్టుడనై నిలువబడి యేదిక్కుదోచక మహాభీతిచే దేవేంద్రుని పాదములవ్రాలి నే జేసిన యకృత్యములు క్షమింపుమని పెక్కువిధముల వేడుకొంటిని. అంత నా యమరేంద్రుడు నా దీనాలాపంబుల నాలించి యించుక నాయందు కరుణగలిగి "ఓరీ! నీవు పెక్కువిధముల వేడుకొనుచుంటివని కొలదిదినములలో నీకు శాపవిమోచన మగునట్లనుగ్రహించితిని. అంతియేకాని నాయీ శాపంబుఁ ద్రిప్పజాలను. కతిపయదినంబులలో దేవతలకును రాక్షసులకును సమరంబు నిక్కువంబుగ సంభవింపగలదు. అయ్యది భయంకర యుద్ధము. ఆ కదనరంగమునందు మార్తాండుడవై శత్రువులను భస్మీభూతముజేసి వీరవిహారముజేయు భారము నీయది. అంతియే కాని నీయిల్లాలితో సుఖముగ గాలయాపన చేయరాదు. ఆమోహాము నడంచుకొనుము. యుద్ధమునకు సన్నద్ధుడవుకమ్ము. మమ్ము ఆజిలో జయించి మెప్పించితివేని నీకుంగల శాపంబు విమోచనము కాగలదు. ఇయ్యది నిక్కువంబు. యుద్ధమారంభమున నీకడకు రక్తసిక్తములైన

జతమస్తులు వచ్చును. వాటిని ధరించిన లిప్తకాలములో స్వర్గముచేర గల్గుదువు. ఇది నిక్కమును. అశ్రద్ధచేసిన నీకు శాపవిమోచనమగుట అసంభవము. పొమ్ము" అని యనుగ్రహించెను.

అప్పటి నుండియు త్రిలింగదేశమునందు జీవయాత్ర సాగించుచుంటిని. నేను బహుకష్టములకు లోనై వానినెల్ల సహించి భార్యతో నెట్టులో గాపురము చేయుచుంటిని. ఇట్లు కొంతకాలము జరిగినపిమ్మట నొక్కనాడు అరుణోదయ కాలమున సింధురుడు చెప్పినచొప్పున రక్తసిక్తములైన దుస్తులజత నాకడకరుదెంచెను. అమరనాయకుని ఆజ్ఞాపాలన ప్రకారము నాసతి నెచ్చటనుంచి యుద్ధమునకు బోవలయునా అను సందేహము నామనస్సులో బాధించుచుండెను. ఇట్లు నేను విచారించుచుండగా నాస్నేహితుడొకడు నాయొద్దకు విచ్చేసి నాయీ పదునవస్థయంతయు నవలోకించి, జాలినొంది యిట్లనియె. "ఓయీ! ఏల నీవీ లీల జాలి దూలెదవు? నీకువచ్చిన భయములేదు. నిర్భయముగ నుండుము. మానవుని జీవితములో గష్టములువచ్చుట సామాన్యము. అట్టికష్టముల గట్టెక్కించు నుపాయ మాలోచింపవలయునేకాని ధైర్యమంతరింప జేసికొని విచారించుట పురుషులకుదగదు. నీవే యిట్లుబరితపించినచో నీభార్య యెంతపరితపించునో కదా! కావుననే నొక యుపాయంబు జెప్పెద సావధానచిత్తుడవై యాలింపుము. సకలాగమార్థనిపుణుడును, బహు శాస్త్రవేత్తయు, సుగుణఖనియు, ప్రజారంజకుడును, నుదారస్వభావుండును, నన్యకాంతలను దల్లులవలెభావించు పరమపావనుడును నగు విక్రమార్క భూపాలుండు ఉజ్జయినీపురమును బరిపాలించుచుండెను. క్షమాగుణసంపత్తి కలవాడు. వినయగుణభూషణుడు. అతని బోలు క్ష్మాపాలు రీభూమియందొక్కడును మచ్చునకుగానబడడు. అట్టి వాని యొద్దకు బోయితివేని నీకెట్టిలోటును గలుగదు. నీకోరిక తప్పక సానుకూలమగును. నీవు చింతింప నవసరములేదు. అతని సభామంట

పంబునకు నీభార్యతో గూడ బోయి నీయుదంతంబెల్ల వినిపించి, నీసతి వచ్చుట డించి నీవు యుద్ధమునకు బోవచ్చును." అని విన్నవించిన నా మిత్రుని వాక్యముల యందలి సత్యాసత్యము లెంతమాత్రము నిక్కవంబోయని గూరయదలంచి చాలమందిని బ్రశ్నించితిని వారందరు దమ వితరణాదిగుణములను బ్రశంసించినవారే! ఉగ్గడించినవారే! అంత నా గుండె రాయివడి కొంచెము ధైర్యముకలిగినది. నాకోరిక తప్పక నెరవేరునను దృఢనిశ్చయము కలిగినది. తరువాత నేను నాభార్యతో సహితము యింటినుండి బయలుదేరి కొద్దిదినములు ప్రయాణముసాగించి యుజ్జయినీ పురమునకు రెండుదినముల క్రిందట జేరితిని. ప్రభువులు నాయందు గరుణచూపి నేను కదనమునకు బోయి తిరిగివచ్చునంతదనుక నీపెకు దను యంతిపురంబున నాశ్రమమిప్పించ వలయునని నాప్రార్థన. అని తన చరిత్రంతయు జెప్పియూరకుండెను. ఆతని వృత్తాంతమంతయు సవిస్తరముగ వినిన విక్రమార్క భూపతి యాతనిజూచి, ఓయీ! నీమనంబున నావంతయేని విచారింప నవసరములేదు. సందియము వీడుము. నీకోర్కె తప్పక యీడేర్చు భారమునాయది. కాని యింకొక్క సందియము మాత్రము నన్ను బీడించుచున్నది. అయ్యది యేదియనిన? రాక్షసులు కడు దుర్మార్గులు, క్రూరులు, శూరులు, తంత్రమంత్రములు తెలిసినవారు. టక్కరులు, జిత్తులమారులు. అట్టివారిని రణరంగభూమి యందెదుర్కొనుట మిగులకష్టము. ఎదుర్కొంటిమిపో! జయించుట కష్టము. దురదృష్టవశమున దేవలరకే యపజయము కలిగినచో నీవెన్నిదినములలో దిరిగి యిచ్చోటికి రాగలవు? ఆసంగతి నాకు ముందుజెప్పుము. అనిన నాపురుషుడు విక్రమార్కునితో నిట్లు విన్నవించెను. ప్రభూ! నేను జరుగబోవు సంగ్రామమునందు రక్కసులే ఓడి దేవతలకే విజయలక్ష్మి చేకూరునని అమరనాయకుడు మున్నునాతో వక్కాణించిచెప్పెను. అట్లు విధియేమా కనుకూలింపనిచో నేనా కదన

మందిరం నిర్జింపబడుట తటస్థించును. అట్లు తటస్థించిన యెడల నా శరీరంబు యీ సభారంగమునందు వచ్చిపడును. అట్లుకానిచో నాలుగైదు దినములలో దిరిగి నేనీపట్టణంబునకు విచ్చేసి నాయిల్లాలిని వెంటనొని పోవుట నిక్కువంబు. అనివిక్రమార్క క్షమాపాలుని మనంబునందుండు సందియము నివారించెను. అటుపైని విక్రమార్కుడు మిక్కిలి సంతసించి అంమల కియ్యకొని ఆతని సతీమణిని దన విలాసభవనమునకు దోడ్కొని పోదగువారలను నియమించెను.

అంత నావీరపురుషుడు మిక్కిలిసంతసించి విక్రమార్క భూపాలుని యాజ్ఞాభారముగైకొని యుక్కుమిగుల నత్యుత్సాహంబున మింటికెగసెను. అట్లా వీరపురుషుడు ఆకాశమును జేరిన రెండుమూడు నిముసములకు ఆకాశమునుండి ప్రలయకాల ఝంఝామారుతములు వీవదొడంగెను. ప్రలయకాలమహోగ్రభయద జీమూతసంఘములు మదపుటేనుగులరీతి నాకసమున సంచరింపదొడంగినవి. అశనిపాతంబులంగంగంభీరశబ్దంబులు, సింహనాదములు, శంఖభేరీప్రముఖవాద్యాదినిస్వనంబులు, భూమికంపించుట, నిర్నిమిత్తకరాళారావములు, శస్త్రములు, మండుట, పతాకములు, వడకాడుట వాహనముసకిలింపులు, రథములలోకదానినొకటి ఢీకొనిసపుడుకలిగే గంభీరనాదములు, సేనల కోలాహలములు, రధనేమిఘాతములు, భైరవారావములు, బాణసంపాతరవంబులు, జ్యాఘోషంబులు మేఘమండలమందు మెఱుంగులట్టుల వెలుంగు రథధ్వజంబుల కణకణనిసదంబులు, పొడు-పొడు చూచెదవేమి? అని కేకలువైవ విజృంభించు నాదంబులు గగనంబునుండి వినిపించుచుండెను. సైనికుల సమరోత్సాహముచే వేయు కేకలువినిన విక్రమార్కజనపాలుడు అసురాసురయుద్ధము మిక్కిలి భయంకరముగ జరుగుచుండెనని తలంచి ముందుముందు యెటులుండునోయని మనంబున వాపోయనాగెను.

కొన్ని నిముషములకు విక్రమార్కుని సభారంగమున కరుదెంచిన వీరపురుషుని ఆర్తనాదము వినబడినట్లయ్యెను. అట్లువినబడిన కొన్నిక్షణములకు ఆవీరపురుషునిహస్తమొకటి రక్తముతోనిండి విక్రమార్కుని సభాపేరోలగంబున పడెను. ఆసభారంగము నలంకరించిన వారందరాశ్చర్య నిమగ్నులై ఆ తెగిపడిన హస్తము వీరపురుషునిదేఅని నిశ్చయించి మిక్కిలి విచారముద్రితులై యుండ, అతనిశరీరము శిరంబునుండి వేరుచేయబడి మొండెము విక్రమార్కుని సభయందు పడెను. అదిజూచి సభవారందరు ఆవీరపురుషుడు పంచత్వము నొందినందులకే మిక్కిలి విచారింపసాగిరి. మరికొందరావీరపురుషుని బలశౌర్య ధైర్య గుణంబుల కచ్చెరువందియు సంతసించి, అరాతులను కదనభూమియందు వేటాడి, చించి చెండాడి మెప్పువడసి దివంబలంకరించిన వీరాధివీరుడైన వీరపురుషుని మిక్కిలిప్రశంసించిరి.

అట్లా వీరపురుషుని మరణవార్త క్రమక్రమముగా అంతిపురంబునగూడ వ్యాపించెను. అంతిపురంబునందు వీరపురుషునిభార్య తన మగని మరణవార్తవిని మిక్కిలి శోకించి నొకపరిచారికాసాయమున విక్రమార్కుని సభారంగమున ప్రవేశించి అతనిమ్రోలనిలిచి కృతప్రణామములాచరించి "దేవా! శాపకారణంబున నామేటిమగండు సామాన్యమానవునివలె భూలోకమున సంచరించుచుండుటంజేసి నా ప్రాణనాథుడు యుద్ధభూమియందు ధైర్యముతో శతృవులనెదుర్కొని వీరమరణంబునొంది దివినలంకరించెను. నన్నీ భూమిపై నాదరించి, సౌఖ్యానుభూతి కలిగించు నుదార పూరుషులెవ్వరు? నాకనుజ్ఞ నొసంగుడు. నాభర్తతోనరిగి స్వర్గంబున ఆతనిగూడి నాయిచ్చవచ్చినటుల స్వర్గీయసౌఖ్యములను చూరగొనెదను. ఆమాటలాలించి విక్రమార్క మహారాజు పడతీ! నీకోమల శరీరమునేల నిష్కారణముగా నగ్నిని కాల్చెదవు. నీకంతటి దురవస్థ ఏమిసంభవించె? నీకేమి కొదువయా?

నీకు గావలయు సామాగ్రియంతయు నేనిచ్చెద నీకేకోపముండబోదు. నీవు నాకన్నకూతురవు. నాకడుపున పుట్టినబిడ్డవలె జూచుకొనెద. నీవు నాసన్నిధానమున నుండుము. బాగుగా యోచింపుము. అందు నీకెట్లు అంగీకారమగునో అట్లేగావించుము. అని విక్రమార్క మహీపాలు డాలలనామణికి ఓదార్పునెంచెను.

ఆ పలుకులువిని ఆచేడియ విక్రమార్క మహారాజునకు దండ ప్రణామమునాచరించి "ప్రభూ! మీరు సకలమార్గనిపుణులు, సకలశాస్త్రపారంగతులు. దయామయులు దాక్షిణ్యపరులు, యోగ్యాయోగ్యములు తెలిసినవారలు, ఆశ్రయదాతలు. ప్రపంచ విఖ్యాతిపురుషులు, సమస్తధర్మములు ఆచరించినవారలు మీకొండొక ధర్మంబుజెప్పవారులేరు. మీకు తెలియని ధర్మంబులు ఈభూమండలంబునలేవు. ఎట్టి దుఃఖమైన పొందవచ్చును, కాని భర్తృవియోగము భరించుట దుస్సాధ్యము. వైధవ్యము భరించుట దుస్సాధ్యము. నాజీవితము అంధకారమయము. భార్య భర్తకు అర్ధాంగి. భర్తసాన్నిధ్యమే మహాభాగ్యము. మరియెట్టివ్రతాదు లాచరించినను స్త్రీపుణ్యము లభించుటసున్న. వస్త్రాలంకారాది సౌభాగ్యము, రూపము, తేజము, కీర్తి, స్నానము, దానము, భూషణము, పుత్రమిత్ర, బంధు సౌభాగ్యములు మొదలగునవన్నియు పతిప్రసాదము వలననే కలుగును. రూపము, జన్మము, యవ్వనము పతివలననే శోభించును. పతిహీనయైన నారీమణికి సుఖమెక్కడిది? లేనిదౌర్భాగ్యము ప్రాప్తించును. మహాదుఃఖము సంభవించును. దానివలన కలిగెడి నష్టమునకు తావు లేదు. అట్టి భర్తలేని జీవితము నాకేల? జీవించియున్ననేమి? మరణించియున్ననేమి. జనులామెను దూషింతురు. భర్తయే నాథుడు. అతడే గురువు. అతడే దేవుడు. వేయేల? పతిలేని నాడు నీరు పెట్టని నారుమడి యట్లు సతి బ్రతుకంతయు వ్యర్థము. మంచి భార్యకు

భర్తృశుశ్రూషను మించిన ధర్మము లేదని శాస్త్రములు ఘోషించుచున్నవి. కనుక ఓ మహారాజా! అల్పసుఖములకై యాశించి శాశ్వత ధర్మమును విడువ వచ్చునా? అంతకుగాను "భర్త చనిపోయిన వెంటనే సతి, సహగమనము చేయవలసిన విధి" అని సమస్తపురాణములు చెప్పుచున్నవి. అట్టి సతియే, పతితో సమస్త సౌఖ్యములు స్వర్గమునం దనుభవింపగలుగు నని కూడ పురాణములు ఘోషించుచుండెను. అట్టి అనఘ చరిత్రలే సమస్తలోకములచే పూజనీయురాలగును. ఓ మహారాజా! మా చరిత్ర యందొక విశేషమున్నది. అది ఆకర్ణింపుము. మేమిరువురము దేవతాగణములలోని వారమయ్యు శాపవశంబున మేమిపుడీ ధరావలయంబున మానవులమై దిరుగవలసిన వారమైతిమి. వీరశయనము నొందిన వాడవుటచే నా నాథుడు స్వర్గమలంకరించెను. అట్టి నానాథునితో సహగమన మొనర్చితినా? నేనుకూడ నానాథుని సన్నిధికేగి స్వర్గసౌఖ్యముల ననుభవింప నవకాశము చేకూరును. కావున దేవరవారు నా దీనాలాపంబుల నాలించి నాకు సహగమనమునకు నాజ్ఞయొసంగి, నా కెట్టి యాటంకము కలుగజేయరాదని యుక్తాయుక్తముగ పల్కి విక్రమార్కమహీపాలు నొప్పించి సహగమనమునకు అనుజ్ఞగైకొనెను. విక్రమార్కుడాయమ పాతివ్రత్య ధర్మమునకచ్చెరువొంది చితిపేర్ప నియమించెను.

మరునాడు మంచిగంధపు చెక్కలచే చితిపేర్పబడెను. అద్దానిపై బూలపాన్పును ఏర్పరచి ఆ సతీమణి తనభర్త దేహమును ముదుంగా బరుండబెట్టి, తాను స్వచ్ఛవసనాంబర ధారిణియై, పసుపు కుంకుమను చేతదాల్చి, పెక్కురు బీదలకు దానములాచరించి, చితి ప్రవేశించి, భర్తశిరమును తనయూరువుపై నిడుకొని చితికి నగ్నిరగుల్గొలుపుడని యాజ్ఞాపించెను. కొన్ని నిముషములలో ఆపవిత్ర జీవనములను అగ్నిహోత్రుడు నిశ్శేషంబుగ భస్మమాత్రావశేషముగా జేసెను.

ఆ పవిత్రజీవములు రెండును అగ్నిహోత్రమున కాహుతియయిన దృశ్యమును చూడజాలక సహస్రకిరణుడు అపరాంబుధి గ్రుంకెను.

విక్రమార్క భూపాలుడు నాటిదినమున సభచాలించి నిత్యవిధులాచరింపబోయెను.

మరునా డుదయమున విక్రమార్కుండు సభారంగమున కరుదెంచి సింహాసన మధిష్ఠించెను. సమస్త పరిచారికా జనంబులు తన్ను గొలువ సామంత, మంత్రి, పురోహిత, ప్రధానపౌరజనపరివృతంబై యుండ, గ్రహమండలముభంగి గురు బుధ మిత్ర కవిరాజ విరాజితంబై యుండ, భృత్యతతి కైదండలొసగ, పురోహితవర్గంబు స్వస్తి వాచకముల జదువుచుండ,సచివోత్తములు రాజకీయకార్య తంత్రముల తెలంగులు సెప్పుచుండ, ధరణీవల్లభులు జయజయ ధ్వానంబుల నప్పనంబుల నొసగుచుండ, విద్వత్కవులు వేద శాస్త్ర కావ్య నాటకములు చర్చించుచు సాధువాదములు జేయుచుచుండ, గాయకశిఖామణుల వేణువీణావాదిత్ర మధురరవంబులుసభ్యుల మనంబుల సొమ్మసిలజేయుచుండ, వంధిమాగధులు వంశగీతములగానము సల్పుచుండ, పేరోలగంబున నుండి ఆ విక్రమార్క క్ష్మాపాలుడు యింద్ర విభవంబుకన్న మేటిగ వెలంగుచుండు సమయంబున దేవదానవుల యుద్ధమందు దేవతల పక్షమున బాల్గొనిన వీరపురుషుడుసభారంగమునందు మార్తాండునివలె ప్రవేశించి విక్రమార్కునికి వినయపూర్వకముగ నమస్కరించిఆభూపాలునకు నందనవనమునందుగల ప్రసూనములను గొన్నిటిని మాలికగా గ్రుచ్చి బహూకరించెను. అంత విక్రమార్కు డాతనిని గాంచి మిగుల సంతసించి యుద్ధభూమియందు జరిగిన విషయముల నెరింగింపుమని ఆవీరపురుషుని కోరెను.అంతనా వీరపురుషుడు రణరంగమంతయు రక్త ప్రవాహములతోడను, ఆ ప్రవాహములపై దేలియాడు పీనుంగులును, మరికొన్ని రథంబులును, ప్రధానాంగములను పోగొట్టుకొనిన, వారు

వంబులును, సేనలును జూచుటకు మిక్కిలి భయంకరము గానుండెనని చెప్పెను. అదియునుగాక నారాక మహేంద్రునికెరింగించి పగతురతో బోరునకు దలపడితిని. నాకు సమరోత్సాహ మధికమయ్యెను. దానికి దోడు నాపూర్వ స్నేహితుడొకడు సాయమొనర్చుటచే నాయుత్సాహము మరింత అధికమై శత్రుసైన్యము నంతయు జెండాడియు, కల్లోలపరచియు, లంఘించి వారలను రూపుమాపితిని.

ఇట్లారక్కసులను జెండాడుటగాంచి అఖండలుండు నాధైర్యసాహసాది గుణంబుల కచ్చెరునంది బాపురే! అయ్యారే! ఏమినీసాహసము! సెబాస్! అనుచుబొగడెను. ఆమాటలాలించి నేను తిరిగి నాభార్యతోకూడ స్వర్గసౌఖ్యముల ననుభవింప గలుగుదుననియు, నాయుద్యోగము నాకుతిరిగి ప్రాప్తించుననియు మిగులసంతసించితిని.

నాటినుండియు దేవేంద్రుడు నాపరాక్రమమును మిక్కిలి గొనియాడుచు, నాయొక్క ప్రభుభక్తివిశ్వాసములుచూచినీవుభూలోకమునకు బోవనవసరములేదు. నీయుద్యోగము నందు నీవు తిరిగిప్రవేశింపవలసినదనియును, ఎప్పటియట్లు నీభార్యనుతెచ్చుకొని సుఖంపుమనియును నుడివెను. వెండియు ఓదేవా! నాభార్యను విక్రమార్కభూపాలునియొద్ద విడిచివచ్చితినని చెప్పగా మిగులసంతసించి నావిజయమునుగూర్చి మీతో ముచ్చటింపుమని నుడువుచు నీ ప్రసూనమాలికను తమకు బహుమతిగానిచ్చి నాభార్యను తోడ్కొనిరమ్మని యనుజ్ఞయిచ్చెను అని వీరపురుషుడు విక్రమార్కమహీపాలునితో నావృత్తాంతమంతయు, జెప్పి తనచేతిలో నున్న ప్రసూనమాలికను విక్రమార్కునికిచ్చెను. సభారంగమున నున్నవారందరు చచ్చినవాడెట్లు బ్రతికివచ్చెనని ఆశ్చర్యపడుచుండిరి. ప్రభూ! సత్వరముగ నాసతీమణిని పిలిపింపుడు. లేనియెడల ఆయువతిరిగి శపించును." అనిచెప్పగా ఆసభారంగము నందొక సభికుడులేచి అయ్యా! మీశరీరము ఖండితమై యీసభారంగము నందు

పడెను. అయ్యది కాంచి మేమందరము నీవువీరస్వర్గ మలంకరించితివని తలంచితిమి. అంత నీవార్త నీభార్యకు తెలిసి ఆమె విక్రమార్కమహీపాలునియొద్దకు విచ్చేసి సహగమనమునకు అనుజ్ఞగైకొని ఖండిములైన నీశరీరముతోపాటు సహగమన మొనర్చెను. ఎన్ని చెప్పినను వినదాయెను. ఈసభ నారందరు ఆమెపాతివ్రత్యమహిమను మిక్కిలిగొనియాడిరి" అని చెప్పెను. అంత నావీరపురుషుడు విక్రమార్కునిజూచి "అయ్యా! మీరేదో ఆశ్రమదాతలని, ప్రాణభిక్షుకులని, యుదారపురుషులని, కీర్తి వంతులని, సమస్తధర్మములు తెలిసినవారని, ఆడితప్పనివారని, నా భార్యనువిడిచి పోయితిని. మీరీవిధము జేయుటపాడిగాదు. నాసొత్తు హరింపనుద్దేశములేకయూ, ఈ యన్యాయపుమాటలు. వింతగానున్నది." అని పలుకగా "విక్రమార్కుండు నాపల్కులు విశ్వసింపుము. నేనట్టియన్యాయమునకు పాల్పడువాడను గాను. ఈసభాంగము నందుండువారలే సాక్షులు. ఆమె నిశ్చయంబుగ అగ్నిప్రవేశ మొనర్చెను. త్రికరణ శుద్ధిగబల్కుచున్నాను. నీభార్యపై నాకట్టి దురుద్దేశములేదు" అని నుడివెను. "లేదుమహారాజా! పొరబడుచున్నారు. అంతఃపురము నకు వార్త బుత్తెంపుడు. అంతయు మీకేబోధపడనోపు" అనిచెప్పగా విక్రమార్కుడట్లుచేసెను.

కొన్ని నిముషంబులకు నొక పరిచారిక యేతెంచి "ప్రభూ! మొన్న సహగమన మొనర్చిన తరుణీమణి సంతోషముగ దేవిగారితో ముచ్చటించుచున్నది." అని చెప్పగా విక్రమార్కుడు "సత్వరముగ ఆమెను ప్రవేశపెట్టుము!" అని చెప్పెను. కొన్ని నిముషముల కామె సభాస్థలి ప్రవేశించగనే అందరు ఆశ్చర్య నిమగ్నులైరి. విక్రమార్కున కిదంతయు విడ్డూరముగ కనబడెను. పిదప నా వీరపురుషుడు తన నిజ స్థితి నంతయు చెప్పెను. ఓ మహోదార పురుషా! నే నింద్రజాల మహేంద్రజాలాది విద్యలనెరింగిన వాడనని యిదివరకే చెప్పియుంటిని

కదా! ఈమెయుకూడ అట్టి విద్యలయందు ప్రవీణతకలదు. ఆప్రవీణతయే యీా ప్రవీణత. అదంతయు నిజముగా జరిగిన సంగ్రామము కాదు. అదంతయు నా యింద్రజాల మహాత్వము చేతనే'' అని చెప్పగా అక్కడ నున్న వారందరు వారిని మిక్కిలి కొనియాడి సంతసించిరి. అంత విక్రమార్కుండు వారిని గాంచి ''ఓయీా! నేను పెక్కురు యింద్రజాలకుల పాటవముల వీక్షించితి కాని యందొక్కటి నీపాట నంబునకు సరిపోలదు. సరిపోల్పలేను. ఇట్టిప్రవీణత యున్నవాని నేనెన్న డు సందర్శించియుండ లేదు. అని పల్కి ఆవీరపురుషునికి మిక్కిలిగ బహుకరించి పంపివైచెను.

ఇట్టికథ అంతయు వినిపించి సాలభంజిక భోజభూపాలుని గాంచి ఆతనితో నిట్లనియెను. ఓ భోజభూపాలా! నీయందిట్టి ఔదార్యాది గుణంబు లుండెనేని యీా సింహాసనము నధిష్ఠింపుము. లేదేని యనర్హు డవు. వెడలిపొమ్ము. అని నుడువగా భోజభూపాలుడు మిక్కిలి సిగ్గు నొంది మంచి శుభముహూర్తమున తిరిగి యీా సింహాసన మధిష్ఠింప దలచి యంతిపురమునకు దిరిగి పోయెను.

# ముప్పదియొకటవప్రతిమ చెప్పిన కథ.

మఱలభోజభూపాలుఁడొక్కశుభదినంబునసింహాసన మధిష్ఠింప టకు రాగా ముప్పదియొకటవ సోపానమునగల సాలభంజిక యాతని వారించి, ''ఓరాజా! ఏల నూఱక శ్రమజెందెదవు! విక్రమార్కునికి

గల సాహసౌదార్యాది వితరణగుణంబులు గలవారు దక్క దదన్యులీ దేవేంద్రదత్త మగు సింహాసనమధిష్ఠింప దగరు. వినదలతువేని యాతని గుణంబు వివరించెదన''నిన భోజుడు "సాలభంజికా! ఆతని గుణంబులు దెలిపి నన్ను కృతార్థునిగా జేయు'' మనిన నాప్రతిమ యీక్రింది కథ జెప్పెను.

విక్రమార్కుడు పరిపాలించుచున్న యుజ్జయినీపురవరంబున దేవదత్తుడను విప్రోత్తముడు గలడు. దేవదత్తుడొకనాడు సమిత్కుశ సంగ్రహార్థమై యా సమీపమునున్న యరణ్యమునకేగెను. విక్రమార్కుడు మృగయావినోదార్థమై యా యరణ్యముజొచ్చి యొంటిమై యాదుర్గమారణ్యమున మార్గము గనుగొనజాలక శ్రమజెంది యొక్కచో మూర్ఛిల్లియుండెను. అంత దేవదత్తుడు భూపతినిగాంచి యాసమీపమున గల యేటికడకరిగి తామరపత్రమును దొప్పగాజేసి జలంబును గొని వచ్చి భూపాలుని సేదదీర్చి తనకడనున్న ఫలంబులను దిననొసంగెను.

పిమ్మట విక్రమార్కుడు సేదదేరి యాతనితో నుజ్జయినికేగి నా ధనంబుతో బహూకరించి యిట్లనియెను. "నీమేలెన్నటికిని మఱువను. మున్ముందు నీకెద్దియైన నుపకారమొనర్చెదనని'' పల్కి యాతనిసాగనంపెను.

కొన్ని వత్సరములు గతించినపిమ్మట దేవదత్తుడు మున్నుతనకు విక్రమార్కుడొసంగిన వాగ్దానమును బరీక్షింపనెంచి యొకనాడు విలువగల భూషణాదులను ధరించి వీధిలోనాడుకొనుచున్న యొక్క రాకొమరుని తనగృహమునకు రహస్యముగా గొనిపోయి దాచియుంచి యా బాలునికడనున్న యాభరణములలో నొక్కటిదీసి దాసిచేతికిచ్చి విక్రయింప బంపెను.

దేవదత్తుడు దాచియుంచిన బాలుడు విక్రమార్కుని బంధువులలో నొక్కని కుమారుడగుటచే నంతఃపురంబున నలజడి బయలుదేరి విక్రమార్కునికి దెలిసెను. విక్రమార్కుడు ఆబాలుని వెదుక రాజభటులను బంపెను.

ఒకయంగడిలో నాభరణము విక్రయించుచున్న దేవదత్తుని దాసిని రాజభటులు గాంచియాదాసిని విక్రమార్కునికడకు దోడ్కొని పోయిరి. ఆదాసి భయకంపితురాలై తనకాయాభరణము విక్రయింప బంపి దేవదత్తుడొసంగినట్లు చెప్పెను. అంత భూపాలుడు దేవదత్తుని రావించి "ఈయాభరణము నీకెచ్చటలభించె"ననిన దేవదత్తుడు, అయ్యా! సత్యము వక్కాణించెదను. ద్రవ్యమునకాశించి యాబాలుని నేనేచంపితిని," అని పల్కెను.

విక్రమార్కుడు సభ్యులనుగాంచి "ఈతనికెట్టి శిక్షవిధించ వలయునో తెల్పు"డనిన వారెల్లరు మరణదండనమని చెప్పిరి. అంత విక్రమార్కుడు దేవదత్తునిగాంచి "ఓవిప్రోత్తమా! మున్ను నొక ప్పుడు నీవు మహోపకారమును గావించితివి. మఱల నీకు ప్రత్యుపకార మొనర్చెదనని నీకువాగ్దానముగావించితిని. ఈసభాసదులెల్లరు నీనేరమునకు నిన్ను వధింపవలయునని చెప్పినను నీకు నేను ప్రాణదాన మొసగెదను. ఇక ముందెప్పుడును యిట్లులాచరింపకుము." అనిచెప్పి యాతని బంపివైచెను.

దేవదత్తుడాతని గుణంబులకు మతినలరి తనగృహమునకేగి యాబాలునెత్తుకొని విక్రమార్కుని సన్నిధికరిగి యాబాలునాతని కొసంగి నిజముదెల్పి తప్పుక్షమింపుమని వేడుకొనెను. విక్రమార్కుడు సంతసించి యాతని విశేషముగా బహుకరించెను.

భోజభూపాలచంద్రమా! నీకడనిట్టిగుణములు లేవు.నీవీసింహాసనమధి ష్ఠింపదగవు. వెడలిపొమ్మనిన భోజుడు నాటికంతఃపురంబుజేరబోయెను.

# ముప్పది రెండవ ప్రతిమ చెప్పిన కథ.

మరునాడు సింహాసన మధిష్ఠింపవలయునను నుత్సాహముతో నరుదెంచిన భోజభూపాలుని ముప్పది రెండవ సోపానమునగల సాలభంజిక యాతనిని వారించి యిట్లనియెను. "ఓ భోజభూపాలచంద్రమా! విక్రమార్కుని సుగుణంబులు పెక్కింటి నాలించియు నింకను నీవు ప్రయత్నము విరమింపవేమి? ఈసింహాసన మధిష్ఠించుటకు నేనర్హుడనని దలంచుచున్నావా యేమి?" అనినభోజభూపాలుడు, ఓ సాలభంజికా "విక్రమార్కునిసుగుణంబులు వినినకొలది యింకనూ వినవలయునను బుద్ధి వొడముచున్నయది. కావుననీవాతని సుగుణంబులు కథనముచేసి నన్ను చరితార్థునిజేయుము" అనిన నాప్రతిమ తన సరసవచోనైపుణ్యము మెఱయనీక్రింది కథజెప్పెను.

విక్రమార్కమహీపాలుడు షణ్మాసములు రాజ్యము బరిపాలించిన వెనుక భూసంచారమునకు బయలుదేరి పెక్కుదేశములు ద్రిమ్మరుచు పెక్కులగు బుణ్యక్షేత్రములను దర్శించుచు నొక్కనగమునగల దుర్గాలయముజేరి యందున్న యాదేవిను పాసించెను. దుర్గాదేవి, నిష్ఠాగరిష్ఠతతో దన్నుపాసించిన విక్రమార్కునిభక్తికిమెచ్చుకొని యాతనికి సాక్షాత్కరించి "భూపాలా! నీభక్తికి నేనెంతయు సంతసించితిని. నీయిచ్చవచ్చినవరంబు గోరుకొమ్ము" మనినవిక్రమార్కుడు "జననీ! నీదయ వలన నాకు అన్నిశుభంబులు సమకూడియున్నవి. అన్నివిద్యలయందును నసమానపాండిత్యము గలిగియుంటిని. కాని పరకాయప్రవేశవిద్య యొక్కటియే నాకుగొఱంతగానున్నది. తల్లీ నీవునాయందు బ్రసన్నతజెందితివేని పరకాయ ప్రవేశవిద్య ననుగ్రహింపుము." అనివేడుకొనిన నామహాదేవి యాతనికొక్కమంత్ర ముపదేశించి తిరోహితయయ్యెను.

పిమ్మట విక్రమార్కుఁడు ఆ నగరముననే నివసించుచూ చక్కని పొట్టేలు నొక్కదానిని పెంచసాగెను. ఆ నగరముననే యొక్క విశ్వకర్మ కలడు. అతను పొట్టేళ్ళ బెంచుచు బందెములు వైచుచు గెలుపొందుచు నద్దానివలన లభించుచున్న ధనముతో జీవింపసాగెను. ఒక నాడు విక్రమార్కుఁడు పొట్టేలును పెంచుచుండుట విశ్వకర్మ గాంచి భూపాలునితో నిట్లనియెను. "ఓ రాజా! మన పొట్టేళ్ళను వినోదముగా కొంతతడవు పోరింతమా?" యనిన విక్రమార్కుఁడందు కంగీకరించి కొంతధనమును పందెముగా నిడి పొట్టేళ్ళను బోరింప రంగమున విడిచిరి.

రెండు పొట్టేళ్ళును నిరుపమశౌర్యమున బోరాడుచుండెను. రెండు పొట్టేళ్ళ మస్తిష్కమునుండి రుధిరము ధారాపాతముగ గురియసాగెను. కొంతతడవు రెండును సమముగా బోరాడెను. పిదప విక్రమాదిత్యుని పొట్టేలు కొంచెము వెనుకంజ వేయసాగెను. విశ్వకర్మ పొట్టేలు రెట్టించిన శౌర్యమున దానితో ఢీకొనుచుండెను. అప్పుడది గాంచి విక్రమార్కుఁడు తన పొట్టేలు తప్పక ఓటమినొందునని తలచి, దుర్గాదేవికృపవలన దాను నూతనముగా నేర్చిన పరకాయప్రవేశ విద్యను బరీక్షింపదలచి తనశరీరము నొక పొదమాటున గుప్తపరచి తనపొట్టేలు దేహమున బ్రవేశించెను.

విక్రమార్కుఁడు తన దేహమును పొదమాటున గుప్తపరచుట కళాదుండు గాంచి విక్రమార్కుని దేహమున నాతఁడు ప్రవేశించెను. విక్రమార్కుఁడు తన పొట్టేలుదేహము బ్రవేశించి, కళాదుని పొట్టేలు నోడించి తన పొట్టేలుదేహమును విడిచి తన దేహమునకై వెతికి కానక మరల పొట్టేలుదేహమున బ్రవేశింపనెంచెను. కాని యయ్యది యొక్క కటికివానిచే ఖండింపబడెను. విక్రమార్కుఁడు విచారించుచు నలుదెసలును బరికింప నొక్కచో నొక్క చిలుక పడియుండుటగాంచి యద్దాని యందు బ్రవేశించి కొన్ని చిలుకలతో గలిసి యొక వనమును జేరుకొనెను.

విక్రమార్కుని దేహమును బ్రవేశించిన విశ్వకర్మ తాను ప్రవేశించిన శరీరముజ్జయినీ పురపాలకుండైన విక్రమార్కునిదని తెలిసికొని యుజ్జయినీకేగెను. భూసంచారమున కేగి షణ్మాసములు బూర్తికాకుండగనే యరుదెంచిన కుమారా విక్రమార్కునిగని యెల్లరును వింత పడజొచ్చిరి. విశ్వకర్మ అంతఃపురమును బ్రవేశించిన జూచి యాతని వింతప్రవర్తనమును గని అంతఃపురాంగనలు వెఱగొంది, యమాత్యులకిట్లు వర్తమానమంపిరి. "విక్రమార్క భూపాలుని దేహమున బరకాయవిద్య నెఱింగినవాడెవడో ప్రవేశించినట్లు దోచుచున్నయది. దేవేరులను గుర్తింపనేరక దాసీజనులను దేవేరులగా భావించుచుండెను. విక్రమార్కునికిగల గుణంబులలో నొక్కటైన నీతనికడ నున్నట్లు గన్పడదు. ఇట్టులనేక విషయములందీతఁడు వింతగా బ్రవర్తించుచుండెను. నిక్కముగా నీతఁడు విక్రమార్కుఁడు కాడు."

ప్రధానామాత్యుఁడగు భట్టి దేవేరులయొద్దనుండి వచ్చిన యా వార్తనాలించి యేమిచేయవలయునో తోపక తాను దీర్ఘముగా నాలోచించి తదితర యమాత్యులతోఁగూడ నాలోచించి దేవేరులకిట్లు వార్తలంపెను. "కొద్దికాలమువరకు మీరాతని కంటబడకుండగానుండి దాసీస్త్రీలను దేవేరులుగా నటింపజేయుడు. కొంతకాలమునకైనను నిజము బయలుపడును." ఆవార్తనాలించి దేవేరులు కళాధుని కంటబడకుండగానుండి దాసీస్త్రీలను శృంగారించి దేవేరులుగా నాతనికడకు బంపుచుండిరి. కళాధుండును నా దాసీస్త్రీలను దేవేరులుగాభావించి వారితో గడపుచుండెను.

వనములో జిలుకరూపంబున నున్న విక్రమార్కుఁడు తదితర చిలుకలతోఁగలిసి విహరించుచు వాటిననుసరించియుండి కాలముగడపుచుండెను. ఇట్లు గొన్నిదినంబులు గడచినవెనుక నొక్కనాడు కొన్ని కాకము లాచిలుకలు నివసించుచున్న చెట్టుపైకూర్చుండి కొన్నిఫలం

బులు భక్షించుచుండెను. విక్రమార్కుఁ డయ్యదిగాంచి తనతోడి చిలుకలతో నిట్లనియెను. ఈ వాయసములు భక్షించుచున్న ఫలముల యందలి గింజలు భూమిపై బడి యొక్క లతాగుల్మముద్భవించి కొన్ని దినములలో నీవృక్షము నాధారముగాగొని దినదినాభివృద్ధినొందును. అద్దానివలన మనుజులీవృక్షమును సులభముగానెక్కి మనలను బట్టుకొందురు. కావున నీకాకములనిచ్చో నిలువనీక పారదోలుట మంచి దనిన తదితరచిలుకలు విక్రమార్కునివలుకులను నిరాదరించి కాకంబులపొంత బోకయున్నకుండెను.

మఱికొన్ని దినములకు విక్రమార్కుఁడు చెప్పినట్లుగా నొక్క లతాగుల్మము పొడసూపెను. అప్పుడు మఱల విక్రమార్కుఁడు చిలుకలకిట్లు జెప్పెను. "నాపల్కులుమీరు నిరాదరించిరి. ఇప్పుడైనను నామాటవిని యీలతాంకురము నిర్మూలమొనరింతము రం"డనిన నా శుకంబు లప్పటికిని విక్రమార్కునిపల్కులు పాటింపక మిన్నకుండెను. మరికొన్ని దినంబులకా లతాగుల్మమువృద్ధినొంది క్రమముగా యావట వృక్షము నావరించుకొనెను. ఒక్కనాడొక్క బోయడచ్చటి కరుదెంచి యాచిలుకలను బట్టదలచి యావృక్షమును గుర్తించుకొని వెడలి పోయెను. చిలుకరూపమునన్న విక్రమార్కుఁడానంగతి గనిపెట్టి తన హితులకు మరల హితముపదేశించెను. నేడొక్క బోయడిచ్చటి కరుదెంచి వృక్షమును గురించుకొని వెడలిపోయెను. రేపటిదినమున మగిడి యేతెంచి మనలను బట్టుకొనును. కావున నిప్పటికైనను నాపల్కు లాలింపుము. ఈవృక్షమును విడిచి మఱియొకవృక్షము నాశ్రయించి మనప్రాణములను గాపాడుకొందము రండని చెప్పి యాచిలుక యాతని మాటలను బెడచెవిని బెట్టెను.

ఆమరునాడా బోయడరుదెంచి వలబన్ని యాచిలుకలన్నిటిని బట్టుకొనెను. అప్పుడాచిలుకలు విక్రమార్కునిమాటలను బాటింపక

పోవుటచేగదా యిట్టిగతి పట్టెనని చింతించి యీ వలనుండి తప్పించు
కొను నుపాయమేదైనను జెప్పుమని యాతనిని బ్రతిమాలకొడంగెను.
అంత విక్రమార్కుండు, "జరిగినదానికై చింతించుట వెర్రితనము
మనమాచరించు ప్రతికార్యమునకును దూరదృష్టి గలిగియుండినచో
నాపదలు రావు. వచ్చినచో బుద్ధిమంతుం డుపాయమున నపాయము
నుండి తప్పించుకొనజూచును గాని మూర్ఖునివలె విచారింపడు. సుఖము
లకు సంతసించుటయు, కష్టములకు విచారించుటయు గూడనివి.
ప్రస్తుతము మన మిప్పుడీవలనుండి తప్పించుకొను తెరువు నూహించుకొన
వలెను. నేనొక్క మార్గ ముపదేశించెద నాలింపుడు. అదియెద్దియనిన
మనమందరమును గూడి లెక్కకు నూర్గురము గలము. మన మందరము
మరణించినట్లు మెడలు వ్రేలవైచి పడియున్నచో బోయండు మనము
మృతిజెందితిమని తలంచి యొక్కొక్కదానిని గ్రిందపడవేయును. అప్పుడు
ప్రతిచిలుకయు గ్రిందపడినవాటిని లెక్కించుకొని నూరుచిలుకలను
గ్రింద పడవైచినతోడనే పారిపోవలయును." అనియెఱింగించిన యా
శుకంబులెల్ల సంతసించి యాతనిబుద్ధికుశలతను బొగడి యాతండు చెప్పి
నట్లుగా నాచిలుకలన్నియు మృతిజెందినట్టుల శిరంబులు వ్రేలవైచికొని
యుండెను.

కొంతసేపటికి బోయవాడరుదెంచి వృక్షమునెక్కి చిలుకలన్నియు
జచ్చియుండెనని తలంచి యొక్కొక్క చిలుకను వలనుండి తప్పించి క్రింద
బడవైచుచుండెను. అతడు తొంబది తొమ్మిదిచిలుకలను గ్రిందబడ
వైచినపిమ్మట నాతనిమొలనున్న కొడవలిజారి క్రిందబడెను. ఆధ్వని
నాలించి శుకంబులు నూరును గ్రిందబడినట్లుగ దలంచి చిలుకలన్నియు
రివ్వున నెగిరిపోయెను.

అంత నాబోయవాడదిగని చిలుకలన్ని పారిపోయెనుగదాయని
చింతించి మిగిలిన చిలుకరూపమున నున్న విక్రమార్కునిబట్టుకొని చంప

శంకించెను. అంతవిక్రమార్కుఁడాతనితో "ఓయీ! నన్నేల జంకెదవు? నన్నేరికైన విక్రయించినచో నీకు ధనమధికముగా వచ్చునట్లు చేయుదును." అనిన నాతఁడు సమ్మతించి యాచిలుకను (విక్రమార్కుని) సమీపమున నున్న నగరమునకుఁ గొనిపోయి యమ్మఁజూపెను. ఆదారిని బోవువారు యాచిలుక విలువనడిగిన బోయవాఁడు నూఱువరహాలు చెప్పుచుండుటచే నెవ్వరును గొనజాలరైరి. అంతనాదారినొక్క వైశ్యుఁడు పోవుచు చిలుక వెలయెంతయని యడిగెను. అంతబోయవాఁడు నూరువరహాలని చెప్పఁగా నాతఁడు "ఓయీ! యీచిలుక వెలనూరు వరహాలేమిటి? నూరువరహాలతో నూరు చిలుకలను గొనవచ్చును." అని పల్కెను. అంతచిలుకరూపమున నున్న విక్రమార్కుఁడా వైశ్యునితో నిట్లనియెను. "ఓవణిజుఁడా నాపలుకాలించి, నన్ను గొనియాతనికి నూరువరహాలొసంగి పంపివేయుము. నావలన నీకు మున్ముందు మంచి లాభము కలిగి నూరువరహాలకంటెను నెక్కువధనమును సంపాదింపగలవు" అనిచెప్పిన నా వైశ్యుడు బోయవానికి నూరువరహాలొసంగి చిలుకను గొనెను.

ఆవణిగ్వరుఁడా చిలుకను దనగృహమునకు గొనిపోయి యొక్కపంజరమునందుంచి తనదుకాణముకడ వ్రేలాడగట్టి మిక్కిలిగారాబమున పెంచుచుండెను. చిలుకరూపమున నున్న విక్రమార్కుఁడు దుకాణముకడ వెచ్చములకు వచ్చు వారితో సంభాషించుచు సరకుల ధరలు చెప్పుచునిట్లు వర్తకునకధికలాభము నొసఁగుచుండెను. జనులెల్లరు నాచిలుకను గాంచి దానితో సంభాషింపను బలాటపడి వెచ్చములకొఱకు నాదుకాణముకడకే యరుదెంచుచుండిరి. చిలుకవలన దాను విశేషలాభ మొందుచుండుటచే వణిగ్వరుఁడు చిలుక చెప్పిన ప్రకారము నడచుకొనుచుండెను.

ఆనగరాధీశునికి బద్మావతియను పుత్రిక యొక్కతె కలదు. ఆమెపై భూపాలునకు మక్కువమెండు. గ్రహరాజు నిజకాంతులు

తప్పినను భూపాలుఁడు పద్మావతిమాట కెదురాడఁడు. అందుచేఁబద్మావతి యొక్క శాసనమును నిర్మించెను. అదియెద్దియనిన, కలలోనెవ్వఁడైన బురుషుఁడు తనతోభోగించునట్లు గాంచినచో నాపురుషుఁ డుపరాధము క్రింద నూరువరహాలను జెల్లింపవలయును. అట్లుచెల్లించనిచో వాని శిరము ఖండించబడును. ఈశాసన మూలమున పెక్కురు మరణించిరి. పెక్కురు తమప్రాణములు నిలుపుకొనుటకై తమకడనున్న ధనము నర్పించి తిరిపమెత్తుకొని జీవించుచుండిరి.

ఇట్లుండ నొక్కనాఁడొక్క పేదపాఱువాఁడుపద్మావతిస్వప్నమున గన్పించి యామెతోభోగించెనట. అమరునాఁడుదయమున రాజభటులను బిలిచి యాపాఱుని ముఖలక్షణములను దెల్పి యాతనికడనుండి ధనమును గొనిరమ్మని పంపెను.

రాజభటులా నగరమంతయు ద్రిమ్మరియొక్కచో బద్మావతి తెల్పిన ముఖలక్షణములుగల యొకవిప్రునిగాంచి యాతనిబట్టుకొని "ఓయీ! నీవు గతదినంబున రాత్రి పద్మావతికలలో గాన్పించి సంభోగించితివట. అద్దానికై యపరాధముక్రింద నూరువరహాలనిచ్చెదవా? లేకపద్మావతి గృహంబునకరుదెంతువా?" యననావిప్రుఁడు "అయ్యా! నేనొక్కభిక్షుకుఁడిని ఏపూటకాపూట బిక్షమెత్తుకొని జీవించువాఁడను. నాకడ నూరువరహాలుగాక యొక్కగాసైనను లేదు. నాశిరంబు ఖండించినను సమ్మతమే గాని నూరువరహాలు నొసంగుట నావల్లగాదు." అనిపల్కిన రాజభటులాతనిని బద్మావతికడకు గొంపోవుచుండిరి. ఆవిప్రుఁడు నిష్కారణముగ జీవములు బాయవలసి వచ్చెను గదాయని దుఃఖించుచు రాజభటులవెంట,విక్రమార్కుఁడు చిలుకరూపమునన్న వణిగ్వరుని యింటిముందరనుండి పోవుచుండెను.

విక్రమార్కుఁ డావిప్రోత్తముని గని, "ఓయీ! ఏలనీరీతిని వాపోవుచుంటివి? నీదుఃఖకారణ మెరింగించినచో నావలన నగునహాయ

మొనరింతును. నీ విచారకారణము నాకు దెల్పుము." అనిన విప్రుఁడు దుఃఖముపశమించుకొనియిట్లుజెప్పెను. ఈనగరాధీశునుంపుడుగత్తెయయిన పద్మావతి కలలో నేను గన్పించి యామెతో సంభోగించితినట. అందుచే నపరాధము క్రింద నూరువరహాలు చెల్లించవలయునట. లేనిచో శిరముఖండింతురట. భిక్షమెత్తుకొనువాడను నాకడ నూరువరహాలులేవు నిష్కారణముగా చావవలసి వచ్చినందున దుఃఖించుచుంటిని." అని పల్కెను. అదివిని యాచిలుక (విక్రమార్కుఁడు) "ఓ విప్రోత్తమా! చింతిల్లకుము. నీకు ప్రాణభయము లేదు. నిన్ను నే గాపాడెదను. ఆ పద్మావతినిచ్చుటకు వచ్చి ధనమును గొనవలసినదని యీ రాజభటులచే వార్తబంపుము. నేనా ధనమును దెప్పించి యుంచెదను." అని చెప్పిన విప్రుఁడు రాజభటులతో "పద్మావతి యిచ్చటి కరుదెంచినచో ధనమీయగలను. మీరుపోయి యామెను దోడ్కొనిరండు" అని చెప్పిన రాజభటులీసంగతి పద్మావతికి దెలియజేయుటకేగిరి.

తోడనే చిలుక ఆవణిజునిబిలిచి యాతనితో నిట్లనియెను. "ఓయీ! నేనీ విప్రపుంగవునిగాపాడ నిశ్చయించుకొంటిని. అందులకు నీవాకింత సహాయ మొనర్పవలయును. నీవు నూఱువరహాలను దెచ్చి యొక మూటగాగట్టి యామూట నొక యద్దమున బ్రతిబింబించునట్లొనర్పుము. పిమ్మట జరుగగల కార్యము నీవే కాంచెదవు. ఇట్లు చేసినచో నీనూరువరహాలు పోకుండును, ఈవిప్రుడును రక్షింపబడును" అనిచెప్పిన పిని యా వైశ్యుడట్లొనరించి జరుగగల కార్యమును గాంచుటకై యెదురు చూచుచుండెను.

రాజభటుల వలన యావృత్తాంత మంతయు నెఱింగి ధనంబును గైకొనవచ్చునను ఆశతో యరుదెంచిన పద్మావతినిగాంచి యాచిలుక యిట్లనియెను. "పద్మావతీ! నీ శాసననిర్మాణమునకు నేనెంతయో సంతసించితిని. నీవు గలలోగాంచిన పురుషునికడ నూరువరహాలను దీసికొను

చుంటివి. కావున నా దర్పణమున బ్రతిబింబించు నావరహాలమూటను గైకొని నీగృహంబున కేగుము" అని వచించిన పద్మావతి యాగ్రహము జెంది, "దర్పణమందలి ప్రతిబింబము నెట్లు దీసికొననగును?" అని యాశుకంబు "పద్మావతీ! కలలోగన్పించిన పురుషునికడ నెట్లు ధనమును గైకొననెంచితివో యట్లే యిద్దానిని గూడగొనుము" అనియెను. ఆపల్కులాలించి పద్మావతి చిలుకపైనాగ్రహము జెంది మారుమాటాడక గృహంబునకు బోయెను. పిదప నా విప్రుండు తన ప్రాణములు రక్షించిన చిలుకయొక్క మేధాశక్తిని మిక్కిలిగా బొగడి గృహంబునకు బోయెను.

పద్మావతి తన గృహంబునకేగి శుకంబు తన కొనరించిన పరాభవమున దగిన ప్రతీకార మొనర్పవలయునని మది నిశ్చయించుకొని యాశుకంబు నెట్లవమానపరచ వలయునో కొంతతడవు యోచించి యెట్టకేలకామె యొక యుపాయం బాలోచించుకొనెను. నాటిరాత్రి పద్మావతి భూపాలునికడ కరుగక తన దేహము అస్వస్థగానున్నదని యనునందుచే నీ దినమునకు రాజాలనని భూపాలునికి దెలుప నొక రాజభటుని బంపెను. భూపాలుడదివిని తక్షణమే యాస్థానవైద్యుని రావించి పద్మావతి కారోగ్యముచెడెను గావున, నామెకు త్వరలో నారోగ్యము కూర్చుడని నియోగించి పంపెను.

ఆవైద్యుడు పద్మావతీ గృహమునకరిగినతోడనే యామె యెదురేగి యాతనిని లోనికి దోడ్కొనిపోయి యొక్క సుఖాసనముపై నుపవిష్టుజేసి యాతనితో సరససల్లాపంబులు గావించి సంతుష్టునిజేసి యిట్లనియెను. "అయ్యా! నా అస్వస్థతకుగల కారణంబెరింగించెదను వినుము. నా ఆరోగ్య మేమాత్రమును చెడలేదు. కాని నేడు మన నగరమునగల వణిగ్వరుని కడనున్న చిలుక నన్ను బరాభవించెను. దానికి దగిన ప్రతీకారము జేయ నిశ్చయించుకొంటిని. ఎట్టులైనను దానిని జంపి నాపరాభ

వాగ్ని జల్లార్పుకొనెదను. మీరీకార్యమును జక్కబరచవలయును. అట్లుమీరు చక్కజేసినచో నెల్లప్పుడును నేను మీకు వశవర్తినై యుందును.” అని పల్కిన నాలించి వైద్యుఁడు యిట్లనియెను.

“పద్మావతీ! పెక్కుదినముల నుండి నీపై మక్కువ గొనియుంటిని. సాహసించియడుగ జాలకపోతిని. నీవు నాకోర్కెదీర్ప నంగీకరించెదవేని నీకార్యమును నే జక్కజేసెదను. అందులకొక యుపాయము గలదు” అన నా పద్మావతి ‘తమకేటి సందియము? నా కార్యము జక్కజేసితిరేని మీకోర్కె దీర్చెదను. తమరు సంశయింపక తగు నుపాయంబు దెలుపు” డనిన వైద్యుడు సంతసించి యిట్లుచెప్పెను. “నీ కసాధ్యమగు రోగము వచ్చినదనియు నా చిలుకనుజంపి యద్దాని రక్తముతో నౌషధము తయారుజేసి యొసంగినగాని రోగము కుదురదని చెప్పి యొప్పించి ఆచిలుకను దెప్పించి నీకొసంగెదను.” అని చెప్పి వెడలిపోయెను.

ఆ వైద్యుఁడు మరునా డుదయమున భూపాలుని దర్శించి యాతనితో నిట్లనియెను. “దేవా! పద్మావతికొకయసాధ్యమైన రోగముంకురించినది. అద్దాని నివారించుటకు, మనుజభాషణములు బల్కు చిలుక యొక్క రక్తము నౌషధముగాజేసి యా చిలుక మాంసమును దిననొసంగవలయును. అట్లుజేయనిచో దద్రోగము కుదురుట కష్టము” అనిన భూపాలుఁడు వెజ్జునితో నిట్లనియెను. “ఓయీ! మనుజ వచనంబులు బల్కు శుకంబెచ్చట లభించును?” అనిన వైద్యుఁడు “దేవా! అట్టి చిలుక లీసామీప్యమున గానరావు. హిమవత్పర్వతప్రాంతమున నుండును. కాని యీ చిలుకలదండులోని యొక చిలుక దండునుబాసి యీ పురంబునకేతెంచిన యెవ్వరో యద్దానిని బట్టి పెంచుచుండిరట. అద్దానిని దెప్పించిన మంచిది.” అని పల్కెను.

భూపాలుఁ డాతని మాటలను విని తత్క్షణమే రాజభటులను పిలిచి 'మనుజవచనములు బలుకు చిలుక యెచ్చట నున్నదో కనుగొని యద్దానిని పెంచుచుండిన వారిని దోడ్కొని రం'డని యాజ్ఞాపించెను. రాజభటులు మఱల గొన్ని నిముషముల కేతెంచి భూపాలునిగాంచి "దేవా! ఈ నగరమునగల యొక్క వైశ్యుడద్దానిని పెంచుచుండెను. ఆ వణిజునిగూడ దోడ్కొనివచ్చితిమి" అని సభారంగమునకు వెలుపల నున్న వైశ్యుని లోనికి దీసికొని వచ్చిరి.

ఆ వణిజుఁడరుదెంచినంతనే భూపాలుఁ డాతనికూర్చుండనియమించి యాతనితో "ఓయీ! నీగృహము నందొక్క మనుజవచనంబులు బల్కు శుకంబుండెనట. అద్దానియవసరము వచ్చినందున నయ్యది మాకీయవలయును. నీవు దానిని గొన్న క్రయమునకధికముగ వెల నొసంగుదును." అనిన వణిజుఁడు "దేవా! నేనాచిలుకను కన్నబిడ్డ కన్న మిన్నగా జూచుకొనుచుంటిని. నా వ్యాపారమున కదెంతయో తోడ్పడుచు నధికలాభం బొనగూర్చుచున్నయది. ఆ చిలుకను తమ కొసంగనందులకు నన్ను మన్నింపవేడెదను." అనిన నా భూపాలుఁడు యాచిలుక నెట్లయినను గొనవలయునని దానివెల హెచ్చించి తుట్టతుదకు లక్షవరహాలొసంగెద ననెను. వైశ్యుఁడాధనమున కాశపడి, "దేవా! నా చిలుకతో నాలోచించి సమాధానమొసంగెదనని" చెప్పి వెడలి పోయెను.

ఆ వణిజుఁడు చిలుక కడకేగి, "శుకోత్తమా! భూపాలుఁడు నిన్ను తనకిమ్మని కోరుచున్నాడు. నీకు బ్రతిగా నాకు లక్షవరహాల నీయుటకంగీకరించెను. నిన్నాతనికీయజాలననికూడ దెల్పితిని. భూపాలుని మాటలనుబట్టిజూడ నిన్నాతడెట్లయినను గొన నిశ్చయించుకొనినట్లు విదితమాయెను. నీయభిప్రాయమేమియో దెల్పుము." అనిన నా శుకము "ఓ వైశ్యోత్తమా! లక్షవరహాలనేల వృథాగా బోగొట్టుకొనె

దవు! నీవునేడాతని దిరస్కరించి యీయకున్నను బలిమినైన నన్నును గొనితీగును. ఆతని యుంపుడుకత్తె, నన్ను పరాభవింపగోరి తనశిరోవేదన మునకు నావంటిచిలుక కావలయునని కోరినది. భూపాలుఁడు ప్రియురాలి కోర్కెతప్పకదీర్చును. కావున నామాటవిని భూపాలునికి నన్ను విక్రయింపుము. లక్షవరహాలు నీవుయెన్నిదినములలో నార్జింపగలవు! నన్ను నీవుబోయినవానివద్దనుండి కొన్నందులకు నేనునీఋణమునుదీర్చుకొంటిని. సందేహింపక నన్నువిక్రయింపుము. మరల బద్మావతిని బరాభవించి యథేచ్ఛగా సంచరించబోయెదను.” అనిన వణిజుఁడు భూపాలునకు “లక్షవరహాల నొసంగినచో జిలుకనిత్తునని” వార్త బంపెను.

భూపాలుఁడావార్త నాలించి వైజ్ఞునిరావించి యాతనికి లక్షవరహాలనొసంగి యాధనమును వణిజునకొసంగి యాశుకంబును జాగ్రత్తగా గొనిరమ్మని నియమించెను. వైద్యుఁడా వణిజునికడకరిగి శుకంబునుగొని పద్మావతీగృహమునకేగి యామెకొసంగెను. పద్మావతిమిక్కిలి సంతసించి యాచిలుకనుజంపి తనకుకూరగా వండిపెట్టుమని వంటలక్కకప్పగించెను. పిదప బద్మావతి మున్ను తాను వాగ్దాన మొనరించిన ప్రకారము యావైద్యుని సంతృప్తిపరచి పంపివైచెను.

ఆ వంటలక్క యాశుకంబు రెక్కలను నులిమి యొకచో పడవైచి వేరొకపనికై యేగెను. ఆ శుకంబు తప్పించుకొనుట కదే సమయమని తలఁచి రెక్కలునలిగి యుండుటచే నెగురజాలక యా సమీపమున నున్న కాల్వలోనికి దూరి దాగియుండెను. వంటలక్క మగిడియేతెంచి చూచి శుకంబునుగానక పారిపోయినందులకు మిక్కిలి చింతించి, ఇయ్యది తెలిసినచో బద్మావతి తన్ను శిక్షించునని తలచి వేరొక శుకంబును గొనివచ్చి యద్దానిని జంపి కూరగావండి పద్మావతికిఁ దినబెట్టెను.

ఆ చిలుకయు బగలెల్ల నా కాలువలో డాగి రాత్రి సమయమున వెలికరుదెంచి సమీపముననున్న మెతుకులను దినుచు విశ్రమించు చుండెను. ఇట్లుకొన్ని దినములు గడపి యొక్కనాడు యెవ్వరులేని సమయమున నచ్చటనుండి యెగిరి ప్రతిదినమును పద్మావతి పూజలొనరించు చుండు దేవాలయముపై వ్రాలుచుండెను.

ఒక్కనాడు పద్మావతి దేవుని దర్శించి ప్రార్థించుచుండగా శుకంబు విగ్రహము మాటునడాగి యిట్లనియెను. 'పద్మావతీ! నీవు నిత్యమును భక్తియై నన్ను బూజించుచుంటివి. నీభక్తికి నే మెచ్చితిని. నీయిచ్చవచ్చిన వరము కోరుకొనుము"న బద్మావతి సంతసించి స్వామికి నమస్కరించి "దేవా! తమకు నాపై ననుగ్రహమున్నచో నీ శరీరముతో నన్ను కైలాసమునకు జేర్చుడు' అని వేడుకొనెను. అంత నా చిలుక విగ్రహము వెనుకనుండియే పద్మావతితో నిట్లనియెను. "పద్మావతీ! నీవు కోరుకొను నట్లొనరించెద. రేపటిదినంబున రమ్ము." ఆ పల్కులాలించి సంతసించి గృహంబున కేగెను.

నాటిరాత్రి పద్మావతి యావృత్తాంత మంతయు భూపాలునకు దెల్పెను. భూపాలుడా మాటలను విశ్వసింపక మరునాడామెతో దేవళమున కరిగెను. పద్మావతి భూపాలుని దేవాలయ పురోభాగమున నిలిపి తాను స్వామిసన్నిధికరిగి ప్రార్థించెను. అంత నా చిలుక యామెతో నిట్లనియెను. "పద్మావతీ! కైలాసమున కేగదలచువారు యైహికకాంక్షలను బోవిడువవలయును. కావున నీకుగల ధనమంతయు బీదసాదలకు బంచిపెట్టుము. అట్లొనరించి నిష్కళంకచిత్తవై నాకడ కరుదెంచినచో నీకు కైలాసమునకేగు మార్గముపదేశించెదను." అని పల్కిన విని పద్మావతిసంతసించి "అట్లే యొనరించెద"ననిపల్కి దేవాలయము వెలికరుదెంచి భూపాలుని గలిసికొని గృహంబునకు బోయెను.

పద్మావతీ గృహంబున కేతెంచి యాచిలుక చెప్పినట్లు తన ధనం బెల్ల బీదసాదలకు బంచిపెట్టెను. పిదప నొక్కనాడు దేవాలయమున కేగి స్వామిమ్రోల నిలిచి"స్వామీ! తమ రాజ్ఞాపించినటుల నాయర్థం బెల్ల బీదసాదలకు బంచి యిచ్చితిని మఱల తమ యాజ్ఞకై యెదురు చూచు చున్నదానను." అని పద్మావతి పల్కిన విని చిలుక "పద్మావతీ! నీభక్తికెంతయును సంతసించితిని. నీవొనర్చిన దానధర్మములె నిన్ను కైలాసమునకు గొనిపోవ జాలును. తప్పక నిన్ను బొందితో కైలాసమునకు గొనిపోయెదను. ఇయ్యది మహావింత. కావున నెల్లరును జూడ నభిలషింతురు. మీ మహారాజుతో జెప్పి యీ వింత గాంచ రమ్మని నానా దేశాధీశులను బిలిపింపుము. వారందరును యీ వింత గాంచుట కరుదెంచిన పిమ్మట నీవు నా సన్నిధి కరుగుము." అని చెప్పెను.

పద్మావతీ గృహంబు కరిగి భూపాలునితో జిలుక చెప్పిన దంతయు జెప్పి నానా దేశాధీశులకు వార్తలను బంపించి, నగరమంతయు జాటింపించెను. కొందరు భూపాలురా వర్తమాన మాలించి యీ వింత గాంచ వలయునని బయలుదేరిరి.

క్రమక్రమముగా నొక్కరొక్కరుగా భూపాలురెల్ల నరుదెంచిరి. ఆ భూపాలురెల్లరకు వసతిగృహము లేర్పరచబడెను. నగరమంతయు గన్నులపండువుగా నలంకరించబడెను. వివిధదేశములనుండి పెక్కురీ వింత గాంచవలయునని యా నగరమున కరుదెంచిరి.

పద్మావతి యొక్కనాడు దేవాలయమున కేగి స్వామిమ్రోల నిలిచి, "స్వామీ! పెక్కు దేశములనుండి పెక్కురు భూపాలురరుదెంచి యున్నారు. ఇంక నేనొనర్పవలసిన పనులేమైన నున్నచో సెలవిండ"ని వేడుకొనెను. అంత జిలుక యిట్లనియెను. "పద్మావతీ! రేపటిదినమే నీవు కైలాసమున కేగగలవు. కావున నీ వీశరీరముపై గల యభిమానమును వీడి సిగ్గుబిడియములు బోనాడి క్షురకర్మ మొనరించుకొని గాడిదపై నెక్కి యూరేగి యిచ్చటికి రమ్ము. పిమ్మట నిన్ను కైలాసమునకు దోడ్కొనిపోయెదను" అనిపల్కి పద్మావతిని బంపివైచెను.

పిమ్మట నర్చకునిబిలిచి "ఓయీ! ధ్వజస్తంభమునకు నిలువు యెత్తున యొక యుట్టిగట్టియుంచుము" అని చెప్పి యట్లు చేయించెను.

చిలుక చెప్పినట్లుగ బద్మావతి క్షురకర్మమొనరించుకొని గాడిదపై నెక్కి యతివైభవంబున నూరేగి దేవాలయము జేరుకొని, దేవాలయ గుమ్మమువద్ద నెల్లర నుండనియమించి తాను స్వామిసన్నిధికరిగి యిట్లు ప్రార్థించెను. "దేవా! తమరు చెప్పిన చొప్పున క్షురకర్మమొనరించుకొని యూరేగితిని, ఇంక సీదాసురాలి ననుగ్రహించి కైలాసముజేర్ప వేడుచున్నాను."

అప్పటికి జనులెల్లరును దేవాలయ ప్రాంగణముజేరి యేమిజరుగు నోయని చూచుచుండిరి. భూపాలుడును వివిధదేశాధీశులతో గూడ నొక్కచో గూర్చుండి యుండెను.

స్వామినట్లు ప్రార్థించుచున్న పద్మావతికి విగ్రహము మాటున దాగి చిలుకరూపమున నున్న విక్రమార్కుం డిట్లనియెను. "పద్మావతీ! నీవు ముందుగా బోయి ధ్వజస్తంభమునకు గట్టబడిన యుట్టిపై నెగిరి గూర్చుండుము. పిదప నేనువచ్చి నిన్నుగైలాసమునకు గొనిపోయెదను.' పద్మావతి ధ్వజస్తంభముకడ కరుదెంచి నిలువుయెత్తున గట్టబడినయుట్టిపై కెగిరి గూర్చుండజాలక మఱల స్వామిసన్నిధి కరిగి "దేవా! ఆయుట్టి చాల యెత్తుననుండుటచే నేనెగిరికూర్చుండ జాలకపోతిని" అని తెల్పగా శుకంబు "పద్మావతీ! నీవుపోయి దేవాలయప్రాంగణమున నుండుము. నేనరుదెంచెద"నని చెప్పను. పద్మావతి యచ్చటకేగి స్వామిరాకను నిరీక్షించుచుండెను.

అంతలోశుకంబు ధ్వజస్తంభముపైవ్రాలి, "పద్మావతీ! ఉట్టి కెగురలేనిదానవు స్వర్గమునకెగురగలవా?" అనిపల్కి యెల్లరువినంగ నిట్లనియెను. "ఈమె తనకలలో గాన్పించినవారికడనపరాధముగా నూరు వరహాలను దీసికొనుచు, నట్లీయని వానినిజంపించుచుండెను. ఒక్కనాడు

నేను యీమెకుబుద్ధిసెప్పగా దన్ను బరాభవించితినని తలచి ప్రతీకారము జేయుటకై వైద్యునితో రహస్యప్రయత్నమున నంగీకరించి భూపాలునిచే నన్ను గొనిపించెను. పిమ్మట నేనిమె బారినుండి తప్పించుకొని యిచ్చట కరుదెంచి యీమెకు దగిన శాస్తిజేసితిని.'' అని చెప్పి చిలుక రివ్వున నెగిరి పోయెను. తోడనే పద్మావతి ప్రాణములువిడిచి భూమినొరగెను.

పిమ్మట జిలుకరూపమున నున్న విక్రమార్కుడు దుజ్జయినికరు దెంచి భట్టికి తనరాకదెల్పి తన దేహమున నున్నవాడు కళాదుడని చెప్పెను. పిమ్మట సమాత్యపుంగవు లెల్లరుగూడి యొకపక్కని యుపాయమును బన్నిరి. అందుల కంతఃపుర స్త్రీల సహాయము గావలసియుండుటచే వారలకు గూడ విక్రమార్కుని రాకదెల్పి వారుపన్నిన యుపాయమును బోధించిరి.

అంతఃపురాంగనలు దాసీస్త్రీలను దేనేరులుగాజేసి ఆకళాదుని కడకు బంపుచుండిరి. ఒక్క నాడంతఃపుర కాంతలెల్లరును విలపింపసాగిరి. ఇంతలో గళాదు డంతఃపురమును జేరి యూరడించనెంచెను. కానివారా తని గాంచినతోడనే మరింతగ విలపింప సాగిరి. కళాదుడొక పరిచారి కనువారిదుఃఖకారణ మెఱుంగవియమించిన నాపరిచారికయిట్లు దెలిపెను. "ప్రభూ! మహాదేవిగారి పెంపుడుశుకంబు నేడాకస్మికముగా జని పోయెను. ఆచిలుకపై నభిమానము పెంపున విలపించుచుండిరి.

అనిన విని యా విశ్వకర్త తనమనంబున నిట్లని వితర్కించు కొనెను. 'ఈయంతఃపురాంగనలను సంతోషింపజేసినచో వీరికి మనయం దనురాగము మెండగును. నేను పరకాయ ప్రవేశమున నాచిలుక శరీర మును బ్రవేశించి వీరల సంతుష్టిపరచెదను.'' అని వితర్కించుకొని తన దేహమును (విక్రమార్కుని దేహము) నొకచోనుంచి యా చిలుక శరీరమున బ్రవేశించెను. విక్రమార్కుడు సమయమునకై నిరీక్షించుచు

నా సమీపముననే యుండెను. దాసియొకతె, కళావతుఁడు దేహమును విడిచినట్లు దెలుపగా విక్రమార్కుఁడు చిలుకదేహమును విసర్జించి నిజ దేహమును బ్రవేశించి యాచిలుక దేహమును జీల్చివైచెను.

విశ్వకర్త చిలుకదేహమును బ్రవేశించి సప్రాణిగా నొనర్చి నంతనే యంతఃపురాంగనలు (దాసీలు) ఆచిలుక నెత్తుకొని ముద్దులాడు చుండిరి. అంత విక్రమార్కుఁ డచ్చటికరుదెంచి యాచిలుకను బట్టి చంపించెను. పిమ్మట విక్రమార్కుఁడు సుఖంబుగా రాజ్యపాలన మొన రించెను.

అని యాప్రతిమ పైకథనుజెప్పి "విక్రమార్కునిబోలు భూపా లుఁడు భూలోకంబునలేడు. అతఁడీ ధరాచక్రమును రెండువేలవత్సర ములు బరిపాలించి దివంబలంకరించెను. జగంబునం దాతనిపేరు చిర స్థాయిగా నుండునట్లొక శకముకూడ బ్రారంభమయ్యెను. ఆతనిసుగు ణంబులు వర్ణింప శేషశాయికైనను శక్యముగాదు" అని వివిధరీతుల విక్రమార్కుని గుణంబులను గీర్తించెను.

భోజభూపాలుఁడు, సాలభంజిక పల్కులాలింపుచుండ నాద్వా త్రింశతి సాలభంజికల సింహాసనమందున్న ప్రతిమలు ముప్పదిరెండును దివ్యాంగనల రూపంబుదాల్చి నిలువంబడియె. భోజభూపతి యాలలనా మణులను గాంచి యాశ్చర్యమునుబొంది యిట్లనియెను. ఓకాంతలారా! మీరెవ్వరు? మీవృత్తాంతమంతయు సవిస్తరముగ దెల్పవేడెద" ననిన యా దివ్యాంగనలలో నొక్కతె యాతనితో నిట్లనియెను.

"భోజభూపాల చంద్రమా! ఇంతవరకు విక్రమార్కుని గుణం బులు దెల్పుచు నిన్ను దిరస్కరించుట మా శాపవిమోచనముకై యట్లొనరింపవలసి వచ్చింది. అందులకు మమ్ముక్షమింపవలయును నీవును విక్రమార్కునితో సమానభూపాలుఁడ వగుదువు. మిమ్ములను మించు భూపాలుఁడు భూలోకంబున బుట్టబోఁడు."

"మేమందరము పార్వతీదేవి చెలికత్తెలము. మేమందర మొక్క దినంబున నుద్యానవనంబున గూర్చుండి సంభాషించు చుంటిమి. అచ్చోటికి శంకరుడేతెంచి మమ్ములనుగని మోహపరవశుండై మాతో విలాసముగా సంభాషించుచుండెను. పార్వతీదేవి దానిగాంచి యాగ్రహ పరవశురాలై శపించెను. అంత మేమామెను బ్రార్థింప నించుక శాంతిజెంది, "కొంతకాలమున కింద్రుడు మీరున్న సింహాసనమును విక్రమార్కునికి బహుమానముగా నొసంగును. విక్రమార్కుండు రెండువేల వత్సరములు భూచక్రమును బరిపాలించి లోకాంతరగతుడగు. అతని యనంతరము మీరున్న సింహాసము భూమిలో నిక్షేపింపబడును. కొన్ని వత్సరములరిగిన పిమ్మట భోజభూపాలు డీసింహాసనమును వెలికిదీయించి తానధిష్ఠింప జూచును. అప్పుడు మీరందరును విక్రమార్కుని గుణములు వర్ణించినంతనే శాపవిమోచన మగును. ఇదియే మాచరిత్ర"మని తెలిపి యా దివ్యాంగనలు అంతర్ధాన మొందిరి.

భోజభూపాలుండు ఆ ద్వాత్రింశతి సాలభంజికల సింహాసనమును దానధిష్ఠింప లేనివాడై యందీశ్వరునినిల్పి నిత్యము బూజించుచుండెను.

సంపూర్ణము.

శ్రీ ప్రభాసీ ప్రెస్‌నందు ముద్రింపఁబడియె,
రాజమహేంద్రవరము.